RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Issue No. 5(1) Monthly May 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



కాశీనాధుని నాగేశ్వరరావు



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 5(1) - May 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

కాశీనాధుని నాగేశ్వరరావు

పత్రికా లోకానికి వేగుచుక్క కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు. "నేడు జర్నలిజం ఇంత అభివృద్ధి పథం వైపు నడుస్తుందంటే, ముఖ్యంగా తెలుగు దినపత్రికలు అభివృద్ధిలోకి వచ్చాయంటే, అదంతా ఆయన చలువే" అని కాశీనాధుని గురించి ప్రఖ్యాత జర్నలిస్ట్ నార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

కాశీనాధుని నాగేశ్వరరావు ప్రఖ్యాత పాత్రికేయుడు, వ్యాపారవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకులు. గ్రంథాలయ విస్తరణకు కృషి చేసిన విద్యావేత్త, దానశీలి, ఖాదీ ఉద్యమాన్ని ప్రోత్సహించారు. నాగేశ్వరరావు కృష్ణా జిల్లా ఎలకుర్రు గ్రామంలో 1867 మే 1 శ్యామలాంబ, ఋచ్చయ్య దంపతులకు జన్మించాడు. వీరి ప్రాథమిక విద్య మచిలీపట్నంలో సాగింది. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో పట్టభద్రులయ్యారు. ఆ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త డా॥. రెవరెండ్ మిల్లర్ ప్రభావం కాశీనాధునిపై పడింది. కందుకూరి వ్యాసాలు కూడా వీరిని ప్రభావితం చేశాయి. కాశీనాధులు వ్యాపారరంగంలో అడుగుపెట్టి 1893 సంవత్సరంలో అమృతాంజన్ లిమిటెడ్‌ను స్థాపించారు. కాశీనాధులు స్వయంగా రూపొందించిన అమృతాంజన్‌కు విశేష ఆదరణ లభించింది. ఒకవైపు వ్యాపారాలు చూసుకుంటూ భారత స్వాతంత్ర్య పోరాటాల్లో చిరివిగా పాల్గొనేవారు. నాటి సమాజంలో ఆంగ్లేయ పత్రికలే నడుస్తుండేవి. కాశీనాధులు తెలుగువారికి తెలుగులోనే వార్తా సమాచారాలను అందించాలన్న అవసరాన్ని గుర్తించారు.

తెలుగు వారి కోసం కాశీనాధుని నాగేశ్వరరావు సెప్టెంబర్‌లో 1908 సంవత్సరంలో బొంబాయి నుండి మొట్టమొదటి సారిగా 'ఆంధ్రపత్రిక'ను వారపత్రికగా ప్రారంభించారు. తెలుగువారికి గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ పత్రికలో సామాజిక చేతనా దృక్పథాన్ని, సమకాలీన చరిత్రపై అతని అవగాహనను ప్రతిబింబిస్తాయి. నాటి మొదటి ప్రపంచ యుద్ధం కాలం నాటి పరిస్థితులు, రాజకీయ పరిణామాలను తెలుగువారికి మాతృభాషలో అందించాలనే సంకల్పంతో ఆంధ్రపత్రికను దినపత్రికగా ప్రారంభించారు. మద్రాసు నుండి ఈ పత్రిక తొలిసారిగా వెలువడడం తెలుగు పత్రికా రంగంలో ఒక సువర్ణ అధ్యాయానికి దారి తీసింది. 1924 భారతి అనే సాంస్కృతిక సాహితీ పత్రికను ప్రారంభించి తెలుగు సాహిత్యాభిమానుల మన్ననలు అందుకున్నారు.

ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలన్న ఉద్యమాలకు ఊపిరిపోస్తూ ప్రత్యేక రాష్ట్రం కోసం కాశీనాధుని తన పత్రికల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాడు. వీరి తెలుగు భాష, సంస్కృతులకు చేస్తున్న విశేష కృషికి తెలుగువారు దేశోద్ధారక బిరుదుతో సత్కరించారు. 1926 సంవత్సరంలో 'ఆంధ్ర గ్రంథము' అనే ప్రచురణ సంస్థను ప్రారంభించారు. తెలుగు నాటక గ్రంథాలయోద్యమానికి కాశీనాధుని పితామహుడిగా పేర్కొంటారు. ఒకవైపు వ్యాపారం, ఇంకొకవైపు పత్రికారంగం, మరొకవైపు ప్రచురణ సంస్థలలో నిమగ్నమయ్యే కాశీనాధుని రాజకీయాల్లో కూడా తనదైన ముద్రను వేసుకున్నారు. నాలుగుసార్లు ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరించారు. నాటి ఖద్దర్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి పోరాటాల్లో చురుగ్గా పాల్గొని జైలు జీవితాన్ని చవిచూశారు. జైలు జీవితంలో భగవద్గీతకు వ్యాఖ్య రాశారు. కాశీనాధుని దానశీలి. ఎప్పుడూ వారి ఇల్లు దానధర్మాలలో నిండి ఉంటుంది. గాంధీజీ కాశీనాధుని దాతృత్వానికి ముచ్చటపడి విశ్వదాత అని కొనియాడారు.

తెలుగు నాటకరంగానికి విశేషంగా సేవలందించారు. తెలుగు నాటకం అభివృద్ధి చేసేందుకు ఆంధ్రనాటక కళా పరిషత్‌ను 1929 సంవత్సరంలో స్థాపించిన నాటకరంగ ప్రముఖుల్లో వీరు ఒకరు. తెలుగు జాతికి, తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి ఎనలేని సేవలందిస్తూ 1938 ఏప్రిల్ 11వ తేదీన తుదిశ్వాస విడిచారు. **- సంపాదకవర్గం**

Contents (విషయ సూచిక)

1. పరిశోధన మార్గదర్శనంలో ప్రథములు నమామి	- చెప్యాల నర్సింలు	6
2. 'అంతటి నరసింహం' రేడియో నాటకాలు - ఒక పరిశీలన	- డా॥. ఎం. హరికృష్ణ & - బియ్యం మల్లీశ్వరి	9
3. "విముక్త సంచార యాచక బ్రతుకులు"	- దాసరి విజయలక్ష్మి	13
4. మన సంస్కృతి ఘనత (ఆధ్యాత్మిక నేపథ్యంలో)	- డా॥. శంకర్ అనంత	20
5. కనుమరుగవుతున్న బంజారాల సంస్కృతి - సంప్రదాయాలు	- డా॥. డి. రాంబాబు	24
6. రాసాని వృత్తి నవల 'పరస'	- జి. పార్వతి	28
7. శ్రీ భూనీళా సమేత శ్రీ శేషతల్ప రంగనాథస్వామి ప్రాశస్త్యం	- డా॥. పి. మాధవి	34
8. అనువాద విద్య - భాష పరిచయం	- ప్రత్తిపాటి మాథ్యు	36
9. జానపద వైద్య విధానాలు	- ఆచార్య డి.వి. శ్రవణ్‌కుమార్	43
10. వ్యవసాయ అనుబంధ వృత్తుల కథలు	- డా॥. డి.యువశ్రీ	48
11. అమ్మకు ఆదివారం లేదా? కథలో - స్త్రీ జీవన చిత్రణ	- కె. నాగరాజు	52
12. పూలు నవ్విన కాలం - రసరాజు కథానిక సౌందర్యం		
13. 'అత్తలందు మా అమ్మ వేరయా' కథానుశీలనం - ప్రకృతి జీవన విధానం	- మడకశిర రాజేశ్వరి	61
14. వి.ఆర్.విద్యార్థి కవిత్వం - శాంతి ప్రియత్వం	- పాశం శ్రీనివాస్	63
15. విద్యాలయాల్లో ప్రస్తుత తెలుగు భాష పరిస్థితి	- ఆచార్య గెంజి అరుణ	67
16. వీరేశలింగం రాసిన జీవిత చరిత్రలు	- ఆర్. బాలసుబ్రమణ్యం	70
17. కొలకలూరి ఇనాక్ దృక్పథం - ఆచార్య కొలకలూరి ఇనాక్ దృక్పథం	- ఆచార్య విస్తాలి శంకరరావు	77
18. తెలుగుభాష వ్యాప్తి - అమలు విధానం	- వై. శివకుమార్	84
19. చరిత్ర తలవని నంగేలి	- డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. బూసి వెంకటస్వామి	87
20. పెబ్బిలి హైమావతి కథలు - మానవీయ సంబంధాలు	- పులి చిన్న బాబు	90
21. పొత్తూరి విజయలక్ష్మి కథలు - మానవ సంబంధాలు	- పి. విజయలక్ష్మి	93
22. తెలుగు ప్రజల గ్రామీణ సంస్కృతి - అవలోకనం	- డా॥. ఎస్. చిన్నరెడ్డయ్య	96
23. పూలు నవ్విన కాలం - రసరాజు కథానిక సౌందర్యం	- ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి & - మన్మథరావు కొండెపు	101

24. Amish Tripathi and Bharati Mukheerj's Cultural	- D.Bhuvani, Joshi Usha & - Dr. J.Dharageswari	107
25. Nirjana Varadhi: Autobiography of Kondapalli	- Dr. J. Neeraja	115
26. Exclusion of Nomadic Tribes in Andhra Pradesh	- Dr. Dara Ashok Kumar	118
27. Bramhanism in U.R. Ananthmurthy's Samskara	- Dr.V.Siva Prasanna Kumar	123
28. An Indian Phenomenon of Early 1950 : ...	- J.Ambika	126
29. Analysing Dalit-feminism :A Study of Kalyani Thakur ...	- Mustakim Ansary	131
30. Peculiarity of Premanand's Sudama Charitra	- Nayan H. Vasan	140
31. Super Cyclone Amphan Damage the Coastal Environment...	- P. Girija & - Dr. T. Asokan	144
32. Two Novels by Khushwant Singh and Bapsi Sidhwa...	- Bilal Ahmed Hakla & - Samir Khan	153
33. India and ASEAN Relations : An Overview	- Dr. M. Krishna Kumar	162

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పరిశోధన మార్గదర్శనంలో ప్రథములు నమామి

– చెప్యాల నర్సింలు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

సాహిత్య, పరిశోధన, పరిష్కరణ రంగాల్లో నమామి చేసిన కృషిని క్షుణ్ణంగా పరిశీలిస్తే గానీ ఆయన స్థానాన్ని నిర్ధారించలేం. కవిత్వం, కథ, నవల, నాటకాల్లాంటి ప్రక్రియల్లో ఆయన సృజన రచనలు వెలువరిస్తూ వస్తున్నప్పటికీ ఆ రంగంలో ఆయన స్థానాన్ని పదిల పరచలేం. ఎందుకంటే ఆయన సృజన రచనలు ప్రక్రియా పరంగా, రచనా పరంగా అమూల్యమైనవి, అపురూప మైనవి అయినప్పటికీ, ఆయన పరిశోధనా రంగంలో చేసిన కృషిని మించవు. ఆయన పరిశోధనలు రాసిలోనూ వాసిలోనూ ఎక్కువే. ఆయన 1979 నుండి ఇప్పటిదాకా పరిశోధనా రంగంలో నిరంతరం శ్రమిస్తూ ఆ రంగాన్ని సుసంపన్నం చేస్తూ వస్తున్నారు. కవిత్వం, కథ, నవల లాంటి వివిధ ప్రక్రియల్లో పరిశోధనలు చేసి గ్రంథాలెన్నో వెలువరించారు.

పిడికెడు ఆత్మ గౌరవం కోసమైనా జాతుల పోరాటాలు ఆరంభమైన యుగం ఇది. ఈ శతాబ్దం అర్ధ భాగంలో అమెరికన్ ''బ్లాక్ ఫాంథర్స్'' చేపట్టిన పోరాటం, మన దేశంలో ''దళిత ఫాంథర్స్'' సాగించిన ఉద్యమ చైతన్యంలో ప్రతిబింబించింది. దళిత సాంస్కృతిక రంగానికి అది తగిన నేపథ్యాన్ని అందించింది. మనువాదుల సాంఘిక ఆధిపత్యం మీద సాధికారాన్ని సాధించుకునేందుకు దళిత శ్రేణులకు అవకాశాన్ని కలిగించింది. ఈ దళిత బహుజన ఉద్యమం అంబేద్కర్ భావ ధారని పునాదిగా గ్రహించటం మూలంగానే అన్ని రంగాల్లో దళిత దృక్పథం విశాలం కావడం మొదలైంది.

దళిత బహుజన పోరాటానికి ఘనమైన వారసత్వం ఉంది. మూలవాసి దృక్పథానికి మూలపురుషుడు జ్యోతిబాఫూలే. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకొని అంబేద్కర్, పెరియార్, నారాయణగురులు సెల్ఫ్ రెస్పెక్టు, రాజకీయ హక్కులు, సాంఘిక హోదాకోసం పోరాటాలు జరిపారు. అదే మార్గాన్ని ఎన్నుకున్న కాన్షీరాం 1984 నుంచి దళితులకు రాజ్యాధికారం కావాలన్న విప్లవాత్మక నినాదంతో దళిత సాహిత్యం బయలు దేరింది. ఈనేపథ్యంలో ఆచార్య ననుమాస స్వామి సంపాదకత్వంలో మూలవాసి పాటలు అనే సంకలనం డిసెంబర్ 2000 లో దళిత రచయితల సంఘం ప్రచురించింది. ఉద్యమం కోసం మేము సైతం నినాదంగా ఈ గేయ కావ్యంలో 50 గేయాలు వెలువడ్డాయి. 34 మంది కవులు ఈ సంకలనంలో భాగస్వాములు. దీనిలోని కవులంతా ఉద్దండులే. మూలవాసుల సిద్ధాంత కర్త మాస్టార్జీ కవితలు కూడా ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి.

లెల్లే సురేష్, గూడ అంజయ్య, బత్తుల, తాళ్లపెల్లి స్వామి, జైభీం, శ్రమశ్రీ, కె. సురేందర్, నక్క సుదర్శన్, సదాశ్రీ, నమామి, ప్రేమ్‌కుమార్, పుచ్చ కుమారస్వామి, బండెల సదానందం, బాలకృష్ణ, శివసాగర్, రాంబాబు, గడ్డర్, మైసమ్మ, వంగపండు, బోయిభీమన్న, చందర్, కలెకూరి ప్రసాద్, గ్యార యాదయ్య, గోరటి వెంకన్న, ఎన్.ఆర్.వెంకటేశం, అంబటి వెంకన్న, వేముల ఎల్లయ్య, ఉ.సా. రాచమల్లు కుమారస్వామి, అందెశ్రీ, ఉదయశ్రీ లాంటి ఉద్ధండ కవి పుంగవులు రాస్తూ తెలుగు ప్రజానీకాన్ని చైతన్యవంతం చేస్తూనే ఉన్నారు.

దళిత పులులమ్మ...అనే శీర్షికన గద్దర్ ఇలా చిత్రీకరించారు. ''కోటి బాధలతో మునిగి తేలినా ఆడిన మాటకు అటుఇటుగాదు / వడ్డీలు మీద వడ్డీలు గట్టి నడ్డి విరిగిన బుద్ధిమంతులు / మట్టిలో మట్టై మన్నులో మన్నై పండించిన ప్రతి వడ్లగింజను / బలిసిన దొరల గరిసెలు నింపి పస్తులు పండె కష్టజీవులు '' దళిత పులులమ్మా/ కలబడి నిలబడి పోరు చేసినా'' అని నినదించిన వ్యక్తి గద్దర్.

ఈ కోవలోనే చిత్రీకరించిన మరో కవిత లెల్లె సురేష్ కలం నుండి జాలువారింది. "లెయ్యి లెయ్యిర మాదిగన్నా మాయన్న/ డప్పుమీద దరువు లెయ్యరో మాయన్న/ నలుపు రంగు మెరుపు నువ్వు మాయన్న/ సిరిమల్లె నువ్వు నువ్వు/ మండేటి సూర్యునికి నువ్వు మాయన్న / గూడ చెప్పులు కుట్టి ఇస్తివో మాయన్న/ చింతాకు పులుపు నువ్వు మాయన్న/ చిరుత పులి పరుగు నువ్వు మాయన్న / ...../ అందరికీ ఎట్టి చేసినా మాయన్న / అంటు బతుకు ఎట్ట అయ్యనే మాయన్న / అగ్రకుల రాజ్యంలో మాయన్న/ నీది అంటరాని ఆకలయ్యో మాయన్న /ఆ రాజ్యాన్ని ఏలేటోడ్ని మాయన్న/ గావూ పట్టించ పూనరో మాయన్న" అని గంతేసి తెలుగు ప్రజానీకానికి జలదరింపులు పుట్టించిన వ్యక్తి లెల్లె సురేష్.

అలాగే ఈ బాధలన్నీ ఏవిధంగా చెపుకునేది అని తనలో తాను మదనపడ్డ వ్యక్తి మన లెల్లె సురేష్ ఈ విధంగా బాధపడటం కనిపిస్తుంది. "గుండెలోన గుబులురా / గుండెలోన దిగులురా/ ఎవరికి చెప్పాలిరా/ ఏమని చెప్పేదిరా/ పొద్దు మునిగి పోయినా/ పొయ్యి రాజుకోదురా / కూలి ఎంత జేసినా కూటిలోకి రాదురా/ మూలిగే ఈ పేగు బాద / ఏ భాషతో చెప్పేదిరా" అని వ్యధ చెంది రాసిన కవితలు, పాటలు ఎన్నో ఎన్నెన్నో...

అలాగే ఈ దేశ మూలవాసి అయిన మాస్టార్జీ తన కింద ఉన్న ఉపకులాలను చైతన్య పరచడానికి రాసిన ఒక గొప్ప వాగ్గేయకారుడు. ఆయన తన కలం నుండి అనేక పాటలను జాలువారించాడు. ఉపకులాలను చైతన్య పరిచే ఉద్దేశంతో "రెల్లివీధికి" అనే శీర్షికన "ఎల్లాలి ఎల్లాలి రెల్లి వీధికి.... ఎల్తే / ఎల్లి నట్టుంటాది మల్లె తోటికీ...../ ఆ వీధి పాదులోన - మొలసిన రెల్లి యువత/ విలువలేని బత్కు- ఇంకెంత కాలమంటు/ ఆత్మాభిమానం కొరకు- నీచ కులవృత్తిని మాని/ విలువలైన బత్కు కొరకు- విద్య బుద్ధులు నేర్చి/ఉద్యోగం వేటలోన- ఉన్నా వయసుడిగి పోయేనా/ లేకి పాకి పనిని- మేమసలే చెయ్యమంటు / కోల్పోయిన హక్కుల కొరకు- కొదమ సింహాల వోలె/ పోరాడ పూనుకున్న - ధీరులున్న వీర విధి" అని సౌందర్యోపాసనతో అత్యంత అద్భుతంగా చిత్రించాడు మాస్టార్జీ.

"దళితులనగా ఎవరురా...?" అనే శీర్షికలో... గూడ అంజయ్య ఈవిధంగా... తెలియజేసాడు.

"దళితులనగా ఎవరురా?/ ధరణిలోని దరిద్రు లందరు/ దళితులేనుర సోదరా!"

పట్టెడన్నము దొరకనోల్లు/ పుట్టెడప్పులున్నవాళ్లు/ బతుకు గడవని బడుగు జీవులు/ దళితులేనుర సోదరా!" నిగూఢమైన నిజాలను మన ముందుంచాడు గూడ అంజయ్య.

అట్లాగే దళితులను చైతన్య పరుస్తూ, వారి శక్తి యుక్తులను గమనించి " గర్జించుడి! గర్జించుడి!! / దళిత జాతి చిరుతలారా/ పంజవిప్పి కండ్లలోన / చండ్రనిప్పులను చెరుగుడి / కులమతాల కూలదోసి/ వర్గాలను రూపు మాపి/ సమసమాజ స్థాపనకై/ నడుంకట్టి నడువండి"/ దళితులారా ధీనులారా/ దగాపడిన తమ్ములార/ రక్తార్పణ చేయండి/ హక్కులను పొందండి" అని దళిత వీరులను గావించాడు గూడ అంజయ్య.

అలాగే "నినదిస్తుంది నినదిస్తూందోయ్" అనే శీర్షికన - బత్తుల అయిలయ్య ఈవిధంగా అంటున్నాడు

"నినదిస్తుంది నినదిస్తుందోయ్/ దళిత గళం నిన దిస్తూందోయ్/ దళితులందరు దండుదండుగా/ కదలి రమ్మని నినదిస్తూందోయ్/ బ్రాహ్మనిజం మంటకలు పోయ్/ సమాజంలో చోటు లేదోయ్" అంటూ దళిత గళాలను విప్పి దండు గట్టాలని ఉద్భోదించాడు బత్తుల అయిలయ్య .

ఐసా భళారే అనే తాళ్ల పల్లి స్వామి గారి ఆగ్రహం ఇలా ఉంది. " ఐసా భళారే దగాకోరు పాలకులు/ అంతూ చూడాలే దగాకోరు పాలకులా/ ..... ఇండ్లల్లో అన్నం తిని పోతారు/ పేపర్లో ఫోటోలకు ఫోజులిచ్చి పోతారు/ మల్ల ఐదేండ్లదాక మల్ల ఐదేండ్ల దాక మర్రిజూడకుంట

పోతరు..... / తెరవెనుకవుంటారు/ కథనడిపిస్తుంటారు/ తిరగబడిన దళితులను / ఊచకోత కోయిస్తరు/ అన్యాయం జరిగిందని మొసలికన్నీరు పెడ్తరు/ రౌడిలే రాజ్య పాలకులై/ రాజకీయం జేస్తుంటరు'' రౌడీల రాజ్యంలో దళితుల స్థితిగతులను వివరించారు. అలాగే ఆయన ఇంకా ఇలా అంటాడు. "బహుజన విప్లవ కారులం / బాబాసాహెబ్ వారసులం/ బహుజన విప్లవ కారులం / సామాజిక న్యాయానికి పోరాడుతాం'' రండి అని ఉద్యమిస్తాడు.

అలాగే బండెల సదానందం తన గళాన్ని ఇలా వినిపించాడు. " త్వరపడి లేరా/ పరుగిడిరారా / ఓ దళిత వీరా/ దళితోద్యమం కోసం/ ప్రాణాలు వీడరా'' - జైభీం అంటూ ప్రాణ త్యాగానికైనా వెనుక పోవద్దు అంటాడు. దళిత నాట్యమండలి సభ్యులుగా పనిచేసిన బండెల సదానందం. దళిత నాట్య మండలి అనేది మన ఊపిరిగా పని చేయాలంటాడు. జి. బాలకృష్ణ కుల రక్కసి కోరల్లో చిక్కుకున్న దళితులను చైతన్యం చేయటానికి ఇలా చిత్రీకరించాడు. " దళిత నాట్య మండలి/ దండు బయలుదేరెరా/ బ్రాహ్మనిస్టు గూండాలకు/ గుండెలదిరి పోయెరా". ..... "ఆకలి మంటలు ఆరేదాకా/ కుల రాక్షసులు కూలేదాకా/ దోపిడి పాలన అంతం దాకా/ దొరల పెత్తనాన్ని అణిచేదాకా/ దోపిడి గుండెలు పగిలేదాకా/ దోపిడి రక్కసి చచ్చేదాకా! అరెరెరె అహా/ మా కంఠంలో ఊపిరున్నంత దాకా/ వీడంరో అంబేద్కర్ బాట/ బొందిలో ప్రాణం ఉన్నంత దాకా / మరువంరో అంబేద్కర్ మాట'' అని అంబేద్కర్ మాటను మరువము అని నిక్కచ్చిగా చెపుతున్నాడు.

కదలిరండి కలసిరండి అనే శీర్షికలో కె. రాంబాబు దళితులను కదలిస్తున్నాడు. " కదలిరండి కలసిరండి దళితులారా / తరలిరండి బానిస జన సోదరులారా/ ..... దొరల స్వార్థ పరుల ఆ కుటిల చేతిలో..../ తరతరాలుగా నీవు బానిసైతివా/ ఉదయించే సూర్యునివై విప్లవించి లేచిరా/ నిదురించే దళితులను కిరణాలతో మేలుకొలుపు'' అని దళితుల బాధ్యతను గుర్తు చేసాడు.

"మనువుగాని మడి ధర్మమొద్దు దళితన్నా/ కౌటిల్యుని కథలు మనకొద్దు కూలన్నా/ ఆదిమ సమాజంలో అంటు ముట్టు లేదు/ సింధులోయలో కులము మతము లేదు/ సంప్రదాయాలు సత్తెనాశనం జేయ/ మూఢ ధర్మాలను మంటల్లో దగ్ధం జేద్దాం/ దోపిడి కూల్చ మనం పోరులో కలుద్దాం'' అని చందర్ పోరుకు ఆహ్వానించటం ఆయన ధైర్య సాహసాలకు నిదర్శనం. అలాగే కీర్తి శేషులు కలేకూరి ప్రసాద్ హంతకుల గుండెలు అదురగొట్టే కవిత్వం చిత్రించిన తీరును చూడండి....

"దిక్కుమొక్కులేని జనం / ఒక్కటయ్యి కదలతేను / దోపిడోల్ల గుండెల్లో ఒణుకుపుట్టెరా/దెబ్బతిన్న దళిత గుండె దండోర వేయుచుండ/ హంతకుల గుండెలన్ని అదిరి పోయరా''

ఎన్నిసార్లు ఈ ఘోరాలు అనే శీర్షికన కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న గారు ఘోరాలను అరికట్టక పోతే బతుకలేము అని హెచ్చరిస్తున్నాడు. " ఎన్ని సార్లు ఈ ఘోరాలు / ఎంతమందిమి ఒరుగుదాము/ దళితన్న దండుకట్టకుంటె బతుకలేము / దళితన్న బరిసెలెత్తకుంటె నిలువలేము/ ..... తోలుకోసే రంపెతోని వీళ్ల తోళ్ల చెమడ దీసి/ జమిడికేసి వీరులకు దండమంటు పాడుదాం/ దళితన్న ఇగ గొళ్లు మంటు ఏడ్వకన్న/ దళితన్న నీ గోసముట్టి కూలుతరీళ్లు'' అంటూ ఎలుగెత్తిన వాగ్గేయ కారుడు గోరటి వెంకన్న.

ఈవిధంగా ఆచార్య ననుమాస స్వామిగారు తనకలం పేరుతో (నమామి) ఇప్పటివరకు అనేక చైతన్య వంతమైన రచనలు తెలుగు సాహిత్యానికి ఇస్తూ తెలుగు సాహిత్య కొనసాగింపుకు హితోధికంగా తోడ్పడుతున్నాడు. ఆయన మీద, ఆయన రచనలమీద ఇంకా పరిశోధనలు రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'అంతటి నరసింహం' రేడియో నాటకాలు – ఒక పరిశీలన

– డా॥. ఎం. హరికృష్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, ద్రావిడ విశ్వవిద్యాలయం.

– బయ్యం మల్లీశ్వరి
తెలుగు విభాగం, పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం.

'డాక్టర్ అంతటి నరసింహం' 1925లో కడప జిల్లాలోని వెంకట్రాజుపల్లె గ్రామంలో జన్మించారు. ఆయన బహు భాషా కోవిదుడు. తెలుగు ఎం.ఏ, పీహెచ్‌డీతో పాటు, హిందీ విశారద కూడా పూర్తిచేశారు. డాక్టర్ అంతటి తన రచనలతో ఆంధ్రదేశంలో నెలకొన్న సామాజిక సమస్యలు, రుగ్మతలమీద గళమెత్తిన మేధావి. అనేక ప్రాంతాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుడిగా, ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేకాధికారిగా, వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సహాయసంస్థ అభివృద్ధి అధికారిగా, ఏపీ వాషర్‌మెన్ ఫెడరేషన్ మొదటి చైర్మన్‌గా అనేక పదవులను అలంకరించారు.

తెలుగు సాహిత్యంలో అంతటి తడమని సాహితీ ప్రక్రియ అంటూ లేదని చెప్పవచ్చు. కవిత్వం, నవలలు, నాటకాలు, రేడియో నాటకాలు, బాల సాహిత్యం, జీవిత చరిత్రలు మొదలైనవాటన్నింటినీ ఆయన రాశారు. ఆయన రచనలు కొన్ని హిందీలోకి కూడా అనువదింపబడ్డాయి.

"అంతటివారి రచనలన్నీ నిశితంగా పరిశీలిస్తే సామాజిక స్పృహ, సత్యాన్వేషణ కొట్టవచ్చినట్లుగా కనిపిస్తాయి. హేతువాదం, తర్కబద్ధమైన సంభాషణలు అడుగడుగునా అడ్డుతగులుతాయి. సార్థక పదప్రయోగం చేసే రచయిత నరసింహంగారు" అంటారు త్రిపురనేని సుబ్బారావు.

నాటకం అంటే రంగస్థలం మీద పాత్రధారులు ప్రదర్శించే ఒక దృశ్య, శ్రవణరూప ప్రక్రియ. నాటకంలో ప్రేక్షకులు దృశ్యాన్ని చూడగలుగుతారు. కానీ, రేడియో నాటకంలో కేవలం గొంతుద్వారానే అన్ని భావాలూ పలికించాలి. శ్రోతలకు తాము నాటకం చూస్తున్న అనుభూతిని కల్పించాలి. లేకపోతే నాటకం అభాసుపాలైపోతుంది. అందుకే మామూలు నాటకాలకన్నా రేడియో నాటకాలు రాయడం కొంచం కష్టమైన విషయం.

కానీ, అంతటి నరసింహం అనేక సామాజిక సమస్యల మీద 'మంది ఎక్కువ- మజ్జిగ పలచన', 'ముట్టుకుంటే పాపమా?', 'నాకూ చదువు కావాలి', 'పిల్లలు సుద్దులూ-పెద్దల బుద్ధులూ', 'అనర్థాలకు మూలం (నిరక్షరాస్యత)', '(మన)సారా వద్దు' అనే నాటకాలు రాశారు.

'మంది ఎక్కువ -మజ్జిగ పలచన' అనే నాటకాన్ని ప్రధానంగా రిజర్వేషన్లలోని లోపాల గురించి, అధిక సంతానం వల్ల కలిగే ఇబ్బందులను గురించి రాశారు. సమాజం అగ్రవర్ణాలుగా భావిస్తున్న వారిలో కూడా పేదరికం తీవ్రస్థాయిలోనే వుందని, వారిని కూడా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద వున్నదని ఆయన నాటకంద్వారా హితవు పలికారు.

క్రైస్తవులుగా మారిన దళితులకు రిజర్వేషన్ ఫలాలను దూరంచేయడం గురించి అంతటి దుయ్యబట్టారు. సరైన ఉపాధిలేక, రిజర్వేషన్లూ లేక, ఉన్నత కులాలుగా పేరు బడిన ముస్లింలు అనుభవిస్తున్న కటిక దారిద్ర్యాన్ని కూడా ఆయన కళ్లముందు నిలిపారు.

ఈ నాటకంలో ఇబ్రహీం అనే పాత్ర తన సహచరులైన జాన్సన్, ప్రకాశం, రామారావులతో మాట్లాడుతూ "జాన్సన్‌భాయ్, నీవు కొంతయినా, కొంతకాలమైనా రిజర్వేషన్ సహాయాన్ని అనుభవించావు. మాకదికూడా లేదే! ఈ ఉన్నతకులాల వాళ్లకంటే మేం వున్నతులం గాబోలు! వాళ్లలాగా దొంగ సర్టిఫికెట్లు పెట్టడానికి కూడా వీలులేకపోయింది. మా బతుకు" అంటాడు.

ఆ కాలంలో కూడా ప్రభుత్వం బడిలో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేసింది. కొంతకాలానికి ఈ పథకం ప్రభుత్వానికి భారంగా మారింది. కారణం అధికసంతానం వల్ల పిల్లల సంఖ్య ఎక్కువగా వుండడమే. దీంతో ఉద్యోగస్తుల పిల్లలకు, అగ్రవర్ణాల పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని ఆపేసింది. ఉద్యోగస్తుల్లో పెద్ద ఉద్యోగులే కాదు, అతి చిన్నస్థాయి ఉద్యోగులు కూడా వుంటారు. వారి పరిస్థితేంటి?, అగ్రవర్ణ పేదలు లక్షల్లోనే వున్నారు. ఆ బిడ్డల కడుపు నిండేదెలా? ఈ ప్రశ్నలనే అంతటి ప్రభుత్వానికి సంధించారు ఈ నాటకంలో. అందరికీ సమగ్ర భోజన పథకం అమలు చేస్తే వారు చక్కగా చదువుకుని పేదరికం నుంచి బయటకు రాగలరని, లేకుంటే దళితుల వల్లే తమకీ కష్టాలని భావించి, వారిమీద ఆగ్రహం పెంచుకుంటారని, ఇది మళ్లీ సమాజంలో అసమానతలకు, అనర్థాలకు దారితీస్తుందని ఆయన ఈ నాటకంలో హితవు పలికారు. అంతేకాదు, తల్లిదండ్రులు కూడా కుటుంబ నియంత్రణ పాటించాల్సిన అవసరం వుందని కూడా అంతటి సూచించారు.

'ముట్టుకుంటే పాపమా?' అన్న నాటకంలో అంటరాని తనాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత విద్యార్థుల మీద వుందని, వారివల్లే సమాజంలో మార్పు వస్తుందన్నారు అంతటి.

గాంధేయవాది అయిన రామశాస్త్రివల్ల దళితుడైన వెంకటేష్, అగ్రవర్ణానికి చెందిన కళానిధిలతో పాటు చాలా మంది యువకులు కులమతాలకు దూరంగా తమ ఆదర్శవంతమైన మార్గాన్ని మరింత విస్తరించుకున్నారు. రాజ్యాంగకర్త అంబేద్కర్‌ను అపరమనువుగా కీర్తించడాన్ని నాటకంలో తీవ్రంగా దుయ్యబట్టాడు అంతటి.

మనువు రాసిన మనుస్మృతి వేలాది సంవత్సరాలుగా సమాజాన్ని రకరకాలుగా విభజించిందని, తీవ్ర అసమానతలతో ప్రజలు ఇబ్బందులు పడడానికి మనుస్మృతే కారణమని, అలాంటి దాన్ని ఒక శాస్త్రంగా ప్రజలమీదికి వదిలిన మనువుతో, ఎంతో అభ్యుదయవాది అయిన అంబేద్కర్‌ను పోల్చకూడదని ఆయన పేర్కొన్నారు.

యువత ముందు కులాలను సూచించే పేర్లను విడనాడాలంటారు అంతటి. "ఆదర్శాలలో నెగ్గాలంటే అంబేద్కరంత పట్టుదల గలిగివుండాలి. కుల నిర్మూలన నానికి మొదటి మందయిన కులాంతర వివాహాలు చేసుకుంటామని శపథం పూనాలి. ప్రప్రథమంగా శర్మ, శాస్త్రి, రెడ్డి, నాయుడు, గౌడు, మొదలయిన కులసూచిక నామాలను త్యజించాలి. ఇవి న్యూనతలకూ, ఈర్ష్యా ద్వేషాలకూ, గర్వాతిశయాలకూ మూలమవుతున్నాయ్. అసలు సమతాభావాలకే అడ్డుతగులుతున్నాయ్. అవి కులస్పృహకు చిహ్నాలు. వాటిని తక్షణం వదలాలి" అని నాటకంలోని రామశాస్త్రి పాత్ర ద్వారా అనిపిస్తాడు.

పాదనమస్కారం చేయడం పనికిరాదంటాడాయన. అలాగే, దళితుడైన వెంకటేష్ దగ్గర వున్న నీళ్లను తాగడానికి నిరాకరించిన కృష్ణశర్మను మందలించి, అతనికి కనువిప్పు కలిగిస్తాడు. బ్రాహ్మణుడైన కళానిధి, దళితుడైన వెంకటేష్ లిద్దరూ తమ కులాలను విస్మరించి ఒకరింట్లో ఒకరు వుండడాన్ని ఆయన మనకు చూపుతారు. ఇలా ఆదర్శవంతంగా అందరూ వుంటే సమాజంలో కుల మతాలు అంతరించిపోతాయని ఆశాభావం వ్యక్తం చేస్తారు ఈ నాటకంలో అంతటి.

'నాకూ చదువు కావాలి' నాటకంలో అందరూ చదువు కోవలసిన అవసరాన్ని ఉద్బోధిస్తారు అంతటి. దళితుడైన రాంబాబు, భూస్వామి కొడుకు ముకుందరావు స్నేహితులు. ఇద్దరూ చదువుకుని డిప్యూటీ కలెక్టర్లయ్యారు. రాంబాబు మేనత్త కొడుకు ముత్యాలు నిరక్షరాస్యుడు. చదువుకుని ప్రయోజకులైన రాంబాబు, ముకుందరావులకు లభించే గౌరవం చూసిన ముత్యాలు తాను కూడా చదువుకోవాలని కోరుకుంటాడు. ఈ విషయాన్నే తమకు భూమి, ఇళ్ల పట్టాలు ప్రదానం చేయడానికి; రాంబాబును, ముకుందరావును సన్మానించడానికి వచ్చిన కలెక్టర్‌కు చెప్పుకుంటాడు. ముత్యాలుతో వెట్టి

చాకిరీ చేయించుకుంటున్న నన్యానయ్యకూడా ముత్యాలు చదువుకోవడానికి ఆనందంగా అంగీకరిస్తాడు.

అదేవిధంగా, పురుషులు మద్యం తాగడం వల్ల సంసారాలు కూలిపోతున్న విషయాన్ని గురించి కూడా అంతటి ఈ నాటకంలో ముకుందరావు పాత్రద్వారా హెచ్చరిస్తాడు.

''యీ తాగుడు వల్లనే మీరు ముందుకు రాలేక పోతున్నారు సుబ్బయ్యా! మీ మాదిరే మీ అడవాళ్లు గూడా తాగితే మీకా గంజి గూడా వుండదు గదూ!''అనిపిస్తాడు.

చదువువల్ల లభించే లాభాలను ప్రజలంతా గుర్తించి ఆ వైపు పురోగమించాలంటారు అంతటి.

'పిల్లల సుద్దులూ- పెద్దల బుద్ధులూ' నాటకంలో పెద్దల తీరుతెన్నులే పిల్లల భవిష్యత్తును నిర్దేశిస్తాయంటారు అంతటి నరసింహం. పెద్దలు వ్యసనాలకు బానిసలైతే పిల్లలు కూడా వ్యసనాలబాట పడతారని, పెద్దలు ఆదర్శ వంతులుగా వుంటే పిల్లలు కూడా అదే ఆదర్శాలతో పెరుగుతారని చెబుతారు.

ఒక బిడ్డ తెలివిమంతుడుగా, బాధ్యతతో కూడిన వ్యక్తిగా, మరో బిడ్డ వ్యసనపరుడుగా మారడానికి ప్రధాన కారణం తల్లిదండ్రులే అంటారాయన.

కళాశాలలో చదివే ఐదుగురు విద్యార్థుల జీవన విధానాన్ని ఈ నాటకంలో ఆయన కనబరుస్తారు. ఒకరు ఆదర్శవంతంగానూ, ఒకరు మద్యపానం సేవిస్తుండ డాన్ని, మరొకరు యువతులకు గాలాలు వేయడాన్ని ఆయన ప్రస్తావిస్తారు. తల్లిదండ్రులు సక్రమమార్గంలో నడుస్తూ, బిడ్డలకు, సమాజానికి కూడా ఆదర్శప్రాయంగా వుండాలని సూచిస్తారాయన.

నేడు వస్తున్న సినిమాలు కూడా యువతరాన్ని పెడదారిన పయనించేలా చేస్తున్నాయని, దీనిమీద కూడా దృష్టి సారించాలని హెచ్చరించారు అంతటి ఈ నాటకంలో.

''ఉదయం లేచింది మొదలు పడుకొనే వరకూ పేకాటలూ, నవలలూ, మేగిజిన్లూ, దిన పత్రికలూ, రేడియోలూ, సినిమాలు, ఇపుడు టెలివిజన్లు. వీటితోనే సరిపోయె! ఇటీవలి డెవలప్‌మెంటేమిటంటే, రోజూ మరికొన్ని గంటలు సినిమా పాటలు రావడం, టీవీలో, కేబుల్ టీవీలో రకరకాల డాన్సుపాటలూ, తల్లీకొడుకు కలిసి కూచుని చూడడానికి వీలుకానివి, ఇక చదువూ సంధ్యలూ చట్టుబండలు కావా?'' అంటుంది విద్యార్థిని సురబాల.

ఇది ఆనాటి మాట. మరి నేటి మాటేమిటి? సామాజిక మాధ్యమాలు జడలు విరబోసుకుని కరాళ నృత్యం చేస్తున్న నేటిరోజుల్లో పిల్లలు బాధ్యతా రహితంగా, విచ్చలవిడిగా మారడంలో ఆశ్చర్యమేముంది?

అంతటి నాటకాలను కేవలం నాటకాల్లాగానే చూడకూడదు. ఒక హెచ్చరికగా తీసుకోవాలనడానికి ఈ నాటకం, నేడు నెలకొన్న దుర్మార్గపు పరిస్థితులే నిదర్శనం.

'అనర్థాలకు మూలం (నిరక్షరాస్యత)' అన్న మరో నాటకం ఎన్ని లక్షల డబ్బులు సంపాదించినా సరే చదువుకోని వారికి సమాజంలో విలువ వుండదన్న విషయాన్ని తెలుపుతుంది. చదువుకోకపోతే తమకు వచ్చిన లేఖలను కూడా చదువుకోలేక అభాసుపాలవుతారన్న వాస్తవాన్ని తెలిపారు అంతటి.

''మన అజ్ఞానానికి మనమే కారకులం. చదువు రాకపోవడమే ఈ అనర్థాలకంతా మూలం మీరు నవ్వుల పాలు కావడానికి, మా పిల్ల పెళ్లి తప్పడానికి కూడా చదువు రాకపోవడమే కారణం'' అంటాడు పెంటయ్య దగ్గర వెట్టిచాకిరీ చేసే పైడయ్య తన యజమానితో.

అలాగే యువతరం చదువుకున్న భార్యను కోరు కుంటున్నారని, అందుకే అమ్మాయిలను కూడా అబ్బాయి లతో సమానంగా అక్షరాస్యులను చేయాలని సూచిస్తారు అంతటి.

'(మన)సారా వద్దు' నాటకం కూడా 'పిల్లల సుద్దులూ- పెద్దల బుద్ధులూ' లాంటిదే. మధ్యతరగతి, ఉన్నత వర్గాల మహిళలు చేతులు కలపకపోవడంతో సారా ఉద్యమం

సంపూర్ణ ప్రభావాన్ని చూపలేకపోయింది. ఒకరకంగా విఫలమైందనే చెప్పవచ్చు.

సారాను మాత్రమే నిషేధించడంతో పేదవాళ్లంతా కల్తీ మద్యం, కల్లువైపు మళ్లారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కు కావడంతో ఇక హద్దూ,ఆపూ లేకుండా పోయింది. దీంతో కల్తీసారా మరణాల సంఖ్య కూడా పెరిగిపోయింది. లంచాలకు అలవాటు పడ్డ అధికారులు తమకు వచ్చే డబ్బులను గురించి, తమ సౌఖ్యాల గురించి ఆలోచించారే గానీ, తమ వారసులు కూడా తాము చూపిన తప్పుడుమార్గంలోనే నడుస్తున్నారని గుర్తించలేకపోయారు.

భార్యలు హెచ్చరించినా, పోట్లాడినా పట్టించు కోకుండా ఇళ్లలోనే తాగుడు, పేకాటలు ఆడే ఈ అధికారులు, తమ మనవలు తాగి పోలీసులకు పట్టు బడడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

అదే సమయంలో కల్తీ మద్యానికి బలైన వ్యక్తి భార్య, సారా ఉద్యమనేత నాగలక్ష్మి వేదన మధ్య, ఉన్నత వర్గాల మహిళలకు కనువిప్పు కలిగించేలా అనిపిస్తుంది. "జీవిత భాగస్వామి అయిన భర్త పోతే అందరికీ బాధే! సంపాదన పరుడైన భర్తపోతే, ఆధారపడిన స్త్రీకి బాధే! మాకు గూడా బాధ వుంటుంది. బ్రతుకు భయం మాత్రం వుండదు. పై తరగతుల వారికి బాధతో పాటు జీవిత భయం కూడా వుంటుంది. భవిష్యత్తులో సుఖజీవనం గురించి భయం వుంటుంది. ఎందుకు? వాళ్ల మామూలు జీవితాలూ, విలాస జీవితాలు గూడా మగవారి సంపాదన పైన్నే ఆధారపడి వుంటాయి గాబట్టి" అంటుంది నాగలక్ష్మి.

నాగలక్ష్మి నోట అంతటి పలికించింది మామూలు మాటకాదు. జీవిత సత్యం. అనేకమంది మధ్య, ఉన్నత వర్గ మహిళల జీవితాలు వారి భర్త సంపాదనపైనే ఆధార పడి వుంటాయి. అదే పేద, బడుగు వర్గాల మహిళలు మాత్రం భర్త సంపాదనమీద ఆధారపడకుండా తమ రెక్కల కష్టం మీదే ఆధారపడి స్వతంత్రంగా జీవిస్తుంటారు.

ఈ పద్ధతి మానుకోవాలని, స్త్రీ, పురుషభేదం లేకుండా అందరూ ఉపాధిమీద దృష్టి సారించాలని హితవు పలుకు తారు అంతటి. అందుకే ఆయన స్త్రీ పక్షపాతి అని పిస్తుంది. ఆయన రచనల్లో బోధించేది కఠినంగా వున్నా, దాని వెనక వున్న వాస్తవాలను పాఠకులందరూ తప్పని సరిగా గుర్తించాల్సి వుంది.

ఆధార గ్రంథసూచి :

1. డాక్టర్ అంతటి సాహితీ జీవితం, త్రిపురనేని సుబ్బారావు. ఆరుపదుల అంతటి, పుట 7, డాక్టర్ అంతటి షష్టిపూర్తి సన్మాన సంఘం, హైదరాబాదు, జనవరి 1, 1987
2. మంది ఎక్కువ- మజ్జిక పలచన నాటకం, డాక్టర్ అంతటి నరసింహం, రేడియో నాటకాలు -1996, సమతా సాహితి పబ్లిషర్స్, 4 సంతోష్ డీలక్స్ అపార్ట్‌మెంట్స్, సంతోష్ నగర్ కాలనీ, మెహిదీపట్నం, హైదరాబాదు, పుట:7
3. ముట్టుకుంటే పాపమా?, డాక్టర్ అంతటి నరసింహం, రేడియో నాటకాలు, పుట : 23
4. నాకూ చదువు కావాలి, డాక్టర్ అంతటి నరసింహం, రేడియో నాటకాలు, పుట : 35
5. పిల్లల సుద్దులూ- పెద్దల బుద్ధులూ, డాక్టర్ అంతటి నరసింహం, రేడియో నాటకాలు పుట : 51
6. అనర్థాలకు మూలం (నిరక్షరాస్యత), డాక్టర్ అంతటి నరసింహం, రేడియో నాటకాలు, పుట : 68
7. (మన)సారావద్దు, డాక్టర్ అంతటి నరసింహం, రేడియో నాటకాలు, పుట : 94

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"విముక్త సంచార యాచక బ్రతుకులు"

- దొసరి విజయలక్ష్మి, పరిశోధకురాలు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

భారతీయులంతా ఒకటే జాతి అంటుంటారు, ఈ మాట వాస్తవమే, అయితే కొన్ని వందల వేల కులాల ద్వారా ఇలా ప్రజలంతా ఎందుకు విభజింపబడి వుంటారు. ఒకే జాతి అనే మాటలోని సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, మత, మానసిక భావాల్ని బట్టి చూస్తే వీరంతా ఒకేజాతి కాదని ఎంత త్వరగా గుర్తిస్తే, అంత త్వరగా అస్పృశ్య జాతులకు మంచిదనేది గ్రహించగలం. అప్పుడైనా ఈ వర్ణ కుల వ్యవస్థ అంతరించి అన్ని రంగాలలోనూ వీరందరూ ఒకే జాతిగా మారాల్సిన అవసరాన్ని గుర్తించి తీవ్రంగా ఆలోచిస్తారు. ఆ లక్ష్యసాధనకు మార్గాలను, ప్రయత్నాలనూ, శాస్త్రీయ (పద్ధతిలో) మార్గంలో అన్వేషిస్తారు. భారతీయ సమాజాల్లో ఈ విధమైన అశాస్త్రీయ విధానం వున్నంత వరకూ, బాధితులకు మూలమైన కులవ్యవస్థల్ని అంటిపెట్టుకుని సాగే ఉప కులాలు, వారి వారి వృత్తులు, జీవన విధానం, భాష, సాహిత్యం, ఆచారం, సాంప్రదాయం, కళలు మొదలైన జీవన సంస్కృతి యావత్తూ, నిర్లక్ష్యానికి గురౌతూనే వుంటుంది.

ఆ యా కులాలు తమ అస్థిత్వాన్ని కోల్పోతూ అనేకానేక రూపాల్ని సంతరించుకుంటూనే వుంటాయి. ఈ నవ నాగరిక సమాజాల్లో తమ ఉనికిని, ప్రత్యేకతను కోల్పోతూ, తమకంటూ గుర్తింపే లేని జాతిగా, క్రమ క్రమంగా కనుమరుగౌతుంటాయి. అలా క్రమ క్రమంగా కనుమరుగయ్యే కులాలలో ఒకప్పుడు ఆశ్రిత కులాలుగా పరిగణించబడుతూ, విముక్త సంచారులుగా, సంచారులుగా, అర్ధ సంచారులుగా, ఉభయ తెలుగు రాష్ట్రాలలో జీవనం సాగిస్తున్న 32 కులాల పైచిలుకు వారు, నేటికీ యాచన చేస్తూ జీవించే తెగలుగా ప్రభుత్వ గణాంకాల్లో సైతం పరిగణించబడుతున్నారు. అటువంటి జీవన విధానం కలిగి, అభివృద్ధి అనేది నామమాత్రమైనా, కనుచూపు మేరల్లో లేని, బడుగు బతుకులే ఈ బుడబుక్కల, దొమ్మర, మొండి బండ, పాముల కులాల వారు. నేడు అనేక సమీకరణల్లో భాగంగా (1972 తర్వాత కాలం నుండి) వెనుకబడిన తరగతుల్లోని (బి.సి - ఎ) లో ఉపకులంగా మార్చబడి నేడు తమ ప్రాబల్యాన్ని, ఉనికిని పూర్తిగా కోల్పోయిన వారయ్యారు. కేవలం వారి వారి ప్రత్యేకతలతో సంతరించుకున్న జీవన విధానం, ఆచార సాంప్రదాయాలు, కళలు, విద్యలు తదితరాలైన సంస్కృతి యావత్తూ కోల్పోతూ, క్రమక్రమంగా ఈ సమాజం నుండి కనుమరుగయ్యే విషమ స్థితిని ఎదుర్కొబోతున్న జాతులుగా ఈ బుడబుక్కల, దొమ్మర, మొండి బండ, పాముల కులాల వారి జీవన విధానం మనకు కన్పిస్తుంది.

చరిత్రలో సంచార జాతులుగా చెప్పబడుతున్న బాలసంతు, బహురూపి, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దుల వారు, జంగం, జోగి, కాటిపాపలు, కొర్చ, మొండి బండవారు, పిచ్చిగుంట్ల, వంశరాజ్, పాముల, పార్ధి, పంబల, పెద్దమ్మలవాండ్లు, దేవరవాండ్లు, వీరముష్టి, గుడాల, కంజర-భట్ట, కళింగ, కొంపార లేక రెడ్డిక, మొండిపట్ట, నొక్కర, పరికిముగ్గుల, యాట, చొపమారి, కైకాడి, జోసినందల వాలాస్, మందుల, కూనపులి, పత్ర, రాజన్నల, కాశికాపడి, మొదలుగా గలిగిన 32 కులాలకు పైబడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్న వారు, నేటికీ తమ దేశంలో తామే పరదేశీయులుగా బ్రతికే తీరు స్పష్టంగా తెలుస్తుంది. భారత దేశపు ఆదివాసీ సంచార జాతులైన బుడబుక్కల, దొమ్మర, మొండి బండ, పాముల మొదలుగా గలిగిన కులాల ప్రజలంతా ఒక విశిష్ట సంస్కృతిని కలిగివున్నారు.

వారు తమ విశిష్ట సంస్కృతికి చిహ్నాలైన నమ్మకాలు, సంప్రదాయాలు, సాహిత్యం, విద్యలు, సంగీతం, నృత్యం, ఆటపాటలు, వేషభూషణాలు మొదలైన అంశాలతో భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేశారు.

భారత దేశమంతటా బ్రిటీష్ వారు, 150 కులాలకు చెందిన వారిని, నేరం చేసేవారినిగా ,నేర పరంపరగా 1871 లో మొట్టమొదటిగా నేరస్త జాతుల చట్టాన్ని రూపకల్పన చేసి అమలుపర్చింది. ఈ చట్టం ద్వారా ఈ 150 కులాలకు చెందిన ప్రజల్ని అందరినీ నేరస్తులుగానే గాక, ఆ జాతులకు సంబంధించిన ప్రజలందరినీ కలిపి, నేరస్త జాతులుగా గుర్తించింది. అలా వారిలో ఎన్నో కులాలకు చెందిన వేలమంది అమాయక ప్రజలు, బ్రిటీషు పోలీసుల వల్ల బాధితులయ్యారు. స్వాతంత్ర్యా నంతరం పండిట్ నెహ్రూ ప్రభుత్వం, నేర పరంపర చట్టాన్ని రద్దు చేసి, బాధితులకు ఎంతో సహాయం చేసింది. అలా విముక్తం చేయబడిన సంచార జాతులైన అనేకానేక కులాల్లో బుడబుక్కల, దొమ్మర, మొండి బండ, పాముల, తెగలకు చెందిన ప్రజలూ వున్నారు. ఈ కులాలకు చెందిన ప్రజల చారిత్రక నేపద్యం, వేద, పురాణాల కాలం నుండి వున్నట్లుగా మనకు, మౌఖికంగా ప్రచారంలో వున్న జానపదుల గాధల వల్ల స్పష్టంగా తెలుస్తుంది. అంతేగాక మరీ ముఖ్యంగా భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో సంచార జాతులుగా చెప్పబడుతున్న కులాల పాత్ర చాలా ప్రధానంగా వుండేది. 1856 ప్రాంతంలో సిపాయిల తిరుగుబాటు జరిగిన సందర్భంలో, ఈ సంచార జాతుల వారి ధైర్యం, తెగువలతో పాటు, వారి సాహసోపేతమైన సహకారమే, బ్రిటీషు వారి దృష్టిలో వీరిని తిరుగుబాటు దారులుగాను, నేరస్త జాతులుగానూ, క్రిమినల్స్ పరిగణించేట్టు చేసింది. అందుకే వారిని ప్రత్యేకంగా ఈ విధమైన నేర పరంపర చట్టాలతో అణచివేసింది. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం 1871 బ్రిటీష్ క్రిమినల్ ట్రైబ్స్ చట్టం ప్రకారం వీరిని క్రిమినల్స్‌గా నోటిఫై చేసి దారుణమైన అణచివేతకు గురిచేసింది. అందుకు సంబంధించిన వివరాలేవి ఆధారాలతో గ్రంథస్థం కాలేదు. ఆఖరుకి చరిత్ర పుటల్లోనూ, సంచార జాతుల వారికి తగిన స్థానం దక్కినట్లు కనిపించదు.

బుడబుక్కల, దొమ్మర, మొండి బండ, పాముల కులాల ప్రజలను ఈ సమాజాలు గుర్తించిన విధానం పరిశీలిస్తే ... నేడు డీ నోటిపైడ్ ట్రైబ్స్‌గా పిలువబడుతున్న వీరు, (మోస్ట్ బ్యాక్‌వర్డ్ కులాలు) అలవాటు పడిన నేరస్థులు (HABITUAL OFFENDERS)గాను, అంతకు ముందు నేరస్త జాతులుగానూ (క్రిమినల్ ట్రైబ్స్) (NOTIFIED CRIMINAL TRIBES),అయా జాతులకు (కులాలకు)చెందిన వారై కనిపిస్తారు. అంతేగాక నిఘంటువులలో యిచ్చిన నిర్వచనాల్ని బట్టి కొంతైనా గ్రహించగలం. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువులో బుడ బుక్కల వారికి బుడు బుడుక్కుల వాడు అనియు, అనగా చేతిలో చిన్న డోలు వాయిస్తూ ఇంటింటికీ తిరుగుతూ బిక్షాటన చేసే వ్యక్తి. అనియు, దొమ్మర అనగా గడకట్టి యాడు వారు అనియు. మొండి బండవారు అనగా మొండితనము కలవారు, మూర్ఖులు, చుఱుకుదనము లేనివారు, ఘోరకృత్యములు చేసి బిచ్చమెత్తెడు నొక జాతి వారు, బండపనులు చేస్తుండేవారు, ఆకతాయి గుంపు అనియు, పాముల వారు అనగా పాములను బట్టి ఆడించు వాడని, అహితుండికుడు అనగా పుట్టలోపలి పాము నభ్యుద్ధరించు, వశ్య మంత్రుండు పాముల వాడు. పాములను అనేకముగా ప్రోగు చేసి వాటితో గారడీ విద్యలు ప్రదర్శించే వాడు. అంటూ నిఘంటువులో అనేక అర్థాలున్నాయి. కానీ వాస్తవానికి చరిత్రలో వీరంతా గొప్ప సాహసవంతులు,

బుడబుక్కల జాతి :

చిన్న ఢమరుకాన్ని చేతబట్టి, అర్ధరాత్రి సమయంలో ఊరిలోని ప్రతీ ఇంటి ముందు ఢమరుకాని మోగిస్తూ ... " అంబ పలుకు ... జగదాంబ పలుకు ... మధుర మీనాక్షి పలుకు ... కంచి కామాక్షి పలుకు ... బెజవాడ కనకదుర్గమ్మ పలుకు ... పలుకు పలకవే తల్లీ సత్యం పలుకు... మీరూ

మీ పిల్లలూ సల్లంగుండాలె తల్లీ ... మీరు నడిసే బాటలో ... చేసే పనిలో సల్లంగుండాలె ... మీరు మొక్కుకున్న కోర్కెలు దీరి మీకు సంపదలు కలగాలె తల్లీ ...మూడు పూలతో, ఆరు కాయల్తో, దొరగారి దొడ్లో, ఊరంత పందిట్లో , పచ్చని పాలు పొంగాలి తల్లీ ... నాలుగందాలా లచ్చినంగా మీ కోరికలెల్ల దీరి, కోటి భాగ్యాలతో, మీరు పట్టిందెల్ల బంగారం, ముట్టిందెల్ల ముత్యంలతో సుఖసంతోషాలతో మీరు మీ బిడ్డలెల్లా సల్లంగుండాలి ... మీ గుమ్మాలలోకి మేము రావాలె , లచ్చినంగా జయం గలగాలె తల్లీ ... జయం గలగాలి " అంటూ అయ్య గారిని ఆశీర్వచనాలతో శుభ వాక్కులను పలుకుతారు. దానితో ఆ భూస్వాములు , నేక ఆ ఇంటి యజమానులు దానం ఇచ్చే పంపించే వారు. ఈ విధంగా వారు శివుని ఆజ్ఞ మేరకే అర్ధరాత్రి సమయంలోనే బిక్షాటనకు బయలుదేరతారు. వీరు గొప్ప గొప్ప ఆశ్చర్య కార్యా లనెన్నిటినో చేస్తూ, ఊరికి శుభం కలగాలని ఆశీర్వచనా లిస్తూ, చీడ పీడల్ని తొలగిస్తూ ప్రజలకు నమ్మకాల్ని, విశ్వాసాల్ని అందించటమే కాక, వీరు స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజానాట్య మండలి కళాకారులుగా 1943 నుండి 1950 వరకూ, సాగిన సాంస్కృతికోద్యమంలో, రెండవ ప్రపంచ యుద్ధ బీభత్సాన్ని గురించి, ఆనాటి కరువు, కాటకాలను గురించి, సంఘ విద్రోహుల గురించి సవివరంగా తమ గాత్రంతో ఢమరుకాన్ని ప్రయోగిస్తూ ప్రజల్ని నిరంతరం చైతన్య వంతులను చేసిన జాతిగా కూడా ఈ బుడబుక్కల జాతి వారు చరిత్రలో కనిపిస్తారు.

సుమారు 400 సంవత్సరాల క్రితం ఈ బుడబుక్కల కులం వారు మహారాష్ట్ర ప్రాంతం నుండి దక్షిణ భారత దేశంలోని అనేక ప్రాంతాలలో సంచార జీవులుగా విస్తరించారు. అలాగే ఆంధ్రదేశమంతటా వ్యాపించి సంచార జీవనంతో ఊరూరూ యాచనతో బ్రతుకులీడుస్తున్నారు. మహారాష్ట్ర చరిత్రలో జరిగిన యుద్ధాలలో ఓడిపోయి, పారిపోయి వచ్చి గ్రామాలలో మిరాశిని హక్కుగా కలిగి అడుక్కుంటూ జీవిస్తున్న కులం వారే ఈ బుడబుక్కల కులం వారు. వీరు మరాఠీ భాషను బాగా మాట్లాడమే కాక, సంచారం ద్వారా వారు నివసించే ప్రాంతంలోని స్థానిక భాషలను కూడా వీరు చాలా స్పష్టంగానూ, బాగా మాట్లాడగలగటం విశేషం. వీరు ఆంధ్ర దేశమంతటా సుమారు 3000 వేలకు పై చిలుకు కుటుంబాల వారు జీవనం కొనసాగిస్తున్నారు. మరాఠా ప్రాంతం నుండి వచ్చిన వీరిలో నాలుగు తెగలున్నాయి. అవి 1) ఆరే బుడబుక్క లోళ్ళు (ఆరె మరాఠాలు), 2) బొమ్మలాటల బుడ బుక్కలోళ్ళు, 3) బొందలీలు, 4) చాకలి బుడబుక్క లోళ్ళు.

ఈ బుడబుక్కల తెగలలో బాగా ఆర్థికంగా స్థిరపడిన వాళ్ళేమో కొందరు మార్వాడీలుగా స్థిరపడితే, మరికొందరు హిందూ బ్రాహ్మణీయ కుల వ్యవస్థ సృష్టించిన అసమానత లతో నిండిన నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో, కూరుకు పోయారు. సామాజికంగా వీరు ఆఖరు మెట్టులో వున్నా, కనీసం వీళ్ళు అటు దళిత సమాజాలతోనైనా కలవలేక, ఈ కుల అంతరాల మధ్య నలిగిపోతూ, అభివృద్ధి అనే మాటకు ఆమడ దూరంలో దుర్భర జీవితాల్ని గడుపుతున్న జాతిగా ఈ బుడబుక్కల జాతి వారున్నారనేది విధితం.

దొమ్మరులు :

వీరు దేశ దిమ్మరులుగా ప్రసిద్ధి. ఒకప్పుడు వీరు రాజవంశీకులుగా, ముఖ్యస్థానాలలో పనిచేసే నైపుణ్య వంతులుగా వుండేవారు. వీరిలోని స్త్రీలు చాలా అందమైన ముఖవర్చస్సును కలిగి వుండేవారు. సహజంగా యుద్ధాలు జరిగినప్పుడు, ఓడిపోయిన రాజు యొక్క రాజ్యంలోని పురుషులను చంపి, రాణీవాసంలోని స్త్రీలను పట్టుకు పోయి తమ అవసరాలను తీర్చుకుని, వారిని నిర్దాక్షిణ్యంగా ఊరిమీదికి వదిలేస్తే, ఆచరించిన వృత్తి కారణంగా, వీరు వ్యభిచార వృత్తిలోనికి వచ్చినట్లు, వారి సంతతే ఈ దొమ్మర కులం వారిగా అయ్యారని చరిత్ర పరిశోధనలవల్ల ఆదోక కారణంగా తెలుస్తుంది. నేడు పడుపు వృత్తి లేని ప్రదేశం ఎక్కడా లేదనే చెప్పాలి. కానీ నేడు ఆ వృత్తిని ఈ కులం వారే చేస్తున్నారా అంటే లేదు అనే చెప్పాలి. కారణం నేడు

ఈ వ్యభిచారం అనేది అన్ని కులాల వారు చేస్తున్నారు. ఆ కులం వారు ఆనాడు తమ బ్రతుకు తెరువు కోసం చేస్తే , ఈనాడు అనేక కులాల వారు తము విలాసవంత మైన జీవితాలు గడిపేందుకు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు.

దొమ్మర కులంలోని వారు పుట్టుకతోనే ఈ వృత్తిని అవలంభించలేదు. పూర్వం వీళ్లు కుటుంబాలుగా కలిసి గడ ఆటలు ఆడటానికి గ్రామగ్రామాలకు వెళ్ళి తమ గారడీ, సర్కస్ విద్యల్ని ప్రదర్శించి పొట్టపోసుకునేవారు. తమ గారడీ విద్యలు అలసిన ఆనాటి సమాజానికి ఆటవిడుపులు. గడపై ఆడేటప్పుడు పిల్లమొగ్గలు వేసి, సర్కస్‌ఫీట్లను చేయటం, స్తంభాలపైనెక్కి తాడుపై నడవటం, చేతులలో గడను ఉంచుకొని నడకలో సమతుల్యం చూపిస్తూ తాళ్ల మీద నడుస్తూ, వేపచెట్టు ఆకుల్ని నోటితో కొరకటం లాంటి విద్యలేమీ సాదారణ మైన ఫీట్లు కాదు. అలా ఫీట్లు చేసే సందర్భాలలో కొన్ని కొన్ని సార్లు, ప్రమాద వశాత్తూ కాళ్ళు చేతులను కూడా కోల్పోవటం, అలాంటి సందర్భాలలో తమ కుటుంబ పోషణార్థం కూడా ఈ పడుపు వృత్తిపైనే ఆధారపడట మనేది ఒక కారణంగా కనిపిస్తుంది. అలాగే తమ వద్ద కావలసినంత దనం లేనప్పుడు, తమ పురుషులే ఆ స్త్రీలను ఊరి భూస్వాముల ఇళ్లకు పంపించేవారు. ఆలా భూస్వాముల తమ కోర్కెలు తీర్చుకుని వాళ్ళేమో రసిక రాజులుగా చలామణి ఆయ్యారు, కోర్కెలు తీర్చినందుకు వీళ్ళేమో దొమ్మరి సానెలుగా చరిత్రలో అస్పృశ్య ముద్ర, అవమానపు గుర్తుగా ముద్రింపబడ్డారు.

మొండి బండ కులం వారు :

మల్లయోధుల వలే పెద్ద పెద్ద బండరాళ్ళను సునాయాసంగా మరొక వ్యక్తి సహాయ సహకారాలేం లేకుండా పైకెత్తి తన భుజాలపై కొన్ని క్షణాలు నిలిపి అవతలకు విసిరి వేయగల శక్తిని, యుక్తితో (కిటుకుతో) ప్రదర్శించే యోధులు, పెద్ద పెద్ద బండ రాళ్ళను గుండెలపై పెట్టుకొని మలాటు (సుత్తి) తో పగులగొట్టించు కొని ఏమాత్రం గాయం కాకుండా, ఆరోగ్యంగా వుండే క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించే జాతులుగానూ, అలాగే ఆకాశంలో వేగంగా దూసుకుపోయే పక్షిని సైతం గురిచూసి, లక్ష్య నిర్దేశం చేస్తూ, ఒకే ఒక్క ఉండేలు (క్యాడ్‌బాల్) దెబ్బతో నేలకూల్చగల సమర్థులు. అంతేకాక వీరి సమస్త శరీర అవయవాలను తాళ్ళతో బలంగా కట్టి బంధింపబడి గుంజకు (స్తంభానికి) కట్టబడి వున్ననూ, లేక ఒక పెద్ద పెట్టెలో (బాక్స్)లో పెట్టి తాళంవేసి, నీటిలో ముంచివేసిన పిదప కూడా వాళ్ళు బంధవిముక్తులై సునాయాసంగా బయటపడి, అందరినీ ఆశ్చర్యంలో చకితులను చేసేవారు. ఇలాంటి విద్యను మంత్ర తంత్రాలతో కాక, కేవలం యుక్తి (టెక్నిక్)తో ప్రదర్శించే నైపుణ్యవంతులుగా ఈ జాతుల (కులాల) యొక్క గత వైభవం వర్ధిల్లింది.

ఈ గిరిజన తెగలవారు ప్రదర్శించిన ప్రావీణ్యత నేడు నీరుగారిపోయింది. దానికి ప్రధాన కారణం స్పృశ్య, అస్పృశ్యతలే కారణం, వాటిని కొనసాగించే కుల వ్యవస్థ, ఆ కుల వ్యవస్థ చట్రంలో కొనసాగే ఈ సమాజాల్లోని ఎన్నో గొప్ప గొప్ప నైపుణ్యాలు, సాంస్కృతిక వారసత్వాలు, ఆచారాలు, కళలు, విద్యలు వెలుగులోనికి రాకుండానే చీకటి దశలోనే చిద్రమైపోతున్నాయి. అలా ఈ సమాజాల్లో అనాదిగా నిరాదరణకు గురైన కొన్ని వెనుకబడిన జాతుల్లో మొండి, బండ, మొండిబండ జాతులవారున్నారు. వీరు ఆదివాసీ, గిరిజన తెగలకన్నా సామాజికంగా (ఈ వర్ణ వ్యవస్థలో) పై కులాలుగానే చలామణి అవుతున్నారు. వాస్తవానికి వాటిని కులాలు అనవచ్చునా లేదా అనేది కూడా సందేహమే. కానీ అధికారిక, సామాజిక శాస్త్ర అధ్యయనాలన్నీ వాటిని కులాలుగా గుర్తిస్తున్నాయి. నిజానికి మొండిబండ కులాలుగా పిలువబడుతున్న ప్రజా సమూహాలన్నీ అటు స్థావర ప్రవృత్తికీ, ఇటు స్థిర ఉత్పత్తి విధానానికి కూడా చేరనివి, వీరు ఆహార సేకరణ దశలో కొంత, పశుపోషణ దశలో మరికొంత జీవిస్తూ నిత్యం జనావాసాల అంచుల్లో భిక్షుక (యాచక) వృత్తిలో కొనసాగే కులాలుగానే ప్రసిద్ధి. వేరొక మాటలో చెప్పాలంటే నేటికీ

వీరు అక్కడక్కడా జంగమ ప్రవృత్తికి చెందిన జీవితాన్ని జీవిస్తూనే వున్నారనేది కాదనలేని సత్యం.ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ సమాజాలలో కొన్నింటికి గొప్ప సంస్కృతి వుంది. సంగీత, నృత్య, గానాల, వైద్య పరిజ్ఞానంతో కూడిన కళలున్నాయి, సాంప్రదాయాలున్నాయి. సాధారణంగా ఒక సమూహానికి తగినంత స్థిరత్వం వుంటేనే సంస్కృతి రూపొంది, అభివృద్ధిచెంది విస్తరిస్తుంది కానీ ఈ మొండి, బండ, మొండిబండ కులాల సంస్కృతి నేడు క్రమక్రమంగా విచ్ఛిన్నమై దాని స్థానంలో నూతన సంస్కృతి వర్ధిల్లిన ఛాయలు అక్కడక్కడా కన్పిస్తున్నాయి. నేటికీ సమాజపు అంచులలో ''ఊరెలుపల బతుకులు'' గానే వున్నారనడానికి భౌతిక నిదర్శనంగా వీరు నివాసాలు, ఆవాసాలు ఊరికి దూరం గానే నిర్మించుకున్నారు.

వీరు ప్రస్తుతం వారి కులవృత్తియైన సవరాలు కడుతూ ఇళ్ళవెంట తిరిగి చిన్న పిల్లకు బూరలకు, తినే పదార్థాలకు వెంట్రుకలు సేకరించి వాటితో సవరాలు కట్టి వాటిని ఆడవారికి అమ్ముకొని వాళ్ళ దగ్గర చిక్కు వెంట్రుకలు తీసుకొని వాటితో మరలా సవరాలు కట్టడం చేసేవారు. ఇప్పుడు ఆ వృత్తి మానివేసి (ఆదరణలేక) ఆడవారు బూరలు, బట్టుబిళ్ళలు, రబ్బరుబ్యాండ్లు, చెవుల రింగులు, పక్క పిన్నీసులు, తాళిబట్టు తాళ్ళు, వెంట్రుకల వ్యాపారంలోనికి మారి వాటిని అమ్ముకుంటూ పొట్ట పోసుకుంటున్నారు.

ఇలా మారుతున్న కాలానికి అనుగుణంగా మొండి, మొండిబండ, బండ జాతి ప్రజలు తమ ఉనికిని క్రమక్రమంగా కోల్పోతూ మగవారు ప్రస్తుత జీవనానికి ఏ వృత్తి అనుకూలమైతే ఆ వృత్తి చేపలు పట్టడం, పెయింటుపని, పాలిష్ పని, లారీలు క్లీనింగ్, పూల కొట్లలో, కళ్యాణ మండపాలలో, ఫొటో స్టూడియోలలో, బెల్ట్ షాపుల్లో, కరెంటు, వైరింగ్, చిరు వ్యాపారాలు, కూలి పనులు, మొదలగు చేతి పనులని చేపట్టి జీవిస్తున్నారు.

పాముల కులం :

సహజంగా పాములు అంటేనే అందరూ భయపడ తారు. అలా భయపడని వాళ్ళు ఒకప్పుడే కాదు, ఇప్పుడు కూడా ఎక్కువ శాతం ఎవరన్నా ధైర్యంగా వున్నారా అంటే అది పాముల కులానికి చెందిన వారే అయ్యుంటారు. ఒకప్పుడు గ్రామ గ్రామాన నాగులచవితి పండుగ మొదలు అనేక పండుగలకీ, పబ్బాలకూ, పాములాటల ప్రదర్శనలతో ప్రతీ గ్రామాన్ని వినోదాలతో, తమ గారడీ విద్యలతో ఉత్సాహపరచే పాముల వాళ్ళు, ఆ గ్రామస్తులు ఇచ్చే చిల్లర డబ్బులపైనే వాళ్ళ కుటుంబాలు, ఆధారపడి జీవించేవి. కానీ నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక టెక్నాలజీ ప్రభావంతో వచ్చిన సినిమా, టి.వి. షోలు, మోడరన్ మ్యూజిక్లు, మ్యూజిక్లతో ఒకనాడు వర్ధిల్లిన కళలనేకం నేడు పూర్తి స్థాయిలో నిరాదరణకు గురవ్వటం వల్ల ఆ కళలపైనే ఆధారపడిన అనేకానేక జీవితాలు పూర్తి స్థాయిలో యాచకులుగా మారిపోయారు. నేడు వీరు ప్రభుత్వ గణాంకాల్లో సైతం (2016 లో జి.వో. నంబర్ 17 ప్రకారం) అడుక్కుతినే కులం వారిగానే వున్నారు. నేటికీ అత్యధికులు యాచక వృత్తి మీద సంచార జీవనం గడుపుతున్నారు.

పాములు పట్టే వాళ్ళను పాముల వాళ్ళు అంటారు. పాము, ముంగిసలతో పోరాట విద్యలు, గారడీ విద్యలు, ప్రదర్శింప జేస్తూ, వీక్షకులైన గ్రామస్థుల నుండి తృణమో ,ఫలమో దొరికింది తీసుకుని ఆపూటకు పొట్ట పోసుకునే దుర్భరమైన జీవిత విధానం వీరిది. వీరు పాము, ముంగిసలతో గారడీ విద్యలు ప్రదర్శించే వారు కాబట్టి వీరిని 'గారడీ సాయిబు' అనే పేరుతో కూడా పిలవటం వాడుకలో వుంది. నిరంతరం సంచార జీవనంలో గడిపే వీరికి ఒక ఊరి నుండి మరో ఊరికి ప్రయాణమైయ్యే సమయంలో సామాన్లు మొత్తం కావిళ్ళలో సర్దుకుని మోసుకుంటూ వెళతారు. చిన్న పిల్లలతో పాటు, పాముల బుట్టలను కూడా, ఒకే కావిడిలో తీసుకుపోతారు. అలా వెళ్ళే వీరు ఒక గ్రామంలో ఏదో ఒక కూడలిని చూసుకుని, ఆ కూడలిలో ప్రజలంతా గుమికూడేందుకు డోలక్లను లయబద్ధంగా మ్రోగిస్తూ జనాలందరూ అక్కడ గుమి

గూడేటట్లుగా చేసి, అలా వచ్చిన వారిని అక్కడే ఆశక్తితో నిలువరింపజేస్తారు. ప్రేక్షకులైన ప్రజల చప్పట్లతో తమ గారడీ విద్యల్ని ప్రారంభిస్తారు. పామును బుట్టలో నుండి తీసి నాదస్వరం ఊదుతూ పాములను ఆడిస్తారు. చివరలో పడగ విప్పి ఆడుతున్న పాముపైకి, ముంగిసను దానిపైకి ఉసిగొల్పుతారు. పోటీ రసవత్తరంగా జరుగుతుంది. పామును కొరికి చంపాలని ముంగిస, ముంగిసను కాటెయ్యాలని పాము, ఇలా హోరా హోరీగా పోరాటం జరుగుతుండగా ఈ రెండింటిలోనూ ఏదీ చావకూడదనే విషయాన్ని ప్రదర్శనను తిలకిస్తున్న వారిచేతే అనిపించి, చివరాఖరికి ఆ పోటీని ఆపేస్తాడు. అలా ఆ ప్రదర్శనా నంతరం వచ్చిన చిల్లర డబ్బులను పోగేసి పొట్టపోసు కుంటూ ఇలా ఊరూరా తిరుగెడు బిక్షకులైన సంచార జాతుల వారే ఈ పాముల వాళ్ళు. వీరు నివశించే గ్రామంలో భూస్వాముల ఇళ్ళల్లోనో, రైతుల ఇళ్ళల్లోనో విషసర్పాలు దూరినప్పుడు, వాటిని పట్టేందుకు ఈ పాముల కులానికి చెందిన వారిని పిలవటం వాటిని వాళ్ళ భధ్రంగా నాదస్వరం ఊదుతూ వాటిని జాగ్రత్తగా పట్టి దూరంగా అడవిలోకి వదిలిపెట్టే సంస్కతి వీరిది. వీటిని పట్టే సంధర్భాలలోనో, లేక వాటితో గారడీ విద్యలు ప్రదర్శిస్తూ పాముల్ని ఆడించేటప్పుడో వీరిని ఈ పాములు కాటేసిన సంధర్భాలూ అనేకం లేకపోలేదు. అంతేగాక ఊరిలో ఎవరైనా పాము కాటుకు గురైతేనో, లేక పశువులు పాము కాటుకు గురైన సంధర్భాలలో, వీళ్ళకి తెలిసిన మందును రంగరించి పోస్తారు. అలాంటి సమయాలలో వారు బ్రతాకితేబ్రతకొచ్చు, లేకపోతే చనిపోనూ వచ్చు. మరణించిన సంధర్భాలూ లేకపోలేదు. వీరిలోనే మరికొందరైతే ఈ పాముకాటుకి తురాయి కట్టడమో, ఆకు పసరు తాగించటమో, లేక మంత్రించిన ఇసుకను చల్లించటమో, ఒక గుడ్డలో కట్టి ఆ కాటు వేసిన ప్రదేశం దగ్గర కట్టిటమో చేయటం వల్ల అనేక మంది విశ్వసించే సంధర్భాలు అనేకం లేకపోలేదు.

కాలక్రమంలో వీరి జీవనం కేవలం పాములను పట్టడం, గారడీ విద్యలతో పాముల ప్రదర్శనలివ్వడం అనే ప్రక్రియ ద్వారా, ప్రజలు ఈ కళల్ని ఆదరించే స్థితి పూర్తిగా మారిపోయింది. అందువల్ల భృతికోసం ఆ గ్రామంలోని భూస్వాముల పొలాలను రాత్రి సమయా లలో అడవి పందులు విధ్వంసం చేయకుండానూ, ఎలుకలు యెదిగే పంటను నాశనం చేయకుండా తెల్లవార్లు కాపలాలుండి సంరక్షిస్తుండే వాళ్ళు. అలాంటి సమయాలలో రాత్రికి ఆ భూ యజమాని పెట్టిన భోజనంతో సరిపెట్టుకుని, ఉదయాన్నే తాము ఉం డేందుకు యేర్పాటు చేసుకున్న కాలువ కట్టలమీదనో లేక చెట్ట క్రిందనో వున్న పాట్టాలతో యేర్పరుచుకున్న గుడెసెల్లో నో ఆదమరిచి నిద్రిస్తే వాళ్ల పిల్లలేమో తమ కున్న రెండు, మూడు అల్యూమినియం పాత్రలైన సట్టి, కుండ, బొచ్చె పట్టుకుని ఊళ్ళో ఇల్లిల్లూ అడుక్కుని తెచ్చిన అన్నాన్ని వాళ్ళకి పెట్టి వీళ్ళు తినే పరిస్థితి వీరిది. అలాంటి వీరి జీవితాల్లో పొలాలకి కాపలా కాసే సమయంలో యే మాత్రం పంట చేలో పందులు పడ్డా, ఇంక ఆ యజమాని వీళ్ళకి ఒక్క గింజ కూడా కొలవడు, అదే జాగ్రత్తగా సంరక్షిస్తే వారికి పంటనూర్చిన సమయంలో ఒక బస్తా ధాన్యాన్ని కొలిచి ఇస్తారు. అదే వారి సంవత్సర కాలం కాపలాకి వచ్చే రాబడి. ఈ విధంగా నేడు ఆ పనులకు కూడా అన్ని కులాలలోని వారు ప్రవేశించటం వల్ల, వీరు తెనాలి మండల మరియు పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ క్లీనింగ్ పనులకని, ఫంక్షన్‌లలో సప్లయర్లుగానూ, పూలు కట్టేవాళ్ళుగానూ, వెళుతూ, అవేవీ లేనప్పుడు యాచన చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

ముగింపు :

నేటికీ ఇటువంటి దయనీయమైన పరిస్థితుల్లో ఈ బుడబుక్కల, దొమ్మర, మొండిబండ, పాముల, జాతుల వారికి సంబందించిన జీవన విధానం కనిపిస్తుంది. గత కాలాల్లో ఎంతో వైభవోపేతంగా వర్ధిల్లిన వారి అస్థిత్వపు ఉనికి, నేడు క్రమక్రమంగా కనుమరుగౌతుంది. ఆ విధంగా అంతరించిపోతున్న వారి యొక్క గత వైభవాన్ని

గూర్చి, వారి సాంస్కృతిక వారసత్వమైన కళలు, విద్యలు, సాహిత్యం, ఆచారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు, సంస్కృతి, మతం, వస్త్రం, దాంపత్య జీవితం, వివాహం, విందులు, వినోదాలు, పండుగలు, సంతానం, ఆట పాటలు తదితరాలైన జీవన విధానాల్ని భవిష్యత్ సమాజా లకు అందించాల్సిన ప్రధాన అవసరం నేటి చరిత్రకారుల పైన, పరిశోధకులపైన బలంగా వుంది. అవ్యక్త, అలిఖిత, అనామక కులాలుగా వున్న బుడబుక్కల, దొమ్మర, మొండి, బండ, మొండిబండ, పాముల మొదలుగా గలిగిన అనేక కులాల వారికి సంబంధించిన బహిరంతర జీవన విధానాల్ని, కళల్ని, ఆచార సాంప్రదాయాల సంస్కృతీ వారసత్వాల్ని, గ్రంధస్థం చేయాల్సిన బాధ్యతతో పాటు, నేటి 21 వ శతాబ్ధంలో కూడా నేటికీ యాచనే తమ హక్కుగా బావించి జీవించే జాతుల్లో ఆత్మగౌరవపు చైతన్యాన్ని నింపాల్సిన భాధ్యత కూడా నేటి ప్రభుత్వాల పైన, మరియు చారిత్రక పరిశోధకులపైన వుంది.

ఆధార గ్రంధాలు :

1) ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సమస్యలు - సంక్షేమం - తెలుగు అకాడమి, హైదరాబాద్.
2) గిరిజన సాహిత్యం - ఆచార్య యన్. గోనా నాయక్.
3) డక్కలి జాంబ పురాణం - సంపాదకులు - జయధీర్ తిరుమలరావు, జానపద ప్రచురణలు.
4) మాజీ నేరస్థజాతులు - సమగ్ర పరిశీలన - వకుళాభరణం లలిత, మల్లిగాంధీ, సుందర్.
5) ప్రజా సాహితి - ఆగష్టు- 2017 నుండి ఆగష్టు -2019 వరకు కొన్ని మాసపత్రికలు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మన సంస్కృతి ఘనత (ఆధ్యాత్మిక నేపథ్యంలో)

– డా॥. శంకర్ అనంత, తార్నాక, హైదరాబాద్.

"భారతీయ సంస్కృతిలో ఎన్నెన్నో ఘనతలు
శాంతి, సహనం, త్యాగం, ఆధ్యాత్మిక విలువలు
ఆచార, వ్యవహార, ఆలోచన విధానాలు
వస్త్రధారణ, జీవన శైలి ఇవే విశేషాలు"

సంస్కృతి... అనేది చాలా చిన్న మాటే అయినా, దీనిలో అక్షరాలు మూడే ఉన్నా... దీనిని వ్యాఖ్యానించడమంటే చాలా విస్తృతంగా, లోతుగా అవగాహన చేసుకోవాలి.

సంస్కృతిలో ఒక సమాజవర్గం లేదా జాతికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, పండుగలు, జీవనశైలి, ఆలోచనలు, కళా స్వరూపాలు, వస్త్రధారణ మొదలగునవన్నీ ఉంటాయి. ప్రఖ్యాత ఉర్దూకవి ఎక్బాల్ మన సంస్కృతి గొప్పదనం గురించి ఇలా అంటాడు.

"కుఛ్ బాత్ హైకి హస్తీ మిట్తీ నహీ హమారీ
సదియో రహా హై దుష్మన్ దౌర్-జమాఁ హమారా
యూనాని మిశ్ర్ రూమా సబ్ మిట్గయే జహాఁ సే
బాకీ మగర్ హై అబ్తక్ నామో నిశాఁ హమారా"

దీని అర్థం... మన సంస్కృతిలో ఉన్న విశేషాల కారణంగా వందల సంవత్సరాలు గడచినా, శత్రువులు దాడిచేసినా దీనికేమీ కాలేదు. ఈజిప్ట్, రోమ్, మొదలగునవన్నీ కాలగర్భంలో కలసిపోయినా, కేవలం మన సంస్కృతే నిరాటంకంగా ఇంకా కొకసాగుతూ ఉన్నది.

మానవ సంస్కృతి అనేది, మనిషి తన స్వార్థ ప్రయోజనాల్ని అధిగమించి సామాజిక వ్యక్తిత్వాన్ని సంతరించుకునే దశలో రూపుదిద్దుకున్నది. కాల క్రమంలో భారతీయ సంస్కృతి అనే సూర్యుణ్ణి పాశ్చాత్య సంస్కృతి అనే మబ్బులు దట్టంగా ముసురుకోవడం మనం చింతించవలసిన విషయం.

ఆధ్యాత్మికత, తాత్విక చింతన, సామాజిక హితం, భారతీయత అనే నాలుగు స్తంభాలపై భారతీయ సంస్కృతి అనే భవనం నిలబడి ఉన్నది. ఈ కారణాల వల్లనే మనదేశం సమస్త విశ్వానికే ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతూ ఉన్నది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో, వైద్య, సమాచార రంగాలలో అనూహ్యమైన ప్రగతి సాధించిన పాశ్చాత్య దేశాలు, మనశ్శాంతి కోసం, ఆత్మోన్నతికోసం మన సంస్కృతినే ఆశ్రయించడం మనకు తెలిసిన విషయమే. మనవద్ద అపారమైన జ్ఞానసంపద ఉన్నది. ఎన్నో పురాణేతిహాసాలు, దర్శనాలు పునాదిగా మన సంస్కృతి మొగ్గతొడిగి, వికసించిన పుష్పమై దశదిశలా దివ్య పరిమళాల్ని వెదజల్లుతున్నా దురదృష్టవశాత్తు మన ఆధునిక యువత, పాశ్చాత్య నాగరికత, వేషభాషలు, సంస్కృతి వైపే మొగ్గు చూపుతూ మన సంస్కృతిని చిన్నచూపు చూడడం బాధాకరం. ముఖ్యంగా చెప్పాలి అంటే నేటి సమాజంలో నైతిక విలువలు దిగజారి పోవడానికి కారణం మనం మన సంస్కృతిని మరచిపోవడమే.

భారతీయ సంస్కృతికి ఆధ్యాత్మికతే నేపథ్యం. మానవ సభ్యత ప్రారంభ దశలోనే భారతీయ మేధస్సు వికసించి ఆధ్యాత్మికతే మనకు శాశ్వతానందాన్ని, శాంతిని ఇస్తుందని, అదే ప్రతి మనిషి దాహాన్ని తీరుస్తుందని గ్రహించింది. వ్యక్తిగత దైవానుభూతియే భారతీయ తత్త్వ విజ్ఞానానికి మూలాధారము. దీనినుండే భారతీయ ఆలోచనాధార పెల్లుబికింది.

తత్త్వజ్ఞాన ప్రధానమైన భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి (The Spiritual Culture of India)కి మూలాధారములు ప్రధానముగా వేదములు, నీతి శాస్త్రములు, పురాణ, ఇతిహాస, దర్శనములు, కొంతవరకు బౌద్ధ, జైనమతములు మరియు హిందూ మతాచార్యుల

ప్రబోధములు.

వేదములు :

వేదములనేవి జ్ఞానము ప్రసాదించే గ్రంథములు. ఈ జ్ఞానము రెండు రకాలుగా ఉంటుంది. అవి భౌతిక జ్ఞానము మరియు బ్రహ్మజ్ఞానము. వేదములు భగవానుని నిఃశ్వాసతో పాటు వెలువడినవని ఉపనిషత్తులు అన్నాయి. మన సంస్కృతి అనగా ఆధ్యాత్మిక సంస్కృతిని గురించి తెలుసుకోవడానికి ముందు మనం మహర్షి వేదవ్యాసుల గురించి తెలుసుకోవాలి.

విష్ణుపురాణం ప్రకారం నూరు వేల మంత్రాలతో కూడిన మూలవేదం మొట్టమొదటగా భగవంతుని ద్వారా ఋషులకు సాక్షాత్కరించడం జరిగింది. అయితే అది నాలుగు విభాగాలుగా ఉండేది. అయితే కాలక్రమంలో అన్ని కలిసిపోవడం లేదా అనేక అంశాలు లుప్తమైపోవడం జరిగింది. అలాంటి స్థితిలో ద్వాపరయుగారంభంలో కృష్ణ ద్వైపాయనుడు వేదాన్ని సంస్కరించి, బుక్, యజు, సామ, అథర్వమను నాల్గు విభాగాలుగా చేసి, 'వేదవ్యాసుడని' పేరు పొందాడు.

"బ్రహ్మవిద్య" అంటే భగవానుని గురించిన పారమార్థిక విద్య. వేదాలు మన సంస్కృతికి మూలకందాలని చెప్పుకొన్నాం కద. వేదాల్లో జ్ఞాన, కర్మ, ఉపాసనల గురించి తద్వారా జీవితాన్ని సఫలము చేసుకునే విధానం గురించి ఉంది. వేద మార్గంలో పయనించడం వలన హృదయ నైర్మల్యము చిత్తశుద్ధి కలిగి, బ్రహ్మజ్ఞానమును స్వీకరించుటకై కావలసిన పరిపక్వత లభిస్తుంది.

ఇక ఉపనిషత్తులు. ఇవి నిర్గుణ నిరాకారుడైన పర బ్రహ్మమును గూర్చి వివరిస్తాయి. మహాఋషుల యొక్క ఆధ్యాత్మిక అనుభూతుల సంకలనమే ఉపనిషత్తులు. బ్రహ్మమును గురించిన నిగూఢ, విశేష జ్ఞానాన్ని అందించే ఈ ఉపనిషత్తులు కూడా మన సంస్కృతికి ఆధారాలు. ఈనాడు మనకు 108 మాత్రమే ఉపనిషత్తులు మనకు లభిస్తున్నాయి.

మన సంస్కృతిలో ఆత్మ-పరమాత్మ గురించి ఎన్నో విశేషాలు తెలుపబడి ఉన్నాయి. ప్రపంచం పరిణామ శీలము. నిరంతరం మార్పులతో ఉంటుంది. దీనిని నడిపించే సత్యవస్తువు పరమాత్మ. ఇక నిరంతర చలనము, మార్పుకు లోనయ్యే దేహము, అంత రంగముల వెనుక ఉన్న శాంతియుతమైన వస్తువు - సత్యవస్తువు ఆత్మ.

ఆత్మానుభూతికి రెండు మార్గాలు. 1) యమ, నియమ పాలన, 2) ధ్యాన యోగసాధన. జీవిత కాలములో బ్రహ్మానుభూతిని పొందిన వ్యక్తులు (జీవన్ముక్తులు) మరియు మరణ సమయమున మోక్షమును పొందిన వ్యక్తులు పునర్జన్మ నుండి విముక్తులౌతారు.

వ్యక్తి ఎట్టి కర్మను చేస్తాడో, ఎలా ప్రవర్తిస్తాడో అలాగే అవుతాడు అంటుంది మన సంస్కృతి. చెడు కర్మ జేయువాడు చెడ్డవాడవుతాడు. ఈవిధంగా ఉపనిషత్తులు, జీవాత్మ పరమాత్మ ప్రపంచముల యొక్క సంబంధాన్ని సవిస్తారంగా విశదీకరించి, బ్రహ్మోపాసన మార్గములను, మరణోత్తర జీవనమును, కర్మ పునర్జన్మకుగల అవినాభావ సంబంధాన్ని ప్రబోధించి, భారతీయుని ఆధ్యాత్మికోన్నతికి, తత్ఫలితంగా భారతావనిలో ఆధ్యాత్మిక సంస్కృతిని ఏర్పాటు చేయడానికి కారణభూతములైనాయి.

స్మృతులు అనగా నీతి శాస్త్రములు, ధర్మశాస్త్రములు కూడా మన సంస్కృతి ఘనతను వివరిస్తున్నాయి. ఇవి హిందువుల జాతి, సమాజ, కుటుంబ, వ్యక్తిగత విద్యుక్త ధర్మాలను తెలియజేస్తాయి. సమాజ స్థితిగతుల్ని బట్టి వేరు వేరు యుగములకు వేరు వేరు స్మృతులు ఉండేవి.

కలియుగానికి పరాశర స్మృతి నియమించబడింది. స్మృతులన్నిటిలోను మనుస్మృతికి ప్రత్యేకస్థానం ఉంది. కారణం దీనిలో అన్ని విషయాలను వివిధ కోణములలో నుండి విచారించి అత్యంత విపులముగా వ్రాయబడింది. దీనిలో ఉన్న మన సంస్కృతిని ప్రతిబింబించే కొన్ని ముఖ్య ప్రబోధాలు :-

1) ధర్మాచరణ అనగా వేదవిహితములైన కర్మములనే చేయడం.
2) మనో వాక్కాయముల నియంత్రణ.
3) సమత్వ నిర్వహణ.
4) మాతా పితరుల సేవ.
5) దేశంపట్ల బాధ్యత.

ఇక పురాణాల సంగతి చూస్తే వీటి లక్ష్యం వేదముల పట్ల ప్రజలలో విశ్వాసం పెంచి వారిలో దైవభక్తి కలిగించడం. ఇవి ప్రజల జీవితాలను తీర్చిదిద్ది, మత విశ్వాసం పెంచి, ప్రవర్తన గూర్చి, భారతీయతను పెంపొందిస్తాయి. ఇవి పద్దెనిమిది. అలాగే ఉపపురాణాలు కూడా పద్దెనిమిదే. వీటిలో ప్రధానమైన శ్రీమద్‌భాగవత పురాణం, విష్ణుపురాణం, శివపురాణములు.

రామాయణం సత్యవాక్పాలనను, ఆదర్శ దాంపత్యాన్ని, భ్రాతృ ప్రేమను, ధర్మాచరణను, స్నేహధర్మాన్ని, దయ, క్షమ, వినయవిధేయతాది సద్గుణముల యొక్క అవసరాన్ని వాటి విశిష్టతను బోధిస్తే మహాభారతం పంచమ వేదంగా పేరుపొందినది. దీనిలో లోకంలో కనబడే ప్రతి నైతిక, రాజకీయ, ఆధ్యాత్మిక, మోక్ష సంబంధమైన విషయాలు ఉన్నాయి.

ఇది వినాశకాలే విపరీత బుద్ధిః
ధర్మో రక్షతి రక్షితః లను సమర్థించింది.
ధర్మనిష్ఠను, భూతదయను,
అధర్మ వ్యతిరేకతను అలవరచుకొమ్మని ప్రేరేపిస్తుంది.

ఆధ్యాత్మిక సంస్కృతి భారతదేశంలో అలరారుతున్నదంటే దానికి కారణం భగవద్గీత ప్రధానం. గీత ఆధ్యాత్మికోన్నతిని పలువిధములుగా ప్రబోధించడమే కాక మానవుని ఆధ్యాత్మిక సాధనకు ప్రోత్సహించి, అతని ఆత్మోన్నతికి కారణమైనది.

భగవత్ శక్తి, విశిష్టతను తెలిపి, ఆశక్తికి పూర్ణ శరణాగతి చేయవలెనని, అన్ని ధర్మములు వదలి కేవలము మానవ జీవిత లక్ష్యమైన భగవత్ ప్రాప్తికి సహకరించే ధర్మమునే పాటించవలెనని, శాస్త్రోక్తమైన కర్మలు చేసి, దాని ఫలితమును మాత్రమే దైవానికి వదలవలెనని, ప్రేయస్సు కాక శ్రేయస్సును కాంక్షిస్తూ, అంతరంగికాభివృద్ధిపైనే దృష్టి పెట్టవలెనని, నీవు కనబడు శరీరము కావు, నాశములేని ఆత్మస్వరూపుడవని, అన్నియు యుక్తమైన విధానంలోనే స్వీకరించి, భగవద్భక్తితో దైవీమాయను దాటవలెనని అందరూ తనకు సమానులైనా, తనకు పక్షపాతమనునది లేకున్నా, దైవీస్వభావము కలవారు, సత్త్వగుణములు కలిగి, అజ్ఞానములేని వాడే నిజమని దైవ భక్తుడని ఇంద్రియ నిగ్రహాలతో జీవించేవాడే తనకు ఇష్టుడని అన్న భగవద్గీత మన ఆధ్యాత్మిక సంస్కృతికి ఆధారం.

విశ్వంలోని ప్రతి దేశమునకు తనదంటూ ఒక సంస్కృతి ఉంటుంది. అయితే, భారత సంస్కృతిని తప్పించి మిగతా అన్ని దేశాల సంస్కృతులు భౌతిక జీవనానికి, లౌకిక విధానాలకు, దైహిక సుఖాలకు ప్రాధాన్యత ఇస్తే, భారత సంస్కృతి మాత్రము తత్త్వజ్ఞానానికి అనగా పృదావి మొదలు పరమేశ్వరుని వరకు గల పదార్థములకు సంబంధించిన యథార్థ జ్ఞానమునే 'తత్త్వజ్ఞానము' అని అంటారు. తత్త్వ జ్ఞానములో ఆత్మజ్ఞానము ఉంటుంది.

తత్త్వజ్ఞానము దాని మూలమున మోక్ష ప్రాప్తి కలిగించేదే ధర్మము. ధర్మము అనేది వేద విధానములో ఉండే లోకములో సుఖసంతోషములు కలిగించేది మరియు మోక్షప్రాప్తిని కలిగించేదే ధర్మము. అదే మన సంస్కృతికి మూలాధారం.

చివరగా... మన సంస్కృతికి పునాదియైన ఆధ్యాత్మిక సంస్కృతిలో అత్యంత ప్రధానమైనది "అష్టాంగ మార్గం". ఇది జీవన విధానం. జీవితాన్ని న్యాయమార్గములో నడిపింప చేయడానికి ఇవి దోహదపడతాయి. ఇవి ఎనిమిది : 1) సమ్యక్ (యోగ్య) దృష్టి, 2) సమ్యక్ (యోగ్య) సంకల్పము, 3) సమ్యక్ (యోగ్య) వచనము, 4) సమ్యక్ (యోగ్య) కర్మము, 5) సమ్యక్ (యోగ్య) జీవనము, 6) సమ్యక్ (యోగ్య) యుత్నము, 7) సమ్యక్ (యోగ్య) స్మృతి మరియు 8) సమ్యక్ (యోగ్య) సమాధి.

ఆధార గ్రంథాలు :

1) భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి - స్వామి ముకుందానంద (శివానంద ఆశ్రమము).

2) శ్రీ భగవద్గీత - ఆచార్య తెలిదేవులపల్లి ప్రభాకర శాస్త్రి.

3) గీతా సౌందర్యం - శ్రీమతి మోటపర్తి రమాదేవి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కనుమరుగవుతున్న బంజారాల సంస్కృతి – సంప్రదాయాలు

– డా॥. డి. రొంబిబు, తెలుగు శాఖ, నిజాం కళాశాల, హైదరాబాద్.

తరతరాల నుండి మానవ జీవన విధానములో కొనసాగుతున్న ఆచారాలు, కట్టుబాట్లు, నీతి నియమాలు యథాతథంగా కొనసాగించడమే "సంస్కృతి". అయితే ఒక్కొక్క జాతికి, ఒక్కొక్క సంస్కృతి ఉంటుంది. భారతీయ సంస్కృతిలో భాగమే బంజారాల సంస్కృతి. అట్లే ఇతరత్రా జాతులకు, తెగలకు వేరు వేరు సంస్కృతులు ఉన్నా, అవి భారతీయ సంస్కృతిలో భాగమే. అయితే బంజారాలకు, బంజారేతరుల సంస్కృతిలో భేదాలు ఉంటాయి.

భారతీయ సంస్కృతి అనే విషయంపై అనేక మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినా సర్వేపల్లి రాధాకృష్ణ గారి విశ్లేషణ ప్రకారంగా "సహనమే సంస్కృతి" అని వివరించారు. సంస్కృతిపైనా ఎంత మంది వివరణ ఇచ్చినా సమాజంలో జరుగుతున్న మానవ జీవన విధానంలో, ఆలోచనా సరళిలో వారు అనుసరిస్తున్న విధానాలలో ఎలాంటి మార్పు ఉన్నా పూర్వపు పద్ధతులు మనకు కనిపిస్తాయి. ఈ సంస్కృతిలో భాగంగా బంజారాలలో విస్తృతమైన ప్రాముఖ్యత, ప్రాధాన్యత కనిపిస్తుంది. ఇతర జాతుల యొక్క సంస్కృతిలో త్వరితగతిన మార్పులు జరిగినా బంజారాల సంస్కృతిలో మాత్రం అంత తొందరగా మార్పు కనిపించడం లేదు. దీనికి కారణం బంజారాలు గ్రామాలకు దూరంగా ఉండడం.

ఇతర ప్రజలలో దేశ, కాలమాన పరిస్థితులను బట్టి సంస్కృతిలో మార్పులు జరుగుతుంటాయి. గిరిజన తెగల్లో ఒక్కటైన బంజారాలు సమాజానికి దూరంగా ఉండడం వల్ల వారి జీవన విధానంలో కొన్ని ప్రత్యేకమైనటువంటి పద్ధతులు మనకు కనిపిస్తాయి. బంజారాలు కూడా పితృస్వామ్య వ్యవస్థను కొనసాగిస్తూనే ఉమ్మడి కుటుంబాలుగా జీవిస్తారు. బంజారాల వృత్తి ప్రధానంగా వ్యవసాయము. గ్రామాలకు దూరంగా నివాసాలుండే బంజారాలు తాము నివాసం ఉంటున్న ప్రదేశాన్ని "తాండాలు" అని పిలుచుకుంటారు. ఈ మధ్యకాలంలో తాండాలకు కూడా వేర్వేరు పేర్లను (వ్యక్తుల పేర్లు, స్థలాల పేర్లు) పెట్టి పిలుచుకుంటారు.

భారతదేశంలో బంజారాల స్వస్థలం రాజస్థాన్. అయినప్పటికీ వీరు నేడు అన్ని రాష్ట్రాలలో నివసిస్తున్నారు. బంజారాలు ఎక్కువగా దక్షిణ భారతదేశంలోని ఆంధ్రరాష్ట్రంలో ఎక్కువగా నివసిస్తున్నారు. వీరిది బహుజన సమాజం. బంజార అంటే ఒక కులం కాదు. దీనిని ఒక సామాజిక సమూహం అని చెప్పవచ్చు. బంజారాలను కొన్ని రాష్ట్రాలలో గిరిజనులుగాను, మరికొన్ని రాష్ట్రాలలో నోటిఫైడ్ ట్రైబ్స్‌గాను, మరికొన్ని రాష్ట్రాలలో హరిజనులుగాను గుర్తిస్తారు. మన రాష్ట్రంలో 1967 తర్వాత ఎస్‌టిలుగా గుర్తించింది. బంజారాలు తమకు తాము గిరిజన ప్రవృత్తిని స్వీకరించిన వారే తప్ప వారు గిరిజనులు మాత్రం కాదని బి.ఎస్.ఆర్. కృష్ణ గారు బంజారా చరిత్ర, సంస్కృతి-ప్రగతి అనే గ్రంథంలో పేర్కొనడం జరిగింది. బంజారాలు మొదటి నుంచి నాగరికత కలిగిన వారని, దేశమంతటా తిరిగి వ్యవసాయం చేసేవారని, వ్యవసాయంలో పరిపూర్ణమైన అవగాహన కలిగిన వారు బంజారాలే అని చెప్పవచ్చు.

బంజార అంటే "బన్" అంటే ఉర్దూలో "అడవి" అని అర్థం. "జారా" అంటే "జీనేవాలే" (బ్రతికేవాళ్ళు) అని అర్థం. "జంగల్‌మే జీనేవాలే" అంటే "అడవిలో బ్రతికే వాళ్లు" అని అర్థం.

బంజారాల సంస్కృతి :

బంజారాలు తమ ప్రధాన వృత్తి అయిన వ్యవసాయాన్ని కొనసాగిస్తూనే వ్యాపారాలు కూడా చేస్తారు. బంజారాలు ఎంతోమంది రాజులకు అనేక రకాలుగా

సహాయం అందించిన వారు, బంజారాలకు ఒక విశిష్ట మైన, ఉన్నతమైన సంస్కృతి కలిగి వుందని చెప్పవచ్చు. బంజారా స్త్రీల వేషధారణ, వారి జీవన శైలికి ప్రతిబింబాలు. ఇప్పటికి బంజారా స్త్రీలు "తాండా"లలో తమ వస్త్రధారణ సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే నేటి ఆధునిక సమాజంలో బంజారా స్త్రీలు పట్టణీకరణ పేరుతో వేషధారణలో మార్పులకు గురి కావడం జరుగుతుంది.

బంజార స్త్రీలు వేషధారణలో భాగంగా ఛాంటియా (పైటకొంగు), కాలీ (జాకెట్), ఫేటియా (లంగా), బల్యా (గాజులు), కోల్డా (పట్టీలు), ఫూల్లీ (ముక్కుపోగు), భూరియా (మెడలో హారం), ఘూంగ్టో (కొంగు) ఇలాంటి ఆభరణాలు ధరిస్తారు. వీటిలో వెండి, రాగి, సీసం మొదలైన వాటితో చేసిన ఆభరణాలతో పాటు మెడలో వేసుకునే హారంలో రూపాయి నాణెములు కూడా ఉంటాయి. కాళ్ళకు వేసుకునే పట్టీలల్లో (కోల్డా) మువ్వలు కూడా ఉండటం ప్రత్యేకత. ఈ ఆభరణాలు బంజార స్త్రీలకు అలంకరణతో పాటు భౌతికరక్షణ కూడా కల్పిస్తాయి. ఈ వస్త్రాభరణ ధారణను బంజార స్త్రీలు కొన్ని వందల సంవత్సరాల నుండి వేసుకొని కాపాడు కుంటూ వస్తున్నారు. బంజార సమాజంలో పురుషులు సామాన్యంగా నిరాడంబరమైన దుస్తులు మాత్రమే ధరిస్తారు. వీరి వేష ధారణలో ప్రత్యేకత ఏమీ ఉండదు.

బంజారాల వివాహ పద్ధతి :

పెళ్ళికంటే ముందే "బెల్లం" తినడం అనేది ఒక ఆచారం. (పూలు, పండ్లు పెట్టడం లేదా మాట ముచ్చట కావడం లేదా సంబంధం కుదరడం అని అర్థం). తండాలో కుల పెద్దలు (తండా పెద్దలు) అమ్మాయి తరపున మరియు అబ్బాయి తరపున బంధువులు కలిసి తండాకు సమీప ప్రాంతంలో ఒక చెట్టు క్రింద కూర్చొని "బెల్లం తినడం" అనే కార్యక్రమం చేస్తారు.

కుల పెద్దల సమక్షంలో రెండువైపులా వారికి కుంకుమ బొట్టు పంచుకొని, ఇరువైపుల వారికి ఇవ్వడం జరుగు తుంది. ఈ కార్యక్రమం కులం పెద్ద (గురువు లేదా దేవుని మనిషి) ఆధ్వర్యంలో జరుగుతాయి. తర్వాత మత్తు పానీయాలను సేవిస్తారు. దీనితో పాటుగా ధూమ పానంను కూడా సేవిస్తారు.

బంజారాల్లో పూర్వకాలం నుండి వరకట్న పద్ధతి లేదు. బాల్య వివాహాలు కూడా లేవు. బంజారాల వివాహాన్ని సాంప్రదాయబద్ధంగా అయిదు (05) రోజులు చేస్తారు. మేనరికపు వివాహాలు చేసుకుంటారు. పెళ్లికి ముందు వరుడిని, వధువు ఇంట్లోనే నెల రోజులు ఉంచుకొని వరుడి గుణగణాలను తెలుసుకుంటారు. ఈ నెల రోజుల సమయంలో వరుడి పనితనం (వ్యవసాయానికి సంబంధించిన పని విషయంలో నేర్పరితనంను గురించి తెలుసుకోవడం)తో పాటు ఆహారపు అలవాట్లు, నియమాలు, మాట, మంచితనం, వరుడి గుణగణాలను తెలుసుకుంటారు.

పెళ్ళికి ముందు సమయంలో వరుడిని బాగా కాగుతున్న వేడి నీటితో స్నానం చేయిస్తారు. స్నానం చేయించేటప్పుడు వరుడు "అబ్బ" అని అనకూడదు. (అంటే ఆ వేడి నీటికి భయపడకూడదు అని అర్థం). వరుడికి వరుస అయిన వాళ్లు అనగా వదిన లేదా బావ వరుస అయిన వాళ్లు మాత్రమే స్నానం చేయిస్తారు. ఆ క్రమంలో వరుడు భయపడితే వధువును ఏలుకోలేడు అనేది వారి నమ్మకం.

బంజారాల వివాహ వేడుకల్లో మధు, మాంసాలను సేవించడం తప్పనిసరి. వితంతు వివాహాలు జరుగు తాయి. అయితే బంజారాల్లో మాత్రం వివాహం అయిన తర్వాత భర్త చనిపోతే ఆ వంశానికి సంబంధించిన వారే (పాలోళ్ళు) అదే ఇంటి పేరు కలిగిన అన్న గానీ, తమ్ముడు గానీ ఆ స్త్రీని వివాహం చేసుకోవాలి. ఒకవేళ అన్న గానీ, తమ్ముడు గానీ, లేకపోతే మామ పెళ్ళి చేసుకోవాలి. (అంటే ఆ స్త్రీని పోషించాలి). బంజారాల్లో తమ వంశానికి చెందిన బిడ్డలు ఇంకో వంశానికి చెందకూడదనేదే దీని ప్రధాన ఉద్దేశ్యము. బంజారాలలో బహు భార్యత్వం ఉంది. పెళ్ళి సమయంలో వరుడికి జంతువులను,

భూములను అరణంగా ఇస్తారు. (పెళ్ళిచేసి పంపే సమయంలో అమ్మాయికిచ్చే వస్తువు గానీ లేదా పాడి ఆవు కానీ అరణం అంటారు).

ఈ పెళ్ళి పద్ధతి అంతయూ హిందూ సంప్రదాయ పద్ధతిలోనే జరుగుతుంది. ప్రేమ వివాహాలు ఉండవు. పెద్దల ఇష్ట ప్రకారమే పెళ్ళిళ్ళు జరుగుతాయి. నచ్చలేదు అనే మాట ఉండదు. పెళ్ళి అయిన అమ్మాయిని అత్త గారింటికి పంపిన తర్వాత తల్లిగారింటికి అంత తొందరగా తీసుకురారు. సుమారుగా ఆరు నెలలు లేదా సంవత్సరం కూడా కావచ్చు.

బంజారాల కుటుంబాల్లో అతిథి మర్యాదలు :

బంజారాల్లో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువ. కొత్తగా ఇంటికి వచ్చిన పెళ్ళికూతురు అత్త, మామలకు మరియు భర్తకు సపర్యలు చేయాలి. అనగా పడుకునే ముందు అత్తమామల కాళ్ళు ఒత్తాలి మరియు స్నానం చేయించాలి. వారు నిద్రలోకి జారుకోగానే, పాదాభివందనం చేసి పడుకోవాలి. స్త్రీ పరాయి పురుషులకు ముఖం చూపించ కూడదు. ఇంటికి వచ్చిన అతిథిని సాదరంగా ఆహ్వా నించాలి. ఆశీర్వాదం తీసుకోవాలి. వారికి మజ్జిగ, తేనీరు అందించాలి. ఏ పని ఏసినా అత్త అనుమతితో చేయాలి. స్నానం చేసే సమయంలో సబ్బు వాడకం తక్కువ. మగ పెళ్ళి అయినా, ఆడ పెళ్ళి అయినా తండ్రి ఇష్టంగానే జరగాలి. బంజారాలు అతిథులంటే భగవత్ స్వరూపులని నమ్ముతారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారు.

అతిథి మర్యాదల విషయంలో బంజారాలకు ఒక ప్రత్యేకస్థానం ఉండేది. ఒక స్త్రీ తన తల్లిగారి ఊరికి సంబంధించిన స్త్రీ కనిపించినా, లేదా బంధువులు కని పించినా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని, తలమీద కొంగు కప్పుకొని (ఢాన్లో) సుఖ దుఃఖాలను ఏడుపు రూపంలో పంచుకుంటారు. అందులో తల్లిగారి యొక్క యోగ క్షేమాలు అడగడంతో పాటు వారి బాగోగులను కోరుకోవడం ఆనవాయితీ. బంజారాల్లో తన ఇంటికి వచ్చిన అతిథులను ఎంతో గౌరవంగా చూస్తూ, వారికి ఆతిథ్యం ఇవ్వడం జరుగుతుంది. మత్తు పానీయాలు ఇవ్వడం, మాంసాహార భోజనం పెట్టడం తప్పకుండా ఉంటుంది.

బంజారాల సాంస్కృతిక పద్ధతులు :

బంజారాలు వ్యవసాయాన్ని నమ్ముకొని అడవితల్లి ఒడిలో ఓలలాడుతూ, మట్టితో మమేకమై జీవిస్తారు. ఆటా, పాట, పెళ్ళి, పేరంటం, ఉత్సవం ఏది జరిగినా అందరూ కలిసి ఆనందంగా జరుపుకుంటారు. బంజారాలు నిజమైన సాంస్కృతిక జీవనం కొనసాగిస్తారంటే అతిశయోక్తి కాదు. అడవిలోని మయూరం ఆనందం కలిగినప్పుడు పురివిప్పి ఆడినట్లే బంజారాల స్త్రీలు హోళీ మరియు మొలకల పండుగ మొదలైన ఉత్సవాల్లో నృత్యం చేస్తున్నప్పుడు రాత్రిపూట భజన చేయడం, భజనల్లో దైవస్తుతి ఎక్కువగా ఉండడం, ప్రకృతికి సంబంధించిన, అడవి తల్లికి సంబంధించిన మొదలైన పాటలు పాడుతూ భజనలు చేయడం జరుగుతుంది. అయితే ఈ భజన కార్యక్రమాలు వ్యక్తులు చనిపోయిన తర్వాత వారి జ్ఞాపకార్థం కూడా చేస్తుంటారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల సమయాల్లో అనేక వాయిద్యా లను వాడుతారు. నంగారా థాలి (ఇత్తడి పళ్ళెం), తాళే (ఇత్తడి తాళాలు), కంజర, ముఖ్యమైన వాటిని ఉప యోగిస్తారు.

బంజారాల్లో పొద్దుపొడుపు (సూర్యుడు ఉదయిం చడం), పొద్దుగూకడం (సూర్యుడు అస్తమించడం) అనేది ఈ నంగారా థాళితోనే జరుగుతుంది. దీనితోనే నిద్ర పోతారు. మరియు మేల్కొంటారు. అయితే వీటన్నింటినీ చేయడానికి మూలం శ్రమను మరిచిపోవడానికి, మానసిక ఉల్లాసం పొందడానికి చేసే కార్యక్రమాలే ఎక్కువ.

ఆహారపు అలవాట్లు :

బంజారాలు శాఖాహారం కంటే మాంసాహారాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. వేట అంటే బంజారాలకు ఎంతో ఇష్టం. మేక, గొర్రె, కోడి మాంసాలతో పాటు అడవి

జంతువులైన కుందేలు, ముంగీస, ఉడుము, తోడేలు, చేప మొదలైన వాటి మాంసాలను ఇష్టపడి భుజిస్తారు. ఎక్కువగా మాంసాన్ని నిప్పుల్లో కాల్చి తినడానికి ఇష్టపడతారు. మరియు ఎండబెట్టుకొని తినే అలవాటు వుంది. సజ్జ, జొన్న అన్నంతో పాటు రొట్టెలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. అలాగే మాంసాన్ని ఎండబెట్టుకొని కూడా తింటారు. శాఖాహారంలో ఆకు కూరలకు కూడా మాంసానికి ఇచ్చే ప్రాముఖ్యం ఇస్తారు. "బొద్దికూర" అనే ఒక రకమైన ఆకుకూరకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. ఈ బొద్దికూర తెలియని బంజారాలు ఉండరంటే అతిశయోక్తి కాదు.

దోసకాయలు మొదలైన వాటిని ముక్కలుగా చేసి ఉప్పుకలిపి ఎండబెట్టి (ఒరుగుచేసి) అప్పుడప్పుడు వండుకొని తినడం ఎక్కువగా కనిపిస్తుంది. మాంసాన్ని కూడా ఎండబెట్టి (వట్టికూర, సుభిబోటి) తినడానికి ఎక్కువగా ఇష్టపడతారు.

ముగింపు :

బంజారాల జీవన విధానంలో మనకు కనిపించే అనేకమైన అంశాలు ఆచార, వ్యవహారాలు, సంప్ర దాయాలు, కట్టుబాట్లు, ఎంతో ప్రాధాన్యం కలిగినవి. అయితే నేటి ఆధునిక సమాజంలో పట్టణీకరణ, నగరీ కరణ జరిగిన తర్వాత బంజారాలు ఇతర సమాజంతో సంబంధాలు పెంచుకొని ఆధునిక నాగరికతకు దగ్గరగా ఉండే పద్ధతుల్ని అనుసరించడం గతంలోని తమ ఆచార సంప్రదాయాలను రోజు రోజుకు ఒక్కొక్కటిగా మరిచి పోతూ వాటి నుండి దూరమవుతున్నారు. సమాజంలో మార్పు అనేది జరగాలనే అందరూ కోరుకుంటారు. కానీ ఆ మార్పు మంచిదై ఉండాలి. గతంలోని మంచిని కూడా వర్తమానంలో అనుసరించేవి కూడా ఉండాలి. వాటిలోని మంచివాటిని కొన్నింటినైనా బంజారా సమాజం మరవ కుండా కనుమరుగవుతున్న బంజార సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాసాని వృత్తి నవల 'పరస'

– జి. పార్వతి, సహ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు నవలా సాహిత్యంలో వృత్తి సంబంధమైన నవలలు దాదాపు 50 వరకు వచ్చి ఉండవచ్చు. అందులో ఊరూరా తిరుగుతూ బిక్షక వృత్తి చేస్తూ జీవితం గడిపే వారిని ఇతివృత్తంగా చేసుకొని చిత్రించిన నవలలు తెలుగులో అరుదు. అటువంటి వాటిలో వి.ఆర్. రాసాని రచించిన 'పరస' నవల ఒకటి. చిత్తూరు జిల్లా పరిసర ప్రాంతాల్లో గంగిరెద్దులను ఆడిస్తూ జీవనాన్ని గడిపే గంగిరెద్దులవారి జీవన విధానం 'పరస' నవలలోని సాంఘిక ఇతివృత్తం. వృత్తిని బట్టి వీరికి ''గంగిరెద్దుల వారు'' అని పేరు వచ్చింది. నిజానికి వీరు యాదవులు. వీరు కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో తమ ప్రదర్శనల ద్వారా జీవనం సాగిస్తూ, సొంత ఊరు ఉన్నా ప్రదర్శనల నిమిత్తం సంచార జీవనాన్ని సాగిస్తారు. పశు సంపద మీదే ఆధారపడి జీవించే వీరికి సామాజికంగా ఎన్నో అవాంతరాలు ఎదురవుతూ ఉంటాయి. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం కరువు ప్రాంతం. వర్షాలు సరిగా పడని ఆ ప్రాంతాలలో జనజీవనానికే సరైన నీటి వసతి ఉండదు. ఆ పరిస్థితులలో ఎద్దులను పెంచుతూ వాటి ద్వారా బ్రతుకు కొనసాగించటం చాలా కష్టం. అటువంటి కష్టాలను అనుభవిస్తూ బీరేశయ్య కుటుంబం గడిపిన జీవన విధానాన్ని చిత్తూరు మాండలికంలో చిత్రించిన నవల 'పరస'. ఈ నవలలో రాసాని గారు ఒక ప్రక్క గంగిరెద్దుల వారి జీవితాన్ని చిత్రిస్తూ, మరో ప్రక్క ఈ వృత్తి కనుమరుగవుతున్న తీరును కళ్ళకు కట్టినట్లు చూపించారు.

రాసాని వెంకట్రామయ్యగారు ''వి.ఆర్. రాసాని''గా సాహితీ ప్రియులందరికీ తెలుసు. 1957 ఏప్రియల్ 19వ తేదీన చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కురవపల్లె గ్రామంలో జన్మించారు. రాసాని గారు కథకుడు, నవలాకారుడు, నాటక రచయిత, కవి, కాలమిస్టు అలాగే నాటక ప్రయోక్త. ఈయన శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా తమ సేవలందించారు. ఈయన రచనలు మెరవణి, పయనం. మా ఊరికతలు, కృష్ణదేవరాయల కథలు అనే కథా సంపుటాలు, చీకటి రాజ్యం, మట్టి బతుకులు, చీకటి ముడులు, ముద్ర, వలస, ఏడో గ్రహం, బతుకాట, పరస వంటి నవలలను స్వర్గానికి ఇంటర్వ్యూ, దృష్టి, జలజూదం, నేలతీపి, మనిషి మారిపోయాడు వంటి నాటికలను కాటమరాజు యుద్ధం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, చెంచు, అజ్ఞాతం వంటి నాటకాలను రచించారు. కామధేను, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, కళాదీపిక వంటి పత్రికలలో కాలమిస్టుగా పనిచేస్తున్నారు. ఈ పరస నవలలో ముఖ్య పాత్రధారి బీరేశయ్య. ఘంటా వారి పల్లెలో ఒక సన్నకారు రైతు బీరేశయ్య. ఈయనకు పది గొడ్లు. అందులో ఒకటి గంగిరెద్దు, రెండు సేద్యపు ఎద్దులు, రెండు కోడెదూడలు, మిగిలినవి పాడావులు. తండ్రి కోటయ్య, భార్య భాగ్యమ్మ, ఇద్దరు కొడుకులు మునుస్వామి, బాలయ్య. తమ్ముడు కనకయ్య మరదలు కనకమ్మ. వీరంతా ఉమ్మడి కుటుంబంగా ఉంటూ ఎంతో ఐకమత్యంతో పనులన్నీ చేసుకుంటూ, జీవనం సాగిస్తూంటారు. బీరేశయ్య తన గంగిరెద్దుతో పాటు తమ్ముడు కనకయ్యకు ఒక గంగిరెద్దు ఉంటే వాడి జీవనం వాడు సాగిస్తాడనే ఉద్దేశ్యంతో పరసలన్నీ తిరిగి, చివరకు శేదళారి చిన్నబ్బ సహాయంతో పుంగనూరు పరసకు బయలుదేరడంతో ఇతివృత్తం మొదలవుతుంది. బీరేశయ్యకు గంగిరెద్దులాట తన తండ్రి కోటయ్య నుండి వంశపారంపర్యంగా వస్తుంది. వీరి వృత్తి ఆధారంగానే వీరు గంగెద్దుల వారిగా ఊరిలో చలామణి అవుతారు. గంగెద్దుల కోటయ్య వృద్ధాప్యం కారణంగా తన వృత్తిని

పిల్లలకు అప్పగించి వాళ్ళకున్న గొర్రెలను, మేకలను మేపుతూ కాలక్షేపం చేస్తాడు.

పరస (పశువుల సంత)లో గంగెద్దును కొనాలంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. పశు వులలోని వివిధ జాతులు, వాటి కుంటే మచ్చలు, సుడులు గూర్చి తెలియాలి. వీటన్నింటి గురించి ప్రతీరెతుకు తెలియడం కష్టం. అందుకే బీరేశయ్య చిన్నబ్బతో పుంగనూరు పరసలో ఒక కోడెదూడను కొనడానికి పుంగనూరు చేరతాడు. దళారి చిన్నబ్బ పుంగనూరు పరస ఏర్పాటైన విషయాలు, పరసలో వివిధ జాతుల పశువులను, వాటికుండే మచ్చలు, సుడులను గూర్చి ఎన్నో విషయాలు చెబుతూ బీరేశయ్యకు ఒక కోడెదూడను, గంగ చంద్రకు రెండు ఎద్దులను కొనిపెడతాడు. ఈ సందర్భంలో దళారి చిన్నబ్బ చాకచక్యంగా మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. తన తెలివి తేటలతో తనకు రావలసిన కమీషనును తాను రాబట్టుకుంటాడు.

''ఇంటికి బిడొచ్చిన వేళ - గొడొచ్చిన వేళ'' అన్నట్లు తన వృత్తి మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగాలనే కోరుకుంటూ బీరేశయ్య కోడెదూడను ఇంటికి తెచ్చి, పసిపిల్లలాగ జాగ్రత్తగా, వాటిని మచ్చిక చేసుకుని, దాని మంచి చెడ్డలు ఎప్పటికపుడుకనిపెడుతూ, వాటికేమైనా వ్యాధులొస్తే సమయానికి తగిన వైద్యాన్ని అందిస్తూ జాగ్రత్తలు తీసుకుంటాడు.

ఒకనాడు బీరేశయ్య తాను కొన్న కోడెదూడకు లచ్చు మన్న అను పేరు పెట్టి తన సొంత బిడ్డలా సాకుతూ, మేళం ఊదుతూ తర్ఫీదునిస్తుంటాడు. కొడుకు మునస్వామి మేళం ఊదుతానంటే మేళాన్ని మునుస్వామి కిచ్చి, దూడను మచ్చిక చేసుకుంటూ, దాని గంగడోలును నిమురుతూ, ''ఒరే లచ్చుమన్నా.... అదో ఆడుండేది నీ అన్న రాముడు, నీ పేరు లచ్చుమన్న మరి మీరిద్దరూ అన్నదమ్ములన్న మాట ఇప్పుడు నువ్వు నేను చెప్పినట్లు వింటున్నావు. రా... రా... నా తొడల పైన కాళ్ళు పెట్టరా'' అని మెల్లగా దాని పొట్ట కింద వేళ్ళతో నిమురుతూ, రాగయుక్తంగా పాడుతూ ఉంటాడు. ఈ సందర్భంలో దూడను మచ్చిక చేసుకోవడంలో బీరేశయ్య ఓర్పు కళ్ళకు కట్టినట్లు రచయిత చిత్రించారు.

పుంగనూరు పరసలో బీరేశయ్యతో పాటు ఎద్దులను కొన్న గంగచంద్ర బండిని సరిగ్గా లాగడం లేదని పదే పదే కోలకట్టెతో కొట్టడంతో, అవి మొండికేసి కూర్చుంటాయి. మరోసారి కపిలబావి లాగుతున్నప్పుడు కూడా మొరాయిస్తాయి. వాటితో విసిగిపోయి గంగచంద్ర వాటిని చిన్నబ్బ సాయంతో తిరిగి అమ్మకానికి పెడతాడు. దీనిని బట్టి మనం పశువులను మచ్చిక చేసుకునే విధానాన్ని బట్టి అవి వాటి పనితనాన్ని మనకు అందిస్తాయి అని అర్థమవుతుంది.

ఘంటావారి పల్లె సర్పంచి సామెర్ల శంకర్రెడ్డికి ఒక కొడుకు కూతురు. ఆ ఊరిలో ''రెడ్డి'' కులాల వారిదే ఆధిపత్యం. శంకర్రెడ్డికి పశువులతో పాటు ఒక దేవరదున్న ఉంటుంది. ఊరి ఆచారం ప్రకారం దేవరదున్న ఊరిలో ఎవరి చేలో మేసినా , ఎవరూ దానిని ఏమీ అనకూడదు. ఒక రోజు దేవరదున్న బీరేశయ్య చేలో పడి మేస్తుండగా దానిని ఏమీ అనరు. కానీ బీరేశయ్య తండ్రి కోటయ్య గొర్రెలను, మేకలను కాపుకాస్తూండగా శంకర్రెడ్డి చేలోకి గొర్రెపిల్ల వెళ్ళిందని కేశవ రెడ్డి ఆ గొర్రెపిల్లను రాళ్ళతో కొట్టగా, దానికి కాలువిరుగుతుంది. గొర్రెకాలు విర గొట్టింది కేశవ రెడ్డే అన్న నిజం తెలుసుకొని కనకయ్య, కేశవరెడ్డిని తిడుతూండగా అక్కడే ఉన్న శంకర్రెడ్డి తనకొడుకును తిట్టిన వాళ్ళను దెబ్బతీయాలని పళ్ళు కొరుకుతూ ఇంటికి వెళ్ళిపోతాడు. బీరేశయ్య, కోటయ్య మాత్రం నోరులేని జీవాలమీద కోపం చూపించిన శంకర్రెడ్డి, కేశవరెడ్డిల కఠిన మనస్సును తలచుకొని బాధపడుతారు.

ఒక రోజు బీరేశయ్య కోడెదూడ తాడు తెంపుకుని శంకర్రెడ్డి పొలంలోకి వెళ్ళిందని కేశవరెడ్డి దాన్ని చావబాదుతూ బీరేశయ్య ఇంటివైపు తోలుకొస్తాడు. దూడ కనిపించక పోయేసరికి వెదుకుతూ బీరేశయ్య వీధిలోకి రాగా, దూడ దెబ్బలతో ఉండటం చూసి బాధపడుతూ

కేశవరెడ్డిని అడిగినందుకు, కేశవరెడ్డి బీరేశయ్యను అశ్లీలంగా మాట్లాడతాడు. అన్నయ్యను అంతలేసి మాటలన్నందుకు కనకయ్య చేయి చేసుకోగా, కేశవరెడ్డి క్రింద పడిపోతాడు. అందరిముందూ క్రింద పడటంతో అవమాన భారంతో ఇంటికి చేరి, బీరేశయ్య ఏమి చూసుకుని మిడిసిపడుతున్నాడు, ఆ గంగిరెద్దుల వాళ్ళ మీద ప్రతీకారం తీర్చుకోవాలని పగతో అదను కోసం ఎదురు చూస్తుంటాడు. శంకర్రెడ్డి కొడుకుతో కలిసి.

దేవరెద్దును ఊరూరా ప్రతి ఇంటికీ తిప్పించి, దేవరెద్దుల వేలుపు చేయడం రాయలసీమలో ఒక సాంప్రదాయం. వచ్చే శనివారం ఘంటావారి పల్లెకి గంగిరెద్దు వస్తోందని, ఊరు జనమంతా ఇళ్ళూ, వాకిళ్ళు అలుక్కుని, కాయ, కర్పూరం తెచ్చుకుని, నాణ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఊరంతా తిరిగి చాటింపు వేస్తాడు వెంకటేశు. ఆ వార్త విన్న ఊరి జనమంతా ఇల్లంతా శుభ్రం చేసుకుని దేవరెద్దు ఎప్పుడు వాళ్ళింటికి వచ్చి పూజలందుకుంటాదోనని ఎదురుచూస్తుంటారు. ఆ ఊర్లో ఏది ఆరంభించాలన్నా దక్షిణ దిక్కున గల రాశింటితోనే మొదలవుతుంది. పండగ పబ్బాలకు, పంపకాలు వేయాలన్నా, వేటను కోసి భాగాలుగా మాంసాన్ని పంచాలన్నా, దేవరెద్దు ఊరేగింపైనా రాశింటివారైన బీరేశయ్య ఇంటి నుండే ప్రారంభం కావాలి. ఇది తరాల నుండి వస్తున్న ఆచారం. ఈ సారి గ్రామ సర్పంచి శంకర్రెడ్డి బీరేశయ్య కుటుంబంపై దెబ్బ తీయాలనే ఉద్దేశ్యంతో దేవరెద్దు మొదటి పూజ ముందుగా తన ఇంటి నుండే ప్రారంభం కావాలని పట్టుబడతాడు. ఎద్దు దాసరి ఘంటానాగరాజు ఎంత చెప్పినా వినకపోవడంతో దేవరెద్దుపూజ శంకర్రెడ్డి ఇంటినుండే ఆరంభమౌతుంది. విజయ గర్వంతో కేశవరెడ్డి వాళ్ళు నవ్వుచుండగా అప్రయత్నంగా బీరేశయ్య వెనక్కి చూడగా శంకర్రెడ్డి చూపులు బీరేశయ్య గుండెల్లో బాణంగా గుచ్చుకుంటాయు. తరాల నుండి వస్తున్న ఆచారం ఈసారి జరగనందుకు ఏమి అశుభం జరుగుతుందోనని బీరేశయ్య కుటుంబం బెంగ పెట్టుకుంటుంది. కాలాధిపత్యంతో, అధికార గర్వంతో శంకర్రెడ్డి బీరేశయ్య కుటుంబంపై ప్రతీకారం తీర్చుకోవడానికి వేసిన మొదటి దెబ్బ అది.

మరునాడు ఉదయమే బీరేశయ్య భార్య భాగ్యమ్మ తలస్నానం చేసి, ఆవు పంచితం కోసం కొట్టంలోకి వెళ్తుంటే కోటయ్య చనిపోయిన తన భార్యను గుర్తుచేసుకుంటూ "శుక్రవారం రాగానే తలస్నానం చేసి, ఇల్లంతా ఆవు పంచితం చల్లడం వల్ల దోషాలు తొలిగిపోతాయని, క్రిమికీటకాలు రావని ఇల్లు పవిత్రమవుతుందని చెప్పేది. బహిష్టు అయితే ఆ మూడు రోజులు వెలుపలే ఉండేది" అని తలచుకొని బాధపడతాడు. ఈ సన్నివేశంలో వీరి కుటుంబంలో ఆచారాలు, సంప్రదాయాలు ఎలా పాటించేవారో తెలుస్తుంది. భాగ్యమ్మ గొడ్ల చావిడిలోకి వెళ్ళేసరికి అక్కడ తన చిన్నకొడుకు బాలయ్య కోడెదూడతో ఆడటం చూస్తుంది. భాగ్యమ్మను చూడగానే కోడెదూడ ఆమె కొంగు పట్టుకొని ఆమెతో పాటు ఇంట్లోకి చేరి నట్టింట్లో పడుకుంటుంది.

అదే సమయంలో కూలి పని పురమాయించడానికి బీరేశయ్య ఇంటికి వస్తాడు చెంగారెడ్డి. నట్టింట్లో పడుకున్న దూడను చూస్తాడు. అంతవరకూ దూడ నట్టింట్లో పడుకున్న దూడను బీరేశయ్య గమనించలేదు. "ఎంతో డబ్బుపోసి పరసలన్నీ తిరిగి తెచ్చిన దూడ ఇప్పుడు వీడి కంట్లో పడింది. ఏమైతుందోనని" భయపడతాడు బీరేశయ్య. ఆరోజు శనివారం. దేవరెద్దు ముసల్ది కావడంతో దాని స్థానంలో గురువెద్దును, ఎద్దుదాసరిని ఎన్నుకునే వేడుక వేల్పులబీడులో ఏర్పాటవుతుంది. చుట్టూ ఉన్న ఊర్ల నుండి దేవరెద్దులన్నీ వేల్పుల బీడుకు చేరుకుంటాయి. అన్ని ఎద్దులలో గురువద్దు నిర్ణయించే సమయంలో ఎద్దుదాసరి ఘంటనాగరాజు వేల్పుల ఉత్సవాన్ని ప్రారంభిస్తాడు. దేవరెద్దుగా ఎన్నుకోబడే దూడకు ఇంట్లో పడుకోవడం ఒక ఆచారం. ఈ విషయం గూర్చే బీరేశయ్య భయపడింది. ఇదే అదనుగా చెంగారెడ్డి

చెప్పినమాటతో శంకర్రెడ్డి ఘంటానాగరాజు చెవిలో రహస్యంగా ఏదో మాట్లాడుతాడు. దేవరెద్దును వెంకటేశ్వరునిగా భావించే ఆ ఊరి ప్రజలందరి ముందు దేవరెద్దుగా బీరేశయ్య దూడను, ఎద్దు దాసరిగా చిన్న కొడుకు బాలయ్యను నియమించి ప్రకటిస్తారు. ఎన్నో ఆశలతో గంగెద్దుగా తయారు చేసుకుందామని ఎన్నో పరసలు తిరిగి తెచ్చుకున్న దూడను బీరేశయ్య కుటుంబం నుండి దూరం చేయడం శంకర్రెడ్డి ప్రతీకారానికి మరో నిదర్శనం.

పొలాలన్నీ కోతలైపోయి ఖాళీగా ఉన్న సమయంలో బీరేశయ్య, కనకయ్య మునుస్వామి గంగెద్దు రామన్నను, నడుంమీద వేరే కాలున్న సీతమ్మ అనే ఆవును వెంటబెట్టుకొని ఊరూరా ప్రదర్శనలకు వెళతారు. ఇదే సమయంలో శంకర్రెడ్డి దొంగలను పురమాయించి బీరేశయ్య గొడ్లచావిడిలో నున్న రెండు ఎద్దులను దొంగలించేలా చేస్తాడు. ఇంటికి వచ్చిన బీరేశయ్యకు ఎడ్లు కనిపించక పోయేసరికి చుట్టుప్రక్కల ఊర్లన్నీ వెతికించి, చివరకు పోలీసులకు రిపోర్ట్ చేసి ఇంటి వస్తాడు. మర్నాడు పశువుల పండగ, ఆరోజు రంగు రంగు ప్రభలతో చక్కగా అలంకరించిన గంగెద్దును, ఆవును, మిగిలిన పశువులను బీరేశయ్య, కనకయ్య తోలుకురాగా, మునుస్వామి బాలయ్య దేవరెద్దును కాటమరాజు కొలుపు దగ్గరికి తోలుకొస్తారు. కాటమరాజు కథను, విరాట పర్వంలోని ఉత్తర గోగ్రహణాన్ని అందరూ తలచుకొని పూజ పూర్తయిన తర్వాత ఎద్దుల గూర్చి ఆలోచిస్తూ గంగెద్దును, పశువులను ఇంటికి తోసుకువస్తున్న సమయంలో బీరేశయ్యవైపు తన ఏద్దులను తోలుకువస్తాడు శంకర్రెడ్డి. వెనక్కి తిరిగి చూసిన కనకయ్యకు శంకర్రెడ్డి వంకర మూతితో వికారంగా నవ్వడంతో వాడే ఎద్దులను ఏదో చేసుంటాడని అనుమానం వస్తుంది. బీరేశయ్య మీద కోపంతో శంకర్రెడ్డి ఎద్దులను తోలగా కొంచెంలో తప్పించుకున్న బీరేశయ్య చేతిలోనుండి గంగిరెద్దు త్రాడు జారిపోతుంది. గంగిరెద్దు కోపంతో వస్తున్న ఎద్దును పొడవగా, అది పక్కగా ఉన్న బావిలో పడిపోతుంది. దాంతో ఆ ఎద్దు కుంటిదైపోతుంది. ఈ సందర్భంలో బీరేశయ్యను ఆ బావిలో పడేద్దామని అనుకున్న శంకర్రెడ్డి పథకం మారి తన ఎద్దే కుంటిదైపోతుంది.

రెండు రోజుల తర్వాత పోలీసులనుండి సమాచారం రావడంతో రెండు ఎద్దులను కబేలా వద్ద అమ్మ బోతుండగా పట్టుకున్నామని, ఎద్దులను బీరేశయ్యకు అప్పగిస్తారు పోలీసులు. కానీ దొంగలెవరో చెప్పరు. ఎద్దులు దొరికినందుకు ఆనందంతో ఇంటికి తోలు కొస్తాడు బీరేశయ్య. శంకర్రెడ్డికి కుంటి ఎద్దును చూస్తున్న ప్రతిసారీ బీరేశయ్య కుటుంబంపై ప్రతీకారం తీర్చు కోవాలనే కాంక్ష పెరుగుతూనే ఉంటుంది. వాళ్ళ కుటుంబా నికి ఆధారమైన గంగెద్దును మట్టుపెట్టాలనే ఉ ద్దేశ్యంతో మరో పాపానికి పూనుకొని పాములవాడిని పిలిపించి బీరేశయ్య గొడ్ల చావిడిలో నాగుపామును వదిలిస్తాడు. పాముకాటుకు గురైన కోడెదూడ అరవడంతో కనకయ్య, బీరేశయ్య కంగారుగా వెళ్ళి చూడగా కిందపడి గిలగిలా కొట్టుకుని అది చనిపోతుంది. అదే సమయంలో కనకయ్య భార్య కనకమ్మ మగబిడ్డకు జన్మనిస్తుంది. ఒకవైపు గొడ్డుపోయిన విషాదం, బిడ్డపుట్టిన సంతోషం మరోవైపు ఒకేసారి ఆ కుటుంబానికి కులగుతాయి. కష్టం, ఇష్టం వెలుగు నీడలై ఏదో జీవన రహస్యాన్ని స్ఫురింప జేస్తాయి.

ఒకరోజు ఇంటివసారాలో కూర్చొని శంకర్రెడ్డి, కేశవరెడ్డి తాము బీరేశయ్యపై దెబ్బతీసిన సంగతులన్నీ పరిసరాలన్నీ మరచి మాట్లాడుకుంటుండగా వీళ్ళ మాటలన్నీ వీధివైపు గోడ దగ్గర నుండి విన్న చెంగారెడ్డి ఎలాగైనా వీళ్ళకు బుద్ధి చెప్పాలని ఇంట్లోకి వెళ్తాడు. చెంగారెడ్డి రాకను గమనించిన శంకర్రెడ్డి, కేశవరెడ్డి కంగారు పడతారు. ఏ పని మీద వచ్చావని చెంగారెడ్డిని పలకరించగా "మీరు అసలు రైతులేనా, రైతులు బతికేది గొడ్ల కష్టంలో. నోరు లేని జీవాల మీదా మీ ప్రతీకారం. వాటిని చంపించడం, దొంగతనం చేయించడం రైతులు చేసే పనేనా?" అని

గడ్డిపెడతాడు. ఇద్దరూ నిర్భ్రాంతపోగా, "గొప్పతనమూ, పెద్దతనము కులంలా కాదు ఉండాల్సింది. మనం చేసే పనుల్లో, మనం మాట్లాడే మాటల్లో ఉండాలి. మీరు చేసిన పనులు ఊర్లో తెలిస్తే ముఖానికి మసిపూస్తారు. పేడతో కొడతారు. కేకరించి ముఖాన ఉమ్ముతారు. థూ..... నోరు నాయి లేని గొడ్లను సంపే మీ ముఖాలు చూస్తేనే పాపం" అని నేలమీద ఉమ్మివేసి తిరిగి వెళ్ళిపోతాడు చెంగారెడ్డి. చెంగారెడ్డి పెద్దరికము, శంకర్రెడ్డి, కేశవరెడ్డిల కుతంత్రాల బుద్ధి మనుస్సకు హత్తుకునే విధంగా రచయిత వివరించారు.

కాలగమనంలో వర్షాలుతో బాగా పెరిగిన పచ్చిన తిని గొర్రెలకు, మేకలకు, వింత రోగమొచ్చి చచ్చిపోతాయి. ఆ ఊరి గొల్లలకు, కురవలకు ప్రధాన వనరైన గొర్రెలు, మేకలు చనిపోవడంతో వాళ్ళ ఆర్థిక పరిస్థితి దిగజారి పోతుంది. రాను రాను వర్షాలు తగ్గి వ్యవసాయం చేయడమే కష్టంగా ఉన్న ఆ ప్రాంతాలలో పశుపోషణ చేయడం కూడా కష్టమైతుంది. కనకయ్య పిల్లవాడు పెద్దవాడు కాగా, అన్న నుండి వేరుపడి, ఒక దూడను కొనుక్కుని గంగెద్దుగా తయారు చేసుకుంటాడు. అన్నదమ్ములిద్దరూ పూర్తిగా గంగెద్దుల మీదే ఆధార పడతారు.

బీరేశయ్య పెద్దకొడుకు మునుస్వామి డిగ్రీవరకూ చదివి తిరుపతిలో ఏదో చిన్న ఉద్యోగం సంపాదిస్తాడు. పెళ్ళి చేసుకుని స్థిరపడతాడు. బాలయ్య మాత్రం సేవదాసరిగా, చిన్నపుడే చదువుమానేసి తండ్రితో పాటే గంగెద్దుల వాడవుతాడు. అతనికీ పెళ్ళవుతుంది.

ఈ నేపథ్యంలో వాతావరణంలో, సమాజంలో మార్పు వచ్చింది. తెలుగుదేశం పార్టీ రాజకీయాలతో సమాజంలో రాను రాను కులరాజకీయాలుగా మారిపోవడంతో శంకర్రెడ్డి సర్పంచిగిరి రాజకీయాల్లో పతనమౌతుంది. కేశవరెడ్డి కాంట్రాక్టులు మొదలు పెట్టి బాగా సంపాదిస్తాడు. దళారి చిన్నబ్బ తన తెలివి తేటలు, మోసాలు ప్రదర్శించి రియల్ ఎస్టేట్ యజమానులకు, కొనుగోలు దారులకు దళారిగా మారి చివరకు ఇండ్లు, అపార్ట్మెంట్లు కట్టిస్తాడు. గంగచంద్ర, చెంగారెడ్డి మాత్రం మట్టిని నమ్ముకుని జీవనం సాగిస్తారు.

కులవృత్తిని వదలకుండా, తనప్రాణం ఉండే దాకా గంగెద్దు ఆచారం పోగొట్టకూడదనే పట్టుదల గల మనిషి బీరేశయ్య. అప్పటికే వయసైపోయింది. ఎలాగైనా రెండువేలతో ఇంకో దూడను కొని గంగెద్దుగా మార్చాలని అనుకుంటాడు. పాతరోజులు గుర్తుకు తెచ్చుకుంటాడు. ఇంట్లో, ఊర్లో, ఎన్నో పశువులతో కళకళలాడేవి. ఇప్పుడు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు పశువులు లేవు, పశువుల పండగ లేదు అనుకుంటూ ఇంటి నుండి బయలుదేరి దేవరెద్దు దగ్గరకు వెళ్తాడు. అప్పటికే ముసలిదైన దేవరెద్దును చూడగానే బీరేశయ్యకు ఎక్కడలేని దు:ఖం ముంచుకొచ్చి రెండుచేతులతో పట్టుకొని ఏడ్చేస్తాడు. ఎద్దు అతని ముఖం లోకి ప్రసన్నంగా చూస్తుంది. బీరేశయ్య తనను తానే సంబాలించుకుని పుంగనూరుకు బయలు దేరుతాడు. బస్సెక్కి పుంగనూరు చేరిన బీరేశయ్యకు ఊరంతా కొత్తగా కనిపిస్తుంది. చిన్నబ్బతో అప్పుడు వచ్చిన పుంగనూరుకు, ఇప్పటికే చాలా మార్పు వస్తుంది. జమిందారు బంగళా దాటి పరసలోకి వెళ్ళగా, పశువులతో క్రిక్కిరిసిపోయిన పరస, ఇప్పుడు వెలవెలబోతుంది. పట్టుమని వంద గొడ్లు కూడా లేవు. పరసంతా తిరిగినా తనకు కావలసిన దూడ దొరకలేదు.

అక్కడే ఒకచోట కోలాహలంగా ఉంది. ఒక వేదికపైన ఒక ప్రసిద్ధమైన సినిమ హీరో రాజకీయాలోకి దిగి, అతని చిత్రం వందరోజుల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎగబడి వచ్చిన ఆ జనాన్ని చూసి బీరేశయ్య ఆశ్చర్యపోతాడు. బీరేశయ్య అనుభవం మీద తెలిసిన నిజం "ఈ ప్రపంచమే ఒక పెద్ద పరస. ఇందులో అమ్మేవాళ్ళు, అమ్ముడుపోయే వాళ్ళు, వ్యాపారులు, దళారులు అందరూ మనుషులే". అని ఆలోచిస్తూ జీవిత గమనాన్ని సాగిస్తాడు బీరేశయ్య.

భారతదేశం ప్రాచీన కాలం నుండి పశువులే సంపాదనగా విలసిల్లిన దేశం. మహా భారతంలో ఉత్తర గోగ్రహణం, కాటమరాజు యుద్ధం కూడా పశువుల గూర్చి జరిగినవే. ప్రాచీన కాలంలో చరాస్థులైన పశుసంపద వృద్ధి పొందడానికే ప్రాధాన్యత చూపించేవారు. కాలక్రమేణా స్థిరాస్తులైన కోటలు, భవనాలు, ఆభరణాలు చేకూర్చుకోవడం వలన చరాస్తులు వృద్ధి తగ్గిపోతోంది. యాదవులు మాత్రం ఇప్పటికీ వారికి ఆస్థిగా పశుసంపదను వృద్ధి చేసుకుంటూ ఉంటారు. రాయలసీమలోని ప్రజల జీవన విధానంలో గంగిరెద్దులాట ప్రస్థిమైనది. అయితే దీనిని వృత్తిగా స్వీకరించి జీవించే వారిది ఎప్పటికీ పేదరికమే. ఇటువంటి వృత్తి జీవితాలను ఆధారంగా చేసుకొని రచయిత నవలను చిత్రిస్తూనే వుండటం ఆయనకు వృత్తి జీవితం పట్ల వున్న ఆసక్తిని తెలియజేస్తుంది.

రాసాని గారు 'పరస' నవలను 2001-2002లో రచించగా, 2008 చతుర మాసపత్రికలో ప్రచురితమైంది. అప్పటి కాలమాన పరిస్థితులను, అనుభవ పూర్వకంగా నిశితంగా వివరించారు రాసాని వారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ మారిన కాలానుగుణంగా సాంకేతికత విస్తరించినా, పూర్వకాలం నుండి వస్తున్న వృత్తులను ప్రోత్సహించడం, పోషించడం మన కర్తవ్యం అని రచయిత ఈ పరస నవల ద్వారా పరోక్షంగా చిత్రించారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ భూనీళా సమేత శ్రీ శేషతల్ప రంగనాథస్వామి ప్రాశస్త్యం

– డా॥. పి. మాధవి, అర్థశాస్త్ర విభాగం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

శ్లో॥ శ్రీరంగ పురనివాసాయ - ఆనంద శేషశాయినాం!
ప్రణవాకార విమానాయ - శ్రీ రంగేశాయ మంగళం॥

శ్రీమద్ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, పిపీలికాది జీవరాశుల కెల్ల ఆధారభూతుడు, దుష్టశిక్షణ, శిష్టరక్షకుడు, సర్వజన సంరక్షకుడు, భక్తుల పాలిటి పెన్నిధి, శాశ్వతానంద సంధాయకుడు, ఆ పరాత్పరుడు, నైసర్గిక ప్రకృతి శోభారమణీయ కరుంబై యోగీ జన సేవ్యంబైన ఈ భరతఖండంన, అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంనకు తూర్పు ఈశాన్య భాగంన శ్రీశ్రీశ్రీ ఆలూరుకోనలో కొలువైయున్నాడు. శ్రీ భూనీళా సమేత శ్రీ శేషతల్ప శయనుడు, భక్తుల పాలిట కల్పవృక్షం, సృష్టి స్థితిలయకారుడైన శ్రీరంగనాయకులస్వామి వారు భూదేవి, శ్రీదేవితో కలిసి కొలువై ఉన్నారు.

ఈ పుణ్యక్షేత్రం పక్షుల కిలకిల ధ్వనులచేత, గలగల పారేసెలయేటి చప్పుడు చేత, వన్య మృగాదుల చేత, జీవజంతువుల చేత, కలహార, కేదార, పున్నాగ, బకుల, దాడి, పత్ర, ఫల, పుష్పాదులచేత, అగరు, చందన, కర్పూర, కుంద, మందార, నీహార సుగంధ పరిమళ ద్రవ్యాల చేత శోభాయమానంగా విరాజిల్లుతుంటుంది. హరిహరరాయలు, బుక్కరాయల కాలంలో ఎర్రమ తిమ్మరాజు అనే రాజు 14వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని కట్టించినట్లు తాడిపత్రి కైఫియత్ అనుగ్రంథంలో వ్రాయ బడింది.

పూర్వం విశ్వామిత్రుడు తపమాచరించి, లోక కళ్యాణార్థమై యజ్ఞం చేస్తుండగా తాటకి, మారీచుడు అను రాక్షసులు యజ్ఞంను చిన్నాభిన్నం చేస్తుండగా రక్షణార్థమై శ్రీరామచంద్రులవారిని, లక్ష్మణస్వామి వారిని నియమించినారని, అప్పుడు రామచంద్రుల వారు తాటికిపైన బాణం సంధించగా తాటకి తాడిపత్రి శ్రీ చిందల వేంకటరమణ స్వామి దేవస్థానం సమీపంన చనిపోయినందున తాటిపర్తి అను పేరు సార్థకమైంది. క్రమేపి తాడిపత్రిగా మార్పు చెందింది. శ్రీ విశ్వామిత్ర మహర్షి ఆలూరుకోన నందు యజ్ఞం పూర్తి చేసి పుట్టుశిలగా, నిరాకారుడుగా వెలసియున్న శ్రీ స్వామి వారిని ప్రాణ ప్రతిష్ట చేసినట్లు ఒక శృతి. 14వ శతాబ్దంలో ఎర్రతిమ్మరాజు ఈ విషయాన్ని మునివర్యుల చేత తెలుసుకొన్నవారై శ్రీస్వామి వారి మూల మూర్తిని ప్రతిష్టాపన చేయించారు.

శ్రీస్వామి వారు 5 అడుగుల పొడవుతో శేషశాయిపై పవళించి ఉంటారు. స్వామి వారి పాదాల చెంత శ్రీదేవి, భూదేవి ఆశీనులైయున్నారు. స్వామివారి నాభియందు పద్మగర్భుడు, చతుర్ముఖుడు అయిన బ్రహ్మ వెలసి యున్నారు. గర్భాలయంలో నైరుతి భాగంలో పుట్టుశిల వెలసియుంది. ప్రక్కనే రామానుజాచార్యులు వెలసి యున్నారు. ఈ ఆలయానికి ఈశాన్య భాగంన ఒక ఫర్లాంగు దూరంలో రెండుకొండల మధ్య భాగంన బుగ్గ ఉత్పత్తియై నిరంతరం ఉత్తర దక్షిణంగా ప్రవహిస్తూ వుంది. ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితులలో కూడ, మండువేసవిలో కూడ నీటిధార ఉంటుంది. చుట్టు ప్రక్కల ప్రాంతాలలో చాలా మందికి శ్రీరంగనాయకుల స్వామి వారు ఇంటి ఇలవేల్పుగా కొలవబడుతున్నారు. వివాహాలు, నామకరణాలు, పుట్టువెంట్రుకలు, మొక్కు బడులు తీర్చుకోవడానికి విశేషంగా భక్తులు తరలి వస్తుంటారు. అనంతపురం, గుత్తి, ధర్మవరం, బళ్ళారి, యాడికి, వరంగళ్ళు, హైదరాబాదు, బెంగుళూరు, విశాఖ, తిరుపతి, విజయవాడ మొ॥ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా వస్తుంటారు. ప్రస్తుతం వసతిసౌకర్యం కూడా ఉన్నందున భక్తుల తాకిడి విశేషంగా ఉంటుంది.

శ్రీ స్వామివారికి చైత్ర శుద్ధ నవమి నుండి చైత్ర బహుళ విదియ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చైత్ర శుద్ధ నవమిరోజున కోనలో అంకురార్పణ, ధ్వజారోహణం, ఋత్విగ్వరణం, దీక్షాహోమాలు జరుగుతాయి. చైత్ర శుద్ధ దశమి రోజున సింహవాహనం, ఏకాదశి రోజున శేషవాహనం, శుద్ధ ద్వాదశి రోజున హనుమత్ వాహనం, త్రయోదశి రోజున గరుడ వాహనం, చతుర్ధశి రోజున గజవాహనం మీద స్వామివారు ఆలూరు గ్రామం నందు తిరువీధుల్లో ఊరేగుతూ ఉత్సవం జరుపుకొంటారు. చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున సూర్యోదయాత్పూర్వం 4.45 గం॥ ని॥లకు ఆలూరు గ్రామం నందు శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానము వద్ద ''కళ్యాణ మహోత్సవము'' జరుగుతుంది. ఆ దినమే సాయంత్రం 4.00 గం॥లకు రథోత్సవం జరుగుతుంది. చైత్ర బహుళ పాడ్యమి దినమున అశ్వవాహనం, పారువేట జరుగుతుంది. చైత్ర బహుళ విదియనాడు కోనలో పగలు వసంతోత్సవం, చక్రస్నానం, పుష్పయాగం జరుగుతుంది. కన్నుల పండుగగా శ్రీ రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమపద్ధతిలో జరుగుతాయి.

అంతేకాక, కార్తీక వనభోజనాలకు కూడా భక్తులు విశేషంగా వస్తూ ఉంటారు. ఆంజనేయస్వామి సన్నిధి కూడ వుంది. అక్కడ కొంత దూరం వెళ్ళి కొండ ఎక్కితే పెద్ద కొలను వస్తుంది. అందులో పిల్లలు, పెద్దలు ఈతకొట్టడం, స్నానాలు చేస్తుంటారు. స్వామి వారికి బియ్యం, బేడలు, బెల్లం ఇవ్వడం ఇక్కడి ఆచారం. పూజ పూర్తి అవుతూనే అక్కడే వండుకొని, పులగం (బియ్యం, పెసరపప్పు, ఉప్పు), కొబ్బరి పచ్చడి తినడం ఇక్కడి ఆనవాయితి. నీటి వలన కావచ్చు, స్వామి మహిమ కావచ్చు ఆ పులగం పచ్చడి రుచికి తిరుగే లేదు. ఇప్పుడు ఫోన్ సౌకర్యం ఉన్నందున ముందుగా పూజారికి చెప్పినా, పూజనిమిత్తం ఆకుపూజకు గాని, పంచామృత అభిషేకాలకు, భోజనానికి అన్ని సమకూర్చుతారు.

మార్గశిర మాసం అంతా కూడ విశేషమైన పూజలు ఉంటాయి. ఉదయం 3 గం॥లకు కుంభంతో, భక్తులు వెంటరాగా పూజారిగారు గుడిచుట్టూ ప్రదర్శన చేసి, పూజా సామాగ్రితోపాటుగా అంతరాలయంలోనికి ప్రవేశిస్తారు. స్వామి వారి మూలవిరాటుకు పంచామృత స్నానం, అభిషేకం వర్ణింపనలవికానిది. కనులారా చూసితీరవలసిందే. కోటి జన్మల ఫలం. సర్వపాపహరం. తర్వాత స్వామి వారికి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి ఐదు వక్తుల హారతి, మహా హారతి, కుంభహారతి ఇస్తారు. ఉదయం 6 గం॥ 30 ని॥కు పూజ పూర్తవుతుంది. భోగి రోజున గోదాదేవి రంగనాయకుల స్వామి కళ్యాణం చేస్తారు. ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ చేస్తారు.

కోన నుంచి తిరుగు ప్రయాణంలో తలారిచెరువు నందు ఉన్న దర్గా చాలా ప్రసిద్ధమైంది. గుడి-దర్గా పక్కపక్కనే ఉండటాన్ని చూస్తే హిందూ ముస్లింల మధ్య ఎంత అన్యోన్యమైన సంబంధం ఉందో తెలుస్తుంది. కోనకు వచ్చిన అందరూ కూడ దర్గాను దర్శిస్తుంటారు. కావున జగత్సవ్యమానుడై, శాశ్వతానంద సంధాయకుడైన ఆ పరాత్పరున్ని, కోరిన కోర్కెలు తీర్చే భక్తవత్సలున్ని దర్శించి తరించవలసిందే. ఇందుకుగాను ప్రతిరోజు తాడిపత్రి నుంచి ఆలూరుకోనకు ఆర్.టి.సి. బస్సులు వుంటాయి. ఆటోలు, కార్లు కూడ వెళ్ళడానికి రోడ్డు సౌకర్యం కలదు. అంతటి దేవదేవుని మహిమకు అందరూ పాత్రులు కావాలని కోరుకొంటున్నాను.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అనువాద విద్య – భాష పరిచయం

– పుత్తిపాటి కూర్మ్యు, జాతీయ అనువాద సమితి, భారతీయ భాషల కేంద్రీయ సంస్థ, మానవ వనరుల అభివృద్ధి శాఖ, ఉన్నత విద్యా విభాగం, భారత ప్రభుత్వం, మానస గంగోత్రి, మైసూరు.

కీలక భావనలు :

అనువాద విద్య, భాష, నూతన విద్యావిధానం ప్రాథమిక విద్య- పూర్వప్రాథమిక పాఠ్య పుస్తక రచన.

అనువాద విద్య :

అనువాద విద్య అనేది ప్రాథమికంగా ఒక భాషలోని గ్రంథాలను మరొకభాషలోనికి అనువాదం చేసే ప్రక్రియనూ దానిపరిసరాలను అంటిపెట్టుకొని ఉన్న బోధన, శిక్షణ, విశ్లేషణ, పరిశోధన, సైద్ధాంతిక, అభ్యాస ప్రక్రియల జ్ఞానాన్ని మెరుగుపరచడానికీ వైవిధ్యభరితమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసే లక్ష్యంగా ఉన్న విద్యను స్థూలంగా అనువాదవిద్య అనవచ్చు. అయితే ఇది ఉన్నత-విద్య స్థాయిలో కొన్ని విశ్వవిద్యాలయాల్లోనే ప్రధాన పాఠ్యాంశాల్లో భాగంగా అభ్యసిస్తున్నప్పటికీ తగినంత ప్రాధాన్యత, ప్రాచుర్యాన్ని పొందలేదు. డిప్లొమా కోర్సులకు పరిమితమై ఉండటం గమనార్హం. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత - విద్య స్థాయిలలో ప్రధాన పాఠ్యాంశాల్లో భాగంగా ఉండాలి. పునాదిదశ నుంచే అభ్యాసం చేయించాలి. వారి పరిధిలోని, అందు బాటులో ఉన్న అన్ని వనరులు పూర్తిస్థాయి వినియోగంతో ఆసక్తికర మైన పాఠ్యక్రమరూపకల్పన చేసి, ఉపాధ్యాయిని/ ఉపాధ్యాయుడు వివిధ మాధ్యమాల ద్వారా మాతృ భాషతో పాటుగా బహుభాషా అక్షరాశ్యతను పెంపొందించే దిశగా వారి బోధన, శిక్షణ, విశ్లేషణ, నిర్మాణాత్మక, సంకలిత మూల్యాంకనాలు చేయవలసి ఉంటుంది. పాఠ్య క్రమరూపకల్పనకు ఉపయోగించిన నివిష్టాలను బట్టి ప్రభావపూరిత సామాజిక పరివర్తన ఉంటుంది. భాషా బోధనలోనే అంతర్భాగంగా అనువాద విద్య ఉండటం గమనార్హం. ప్రత్యక్ష పద్ధతిలో అనువాదం కనిపించక పోయినా వ్యాకరణ అనువాద పద్ధతిలోనో, వివరణాత్మక వ్యాఖ్యాన పద్ధతిలోనో, మాండలిక భిన్నత్వాన్ని అర్థమయ్యేలా చేసే ప్రక్రియలోనో ఈ అనువాదం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ రకమైన సూచన సమగ్ర మైనది. అనువాదం సామాజిక, మానవీయ సంబంధాలతో ముడిపడి ఉంది. దీనిని కార్యాచరణ రూపం చూసే అవకాశాన్ని విద్యార్థులకు అందిస్తుంది. అనువాదం, అనువాద శిక్షణ సాధారణంగా వృత్తిపరమైన స్వభావానికి ముడిపడి ఉండటంతో ఆకాశ నక్షత్రంగా కనిపిస్తుంది.

భాష సంబంధమైన కొన్ని అంశాల వివరణ :

ఈ పై భావనను అందరూ అంగీకరించకపోవచ్చు. అంగీకరించాల్సినపనిలేదు. తెలుసుకుంటేచాలు. అన్ని రకాల, వివిధదేశాల ప్రజలుండే సార్వజనీననగర (కాస్మోపాలిటన్ సిటీ) ఉపాధ్యాయుల/అధ్యాపకుల/ ఆచార్యుల పిల్లల ఇంటి, ఇంటి బయట ఉన్న భాషల అభ్యాస వాతావరణాన్ని ఇక్కడ ఉటంకించంలేదు. ప్రస్తుతంనెలకొనివున్న వివిధ సామాజిక మాధ్యమ బోధనా పరిస్థితులకు తగిన విధంగా ఒక ప్రామాణిక మౌలిక నదుపాయాలను మెరుగుపరచి అందుబాటులో ఉంచటం, ముఖ్యంగా భాషల పాఠ్యక్రమరూపకల్పనకు కార్పస్ అధ్యయన ఆధారిత రచనా సామగ్రి సేకరణ (మాతృ భాష సాంస్కృతిక, సామాజిక-ఆర్థిక నివిష్టాలను కలుపుకొని). దానికి తగిన విధంగా అయా విభాగాలలో ఉపాధ్యాయ శిక్షణ నివ్వవలసి ఉంటుంది. ఒకరోజులో ఇంట్లో మాట్లాడే మాటలు దాదాపుగా రెండువందలకు మించి ఉండవు. ఈ మాట్లాడినమాటల్లో పదాలపునరుక్తి మినహాయించి చూడవలసి ఉంటుంది..

గొప్ప వక్త కావాలనుకుంటే ఆరువేల పదాలు చాలు. మిగిలినవి పరామర్శపదాలు. వీలైనంత వరకు మాతృ భాష పర్యావరణాన్ని తలపెట్టే విధంగా ప్రామాణిక మౌలిక బోధన, అభ్యసన, శిక్షణ సదుపాయాలను కల్పించ గలిగితే 90% విజయం సాధించినట్లే. ఇక మిగిలిన 10% ప్రతికూల మనస్తత్వం (Negative Mind Set). ఎప్పుడైతే బోధన, అభ్యసన, శిక్షణ సదుపాయాలు సమృద్ధిగా ఉంటాయో అప్పుడు నేర్చుకునేవారిలో అది శూన్య అంశం అవుతుంది

మాతృభాష, దేశీయ, విదేశీ భాషలు వీటిలో దేనిని ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయురాలు మాతృభాషగా లేదా ద్వితీయ భాషగా లేదా తృతీయ భాషగా నేర్పినా విద్యార్థులను పూర్తిగా వాక్యాన్ని అడిగే పద్ధతి, దానికి జవాబును విద్యార్థుల నుండి పూర్తిగా వాక్యాన్ని రాబట్టే పద్ధతి అతిముఖ్యం. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ ఆచరణలో అంతగా కనిపించని విషయం.

ఉదాహరణకు :

ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయురాలు : నీ పేరు ఏమిటి? అని అడిగితే

1. విద్యార్థి : రమేష్ అని జవాబు నిస్తే
2. విద్యార్థిని : స్వర్ణ అని జవాబు నిస్తే

పై ప్రశ్నకు ఇద్దరు విద్యార్థులు ఇచ్చిన జవాబులు సరైనవే గానీ విద్యార్థుల నుండి పూర్తిగా జవాబును ఆశించాలి, నేర్పాలి కూడా.

1. నా పేరు రమేష్
2. నా పేరు స్వర్ణ

తద్వారా విద్యార్థులకు భాషకు సంబంధించి నంతవరకు సరైన పునాది పడుతుంది. భాషాభోధనలో ఇది కేవలం ఒక్క అంశం మాత్రమే.

మాతృభాష, దేశీయ, విదేశీయ భాషలు ఏవైనా భాషా శాస్త్ర పరిధిలో ఇవి ఎన్నైనా సమప్రాధాన్యతలోనే ఉంటాయి. అయితే మాతృభాషను నేర్చుకునేవారికీ నేర్పేవారికి ఉన్న గొప్ప సహజసిద్ధమైన సౌకర్యం, సౌలభ్యం ఆ ప్రత్యేక భాషా మాట్లాడే వాతావరణాన్నిఇంటాబయటా అందుబాటులో ఉండటం. అది తెలుగు లేదా సంస్కృతం లేదా హిందీ కావచ్చు. లిపి, ధ్వని, పద.పదబంధ, వాక్యపరమైన, అర్థపరమైన, చారిత్రకమార్పులకు చెందిన సమస్యలు అన్నిభాషలకు సర్వసాధారణం.

ఉదాహరణకు :

తెలుగు లిపి నేర్పటం అనే అంశాన్ని పరిశీలిస్తే :

అ ఆ ఇ ఈ అక్షరాలను సంప్రదాయంగా వస్తున్న పద్ధతిలో ఆయా అక్షరాలను ఉన్నరూపంలో అక్షరాలను దిద్దించి నేర్పటం ఒక పద్ధతి.

నేర్చుకునేవారికి తేలికగా గుర్తుపెట్టుకోగలుగుతారని మొదటి మెట్టుగా అన్నీ సున్నా(0)లు చుట్టించి, ఆ సున్నాలనుండి

అక్షరాలను ఉత్పాదన చేసి నేర్పే పద్ధతి మరొకటి. ఇంకొకటి సున్నాలుగా చుక్కలు పెట్టి ఆ చుక్కలను క్రమబద్ధంగా కలుపుతూ అక్షరాలుగా రూపొందించే పద్ధతి. ఏవిధంగా నేర్పితే విద్యార్థులు తేలికగా, త్వరగా, గట్టిగా నేచ్చుకోగలుగుతారు అనేది ఆ ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయురాలు తీసుకునే నిర్ణయాలు, అధికారిక ఆదేశాల మీద ఆధారపడి ఉంటాయి. భాషాశాస్త్ర క్రమంలో ఒక భాషను నేర్పటానికి లేదా నేర్చుకోడానికి మాతృభాష లేదా , దేశీయ భాషలు, విదేశీ భాషలలో ఏభాషా దీనికి మినహాయింపుకాదు. అన్నీ సమానమే. అన్ని లిపులకు వంకటింకరలు,నిలువుగీతలూ అడ్డగీతలు ఉంటాయి అనేది అందరికీ తెలిసిన సర్వసాధారణ విషయం. అయితే కష్టపడి చదవటం కంటే ఇష్టపడి చదవటం మంచిది అనే ధోరణిని అలవర్చుకుంటే నేర్పే వారికీ నేర్చుకునే వారికి తొంభై శాతం సమస్యలు కను మరుగవుతాయి. మిగిలిన పదిశాతం అన్ని భాషలకూ సర్వసాధారణం.

ఇంకా పదసంబంధమైన సమస్యలు కూడా ఎదు రౌతాయి. బువ్వ, బూసోడు తెలుగు అనుకుంటే పొరపాటే.

ఇవి తెలుగు లిపిలో ఉన్నపదాలు మాత్రమే. భాషను శాస్త్రీయ అధ్యయనం చేస్తే మరింత అవగాహన ఏర్పడే అవకాశం ఉంది.

ఒక భాషను శాస్త్రీయ అధ్యయనం చేసే పద్ధతిని భాషాశాస్త్రం (లింగ్విస్టిక్స్) అని అంటారు. ఇది ఒక నిర్దిష్ట భాష లక్షణాలను లేదా ఆయా భాషల లక్షణాలను క్రమబద్ధంగా పరిశోధన చేయడానికి ఉపయోగపడు తుంది. ఈ అధ్యయనంలో ధ్వనులు, భాషాస్వరూపం, అర్థం, వాక్యనిర్మాణపద్ధతులు ఆయాభాషల వ్యవహార్త లను బట్టి వారి సామాజిక సందర్భాన్ని విశ్లేషించడం జరుగుతుంది. మాట్లాడే మానవ భాషలోని ధ్వని, అర్థం మధ్య పరస్పర చర్యను గమనించడం ద్వారా ప్రాథమిక విశ్లేషణకు దారితీస్తుంది. ఇది ఒ క మనిషి సంకేతాలు, శబ్దాల ద్వారా మరొకరికి తెలియజేయడంతో ప్రారంభమవు తుంది. భాషాశాస్త్రంలో భాషను ప్రభావితం చేసే సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ అంశాల వంటి అనేకమైన వాటితో కూడా వ్యవహరిస్తుంది. ఈ భాషాశాస్త్రం లో ముఖ్యమైన విభాగాలు- ధ్వని శాస్త్రం (Phonology), పదనిర్మాణ శాస్త్రం (Morphology), వాక్యవిజ్ఞాన శాస్త్రం (Syntax), అర్థ విజ్ఞాన శాస్త్రం (Semantics) చారిత్రక (Historical)భాషాశాస్త్ర అధ్యయనం, తులనాత్మక (%జశీఎజ్ఞుతీఖ్ఱజువ%) భాషాశాస్త్ర అధ్యయనం మొదలైనవి. వీటి సరసన అనువాదం కూడా చేరుతుంది. ఎందుకంటే పైన చెప్పిన భాషాశాస్త్రఅధ్యయన ప్రతివిభాగంలోనూ ఏదోవిధంగా అనువాదం అంతర్గతంగా ఉంటూనే ఉంటుంది. ఈ అనువాదం ప్రక్రియ అంతర్లీనంగా జరిగేది. ఒక భాషకు మాత్రమే పరిమితం కాదు, భిన్నభాషలమధ్య కూడా ప్రక్రియ అంతర్లీనంగా జరుగుతుంది..

ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషు బోధనలోనూ నేర్చు కోవడంలోను ఎదురవుతున్న ఇబ్బందులలో అతి ముఖ్యమైన అంశాలు.

ఉపాధ్యాయులు పదబంధాలను అనువదించి చెప్పటంలోనూ విద్యార్థులు వాటిని ఉపయోగించి వ్యాసం రాయటం నేర్చుకోవడం ఒక పెద్ద పోరాటంగా మారిపోతుంది. పదబంధాలపై గట్టి పట్టు సాధించే విధంగా కృషిచేయాల్సి అంటుంది.

పాఠశాలలో తగిన వాతావరణం అవసరం :

ప్రతి ఒక్కరి తల్లిదండ్రులు ఇంగ్లీషు మాట్లాడటంలో నిష్ణాతులు కాదు. పిల్లలు పరస్పర చర్య ద్వారా త్వరగా నేర్చుకోగలుగుతారు. అందుకు భాషా ప్రయోగశాల గల పాఠశాల మాత్రమే సరైన వాతావరణం అందించగలుగు తుంది..

ఇంగ్లీషు మాట్లాడే వాతావరణం విద్యార్థులకు కల్పించటం:

మాతృభాష వాతావరణంపైన మంచి అవగాహన కలిగిస్తే. మరొక భాష ఏదైనప్పటికీ తేలికగా దానిలోని భిన్నత్వాన్ని గ్రహించటానికి వెసులుబాటును కలిగిస్తుంది తప్ప మరొకటికాదు. పిల్లలు వారికిగల పరిసర వాతా వరణంలో పరస్పర చర్య ద్వారా మాత్రమే మరింత త్వరగా భాషను నేర్చుకుంటారు.

వ్యాకరణ సమస్యలు - మనుషులు మాట్లాడుకునే మాటలు విని వాక్యాలు నిర్మించుకోవడం తదనంతర స్థాయిలో వ్యాకరణం నేర్చుకుంటాం. అర్థమయ్యేలా వ్యాకరణ నియమాలను నేర్పించటం. విషయ ప్రధాన (కంటెంట్) పదాలు - విషయ ప్రధానసమాచారాన్నీ దాని అర్థాన్ని ఇస్తే, ప్రయోజనాత్మక (ఫంక్షనల్) పదాలు - వాక్యానికి అవసరమైన వ్యాకరణ సంపుష్టిని కలుగజేసే పదాలు. మరొకమాటలో ఒక ఫంక్షన్ పదం పని ఏమిటంటే వాక్యనిర్మాణానికి దోహదం చేయటం. ఆ పదాలు ఒక వాక్యంలోని ఇతర పదాల మధ్య వ్యాకరణ సంబంధాలను వ్యక్తపరుస్తాయి.

మాతృభాష ప్రభావం :

భారతదేశంలో ఇంగ్లీష్ నేర్చుకునేవారికి తరచుగా ఎదురయ్యే సమస్యల్లో ఒకటి మాతృభాష ప్రభావం.

ప్రాంతీయ భాష వారి స్థానిక భాషలచే ఎక్కువగా ప్రభావిత మవుతుంది. ఇక్కడ ఇంగ్లీషు ప్రశ్న వాక్యాలకు జవాబులు ఇచ్చే పద్ధతిలో తెలుగువారు ఇంగ్లీషు మాతృభాషకాని వారు, ముఖ్యంగా తెలుగు వారు తెలుగు వ్యాకరణ నియమానుసారంగా తెలుగులోనే ఆలోచించుకొని, పదాలను కూర్చుకొని , వాక్యాన్ని నిర్మించుకోవడం జరుగుతుంది. దీనిమూలంగా ఇంగ్లీషులో మాట్లాడేవాక్యాలకు భిన్నమైన వాక్యాలు అంటే మాతృభాష ప్రభావంగల అనువాద ఇంగ్లీషు వాక్యాలు వ్యవహారంలో దొర్లటం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

పదస్థాయిలో చూస్తే ఇంగ్లిష్ కీ ఇంగ్లీషు కి భేదం మొదటిది ఉచ్చారణ విధేయ లిప్యంతరీకరణ, దేశీయీకరించిన రూపం - (nativised form) ఉచ్చారణ విధేయ లిప్యంతరీకరణ. అలాగే కశ్మీర్, కాశ్మీరు పదాలు. ఉచ్చారణ అనేది ప్రాథమికంగా మనం అర్థాన్ని సృష్టించడానికి ఉపయోగించే ధ్వనుల ఉత్పత్తి. ధ్వని శాస్త్రం సాధారణంగా ఒక భాషలోని ధ్వనుల భౌతిక ఉత్పత్తిని తెలియజేస్తుంది.

ఇంగ్లీషు నేర్చుకునే విద్యార్థులలో కనిపించే వాక్య దోషాలు అవి మూడు రకాలుగా ఉంటాయి. అవి :

వాక్య సరిహద్దులు, అర్థాన్ని భంగపరిచే అస్పష్టమైన కూర్పు, వ్యాకరణ నియమ ఆధారిత విరామ చిహ్నాలను:

1. వాక్య ఖండాలు
2. విరామ చిహ్నాలు అనుసంధానం చేసే లోపాలు
3. ఫ్యూజ్డ్ లేదా రన్-ఆన్ వాక్యాలు (అస్పష్ట వాక్య నిర్మాణాలు)

పైవి మూడు వ్యాకరణ నియమానుసారంగా ఇంగ్లీషు పద క్రమంలో సరైన పద, విరామ చిహ్నాల ప్రయోగం ఒక మంచి పునాది వంటిది.

SUBJECT = కర్త, VERB = క్రియ, DIRECT OBJECT = ప్రత్యక్ష కర్మ, INDIRECT OBJECT = పరోక్ష కర్మ

ఇంగ్లీషు రచనలో పరోక్ష కర్మను గుర్తించటంలో నేర్చుకునే విద్యార్థులలో కొంత అస్పష్టత ఉంటుంది లేదా సందిగ్ధత ఏర్పడుతుంది. దీనిని గుర్తించటానికి ఇంగ్లీషులో పద క్రమం ముఖ్యమైనది. బోధన, అభ్యాసం, మూల్యాంకనాన్ని మెరుగుపరచడానికి భాషా వినియోగం ముఖ్యమైనది.

సంపూర్ణంగా ఒక ఆలోచనను వ్యక్తీకరించడానికి కావలసిన పదాలు, వ్యాకరణ నియమ ఆధారిత విరామ చిహ్నాలను ఉపయోగించిన పద సమూహ వాక్యం.

ఉదాహరణ :

1. పిల్లి పారిపోయింది, పాప వెంటబడింది.

పైవి రెండు స్వతంత్ర వాక్యాలు. వీటినే సామాన్య వాక్యాలు అని కూడా అంటారు

2. పిల్లి పారిపోయింది పాప వెంటబడింది.

పైవి రెండు స్వతంత్ర వాక్యాలు లేదా సామాన్య వాక్యాలుగా కనిపిస్తున్నప్పటికీ ఆ రెండు వాక్యాల మధ్య ఇంగ్లీషు వ్యాకరణ నియమ ఆధారిత విరామ చిహ్నాన్ని కామాను ఉపయోగించకపోవడం వలన కొంత అస్పష్టత ఏర్పడింది గనుక ఇటువంటి వాక్యాలను ఫ్యూజ్డ్ సెంటెన్స్ లేదా రన్-ఆన్ సెంటెన్స్ అని అంటారు. ఇక్కడ గ్రహించవలసినది ఈ ఉదాహరణలో రెండు ఆలోచనల మధ్య సంబంధాన్ని ఏర్పరిచే విరామ చిహ్నం లేదు.. రెండు స్వతంత్ర నిబంధనలు గలిగిన వాక్యాలు ఎటువంటి విరామ చిహ్నాలు లేకుండా పక్కన చేరినప్పుడు అది ఒక రకమైన వాక్య దోషం.గా పరిగణిస్తారు. ఇటువంటివి అనేక అంశాలు చర్చించవచ్చు. దేశీయ, విదేశీ భాషలు అన్నింటికీ ఈ భాషా ప్రయోగశాలలు ప్రాథమిక స్థాయి నుండే అవసరం గనుక వాటిని స్థాపన ముఖ్యం. దానితోపాటుగా సరైన, తగిన ఉపాధ్యాయ శిక్షణ అనివార్యం. దీనితోపాటు శ్రేణీకరించిన విషయ ప్రధాన పాఠ్యాంశాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

అనువాదంలో భాష సంబంధమైన కొన్ని అంశాల వివరణ

ఇంగ్లీషులో, నామవాచకాలను నిర్వచించే ఉప పదాలు : '%a, an, the'. ఇవి ప్రధానంగా నామ వాచకాలను నిర్దిష్టమైన, నిర్దిష్టంకాని వాటిని నిర్వచించ టాని ఉపయోగించేవి. నిర్దిష్ట నామవాచకాలను నిర్వ చించడానికి 'the' ఉపయోగించబడుతుంది. అయితే 'a, an' లు నిర్దిష్టంకాని నామవాచకాలను నిర్వచించ డానికి ఉపయోగిస్తారు. అనువాదంలో మాత్రం కొన్ని సందర్భాలలో ఇవి ఐచ్ఛికాలు.

This is a book

1) ఇది ఒక పుస్తకం
2) ఇది ఒక పుస్తకం లేదా ఇది పుస్తకం (అనువాదంలో a ఐచ్ఛికం)

Long long ago there was a king

చాలా కాలం కిందట ఒక రాజు ఉండేవాడు (లేదా అనగనగా ఒక రాజు ఉండేవాడు) (ఈ ప్రత్యక వాక్య అనువాదంలో a అనివార్యం)

This is an elephant

1) ఇది ఒక ఏనుగు
2) ఇది ఏనుగు (అనువాదంలో %ుఅ% ఐచ్ఛికం)

That is an airplane

అది ఒక విమానం

అది విమానం (అ అనువాదంలో is శూన్యం, an ఐచ్ఛికం)

The people at home are good

ఇంట్లో మనుషులు మంచివారు (అనువాదంలో ఒత్తిడి లేదా ఊనిక కనిపించకపోయినా వాక్యాన్ని పలికినప్పుడు దానిప్రభావం ఉంటుంది.)

Where are the pencils?

పెన్సిళ్లు ఎక్కడ ఉన్నాయి?

అనువాదంలో ఇలాంటివి అనేకం. ప్రతి పదం విషయంలోనూ ప్రత్యక శ్రద్ధ అవసరం.

పూర్వప్రాథమిక పాఠ్య పుస్తకాలను కార్పస్ నుండి తీసుకున్న పద పౌనఃపున్య ఆధారంగా రాయాలనుకుంటే ఈ 'a, an, the' లలో మొట్టమొదట కనిపించేది "the", కార్పస్ లోని పుస్తకాల, పదాల పరమాణాన్నిబట్టి కొన్నివేల పదాల తర్వాత "a" అక్షరం కనిపిస్తుంది. అదే క్రమంలో మరికొన్ని కొన్నివేల పదాల తర్వాత "an" ఉంటుంది. "X, Y, Z" అక్షరాల సంగతి సంగతి ఇక చెప్పనవసరం లేదు. మరిన్నేవేల పదాల తర్వాత కనిపిస్తాయి. ఇంగ్లీషులో X, Y, Z అక్షరాలను కూడా చేర్చవలసివుంటుంది కనుక పూర్వప్రాథమిక పాఠ్య పుస్తకాలను రచించే నేపథ్యంలో రచయితలు కొంత జాగ్రత్త వహించాల్సివుంటుంది.

నూతన విద్యావిధానం ప్రాథమిక విద్య :

నూతన విద్యా విధానం కోరుకుంటున్నదేమిటి? ఇక్కడ కొన్ని ప్రాథమిక విద్య అంశాలను తెలుసుకోవాలి. వాటి ప్రస్థావన కింద పేర్కొన్నవి. ఇవి నేరుగా నూతన విద్యా విధానం 2020 అనువాద ప్రతి నుంచి ఉటంకితం:

ఈ విధానం దృష్టి :

భారతదేశాన్ని నిలకడగా ఒక సమాన, శక్తివంత జ్ఞాన వ్యవస్థగా మార్చేందుకు ప్రత్యక్షంగా దోహదపడే భారతీయ మౌలికనీతి, విలువలమీద ఆధారపడిన విద్యా వ్యవస్థను రూపొందించాలని ఈ జాతీయ విద్యా విధానం ఆశిస్తోంది.

ఈ విధానం సూత్రాలు :

ఈ విద్యా విధానం ఉద్దేశం - ఆరోగ్యవంతమైన నైతిక విలువలతోపాటు తార్కికత, కార్యశీలత, కారుణ్యం, సహానుభూతి, ధైర్యం, లాఘవం, శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మక శక్తి వున్న మంచి మనుషులుగా తీర్చిదిద్దడం. మన రాజ్యాంగం ప్రవచించిన సమానత్వం సమ్మిళితత్వం, బహుళత్వం వున్న సమాజ నిర్మాణానికి గాను ఉత్పాదక శీలుల్ని, ఉత్తమ పౌరులను తయారుచేయడమే ఈ విధానం ధ్యేయం. .....మొత్తం విద్యా వ్యవస్థకూ, అందులోని ఆయా విద్యా సంస్థలకూ మార్గదర్శకమైన మౌలిక సూత్రాలు :

- ప్రతి విద్యార్థిని గుర్తించడం, గమనించడం, వారిలోని ప్రత్యేక సామర్థ్యాలను పరిరక్షించడం
- విద్యార్థులందరూ 3వ తరగతి కల్లా పునాదిపూర్వక అక్షరాస్యతను, సంఖ్యా జ్ఞానాన్ని సాధించే అంశానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి.
- సరళత్వం - విద్యార్థులకు తాము నేర్చుకునే అంశాలను, మార్గాలను ఎంచుకోగల సామర్థ్యం సిద్ధిస్తుంది. తద్వారా తమ ప్రతిభ, ఆసక్తిని బట్టి తమ జీవన మార్గాన్ని ఎన్నిక చేసుకోగలుగుతారు.
- కళలకూ విజ్ఞాన శాస్త్రాలకూ మధ్య, విద్యా-విద్యేతర కార్యక్రమాల మధ్య, వృత్తివిద్య అకడమిక్ విద్య మొదలైన వాటి మధ్య ఎలాంటి కఠినమైన విభజనలు వుండకుండా చూడడం.
- బహుళ క్రమశిక్షణను, సమగ్ర విద్యను అందించడం
- బట్టీపట్టడం ..కాకుండా భావనాత్మకంగా అర్థం చేసుకోవడంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం.
- సృజనాత్మకత, తార్కిక ఆలోచనలు పెంపొందించడం
- సమానత్వం, న్యాయం వంటి నైతిక విలువలు, మానవ విలువలు, రాజ్యాంగ విలువలు.
- బహుభాషావిధానాన్ని పెంపొందించడం - బోధనలో, నేర్చుకోవడంలో భాష ప్రాధాన్యత.
- జీవన నైపుణ్యాలు
- నేర్చుకునే స్థాయిని క్రమబద్ధంగా ఎప్పటికప్పుడు అంచనావేయడంపై దృష్టిని కేంద్రీకరించాలి.
- సాంకేతిక పరిజ్ఞానాన్నివిస్తృతంగా వినియోగించడం.
- విద్య ఒక సమకాలిక అంశం అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళిక, బోధనాశాస్త్రంలో, వైవిధ్యతలో అన్నింటిలోనూ వైవిధ్యతనూ స్థానిక సందర్భాన్ని గౌరవించాలి.
- అన్ని నిర్ణయాలలో పూర్తి సమదృష్టి, సమ్మిళితత్వం మూలస్తంభం.
- తొలి బాల్య సంరక్షణ, చదువు మొదలుకుని పాఠశాల విద్య, ఉన్నత విద్య వరకు అన్ని స్థాయిల విద్యా పాఠ్యప్రణాళికలో సమన్వయం వుండాలి.
- నేర్చుకునే ప్రక్రియలో ఉపాధ్యాయులు, అధ్యాపక వర్గం కేంద్రబిందువులు.
- 'సరళమైన-సుదృఢమైన' క్రమబద్ధీకరణ చట్రం.
- అసాధారణమైన విద్యకు, అభివృద్ధికి విశిష్టమైన పరిశోధన ఒక ముందస్తు అవసరం.
- నిరంతర పరిశోధన, విద్యారంగ నిపుణుల క్రమబద్ధ అంచనాల ఆధారంగా ప్రగతిని నిరంతరంగా సమీక్షించడం.
- భారతదేశ ప్రతిష్టతో పెనవేసుకుని వుండటం... ప్రాచీన, ఆధునిక సంస్కృతి, జ్ఞాన వ్యవస్థలు, సంప్రదాయాలు కలిగిఉండడం
- విద్య ఒక ప్రజా సేవ. నాణ్యమైన విద్యను పొందడ మనేది ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కుగా పరిగణించాలి.
- ఒక బలమైన, సచేతనమైన ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గణనీయమైన పెట్టుబడులు.

పై అంశాలన్నీ క్రోడీకరిస్తే :

నాణ్యమైన విద్యను అనేది ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు. దీనిని అందిచటానికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్య పాత్ర గణనీయం. భారతదేశ ప్రతిష్టకు తగిన అత్యంత నాణ్యమైన జాతీయ పాఠ్య ప్రణాళిక, బోధనా శాస్త్ర రూపకల్పన అతిముఖ్యం. ప్రారంభ బాల్య సంరక్షణ విద్య నుండి అంతర్జాతీయ ప్రమాణాలు గలిగిన ఉన్నత విద్య పరిశోధనలవరకు సమన్వయంతో కూడిన పాఠ్య ప్రణాళిక రూపకల్పన, బోధనాశాస్త్రంలో ప్రత్యేక శిక్షణ, అత్యంత నాణ్యమైన మౌలిక సదుపాయాలకు కావలిసిన వనరులకు - విద్యా వ్యవస్థకు సంబంధించినంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గణనీయమైన పెట్టుబడులు ఎంతో అవసరం.

పునర్వ్యవస్థీకరించిన 5+3+3+4 ఈ పద్ధతికి ప్రతిస్థాయిలోను 1) పాఠ్య ప్రణాళిక రూపకల్పన 2) బోధనాశాస్త్రంలో ప్రత్యేక శిక్షణ 3) అత్యంత

నాణ్యమైన మౌలిక సదుపాయాలు 4) ఆధునిక పరిశోధనావిభాగం 5) ఆధునిక ఆవిష్కరణలు 6) పాఠ్యాంశ మూల్యాంకన 7) ప్రచురణ (సమాంతర ద్విభాష పాఠ్యాంశ ప్రచురణ విషయ కొనసాగింపు (సబ్జెక్ట్ కంటిన్యుటీ) సమాచార అనుసంధానం వంటివి అత్యవసరం. అన్నింటికంటే ముందుగా పాఠ్య ప్రణాళిక రూపకల్పనకు ప్రస్తుతం ఉన్న పాఠ్యాంశాలు ఏవి? ఆధునిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా చేర్చ వలసినవి ఎన్ని? ఉన్న పాఠ్యాంశాలలో వేటిని, ఎందుకు తొలగించాలి? ఈ విధంగా ముందుకు పోవలసి వుంటుంది.

మాతృభాషకు సంబంధించినంతవరకు మాతృభాషను 8 ఆపై తరగతులవరకు బోధించడం, చదవడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల, తల్లిదండ్రుల, చదువుకోవాలనుకునే విద్యార్థుల నిర్ణయాలపై ఆధారపడి ఉంది. 12 తరగతుల వరకు కొనసాగిస్తే మంచిది. ఏ మాధ్యమ విద్యార్థులుకైనా వెసులుబాటు కలిగించే విధంగా ద్విభాష పద్ధతిలో సమాంతర పాఠ్యాంశ ప్రచురణ అనివార్యం. ఇది విద్యార్థులకు పాఠ్యాంశ భావనలపైన మెరుగైన అవగాహనను కలిగించడానికి తోడ్పడుతుంది. భాషా ప్రయోగశాలల స్థాపన, శ్రేణీకరించిన బోధనా విషయ సామగ్రిని తరగతులవారీగా వర్గీకరణ, ఉపాధ్యాయుల బోధన విషయంలో ప్రత్యేక శిక్షణ ఇప్పటి అవసరాలు. బోధనలోనూ వ్యవహారంలోను అనువాదం, భాష ఒక సమాంతరప్రక్రియగా పూర్వప్రాథమిక స్థాయి నుండే ఉంటుంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద వైద్య విధానాలు

- ఆచార్య డి.వి. శ్రవణ్‌కుమార్, ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

జానపద విజ్ఞానం సాంస్కృతిక వారసత్వం. జానపద విజ్ఞానాన్ని జన సముదాయమే తమ సాంస్కృతిక వారసత్వంగా కాపాడుకుంటుంది. జన జీవనం ఉన్నంత వరకూ జానపద విజ్ఞానం కూడా సజీవంగా ఉంటుంది. గేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాలు, ఆటలు, వంటలు, వైద్యం, ముగ్గులు, ఇళ్లు వాకిళ్లూ వంటివన్నీ జానపద విజ్ఞానంలో భాగమే.

జానపదవైద్యం తరతరాల నుండీ వచ్చే సాంస్కృతిక వారసత్వం. ప్రకృతే మనకు మొట్టమొదటి ఔషధశాల. ప్రకృతి నుండే మానవుడు తన వైద్యానికి కావలసిన వస్తువులను ఎంచుకున్నాడు. ఆధునిక వైద్యానికి భిన్నంగా ఉంటుందీ జానపద వైద్యం. ఇది అనుభవం వల్ల రూపుదాల్చుకుంది. తరతరాల నుండి వారసత్వంగా సంక్రమించింది. తెలుగులో జానపద వైద్యాన్ని నాటు వైద్యమని, గృహవైద్యమనీ, అమ్మమ్మ, నాన్నమ్మల వైద్యమనీ పిలుస్తుంటారు. ఈ వైద్యానికి శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చు. అయితే ఒక్కో సందర్భంలో మంచి వైద్యమే లభించవచ్చు. భారతీయ వైద్య పద్ధతుల్లో ఆయుర్వేద వైద్యం శాస్త్రీయమైంది. జానపదవైద్యం శాస్త్రీయ ఆధారాలు లేకున్నా, ఎక్కువగా నమ్మకంపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఇందులో రహస్య గుణం ఎక్కువ. మూలికలు, ఆకుపసర్లు వంటి వాటిని చాలా వరకు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. జానపదవైద్యంలో చాలా వరకు మనకు బాగా తెలిసిన ఆకులు, పళ్లు, దుంపలు, కాయలు మొదలైన వాటినే వాడతారు. అందువల్ల అవి ఆహార పదార్థాలతో పాటే జీర్ణమవుతాయి.

తెలుగు వారికి సంబంధించినంత వరకు జానపద వైద్యాన్ని వందల సంవత్సరాల నుండి వాడుతున్నారు. ఈ వైద్య పద్ధతుల్ని గురించి కొన్ని ఉల్లేఖనాలు ప్రాచీన కాలం నుండే లభిస్తున్నాయి. వాపులకు వాయుతైలాలు, వావిల చిగుళ్లు, ఉమ్మెత్త, ఆముదపు చివుళ్లు, జిల్లేడాకులు, వీటితో కాచడం వంటివి చేసే వారని పాల్కూరికి సోమనాథుడు తన 'బసవ పురాణం' (పుట.77)లో చెప్పాడు. గోవులు కాచుకునే గోపబాలురకు కూడా కొంత పశువైద్యం తెలిసి ఉంటుంది. దూడ చచ్చిన ఆవులను సేపునట్లు చేయడం, కడుపులోనే దూడ చచ్చిపోతే ఆవులకు మందులు ఇవ్వడం వాళ్లకు తెలిసి ఉండేది. ఆవులకు వచ్చేరోగాల పట్టికను ఒకదాన్ని గౌరన తన 'నవనాథ చరిత్ర' (పుట.29-30)లో ఇచ్చాడు.

ఆదివాసీలైన గిరిజనుల్లో చాలా మందికి మూలికా వైద్యం బాగా తెలిసి ఉంటుంది. సర్పగంధి, సుగంధపాల వంటి వాటిని వివిధ రోగాలకు తగ్గట్లు ఉపయోగించడం వీరికి బాగా తెలుసు. గాయాలకు, రక్తపోటుకు, గర్భస్రావానికి, గర్భనిరోధానికి గిరిజనుల వద్ద తగిన ఔషధాలుంటాయి. యానాదులు తమ భార్యకు నవమాసాలు నిండగానే పది పన్నెండు రకాల వేర్లను తెచ్చి సిద్ధం చేసుకుంటారు. నొప్పులు మొదలైనప్పట్నుండి పదవ రోజు వరకు మంచి నీటికి బదులుగా ఈ మూలికల కషాయాన్ని తాగడానికి ఇస్తారు. ఇందువల్ల ఏ జబ్బులూ రావని వారి నమ్మకం. ''పెద్దమాన, ఆకుబెరడు, ఎర్రివాలుడు, నల్ల మునుకుడు, పొరము మొక్క, వారగోగు, తెల్ల బులుగుడు, నల్ల బులుగుడు, సోమి, విష బుద్ధి, నేల వేము, చేదుపుల్ల, నేలగుమ్మడి, చిల్ల బాలింత సంచుమి చెక్కలు'' వంటి వేర్లను యానాదులు వాడతారని వెన్నెలకంటి రాఘవయ్య గారు తన ''యానాది'' (పుట. 75)లో తెలిపారు.

రక్తపోటు, చర్మవ్యాధులు, చక్కెర వ్యాధి, అంటు వ్యాధులు మొదలైన వాటికి గిరిజన వైద్యంలోమంచి

మందులున్నాయి. సర్పగంధి లాంటి వాటిని ఈనాడు శాస్త్రీయ వైద్యంలోవాడటం మనం గమనించవచ్చు. ముఖ్యంగా వేపచెట్టు జానపదులందరికీ పరమౌషధం. వేప ఆకులు, ఇగుళ్ల అంటువ్యాధులకు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. వేపనూనె పేలకు, కొన్ని క్రిమి కీటకాలను చంపడానికి ఉపయోగపడుతుంది. వేపపుల్ల దంతధావనానికి ఎలా ఉపయోగపడుతుందో మన కందరికీ తెలిసిందే. వేపనూనె దీపం కంటికి మంచిదని అంటారు. ఈ నూనె మసితో చేసిన కాటుక కంటికి మంచిదని కూడా అంటారు. ఒంట్లో వేడి తగ్గడానికి, వెంట్రుకలకు ఆముదం పెట్టుకుంటే చాలా మంచిది.

అదేవిధంగా చిత్రమూలం పాలు రాస్తే కీళ్ల నొప్పులు, తల నొప్పులు తగ్గుతాయి. రొమ్ము పడిశాన్ని రంక చెక్క నివారిస్తుంది. పాలతీగ కొనను ముక్కులోకి చొప్పిస్తే జలుబు నయమవుతుంది. ఎర్రగడ్డ, తెల్లగడ్డ, అల్లం కలిపి నూరి మింగితే జ్వరాలు తగ్గుతాయి. వాకుడు గింజలు కాల్చి పొగను కుడి చెవిలో పంపితే కుడి దవడ దంతాల నొప్పి కుదురుకుంటుంది. తేలు కొండె ఆకు పసరులో గచ్చకాయల గంధం కలిపి పూస్తే తేలు విషం హరిస్తుంది. నాగ ముష్టి వేరుని కొరివితో కాల్చి పాము కరిచిన చోట పెడ్తే పాము విషం నిలవదు. తులసి పసరు గాయాలకు మంచి మందు. గొంతులో వచ్చే టాన్సిల్సు వ్యాధికి రైలాకు సరైన మందుగా చెప్తారు. జీలకర్ర, తెల్లపాయలను నూరి మాత్రలుగా మింగితే విరేచనాలు కట్టుకుంటాయి. నల్లేరు, తెల్లతుమ్మ, వేపాకులను, మోదుగ తెల్ల పులుగుడు, వెంపలి, తంగేడు, జిల్లేడు వేళ్లు నీళ్లలో కాచి ఆ కషాయాన్ని తొమ్మిది రోజులు సేవిస్తే బాలింత జబ్బులు రానే రావని వెన్నెలకంటి రాఘవయ్య తన 'యానాది' గ్రంథంలో (పుట. 81-84) తెలిపారు.

జానపద వైద్య విధానాలు :

నొప్పులు :

తలనొప్పికి శొంఠిని కణతలకు రాసినా పోతుంది. తల దిమ్ముగా ఉంటే శొంఠిని చితక్కొట్టి కట్టాలి. వేడి వల్ల వచ్చే తలనొప్పికి మల్లెపూలు, ఆముదపు ఆకులు తలకు కట్టాలి. గంధం తీసి ఫాల భాగానికి రాసినా తగ్గుతుంది. లేదా వెల్లుల్లిని బాగా నలగ్గొట్టి నుదుటిపై, కళ్లకు రెండు వైపులా రుద్దాలి.

చెవినొప్పి :

తులసిరసం చెవిలో పోస్తే బాగా పనిచేస్తుంది. వెల్లుల్లిని నూనెలో కాచిపోసినా చెవినొప్పి తగ్గుతుంది. సజ్జ ఆకు రసం కూడా పని చేస్తుంది. నువ్వుల నూనెలో ఒక లవంగం వేసి కాచి పోసినా చెవి నొప్పి తగ్గుతుంది.

పళ్ళనొప్పి :

మిరియాలు, ఉప్పు మెత్తగా పొడి చేసి నొప్పిగా ఉండే పంటిపై కాసేపు ఉంచాలి. లేదా రెండు మూడు లవంగాలు మెత్తగా నూరి నిమ్మకాయ రసంతో కలిపి చిగురుకి, పన్నుకి తాకిస్తే నొప్పి తగ్గుతుంది. నీళ్లలో ఉప్పు కరిగించి ఆ నీళ్లతో నోరు పుక్కిలించినా పళ్ల నొప్పికి ఉపశమనం కలుగుతుంది.

గొంతునొప్పి :

కొత్త సున్నం గొంతుకు పూస్తే గొంతునొప్పి తగ్గుతుంది. సున్నం, మునగాకు రసం కలిపి గొంతుకు పూసినా నొప్పి తగ్గుతుంది. కఫం ఉంటే మిరియాలు పొడిగిన బెల్లం మింగితే సరిపోతుంది. లేదా గోరువెచ్చని నీళ్లలో ఉప్పు కలిపి గొంతులో గులకరించినా (గార్గిల్) ఉపశమనం లభిస్తుంది.

కడుపునొప్పి :

వాము, ఉప్పు కలిపి తింటే కడుపునొప్పి పోతుంది. బొడ్డు దగ్గర నొప్పిగా ఉంటే జిల్లేడు పాలుపోసి పసుపు అద్దితే నొప్పి పోతుందని అంటారు. తంగేడు చెక్క కషాయం, కోలముక్క చెక్క కషాయం కూడా కడుపు నొప్పికి బాగా పనిచేస్తుంది

కళ్లనొప్పి :

నందివర్ధనం పూలు, పొన్నగంటాకు కలిపి కంటికి కట్టాలి. అలాగే కలబంద, పచ్చకర్పూరం కలిపి కంటిపైన పెట్టుకోవడం వల్ల కూడా కంటి నొప్పి పోతుంది.

బెణుకులకు :

ముష్టి పండ్లు, గంజేరు ఆకులు, తుత్తురేణిఆకులు బెణికిన చోట నలిపి కడ్తే తగ్గుతాయి.

గాయాలు, పుండ్లు :

చిన్న చిన్న గాయాలకు సున్నం పూయడమే మేలని జానపదులు భావిస్తారు. ఆముదంలో కలిపిన సున్నమైతే ఇంకా మంచిదంటారు. చిన్న చిన్న గుల్లలకు అయితే ఎర్రమట్టిని పూస్తారు. అది ఎండిపోగానే తగ్గిపోతుందని అంటారు. నెత్తురు కారే గాయాలకు బాగా ఎండిన మామిడి ఆకుల్ని బూడిద చేసి, ఆ బూడిదను గాయాలపై వేస్తే రక్తం కారడం నిలిచి, గాయం కూడా త్వరగా మానుతుందని విశ్వసిస్తారు. కాలిన గాయాలకు మంచి నూనె లేదా కొబ్బరినూనె పూస్తారు. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి కాలిన గాయానికి లేపనంగా పూసినా మంట తగ్గుతుంది. కాలిన గాయంవల్ల మచ్చలు ఏర్పడితే నేరేడు ఆకులను నున్నగా నూరి పూస్తూ ఉండాలి. పిచ్చిక బీరాకు, రాగి చెక్క, పూపిమద్ది చెక్క, ఊటి ఆకు, గబ్బు ఆకు పసర్లు కూడా గాయాలకు బాగా పని చేస్తాయి.

పాముకాటుకు :

తిప్పతీగ, నేలవేము, పాముకొండ, పల్ల ముష్టి చెక్క, లేకవేళ్లు వంటివి ప్రయోగించి పాము విషాన్ని హరిస్తారు.

తేలుకాటుకి :

ఎర్రగడ్డ (ఉల్లిపాయలు) గాని, తెల్లగడ్డ (వెల్లుల్లి) గానీ నలగ్గొట్టి తేలు కాటు వేసిన చోట కట్టాలి. తేలు కుట్టగానే ఉల్లిపాయ, బెల్లం నమిలి తినాలి. ఉల్లిపాయ రసాన్ని తేలు కుట్టినచోట పూయాలి. తేలు కుట్టగానే కుట్టిన తేలుని గాని, మరొక తేలుని గాని పట్టుకుని దాని కొండిని కాల్చి, వచ్చే పొగని కుట్టినచోట పట్టాలని అంటారు. కొండిని కాల్చగా వచ్చిన భస్మాన్ని కుట్టిన చోట పూయాలి. తేనెటీగలు కరిస్తే మంచి తేనె పూసినా, ఎర్రగడ్డలు సగానికి కోసి తేనెటీగలు కుట్టిన చోట రుద్దినా మంట తగ్గుతుంది.

పిచ్చికుక్క కరిస్తే :

పిచ్చికుక్క కరిస్తే చాలా ప్రమాదమని అందరికీ తెలుసు. ర్యాబిస్ సోకుండా ఇంజక్షన్లు తీసుకోవడం అవసరం. అయితే జానపదులు ఉత్తరేణి చెట్టును వేళ్లతో సహా పీకి తెచ్చి రోట్లో వేసి బాగా దంచి రసం తీస్తారు. దాన్ని వడబోసి, రసానికి కాస్త నీళ్లు కలిపి ప్రతి రోజూ ఉదయాన్నే ఒక లోటా చొప్పున వారం రోజులు తాగిస్తారు. పిచ్చికుక్క కరచిన వెంటనే ఈ వైద్యం ప్రారంభించాలి. మనిషి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం మొదలైన తర్వాత ఈ వైద్యం చేస్తే ప్రయోజనం ఉండదని అంటారు.

చర్మవ్యాధులకు :

ముఖంపై మొటిమలు ఉంటే ఎర్రమట్టిని వేడి చేసి వేస్తే పోతాయని అంటారు. లేదా దాల్చిన చెక్కను నిమ్మరసంలో సాది మొటిమలకు పూయాలి. కాలి మడమలు పగిలితే నలగగొట్టిన ఉల్లిపాయను కడితే ఫలితం ఉంటుంది. చలికాలంలో ముఖం పగలడం సాధారణంగా జరుగుతుంది. దీనికి పాలమీగడలో నిమ్మరసం పిండి చర్మంపై మృదువుగా అద్దాలి. ఓ అరగంట తర్వాత చల్లటి నీటితో కడిగెయ్యాలి. చర్మం బిరుసుగా (డ్రై) ఉంటే పచ్చికొబ్బరి తురిమి, దాంట్లోంచి పాలు తీయాలి. అందులో గ్లిసరిన్ కొద్దిగా కలిపి పూసుకోవాలి. చర్మంపై మచ్చలు ఉంటే సున్ని పిండితో బాగా రుద్ది స్నానం చేయాలి. లేదా బొప్పాయి పండు చెక్కలతో చర్మాన్ని రుద్దుతూ ఉంటే మచ్చలుపోతాయి. ఇక గజ్జి,దురద, దుద్దులు వంటివి పోవడానికి గరికను, పసుపును గోమూత్రంలో సాది పూసుకోవాలి. పూసిన అరగంట తర్వాత వేపాకులు వేసి మరగించిన నీటితో స్నానం చేయాలి. అలాగే చింతాకుల్ని నున్నగా నూరి పూసుకున్నా, నిమ్మకాయ రసంలో గంధం పొడిని కలిపి పూసుకుంటే దురదలు పోతాయి. కొన్ని రకాల చర్మ వ్యాధులకు తేనె పూసినా తగ్గుతాయని అంటారు. దేవదారు రసం, సన్నమల్లి ఆకుల రసం తీట వచ్చిన ప్రాంతంలో పూస్తే తగ్గుతుంది.

జలుబు, దగ్గు, జ్వరం :

సహజంగా మనకు వచ్చే సాధారణ రోగాలు జలుబు, దగ్గు, జ్వరమే. దీర్ఘకాలిక రోగాలకు తప్ప సాధారణ జలుబుకు, దగ్గుకు జానపదులు కషాయాలు వాడతారు. జలుబుకు కరక్కాయ, తాడికాయ, ఉసిరిక కలిపి కషాయం చేసుకుని తాగుతారు. శొంఠి, మిరియాలు, పిప్పళ్లు, బెల్లం కలిపిన కషాయం తాగినా జలుబు తగ్గుతుంది. ముక్కుదిబ్బడకు పసుపు కొమ్ముని నిప్పలపై కాల్చి వాసన చూస్తారు. లేదా ముద్ద కర్పూరం గుడ్డలో పెట్టి అప్పుడప్పుడూ వాసన చూసినా ఫలితం ఉంటుంది. ఇక మామూలు దగ్గుకి ఉప్పు, కరక్కాయను బుగ్గన పెట్టుకుంటారు. పొడి దగ్గుకయితే పెద్ద ఉల్లిపాయ ఒకటి తీసుకుని బెల్లం కలిపి రోజుకు మూడు పూటలా తినాలి. నెయ్యితో ఉల్లిపాయను వేయించి తిన్నా మంచిదంటారు. కఫంతో కూడిన దగ్గు అయితే ఉప్పు, మిరియాలు, తెల్లగడ్డ (వెల్లుల్లి) కలిపి దంచి కాసేపు నోటిలో ఉంచుకోవాలి.

జ్వరం మనకు ఎన్ని విధాలుగానైనా రావచ్చు. నిజానికి జ్వరానికి కారణం తెలుసుకుని తగిన మందు ఇవ్వడం శాస్త్రీయ వైద్య పద్ధతి. అయితే అన్నింటికీ కషాయాలే వాడటం జానపదులకు తెలిసిన పద్ధతి. నిజానికి 'లంఖణం పరమౌషధం' అని అంటారు. అంటే ఉపవాసానికి మించిన వైద్యం లేదు. జ్వరం ఎక్కువైతే చల్లటి నీటిలో తడిపిన గుడ్డను మడత వేసి నుదిటిపై ఉంచితే జ్వరం తగ్గుముఖం పడుతుంది. జానపద వైద్యంలోనే కాక ఇంగ్లీషు వైద్యంలోకూడా ఈ పద్ధతిఉంది. చలిజ్వరమైతే అడవి జీలకర్రను తీసుకుని బాగా పొడి చేసి, నెయ్యి కలిపి నీటిలో మరగకాయాలి. సగానికి సగం నీళ్లు ఇంకిపోయేలా మరిగించాలి. దానిలో అదే కొలతతోఅవుపాలు కలిపి తీసుకోవాలి. రోజుకు రెండుసార్లు ఇలా సేవించాలి.

తిప్పతీగ, దంతివేళ్లు, పెద్దమాను చెక్క, ఆకు చెముడు చెక్క, పునగాని చెక్క, నేలవేము చెక్క, వాగుడి చెక్క వంటివి ఉపయోగిస్తే జ్వరాలు తగ్గుతాయి.

అజీర్ణం :

అజీర్ణం అనేక వ్యాధులకు మూలం. వాంతులు, విరేచనాలు, తలనొప్పి, జ్వరం ఇలా రకరకాలైన రోగాలకు ఇదే కారణం కావచ్చు. శొంఠి, జీలకర్ర బాగా పొడి చేసి, మరిగే నీళ్లలో ఈ పొడివేసి ఐదు నిమిషాలు ఉంచి వడకట్టి ఆ నీళ్లు తాగితే అజీర్ణం పోతుంది. ఇక్కడ శొంఠి బదులు అల్లం కూడా వాడవచ్చు. నిమ్మకాయ రసం కూడా మంచిదే. లేదా ఉల్లిపాయను గానీ, వెల్లుల్లిని గానీ కాల్చి తింటే అజీర్ణం పోతుంది. పుదీనా ఆకుతో కషాయం చేసుకుని తాగినా అజీర్ణం తగ్గుతుంది. కడుపు ఉబ్బరానికి పుదీనా కషాయం లేదా చక్కెర, నెయ్యి వేసుకుని తాగినా తగ్గుతుంది. ప్రతిరోజూ ఆహారంలో ఉల్లిపాయ, వెల్లుల్లి వాడుతుంటే జీర్ణశక్తి పెరుగుతుంది.

వాంతులు, విరేచనాలు :

పసి పిల్లలు తాగిన పాలు కక్కుతుంటే పాలలో లేత కొబ్బరినీళ్లు కలిపి ఇవ్వాలి. వాంతులకు నిమ్మకాయ చాలా మంచిది. నిమ్మరసంలో చక్కెర కలుపుకుని తాగవచ్చు. లేకపోతే జీలకర్ర,నాలుగైదు యాలకులు పొడి చేసుకుని కలుపుకుని తాగాలి. ఉల్లిపాయను కాస్త నలిపి వాసన చూస్తున్నా లేదా చింతపండు, జీలకర్ర కలిపి తిన్నా వాంతి వచ్చేట్లుండే వికారం తగ్గుతుంది. వాంతులు, విరేచనాలు అవుతుంటే దోసకాయను తురిమి శుభ్రమైన వస్త్రంలో కట్టి, పిండి రసం తీయాలి. అందులో కొంచెం నిమ్మరసం కలుపుకుని రోజుకి రెండుసార్లు తీసుకోవాలి. అజీర్తి వల్ల విరేచనాలైతే జాజికాయ చూర్ణాన్ని అరటిపండుతో కలిపి తినాలి. నీళ్ల విరేచనాలకు మంచి నేరేడుపళ్లు తీసుకుని నీళ్లలో పిండి, ఆ రసంలో కొంచెం ఉప్పు కలుపుకుని తాగితే తగ్గుతాయి. ఇక అతిసారానికీ జానపద వైద్యంలో మందులున్నాయి. లేత జామకాయ కషాయాన్ని మజ్జిగతో పాటు తీసుకోవాలి. లేదా మెంతులు నోట్లో వేసుకుని మజ్జిగ తాగవచ్చు. దానిమ్మ చెక్కతో కషాయం చేసుకుని, దాంతో పాటు మెంతుల కషాయంతో కలిపి సేవించినా మంచిదే. వేపబంక, ఉల్లిందర బంక, ఎద్దుసోగ చెక్కలు కూడా విరేచనాలు కట్టుకోవడానికి ఉపయోగిస్తారు.

మరికొన్ని వ్యాధులు - జానపద వైద్యం :

జుట్టు రాలిపోతుంటే దాసాని (మందార) పువ్వులను కొబ్బరినూనెలో బాగా కాసి తయారు చేసుకుని, దాన్ని వెంట్రుకలకు పట్టించాలి. నిమ్మకాయ, నువ్వులనూనె కలిపి పూసుకుంటే చుండ్రుపోతుంది. ప్రతిరోజూ నల్లవేప ఆకులను మూడు నెలల వరకు తింటూ ఉంటే మధుమేహం తగ్గుతుంది. అలాగే నేల ఉసిరిక ఆకు తింటూ ఉన్నా చక్కర వ్యాధి నియంత్రణలోకివస్తుంది. నేల ఉసిరిక ఆకును కాయలతో సహా నలగగొట్టి పసరు తీసి మజ్జిగలో కలిపి తీసుకుంటే పచ్చకామెర్ల వ్యాధి నయమవుతుంది. లేత వేపాకు నూరి కొద్దిగా పసుపు, జీలకర్ర, మిరియాలు వేసి ఉండలుగా చేసి మింగించడం చాలా గ్రామాల్లో, ఇళ్లలో మనకి ఇప్పటికీ కనిపిస్తుంది. దీనివల్ల కడుపులో ఉండే కొన్ని రకాల పురుగులు నాశనమౌతాయి. అప్పుడే పిండిన ఆవుపాలు నురగతో సహా కొద్దిగా నిమ్మరసం పిండుకొని తాగితే మూలవ్యాధి నయమవుతుందని అంటారు.

'అమ్మవారు' అనే పేరుతో పిలిచే చాలా రకాలైన రోగాలకు వేపాకులను, ఇగుళ్లనూ, పువ్వులను వైద్యంగా వాడటం ఇప్పటికీ సమాజంలో మనం చూస్తుంటాం. వేపచెట్టు మంచి రోగ నిరోధక శక్తి గల సాటిలేని ఔషధంలా పనికివస్తుంది. అలాగే మనకు నిత్యం కనిపించే చింతచెట్టు, తాటిచెట్టు, ఈతచెట్టు వంటివి కూడా జానపద వైద్యానికి బాగా పనికి వస్తాయి. మనం ఆహార పదార్థాలుగా తీసుకునే ఆకులు, కూరగాయలు, పప్పుదినుసులు, మసాలా దినుసులు, పెరట్లో పెరిగే రకరకాలైన మొక్కలు, దట్టంగా పెరిగి ఉండే పొదలు, లతలు, మూలికలు అన్నీ జానపదవైద్య విధానంలో భాగమే అవుతాయి. అయితే అన్ని రోగాలూ ఈ వైద్య విధానానికి తగ్గుతాయా అని అంటే తగ్గవని జానపదుల క్కూడా తెలుసు. మంత్రాలతో రకరకాలైన వ్యాధులకు వైద్యం చేసే విధానమూ ఈ జానపద వైద్యంలో ఉంది. మంత్రాలతో కూడిన జానపద వైద్య విధానాన్ని ఇందులో ప్రస్తావించలేదు. ఎందుకంటే 'మంత్రాలకు చింత కాయలు రాలవు' కదా! జానపద వైద్య విధానాన్ని ఇంకా అన్వేషించాల్సి ఉంది. దీనిమీద పరిశోధనలు విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉంది. శాస్త్రీయంగా ఉన్న కొన్ని జానపద వైద్యవిధాన పద్ధతులకు శాస్త్రబద్ధత కల్పించడం ఎంతైనా అవసరమనిపిస్తుంది. ఆధునికమైన మందులు చాలా భాగం చెట్ల వివిధ భాగాల నుండి ఫార్మసీ కంపెనీలు తయారు చేయడం మనం గమనిస్తూనే ఉన్నాం.

ఆధార గ్రంథాలు:

1. రాఘవయ్య, వెన్నెలకంటి, 'యానాది', నెల్లూరు
2. సోమనాథుడు, పాల్కూరికి. బసవపురాణం, తితిదే ప్రచురణలు, 2013
3. సుందరం, ఆర్వీయస్, ఆంధ్రుల జానపద విజ్ఞానం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1992
4. మోహన్, జి.ఎస్. జానపద విజ్ఞానాధ్యయనం, ద్రావిడ విశ్వవిద్యాలయం, 2010
5. సుందరం, ఆర్వీయస్. సుందరజానపదం, సౌశీల్య ప్రచురణలు, 2017
6. రమణయ్య, కడప. ప్రధాన సంపాదకులు: దక్షిణ భారతీయ జానపద విజ్ఞానకోశం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వ్యవసాయ అనుబంధ వృత్తుల కథలు

– డా॥ డి.యుగంధర్, సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

దేశానికి జీవనాడి గ్రామీణ వ్యవస్థ. గ్రామాలకు జీవనాడి వ్యవసాయమేనని మనందరికీ తెలుసు. రైతు పైరు చేసి ధాన్యం పండించి నలుగురికీ ఆహారం సమకూరుస్తాడు. అతనికి ఆపని చేయడానికి అనేక పరికరాలు అవసరమవుతాయి. ఆ పరికరాలనందించి రైతు విజయవంతం అయ్యేందుకు తోడ్పడేవారే ఇతర వృత్తుల వారు. వారి పరిస్థితి పూర్వం ఎలా వుండేది, ఇప్పుడు ఎలావుంది అనే అంశాన్ని తెలియజేసేందుకు వృత్తి కథలు తోడ్పడతాయి. కంసాలి, కుమ్మరి, దాసరి వృత్తుల కథలను కొన్నింటిని తీసుకొని మీముందుంచే ప్రయత్నం చేయడమే నా పత్రోద్దేశం.

అన్నంగుడ్డ :

ఈ కథ సుంకోజి దేవేంద్రాచారి గారు రాశారు. గ్రామాల్లో వ్యవసాయందే అగ్రస్థానం. దానికి అనుబంధంగా అనేక వృత్తులు పూర్వకాలంలో వుండేవి. ఆవృత్తులు వ్యవసాయానికి సహాయంగా కూడా వుండేవి. అలాంటి వృత్తుల్లో ప్రముఖంగా పేర్కోదగ్గది కంసాలి వృత్తి. కంసలి, కమ్మరి, వడ్రంగి అనే పదాలకు స్వల్పంగా భేదమున్నప్పటికీ ఇప్పుడు సమానార్థకంగానే ఈ పదాలు వ్యవహరింపబడుతున్నాయి. స్వర్ణకారుణ్ణి కంసాలి అని, ఇనుము పనిచేసే వాడిని కమ్మరి అని, కొయ్యపని చేసే వాడిని వడ్రంగి అని పూర్వం వ్యవహరించేవారు. ఇప్పుడు అవన్నీ సమానార్థకాలుగానే వ్యవహరింపబడుతున్నాయి. గ్రామీణులు కొయ్య పనిచేసేవారిని, ఇనుము పని చేసేవారిని కూడా కంసలే అంటున్నారు. కంసలి రైతులకు మడకలు సరిచేయడం, బండ్లు చేయడం, చిన్న చిన్న ఇనుము పనులు చేయడం సాగిస్తుంటాడు. ఈ వృత్తి మొదట మంచి ఊపులో వుండేది. నానాటికీ అడుగంట పోయింది. ఈ విషయాన్నే సుంకోజి దేవేంద్రాచారి తన 'అన్నంగుడ్డ' కథలో కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

'అన్నంగుడ్డ' కథ ఒక ఆచారి ఒక రోజు జీవితానికి సంబంధించిన కథ. అతడు ఉదయం పనికి వెళ్ళి సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చేదాకా సాగిన కథ. ఈ కథలోనే అంతర్భాగంగా మరొక కథ కనిపిస్తుంది. అది ఆచార్ల పూర్వ ఉచ్ఛస్థితిని తెలియజేస్తుంది.

ఒకప్పుడు గ్రామాల్లో ఆచార్లకు బాగా గిరాకీ వుండేది. ఎప్పుడూ చేతినిండికి పనుండేది. తీరుబడి చిక్కేది కాదు. రైతులకు మడకలు చెక్కడం, పారలు తయారు చేసి ఇవ్వడం, ఎద్దుల బండ్లు సిద్ధం చెయ్యడం, కత్తులు, కొడవళ్ళు, తొలికలు వంటివి తయారు చేసి ఇవ్వడం కూడా వీరి పనులే. ఇవే గాక గృహ నిర్మాణానికి కావలసిన కొయ్యపని గ్రామంలోని ఆచార్లే చేసేవారు. కుర్చీలు, బల్లలు, దాలుబంద్రాలు, కిటికీలు వంటి వాటిని కూడా చేసి ఇచ్చేవారు. దీనికి వాళ్ళకు మంచి కూలే గిట్టేది. ఇది గాక ప్రతి సంవత్సరం కోతలు కోసేటప్పుడు రైతులు తమకు సహాయంగా వున్న పనివాళ్ళకు మోపు, మేర ఇచ్చే వాళ్ళు. ఇది వారికి సంవత్సరకాల భోజనానికి సరిపోయేది.

ఆచారి తమ గత వైభవాన్ని పదేపదే గుర్తుకు తెచ్చుకొని కొడుకు సురేంద్రకు చెప్పి బాధపడేవాడు. అప్పట్లో రైతులంతా పోటీపడి వచ్చి తమ పనులు ముందుగా చెయ్యమని ఒత్తిడి చేసేవారు. నీళ్ళు తాగడానికి కూడా అవకాశం ఇచ్చేవారు కాదు. క్రమేణా ట్రాక్టర్‌లు వచ్చాయి. మడకలు మూలబడ్డాయి. ఆచారికి రైతుకొరముట్లు చేసేపని తప్పిపోయింది. రైతులు తమకు కావలసిన కొయ్యపనిని కూడా టౌనుకు వెళ్ళి సులభంగా చేసుకోసాగారు. యంత్రాల సహాయంతో తక్కువ ఖర్చుతోనే పనులు పూర్తికాసాగాయి.అందువల్ల గ్రామంలో ఆచారిని పట్టించుకొనే నాథుడే లేకపోయాడు. ఆదాయం అడుగంటింది. తిండికే కష్టమైపోయింది. ఎప్పుడైనా

ఎవరైనా పిలిచినప్పటికీ గిట్టుబాటు కూలి ఇచ్చేవారు కాదు. ఆ కూలి ఆచారి ఆకలిని పోగొట్టేది కాదు. ఈ కథలో కూడా తనను పనికి పిలిచిన పెద్ద రెడ్డెప్ప ఇవ్వ వలసిన దానికన్నా చాలా తక్కువ కూలే ఇచ్చాడు. అది కూడా కొంత బాకీ పెట్టాడు.

ఈ 'అన్నంగుడ్డ' కథలో దేవేంద్రాచారి కొయ్యపనిచేసే ఆచార్ల జీవితం ఎంత అధ్వానంగా తయారయ్యిందో చక్కగా చిత్రించారు. వృత్తిపనివారు తమ వృత్తిని విడిచి మరోపని చేసుకోలేని పరిస్థితి ఎదురౌతున్న సంగతి కూడా ఇక్కడ చెప్పారు. ఈ కథలో ఆచారి కొడుకు సురేంద్ర ఇంటర్మీడియట్ ఫెయిల్ అయ్యాడు. ఉద్యోగం వచ్చే చదువుకోసం ఎగబడకుండా వంశపారంపర్యంగా వచ్చే వృత్తితోనే సరిపుచ్చుకొన్నాడు.

ఈ కథ ప్రారంభంలో 'అన్నంగుడ్డ' సాక్షాత్కరిస్తుంది. కథ చివర కూడా దాని ప్రస్తావన కనిపిస్తుంది. ఆచారికి అన్నం ఎంత ముఖ్యమో అన్నంగుడ్డ కూడా అంతే ముఖ్యమని ఈ కథ తెలియజేస్తుంది. 'అన్నంగుడ్డ' ఆచారి దారిద్ర్యానికి ప్రతీకగా రచయిత ఇక్కడ చిత్రించారు. కాబట్టి ఈ పేరు ఈ కథకు బాగా సరిపోయిందనే చెప్పాలి.

నేలదిగని ఊడ :

ఈ కథ వేంపల్లి గంగాధర్ గారు రాశారు. ఈ కథలో పీరా అనే అతను ఇనుము పని చేసేవాడు. తన తాత మాబూ. అతడు నిజాం కొలువులో పనిచేసేవాడు. నిజాం గుఱ్ఱాలకు నాడాలు కొట్టడమే అతని పని. అతడు అప్పుడప్పుడూ స్వస్థలమైన కడప జిల్లా పల్లెలకు వెళ్ళే వాడు. మనవడు పీరాకు నాడాలు కొట్టడంలో మెళకువలు నేర్పేవాడు. రైతుల ఎద్దులకు నాడాలు కొట్టేటప్పుడు అతన్ని కూడా వెంట తీసుకొని వెళ్ళి చూపేవాడు. ఈ విధంగా పీరా నాడాలు కొట్టడంలో నిపుణుడైపోయాడు.

నాడాలు కొట్టే పనితోపాటు కుటుంబ పోషణకు 'కొలిమి'ని కూడా పెట్టుకొన్నాడు పీరా. దాని సహాయంతో రైతులకు కొరముట్లు చేసి ఇచ్చేవాడు. ఆ పనిని తన కొడుకు మస్తాన్‌కి కూడా నేర్పాడు. అతడు వేట కొడవళ్ళు చేయడంలో గట్టిపట్టు సాధించాడు.

పీరా తను నివసిస్తున్న ఊరిలో అంకిరెడ్డి ఎద్దులకు, ఇంకా చాలా మంది ఎద్దులకు నాడాలు కొట్టేవాడు. గిట్టుబాటు కూలీ లభించకపోయినా సరిపుచ్చుకొన్నాడు. పులివెందుల సంతకు వెళ్ళి అక్కడికి వస్తున్న ఎద్దులకు నాడాలు కొట్టడంలో కూడా, నీళ్ళు పట్టించుకోకుండా ఎక్కువ పనిచేశాడు. అవిధంగా శ్రమపడుతున్న సమయంలో తన కుమారుడు వేటకొడవళ్ళు కేసులో ఇరుక్కున్నాడని తెలిసి హతాసుడయ్యాడు. ఎద్దుకాల్లో దిగవలసిన మేకు అతని వేలిలో దిగిపోయింది. అది గుండెలో దిగిన అనుభూతిని పొందాడు పీరా.

ఈ కథలో పీరాది నిరుపేద కుటుంబం. ముగ్గురు కూతుర్లలో పెద్దకూతురికి మాత్రమే పెళ్ళిచేశాడు. ఇద్దరు కూతుర్లకి పెళ్ళిచేయవలసి వుంది. కొడుకు కువైట్‌కు వెళ్ళి డబ్బు సంపాదించుకు వస్తే కష్టాలన్నీ గట్టెక్కు తాయని దృఢంగా విశ్వసించాడు పీరా. కొడుకు కువైట్‌కు వెళ్ళడానికి కావలసిన పైకాన్ని సమకూర్చుకొంటున్న సమయంలోనే మస్తాన్ మీద కేసుపడింది. నిరుపేదలు ఎంత జాగ్రత్తగా ముందుకు వెళ్ళాలనుకొన్నప్పటికీ ఎదురుదెబ్బలు వాళ్ళను నిరోధిస్తాయని, కష్టాలపాలు చేస్తాయని కథకుడు వేంపల్లి గంగాధర్ గారు ఈ కథలో చక్కగా తెలియజేశారు.

కొలిమి :

ఈ కథ డా॥ వి.ఆర్.రాసాని గారు రాశారు. గ్రామాల్లో పనివాళ్ళమీద రైతులందరూ మూకుమ్మడిగా పడతారు. పనులు త్వరగా అయిపోవాలని ఒత్తిడి చేస్తారు. పనులు ఆలస్యం అయితే, తమకు కేటాయించవలసిన సమయాన్ని మరొకరికి కేటాయిస్తే ఆపనివాళ్ళ మీద కక్ష పెట్టుకొంటారు. వాళ్ళను ఇబ్బందికి గురిచేస్తారు. ఈ విషయాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించే కథను డా॥రాసాని వెంకటరామయ్యగారు రాశారు.

ఈ కథలో బొజ్జన్న ఒక కంసాలి. ఉదయం నుంచి కొలిమిని మండిస్తూ రైతులకు కొరముట్లు తయారు చేసేవాడు. వాటిని విక్రయించి జీవనం సాగించేవాడు. రైతులకు బండ్లు, మడకలు, కొడవళ్ళు, పారలు, గడ్డ పారలు మొదలైన వాటిని సిద్ధంచేసేవాడు. భార్య సాలమ్మ, కూతురు రమాదేవి, కొడుకు బ్రహ్మచారి అతనికి సహాయం చేసేవారు. గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ వృత్తులు చేసేవారి కుటుంబం ఈవిధంగానే వుంటుందని కథకుడు ఈ కథలో చక్కగా తెలియజేశారు.

ఈ కథలో తాతప్ప అనే ఆయన పోలీసు. అత్త వారింటికి వస్తూ పోతూ ఆ కొలిమి దగ్గర కూర్చునేవాడు. తన పోలీసు దర్పాన్నంతా ఉపయోగించి బొజ్జన్న దగ్గర నుంచి ఏదో ఒక వస్తువు తిరిపెంగా తీసుకువెళ్ళేవాడు. ఒక రోజు గొడ్డలి చేసి ఇయ్యమని గట్టిగా పట్టుబట్టాడు. ఆ రోజే తాతప్ప మామ పుల్లయ్యనాయుడు కూడా మడకను అతికించి ఇయ్యమని ఒత్తిడి చేశాడు. ఆ ఊరి ప్రెసిడెంట్ బైరెడ్డి కొడుకు జలపతిరెడ్డి కూడా అదే రోజు వచ్చి ఎద్దుల బండికి కట్టు తయారుచేసియ్యమని పట్టుబట్టాడు. కొంత డబ్బు కూడా ఇచ్చి వెళ్ళాడు. ఇవన్నీ ఒకవైపు వుండగా ఆరోజే ముఖ్యమైన సంత. ఆ సంతకెళితే తన కొరముట్లు అమ్ముడుపోతాయి. ఇంత ఒత్తిడి ఒకేసారి రావడం వల్ల బొజ్జన్నకు చింతపట్టుకొంది.

బొజ్జన్న సంతకు సాలమ్మను పంపాడు. జలపతిరెడ్డి బండిని కొడుకుతో కలసి సిద్ధం చేశాడు. పోలీసు తాతప్పకు, వాళ్ళమామ పుల్లయ్యనాయుడుకు ఇది గిట్టలేదు. వీళ్ళిద్దరూ కలిసి బొజ్జన్న మీద పగబట్టారు. తప్పుడు కేసు మోపి, దానికి ఆధారాన్ని తామే సృష్టించి బొజ్జన్న జైలుకు వెళ్ళేటట్లు చూశారు.

బొజ్జన్న లాంటి నిర్భాగ్య వృత్తిపనివారి పరిస్థితి ఎంత ఘోరంగా వుంటుందో ఈ కథ తెలియజేస్తుంది. వ్యవసాయ అనుబంధ వృత్తులు చేసుకొనేవారు ఏవిధంగా కష్టపడతారో, ఎంత కష్టపడితే నాలుగు రూపాయలు కళ్ళచూడగలరో రాసాని గారు ఈ కథలో చక్కగా చిత్రించారు.

ఊదరదుత్త :

'ఊదరదుత్త' అనే కథను అవధాని ఆముదాల మురళి గారు రాశారు. పేరునుబట్టి కుమ్మరి వృత్తికి సంబంధించిన కథగా ఇది కనిపించినా దీనిలో రెండు, మూడు వృత్తులున్నాయి. అన్నీ కూడా బలమైన జీవ వృత్తులే.

ఈ కథలో రామయ్య అనే ఆయన కుమ్మరి. శాంతిప్రియుడు. ఆత్మీయత పంచే ప్రేమధనుడు. ఇతడు సంపంగి మిట్ట గ్రామంలో కుండలు తయారుచేసి విక్రయించేవాడు.

కుమ్మరి వాళ్ళు కుండలు తయారుచేసి, ఎండబెట్టి, ఆవంలో పేరుస్తారు. ఆపైన దాన్ని తగలబెడతారు. పక్వంగా కాలిన పిదప కుండలను బయటకు తీస్తారు. ఇంట్లో పేర్చి పెట్టుకొంటారు. అడిగిన వాళ్ళకు అమ్ముతారు. వాళ్ళిచ్చే ధాన్యాన్ని జీవనానికి ఉపయోగించుకొంటారు. ప్రతియేడూ ఫలితంలో రైతులు కుమ్మరి వాళ్ళకి మోపు, మేరా ఇవ్వడం వాడుక. ఇది కుమ్మరి వృత్తికి సంబంధించిన సంక్షిప్త కథనం. ఈ కథలో 'ఊదరదుత్త' కోసం నరసింహులు వెళ్ళడం, ఆవం వేసినప్పుడు వచ్చి తీసుకువెళ్ళు అని కుమ్మరి రామయ్య చెప్పడం ఈ రెండు అంశాలతోనే ఈ వృత్తి ఇక్కడ సూచించబడింది.

ఈ కథలో నరసింహులుది ఎలుకలు పట్టే వృత్తి. ఎలుకలు పట్టడంలో నరసింహులు తన నైపుణ్యాన్ని ఏవిధంగా ప్రదర్శించేవాడో రచయిత చక్కగా చిత్రించారు. రైతుల మడిగెనాలకు వెళ్ళి ఎలుకలు పట్టినందుకు యానాది వారికి కూడా రైతులు ఫలితమప్పుడు కొన్ని గింజలు ఇచ్చేవారని ఈ కథను బట్టి తెలుస్తుంది.

నరసింహులు కొడకు చంద్రప్ప. అతడికి ఎలుకలు పట్టే వృత్తి నచ్చలేదు. టైలరింగ్ నేర్చుకొని బెంగుళూరుకు వెళ్ళి జీవనం సాగించాడు. రామయ్య కొడుకు వెంకటేశు కూడా తండ్రి చేసిన కుమ్మరి వృత్తికి స్వస్తి చెప్పాడు. పట్టణానికి వెళ్ళి కార్పొరేట్ స్కూల్లో టీచర్‌గా చేరాడు.

గ్రామీణ వృత్తులను ఆదరించేవారు మాత్రమే గాక చేసే వారు కూడా లేకపోవడం వల్ల వృత్తులు మూలపడి పోతున్న వైనాన్ని ఆముదాల మురళీ గారు ఈ కథలో చక్కగా ఆవిష్కరించారు. కులాలు వేరైనా, వృత్తులు వేరైనా గ్రామీణులు ఎంత ఆత్మీయంగా సహజీవనం సాగించే వారో 'ఊదరదుత్త' కథ తెలియజేస్తుంది.

గరుడస్తంభం :

వ్యవసాయానికి సహాయపడే వృత్తులేగాక వ్యవసాయ దారుల మీద ఆధారపడే వృత్తులు కూడా గ్రామాల్లో కనిపిస్తాయి. అలాంటి వృత్తే దాసరివృత్తి. దాసరులు గరుడస్తంభాన్ని వెలిగించుకొని తమవెంట తీసుకువెళ్తారు. చేత్తో జేగంట మోగిస్తూ వుంటారు. ప్రతి ఇంటికీ వెళ్ళి గరుడస్తంభం అక్కడపెట్టి జేగంటమోగిస్తూ పాటపాడు తారు. ఆ ఇంటివారు పెట్టే ధాన్యాన్నో, భోజనాన్నో స్వీకరిస్తారు. తరువాత మరొక్క ఇంటికి వెళ్ళిపోతారు. ఈ దాసరులు విష్ణుదాసులు. విష్ణువుకు సంబంధించిన పాటలే పాడుతుంటారు. వాళ్ళ పాటల్లో వైష్ణవ భక్తి పరిమళిస్తూ వుంటుంది. ఆ పాటల ద్వారా గ్రామీణులకు దైవ సంబంధమైన అనేక విషయాలు బోధపడుతాయి. ఈ వృత్తి చేసేవారిలో కొంతమంది తిరిపం ఎత్తుకోవడం అవమానంగా భావించడం వల్ల ఆ వృత్తికి స్వస్తి చెప్పి వ్యవసాయాది ఇతర పనులు చేసుకోవడం ఇటీవల కనిపిస్తూవుంది. ఈ విషయాన్ని పాఠకులకు తెలియ జేసేందుకు జి.వెంకటకృష్ణ గారు పూనుకొన్నారు. పర్యవసానంగా 'గరుడస్తంభం' అనే కథ వచ్చింది.

'గరుడస్తంభం' కథలో నారాయణ అనే ఆయన దాసరివాడు. అతని తండ్రి 'దాసరి' వృత్తి చేసి జీవించే వాడు. అర్ధవంతమైన పాటలెన్నో కమ్మగా పాడేవాడు. నారాయణకు ఆ వృత్తి అంటే పడేది కాదు. వ్యవసాయం చేసి జీవించాలనేవాడు. నారాయణ ఆ వృత్తిని మార్చు కొమ్మని తండ్రిని ఎంత ప్రాధేయపడినా ఆయన మార్చు కోలేదు. పైగా తాత తండ్రుల నుంచి సంక్రమించిన వృత్తిని ఒదులుకోలేనన్నాడు.

కొద్దిరోజులకు తండ్రి మరణించిన తర్వాత నారాయణ వ్యవసాయం చేపట్టాడు. వర్షాలు లేకపోవడం వల్ల, ఆఊరి రెడ్డి మోసం చేయడం వల్ల వ్యవసాయం అతన్ని బాగా దెబ్బతీసింది. అప్పుల వారి బాధ ఎక్కువైంది. పరిస్థితి మరణాంతకంగా తయారయ్యింది. నారాయణ ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నాడు. కానీ తండ్రి గుర్తొ చ్చాడు. మళ్ళీ బ్రతుకు మీద ఆశ చిగురించింది. చివరకు తన వృత్తికి ఆధారమైన గరుడస్తంభం చేతపట్టుకొని వీధిలోకి నడిచాడు.

ఈ కథలో పరంపరగా వచ్చే స్వీయవృత్తే శ్రేష్ఠమని, ఇతరుల వృత్తులు ఇబ్బందికరంగా తయారయ్యే అవకాశం ఉండనే వుందని రచయిత వెంకటకృష్ణగారు ఈ కథలో నిరూపించడానికి ప్రయత్నించారు.

నేను ప్రస్తావించిన 5 కథలూ వ్యవసాయానుబంధ వృత్తులకు సంబంధించినవే. వ్యవసాయదారుడిచ్చే పారితోషికం మీద, ధాన్యం మీద ఆధారపడి జీవించేవారే. ఒకప్పుడు ఈ వృత్తులన్నీ మంచి స్థితిలో వుండేవి. నాగరికత పెరగడంతో వ్యవసాయదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు పోవడంతో అనుబంధవృత్తుల వారి ఆదాయం క్రమంగా అడుగంటిపోయింది. వృత్తులు మూలబడ్డాయి. రచయితలందరూ కూడా ఈ క్రమ పరిణామాన్ని చక్కగా వివరించారు. ఒకరకంగా చెప్పాలంటే ఆ వృత్తుల మీద పాఠకులకు సానుభూతి కలిగించడంలో కృతకృత్యు లయ్యారనే చెప్పాలి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అమ్మకు ఆదివారం లేదా? కథలో – స్త్రీ జీవన చిత్రణ

– కె. నాగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

సుప్రసిద్ధ మార్క్సిస్టు, స్త్రీవాద రచయిత్రి ముప్పాళ్ళ రంగ నాయకమ్మ. ఈమె రచనలో రామాయణాన్ని మార్క్సిస్టు దృక్పథంతో విమర్శిస్తూ రాసిన రామాయణ విషవృక్షం ఒకటి. స్త్రీవాద రచయిత కావడంవల్ల "పురుష వ్యతిరేకిగానూ, రామాయణ విషవృక్షం రాయడం వల్ల బ్రాహ్మణ వ్యతిరేకిగానూ ఈమెకి పేరు ఉంది. రంగ నాయకమ్మ పశ్చిమగోదావరి జిల్లా బొమ్మిడి గ్రామంలో 1939లో జన్మించారు. ఆమె జానకి విముక్తి, బలిపీఠం, కృష్ణవేణి, పేకమేడలు, కూలిన గోడలు, స్వీట్ హోం మొదలైన నవలలు, అమ్మకు ఆదివారం లేదా? కథా వ్రాసినారు.

'అమ్మకు ఆదివారం లేదా?' కథలోని అన్నపూర్ణమ్మ జగన్నాథం భార్య భర్తలు, వీరు పాతతరం మనుషులు. అంటే ఇంటిపని ఆడవాళ్ళది, బయట పనులు మగాళ్ళవి. ఆడవాళ్ళు మగవాళ్ళకి ఎదురు మాట్లాడకూడదు అనే భావాలు గలవారు. వీరికి ప్రసాద్, వాసు, వేణు, రేఖ పిల్లలు ఉన్నారు. ప్రసాద్, వాసు ఇద్దరూ పెళ్ళైనవారు, ఉద్యోగస్తులు. వీరిలో కమల ఉద్యోగస్తురాలు. చిన్నకొడుకు వేణు, కూతురు రేఖ అందరూ కలిసి ఉంటున్నారు. అన్నపూర్ణమ్మ తమ్ముడు హనుమంతరావు అతని భార్య శకుంతల అదే ఊరులో ఉంటున్నారు. ఈ కథలోని అన్నపూర్ణమ్మ, అరుణ, కమల, శకుంతల, రేఖ పనిమనిషి లక్ష్మి స్త్రీ పాత్రలున్నాయి. వీరిలో అన్నపూర్ణమ్మ పాతకాలపు మనిషిగా కనిపిస్తుంది. మిగితా పాత్రలు మార్పు కోరేవారిగా కనిపిస్తారు. కథలో వీరి జీవన చిత్రణ ఎలా సాగిందో చెప్పదలచుకున్నాను.

కమల :

అన్నపూర్ణమ్మ జగన్నాథం రెండో కొడుకు వాసు. వాసు భార్య కమల. ఇద్దరూ ఉద్యోగస్తులే. కమల బాగా చదువుకొని ఉద్యోగం చేస్తుంది. ప్రభుత్వం ఆడవాళ్ళకు ప్రకటించిన సెలవు గురించి మాట్లాడుకుని అరుణ, కమల ఆదివారం పనిచేయకూడదనుకున్నారు. కమల పొద్దున్నే లేచి చక్కగా జడ వేసుకుంది. హాయిగా కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటుంది. మరదలు రేఖ, అత్త అన్నపూర్ణమ్మలని మనం ఒక కట్టుగా ఉండాలంటుంది. మరిది వేణు వచ్చి వదినలిద్దరూ నిజంగానే పోరాటం మొదలు పెట్టారా అంటే మా సెలవు రోజంటే మీకు వెటకారంగా ఉందా అని కస్సుమంటుంది. ఇంట్లో మొగాళ్ళ మీద పంతం నెగ్గాలంటే అత్తమ్మను తమవైపు తిప్పుకోవాలని భావించి అత్తకు నచ్చచెబుతుంది. బావగారికి, మొగుడికి కాఫీ పెట్టమని, ఉప్మా చేయమని, బట్టలుతకమని పనులు చెబుతుంది. పనులన్నీ మేము చేస్తుంటే మీరేమి చేస్తారంటే రోజూ ఈ పనులన్నీ మేము చేస్తుంటే మీరేమి చేస్తున్నారో ఈరోజు మేము అదే చేస్తాం' అని ధైర్యంగా అంటుంది. డబ్బు తీసుకొని వంట చేయమని అత్తగారంటే అందుకు ఊరుకోదు. హోటలు నుంచి తెప్పిస్తానంటే అంగీకరించదు. ప్రసాదు కొడుకుని కొడితే వాడు పెద్దవాడయిన తర్వాత తిరిగి కొడతాడని హెచ్చరిస్తుంది. హనుమంతరావు బాబాయి మగాళ్ళ పక్షాన మాట్లాడితే ఆడవాళ్ళ పక్షాన మాట్లాడుతుంది కమల.

గవర్నమెంటుతో మాట్లాడి వాసు తెచ్చిన 'డాక్టరు సర్టిఫికెట్' మీద 'స్టే' తెస్తుంది. పాలుపంచుకోవడానికి చేసిన హితబోధ పరమార్థానికి కమలే ముందుగ గ్రహించి మగవాళ్ళని దారిలోకి తేవటానికి, ఇంటి నుంచి వెళతా నంటుంది. తన భర్తకు తన మీద ప్రేమలేదు. పని పంచుకోవడం లేదు. కాబట్టి తాను ఇంటి నుండి వెళ్ళిపోతానంటుంది. మిగతావాళ్ళు కూడా కమలతో పాటే అనడంతో ప్రసాద్, వాసు, హనుమంతు లాంటి వాళ్ళు చివరికి దారికొస్తారు.

జగన్నాథం పరిష్కారం చూపిన తర్వాత సమస్యపూర్తిగా

పరిష్కారం అవుతుంది. ఈ విధంగా కమల బుద్ధిసూక్ష్మత వల్ల చొరవ, ధైర్యం వలన అనుకున్నది సాధించింది.

రేఖ :

అన్నపూర్ణమ్మ జగన్నాథం కూతురు రేఖ. చదువు కుంటుంది. పెళ్ళి కాలేదు. ఇంట్లో అందరికంటే చిన్నది. ఆడవాళ్ళ కష్టాల గురించి అవగాహన లేనిది. అందరిపట్ల ప్రేమాభిమానాలు గలది. ఆదివారం పనిచేయ కూడదను కున్న వదినల నిర్ణయం తెలిసినా అది సరదాకేమో అనుకుంటుంది. రేఖ ఆదివారం పొద్దున్నే లేస్తే వదినలు రేఖను మరి కాసేపు పడుకోమన్నారు. అన్నయ్య లిద్దరిని లేపమన్నారు. పాలప్యాకెట్లు ఎవరూ తేకపోతే నేను తెస్తాంటుంది. అలాగే చిన్నిని దొడ్డికి తీసుకెళతాననడం, ఆకలి అంటున్న చిన్నికి పాలు ఇస్తాననడం రేకలోని మంచితనాన్ని తెలియజేస్తుంది. వదినలు ఆ పనులు చేయవద్దని అనడంతో ఆగిపోతుంది. హనుమంతరావు ఇంటికి వచ్చి ఇంటిపని, వంటపని విషయంలో మగవాళ్ళ పక్షాన మాట్లాడతాడు. అపుడు రేఖ 'నలభీమపాకం' అని మొగాళ్ళ పేర్లతోటి చెబుతారుగా పెళ్ళిళ్ళకి, వాటికీ మొగాళ్ళే వండుతారుగా? హోటళ్ళలో, స్వీటుషాపుల్లో ఎవరు వండుతున్నారు? ఇళ్ళల్లో కన్నా అవే రుచిగా ఉం టాయి. కావాలంటే ఎవరినన్నా అడుగు అంటుంది. ఇంకా సరిగా నేర్చుకొని చేస్తే ఎవరు చేసినా రుచి వస్తుంది. సరిగా చేయకపోతే ఎవరు చేసినా రుచి రాదు. మనిషి మనిషికి తేడా ఉంటే ఉండొచ్చు అని సత్యాన్ని కుండలు బద్దలు కొట్టినట్లు చెబుతుంది.

భారత సంస్కృతి గురించి స్త్రీల గురించి హను మంతురావు మామయ్య మాట్లాడుతుంటే, భారత ప్రభుత్వమే కదా మరి సెలవునిచ్చింది. ఏ ఇరానో, అరబ్బో ప్రభుత్వాలు కాదు కదా అని వాదించేటప్పటికి హను మంతు తెల్లబోయి చూస్తుంటాడు. రేఖ వాదనా పటిమను వదినలిద్దరూ మెచ్చుకుంటారు. చివరికి కమల ఇల్లు వదిలి వెళతానన్నప్పుడు రేఖ నేను కూడా నీతో వచ్చి ఏదన్నా ఉద్యోగం సంపాదించుకుంటా నంటుంది.

జగన్నాథం కలగజేసుకొని సమస్యకు పరిష్కారం చెపుతాడు. ఈ సమయంలో పెళ్ళిళ్ళ పేరయ్య వస్తాడు. రేఖను చూసుకోవటానికి సాయంత్రం పెళ్ళివారు వస్తున్నారని తెలియజేసాడు. రేఖ తనకు అప్పుడే పెళ్ళి వద్దంటుంది. స్వతహాగా సంపాదించే వరకు పెళ్ళి చేసుకోనని స్వతంత్రంగా బ్రతకాలని, ఆడ, మగ సమానం అని భావించే మనిషినే పెళ్ళి చేసుకుంటానని అంటుంది.

అరుణ :

అన్నపూర్ణమ్మ, జగన్నాథం పెద్దకోడలు, ప్రసాద్ భార్య. అత్తగారి లాగే ఇంటి పనులు చేస్తుంది. చదువు పెద్దగా లేకపోవడం వలన తనకు ఉద్యోగం రాదనుకుంటుంది. ఇంట్లో కుట్లు, అల్లికలు చేస్తుంది. భర్త ఏమైన అన్నా సర్దుకుపోతుంది. పాతికేళ్ళ అరుణ చదువు తక్కువైనా మంచి అభిరుచి కలిగింది. పొద్దుటే లేవగానే మొహం కడుక్కుని కుంకుమబొట్టు పెట్టుకుని పెరట్లో ఉన్న పూలతో ఏదో ఒక దాన్ని జడలో పెట్టుకుంది. ఆ తరువాత వంటింట్లోకి వస్తుంది. సెలవు అనగానే వంటింట్లోకి వెళ్ళడం తప్ప మిగతా పనులన్నీ చేసింది. పెద్ద పుస్తకం పట్టుకుని కూర్చుంది.

పాలప్యాకెట్లు వచ్చినా తీసుకురాలేదు. అత్తయ్య, మరదలు ఆ పని చేస్తామన్నా ఒప్పుకోలేదు. మరిది వేణుతో బాబాయి హనుమంతరావు, భర్తతో, మరిది వాసుతో సెలవు గురించి ఇంటిపనులు గురించి వాదిస్తూ గడిపింది.

అన్నపూర్ణమ్మ :

అన్నపూర్ణమ్మ, జగన్నాథం భార్యభర్తలు. భర్తకు దగ్గరగా ఉండి సమయానికి ఆయనకేమవసరమో స్వయంగా అందివ్వటం, ఇంట్లో ఆమె పని, భర్త పని తరువాత ఇంటిపని, వంట పనుల్లో తను చేస్తూ కోడళ్ళ చేత చేయిస్తూ ఉంటుంది. మగవాళ్ళ చేత మాటబడగుండా పనులు చేయడం స్త్రీల విధి అనుకుంటుంది. ఆడవాళ్ళ కష్టం చూస్తున్నా, తన చిన్నతనం నుంచి ఇలాగే జరుగుతూ ఉందని, దానికి విరుద్ధంగా వెళ్ళడం ధర్మం కాదు అనుకునే మనిషి. అయితే ప్రభుత్వం ''ఆదివారం ఆడవాళ్ళకు సెలవు'' అని ప్రకటించింది. కమల, అరుణ, రేఖ, శకుంతల, లక్ష్మి, అన్నపూర్ణమ్మతో శనివారం రాత్రి

మాట్లాడుకుని, ఆదివారం ఏ పనీ చేయకూడదనీ పనంతా మగవాళ్ళ చేత చేయించాలని నిర్ణయించు కుంటారు. ఇందుకు అన్నపూర్ణమ్మ సహకరిస్తుంది.

శకుంతల :

శకుంతల, అన్నపూర్ణమ్మ తమ్ముడు హనుమంతరావు భార్య. హనుమంతరావు వంట మనిషి, బయట వంటలు చేసి వస్తాడు కానీ, ఇంట్లో మాత్రం భార్యే వంట చేయాలి అనే మనిషి. ఇలాంటి మనిషిని ఏమనలేక ఇంటిపనంతా తానే చేసుకుంటుంది. ప్రభుత్వం "ఆడవాళ్ళకు ఆదివారం సెలవు" అనే చట్టం వచ్చినప్పుడు శకుంతల వెంటనే పనులు మానేసి భర్తను ఇంటి పనులు చేయమంది. ఆ పనులు తప్పించుకోవడం కోసం అన్నపూర్ణమ్మ ఇంటికి వస్తాడు. ఇక్కడ కూడా ఇంట్లో పరిస్థితి చూసి ఆశ్చర్య పోయాడు. పోనీ నీకు వంట చేయటం వచ్చు కదా చేయకపోయావా అని అక్కయ్య అంటే ఇంట్లో ఆడదాన్ని కూచోబెట్టి నేను వంట చెయ్యాలా పైగా మేము చేసింది బాగుంటే ఇక రోజూ మమ్మల్నే చేయమంటారు అంటాడు. అక్కయ్యతో ఇంట్లో వంటా వార్పూ ఆడవాళ్ళ నాజూకు చేతులతో చేస్తే అదెంత అందం. వంటింట్లో ఆడవాళ్ళు వండితేనే ముద్దూ ముచ్చట. ఎక్కడ ఉండవలసిన వాళ్ళు అక్కడ ఉండాలి అంటాడు. ఆడవాళ్ళు వంటితేనే రుచిగా ఉంటుందంటాడు. ఆడవాళ్ళకి వంట చేసి పెట్టడం సరైంది కాదంటాడు. మగవాళ్ళు వండినా పప్పు ఉడుకుతుందని, నలభీమపాకాలని పేరుందని ఆడవాళ్ళు వాదించే సరికి గెలవలేక వాదం మాను కుంటాడు.

హనుమంతరావు కోసం అన్నపూర్ణమ్మ ఇంటికి వచ్చిన శకుంతల ఇంటికొచ్చి కాఫీ ఇస్తారా? లేదా అని నిలదీస్తుంది. మగవాళ్ళు వంటచేయకూడదని వేదాల్లో ఉందంటాడు. చూపిచ్చమంటే సమాధానం ఉండదు.

చివరికి కమల ఇంటి నుంచి వెళ్ళిపోతాననడంతో శకుంతల నేను కూడా వస్తానంటుంది. ఇంత సేవ చేసినా కొంచెం కూడా నా మీద ప్రేమ లేదు. పచ్చల్లు పెట్టుకునో, అప్పడాలు చేసుకునో బతుకుతాను అని శకుంతల అంటుంది. జగన్నాథం చేసిన పరిష్కారంతో హనుమంత రావు కూడా ఇంటి పని చేయడానికి అంగీకరిస్తాడు.

లక్ష్మీ :

అన్నపూర్ణమ్మ వాళ్ళ ఇంట్లో పని మనిషి. ఇంటి పనితో పాటు బ్రతుకు తెరువుకు వేరే ఇళ్ళలో కూడా పనులు చేస్తుంటుంది. ఈమెకు ఆరోగ్యం బాగుండక పోతే భర్త ఇంట్లో పనులు చేస్తాడు. బాగుండక పోవడం వలన పనులు చేస్తాడు కానీ, బాగుంటే ఏ పని చేయడని లక్ష్మికి తెలుసు. అందుకు ఆదివారం తనకు సెలవు అనగానే సంతోషించింది.

'అమ్మకు ఆదివారం లేదా?' కథలో రచయిత్రి రంగనాయకమ్మ మంచి పరిష్కారం చూపారు. ఇంటిపనిని ఆదివారంతో నిమిత్తం లేకుండా పంచుకోవాలన్నారు. భార్యాభర్తల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావం ఉండకూడదన్నారు. అందుకే ఆడవాళ్ళు ఇంటి పనితో పాటు బయటిపనులు కూడా చేసుకోవాలన్నారు.

భార్యాభర్తలు మాత్రమే కాదు ఇంట్లోని చిన్నపిల్లలు, పెద్దవాళ్ళు కూడా ఇంటిపనుల్లో భాగం పంచు కోవాలన్నారు. చిన్నప్పటి నుండి పిల్లలకి ఇది ఆడవాళ్ళు చేసే పని, ఇది మగవాళ్ళు చేసేపని అని భేదం చూపక 'మన ఇంటిపని' అనే భావన పెంపొందించాలని సూచిం చారు. దీనివలన కొంతమంది సుఖపడుతుంటే కొంత మంది పనిచేయటం మంచిది కాదనే నీతిని 'అమ్మకు ఆదివారం లేదా?' కథ ద్వారా తెలియజేశారు.

ఆధార గ్రంథాలు

1. అమ్మకు ఆదివారం లేదా? కథ - ముప్పాళ రంగనాయకమ్మ
2. కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పూలు నవ్విన కాలం – రసరాజు కథానిక సౌందర్యం

మన్మథరావు కొమరావు, ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి, తెలుగు విభాగం, కాశీ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి.

తెలుగు కథా సాహిత్యమనేది 19 వశతాబ్దంలో ప్రారంభవైంది. 1910లో ఆంధ్ర భారతి పత్రికలో వెలువడిన గురజాడ వేంకట అప్పారావుగారి దిద్దుబాటు కథ తొలి తెలుగు కథ అని అనేకమంది విమర్శకుల అభిప్రాయం. ఆనాడు ప్రారంభమైన ఈ కథా ప్రక్రియ వస్తు వైవిధ్యంతో అత్యాధునిక యుగ తెలుగు సాహితీ జగత్తులో ధ్రువతారగ వెలుగొందుతున్నది.

కందుకూరి, గురజాడ, విశ్వనాథ, మధురాంతకం, కాళీపట్నం రామారావు,పెద్దిభొట్ల,కొచ్చర్లకోట, ఓల్గా, కొలకలూరి ఇనాక్ మొదలగువారు ప్రాచీన, ఆధునిక పోకడలతో కూడిన ఆధునిక కథా సాహిత్యాన్ని పండిస్తూ, తెలుగు సాహితీ కళా స్రవంతిలో ప్రకాశిస్తున్నారు. ఎందరో కథకులు తెలుగు సాహిత్యాన్ని నిరంతరం సుసంపన్నం చేస్తూనే ఉన్నారు. ఈ కోవలో తెలుగు కథా సాహిత్యానికి విశేష సేవలందిస్తున్న కథకుల వరుసలో ఆణిముత్యం లాంటిడు రసరాజు. ఈయన కోనసీమలో 1943లో జన్మించారు. తల్లి వెంకమ్మ, తండ్రి కాశీ రాజు. రంగినీని సత్యనారాయణరాజు. తన పేరులో మొదటి అక్షరాల కలయికను సంక్షిప్తంగాచేసి రసరాజు అనే పేరుతో సాహితీ సృజన చేస్తున్నారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలతో బాటు, కథానికా రంగాన్ని ప్రధానంగా చేసుకుని సమాజాన్ని తన ప్రత్యేక దృక్కోణంతో దర్శిస్తూ వైవిధ్యభరిత ఇతివృత్తాలతో కథలను రాస్తున్నారు. రసరాజు రాసిన ఆణిముత్యాల్లాంటి ప్రసిద్ధమైన కథల్లో పూలు నవ్విన కాలం ఒకటి.

కథా నేపథ్యం :

సాహిత్య, కళల, పోషకుడుగా అజరామరమైన కీర్తిని సంపాదించిన శ్రీకృష్ణదేవరాయలు1509-29 మధ్య విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించారు. ఈయన పాలించిన కాలం 20 సంవత్సరాలైనా, ఆ కాలం దక్షిణ భారతదేశ చరిత్రలో స్వర్ణయుగాన్ని తలపిస్తుంది. నరసరాయల కాలంనుండి తుళు వంశపు రాజులు తెలుగు భాషనే అభిమానించి ఆదరించారు. రాయలవారి కొలువులో తెలుగు కవులేకాక, సంస్కృత, తమిళ, కన్నడవంటి భాషా కవులుకూడ ఆదరణ పొందారు. రాయలకాలంలో శైవ ప్రభావం కొంతమేర కనుమరుగై, వైష్ణవ ప్రభావం బలపడింది. ఆ నాటి ప్రజల శాంతి సౌభాగ్యాలు, భోగభాగ్యాలు ఆ కాలపు కవుల కావ్యాల్లో బాగా ప్రతిఫలించాయి. మను చరిత్ర, వసుచరిత్ర వంటి ప్రబంధాల్లో వివాహ వైభవాదులు, ఆడంబరంగా వరుడు పెండ్లికి తరలివచ్చే సన్నివేశాలు అవగతమౌతాయి.ఆ కాలంనాటి ముసల్మానుల ప్రభావం వలన ఆయా ప్రాంతాల్లో సాంస్కృతిక కోణంలో కొన్ని కొన్ని మార్పులు జరిగినట్టు కొత్తగా గమనించగలము. అయితే రసరాజు గారు రాసిన పూలు నవ్విన కాలం అనే ప్రస్తుత కథకు నేపథ్యం చారిత్రక ఇతివృత్తం కలదిగా అనిపిస్తుంది. ఇది రాయలవారి పరిపాలనా కాలంలో జరిగిన కల్పిత కథగా కథకుడు తీర్చిదిద్దారు.

ఈ కథ సి. పి. బ్రౌన్ అకాడమీవారి విశేష బహుమతి పొందినది. నవ్య తెలుగు వార పత్రిక 07-07-2010 సంచికలో ప్రచురితమై పాఠకుల విశేష ఆదరణ చూరగొన్నది. శ్రీకృష్ణదేవరాయలును, సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా ప్రకటించడమే కాకుండా, రసిక చక్రవర్తిగా కూడ నిరూపితమైనది.

కథా పరిచయం :

అసలే చలికాలం. ఆకాశం ఉరుములు మెరుపులతో

కుంభవృష్టి కురిసేలా వాతావరణం ఉంది. అందరూ ముసుగుదన్ని నిద్రపోయే సమయం. కానీ రాయలవారు తాను చేస్తున్న గ్రంథ రచనలో ఒక ప్రణయ ఘట్టాన్ని రాస్తూ, మధ్యలో ఆగిపోయారు. ఆ రోజు అంతగా కార్యభారం లేనందువల్ల రచన కూడ ముందుకు సాగనందువల్ల, విశ్రాంతి నిమిత్తం తమ అందాలరాణి శయ్యా మందిరంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంలో చిన్నమదేవి, రాయలవారి సంభాషణలో శృంగార రస చతురత కథలో దోబూచులాడింది. ఏకాంత మందిరంలో రాయలవారు సంతోషంగా ఉన్న సమయంలో ఉలిక్కి పడేలా ఎవరో గంట మ్రోగించారు.

అంత:పురానికి సంబంధించిన రాయలవారి నమ్మిన బంటు సూరపరాజు ఆ గంట మ్రోగించాడు. తలుపు తీసిన రాయలవారికి అప్పుడు కురుస్తున్న పెద్ద వర్షంలో తడిసిన బట్టలతో సూరపరాజు కనిపించాడు. గంభీరంగా నిలబడ్డ రాయలవారితో ''రామరాజభూషణ కవిగారు ఏలినవారి దర్శనంకోసం వచ్చారు. ఏ వేళలో దర్శించ డానికైనా మహారాజా వారు అనుగ్రహించిన అత్యంత గౌరవ ప్రవేశ పత్రాన్ని చూపించడంతో ఈ విషయం మీకు మనవి చేద్దామని ఈ సమయంలో వచ్చాను ప్రభూ'' అన్నాడు. రామరాజభూషణ కవికి గొడుగు పడుతూ రాయలవారి దగ్గరికి తెచ్చాడు సూరపరాజు. ''ఏలినవారు వారు క్షమియింపగ వేడెద'' భయమూ, సంశయమూ కలగలిసిన రీతిలో రామరాజ భూషణుడు తన రెండు చేతులు జోడించి పలికాడు. వర్షంలో తడిసిన భట్టుమూర్తి కవి తుడుచుకునేందుకోసం తన ఉత్తరీయాన్ని రాయల వారు ఇవ్వజూపగా, కవి సున్నితంగా తిరస్కరించాడు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండగా తాను వచ్చిన పనిని రెండు మాటల్లో ఉద్విగ్నభరితంగా ప్రభువుకు నివేదిం చాడు. ఆ ఉద్విగ్నత రాయలవారినీ తాకింది. ''ఇక మీరు బయల్దేరండి. ఎవరినైనా మీకు సాయంగా ఇంటి వరకు పంపించుమని, మా మాటగా సూరపరాజుతో చెప్పండి''. అంటూ రాయలవారు పైకిలేచారు. చిన్నమదేవేరి వారికి ఏ విషయం అర్థంకాలేదు. రాచకార్యాల్లో తలమునకలై పనులు నిర్వహించే ప్రభువులవారి ఆలోచనల జోలికి ఆమె పోదల్చుకోలేదు. మౌనమే శరణ్యమనే భావన ఆమెది.

ఇంతలో వసంత ఋతువు మొదలు కావడంతో ప్రకృతి కాంతులతో శోభాయమానంగా ఉంది. ఇలాంటి సమయంలో రాయలవారు సభతీర్చి ఉండగా మంత్రులు, సామంతులు, అష్టదిగ్గజ కవులు, గాయకులు, నర్తకీ మణులు, చిత్రకారులు ఇలా లలిత కళలకు సంబంధిం చిన వారందరూ కొలువులో ఆశీనులయ్యారు. అప్పాజీ వెంటరాగా రాణులతో వేంచేసిన రాయలువారు, మంగళ తూర్యనాదాల మధ్య సింహాసనాన్ని అధివసించారు. యుద్ధంలో విశేష వీరత్వం ప్రదర్శించి విజయానికి కారకులైన వారికి సత్కారం జరుపనున్నారు. ఈ ప్రథమ సత్కారం భట్టుమూర్తిగా పేరుగాంచిన రామరాజభూషణ కవికి జరుగుచున్నది. ''హిరణ్యగర్భ అయిన మన భూమిపై తీవ్ర స్థాయిలో దండెత్తడానికి నిజాం షాహి రానున్న రెండు రోజుల్లోనే సిద్ధమవుతున్నాడన్న రహస్య సమాచారాన్ని భట్టుమూర్తి కవిగారు అందించారు'' మన దేశ రక్షణపట్ల ముందుచూపుతో రాబోయే ప్రమాదాన్ని అర్ధరాత్రి అయినప్పటికీ ఆలస్యం చేయకుండా ప్రభువులవారికి తెలిపినందువల్ల మన సైన్యాన్ని సమాయత్తపరచగలిగాం. ఆ సమాచారం మాకు సకాలంలో తెలిసి ఉండకపోతే, విజయం అనివార్యమే అయినప్పటికీ, ఎక్కువ శ్రమ పడవలసి వచ్చేది. ఆ సంగతి ముందుగా తెలియడం వలన మరింత జాగరూకతతో శత్రుమూకలను తరిమి గొట్టగలిగాం. జ్వరతీవ్రతతో ఉన్నప్పటికీ రామరాజభూషణ కవిగారు తక్షణ సమాచారం అందించడంద్వారా రాజభక్తిని చాటుకున్నారు. చివరకు రామరాజ భూషణ కవిని సంప్రదాయబద్ధపూర్వకంగా సన్మానించి, ఐదువేల తులాల బంగారాన్ని రాయలవారు కానుకగా సమర్పించారు. ఏలిన వారిచ్చిన హిరణ్యపురస్సర సత్కారాన్ని శిరసావహించి కవి స్వీకరించాడు. కానీ రాజుగారి అనుమతితో ఈ మొత్తాన్ని

అష్టదిగ్గజ కవుల పక్షాన ఒక మూల నిధిగా ఏర్పాటుచేసి, పేదవారి పెండ్లి వేడుకలలో మంగళ సూత్రాలు బహుమతిగా అందించేందుకు, ఈ నిధినుండి వినియోగించవలసిందిగా వేడుకుంటున్నాను. ఇప్పటికే మహారాజా వారు ఇలాంటివెన్నో సహాయ కార్యక్రమాలు చేస్తున్నా, మా కవుల భాగస్వామ్యాన్ని కూడా కలుపుకునేందు కోసమే ఈ నిధి ఏర్పాటు. ఇంతలో అల్లసాని పెద్దన కవీంద్రులు, ప్రభువైన రాయలవారు కూడ స్వయంగా కవి కాబట్టి వారు ఈ నిధికి మరో మూడు రెట్లు బంగారాన్ని జతచేసి మూల నిధిని మరింత పెంచుతున్నందువలన కృష్ణదేవరాయల ప్రభువులతో కలిపి తొమ్మండుగురు కవులవుతున్నారు. అందువల్ల దీనిని మాంగళ్య కవిత నవ నిధి అని పేరు నిర్ణయిస్తే బాగుంటుందని సూచించడంతో ప్రభువైన రాయల వారితో సహా, సభాసదులంతా ఆనందంతో, అనుమోదిస్తూ కరతాళ ధ్వనులు చేశారు.

కథా ఎత్తుగడ :

కథకులు తమ కథలను ప్రారంభించడంలో తమ ప్రత్యేక ఒరవడిని పాటిస్తుంటారు. ఒక కథకుడే తాను రాసిన పలు కథల్లో రకరకాల కోణాల్లో కథా ప్రారంభాన్ని కొనసాగిస్తుంటారు. అలాగే ప్రస్తుత కథకుడు రసరాజు విభిన్న పద్ధతుల్లో కథల ఎత్తుగడను ప్రదర్శించారు. పూలు నవ్విన కాలం అనే కథ రాయలవారి కాలంలో జరిగిన ఒకానొక సన్నివేశ కల్పనకు ప్రతిరూపం. రాయలవారు ప్రణయ కావ్యానికి అందమైన కొనసాగింపు రచన చేస్తుండగా ఆయన కలం ఆగింది. వాతావరణ మార్పులు ఏర్పడి కుంభవృష్టికి సూచనలయ్యాయి. ఈ సన్నివేశాన్ని కథా ఎత్తుకోలుగా రసరాజు తీర్చిదిద్దిన పద్ధతులు పరిశీలించడం ప్రస్తుతాంశం.

"చలికాలం.... దానికి తోడు - ఆకాశంలో ఉరుములు, మెరుపులతో యుద్ధ వాతావరణాన్ని తలపింపజేస్తోంది. మరి కాసేపట్లో కుంభవృష్టి తప్పదేమో అనిపిస్తోంది. జనసంచారం ఎక్కడా కనిపించడం లేదు. అందరూ ముసుగుదన్ని నిద్రపోతున్న సమయమది.

మధ్య మధ్య కోటగుమ్మనుండి సమయాన్ని సూచిస్తూ ఘంటారావాలు వినబడుతూనే ఉన్నాయి. రాత్రి రెండో జాము నడుస్తోంది. అప్పటివరకూ గ్రంథ రచన చేస్తున్న రాయలవారు ఏదో ప్రణయ ఘట్టం రాస్తూ మధ్యలో ఆగిపోయారు".

ప్రబంధ కవుల ప్రణయ సన్నివేశాన్ని గుర్తుతెచ్చుకున్నారు. స్వీయ అనుభూతుల్ని మననం చేసుకున్నారు. అయినా లేఖిని ముందుకెళ్ళడం లేదు. మొరాయిస్తూనే ఉంది. ఆ రోజు కార్యభారం లేకపోవడంతో ఎలాగైనా ఆ ప్రణయ కావ్య ఘట్టాన్ని ముగించాలని ఎంత ప్రయత్నించినా ముందుకు సాగలేదని రాయలవారి కావ్య రచనా చతురత, సున్నిత మనసు, కార్యక్రమాల దక్షత వంటి గుణాలు చిత్రించే కథా ఎత్తుగడకు నిదర్శనంగా చెప్పుకోవాలి.

వర్ణన సౌందర్యం :

రాయలవారు ప్రణయ సన్నివేశాన్ని ముందుకు సాగించలేక అర్ధరాత్రి కావడంతో అంత:పురములోని చిన్నాదేవి శయన మందిరానికి చేరుకున్నారు. రాయలవారి దక్షిణహస్తం రాణిగారి చుబుకాన్ని సుతారంగా స్పృశించింది. "ఆ తాకిడికి చిన్నాదేవి శరీరం ఒక్కసారిగా జలతరంగిణిలా జివ్వుమంది. కోటి వీణలు ఒకేసారి కదన కుతూహల రాగాన్ని వినిపిస్తున్నట్లుగా ఉంది. ఆ స్పర్శ ఆమెకు కొత్త కాకపోయినా ఆ స్పర్శ మాత్రం ఎప్పుడూ నూతనంగానే ఉంటుంది". ఇలా ఈ దంపతుల ఆలోచనలు శృంగార రస భరిత సంపూరితాలు.

శిశిర ఋతువు ముగియడంతో వసంత ఋతువు కోయిలై కూస్తోంది. ఈ ఋతువర్ణన, రాయలవారి సభా వర్ణన రసరాజుగారు తీర్చిదిద్దిన వర్ణనా సౌందర్యాన్ని కొత్త కోణంలో దర్శించవచ్చు.

"చెట్లు చిగురుటాకుల్ని కప్పుకుంటూ ముగ్ధ

మనోహరంగా నవ్వుతున్నాయి. కుప్పలు తెప్పలుగా విరిసిన పూలతో తోటలన్నీ కీర్తి పరీమళాల్ని దశదిశలా వెదజల్లుతున్నాయి. ప్రకృతి మొత్తం చైతన్యంతో కళకళ లాడుతోంది".ఇది ప్రకృతి శోభ.

రసరాజు వర్ణించిన రాయలవారి సభా వర్ణన పరిశీలిద్దాం. "ఆ రసానంద వేళలో విజయోత్సవ సభ ప్రారంభం కావడానికి మరికొంత సమయం మాత్రమే ఉంది. మంత్రులు, సామంతులూ అటూ ఇటూ కొలువుదీరి ఉన్నారు. ప్రక్కనే సైన్యాధిపతులు. అష్టదిగ్గజ కవులు సరేసరి. వారందరూ పుంభావ సరస్వతులై, తేజోమూర్తులై అక్షర తేజస్సుతో ఉట్టిబడుతున్నారు. గాయకులు, నటులు, నర్తకీమణులు, చిత్రకారులు వంటి లలిత కళలకు సంబంధించిన వారందరూ ఆ కొలువు కూటానికే తోరణాల్లా భాసిస్తున్నారు. నిర్ణీత ప్రదేశాల్లో ప్రజానీకం కూర్చుని ఉన్నారు. మంగళ తూర్యనాదాలు, జయ జయ ధ్వానాలు మిన్నంటునట్లు మ్రోగుచుండగా, గౌరవార్ధం అందరూ లేచి ఉన్న వేళలో అప్పాజీ వెంట రాగా, రాణులతో వేంచేసిన శ్రీకృష్ణ దేవరాయలువారు తమ సింహాసనాన్ని అధివసించారు". ఈ మధ్యనే జరిగిన యుద్ధంలో విశేష వీరత్వం ప్రదర్శించి, విజయానికి కారకులైన వారిని సన్మానించే అందమైన సభా వర్ణన మనం గమనించాము. రసరాజు మలచిన వర్ణన తీరులు గమనించాము.

సంభాషణ సౌందర్యం :

కథలో కొన్ని పాత్రలతో మాటలు పలికించడం సామాన్య విషయమే. కానీ రెండు పాత్రలకు నిర్వహించే సంభాషణలో కథకుడు పాఠకుల్లో ఆసక్తి, అనురాగాలు రేకెత్తించేలా కథ రాయడం రసరాజు నేర్పు. ఆ సంభాషణ సౌందర్యాన్ని పరిశీలించడం ప్రస్తుత కర్తవ్యం.

చిన్నమదేవి మందిరంలో ప్రవేశించిన రాయలవారికి, ఆ దేవేరి అనురాగం ఉట్టిపడేలా మాట్లాడుతుంది. రసిక చక్రవర్తి అయిన రాయలవారు సమయోచిత చమత్కారాలతో మాట్లాడారు. ఆ విధానం గమనిద్దాం.

రాయలవారు సాహితీ సమరాంగణ సార్వభౌమములే కాదు- రసిక చక్రవర్తులు కూడా. అప్పటికే అందాలరాణి చిన్నాదేవి ఆ శయ్యామందిరంలో రాయలవారి మగసిరి కోసం ఎదురు చూస్తోంది. "దేవిగారి కంటి మీదకి కునుకే రావడంలేదేమో" రాయలవారు చిన్నా దేవివైపు సరసనేత్రలై చూశారు. "మన ప్రభువులు దయచూపినదే..." అంటూ ఆమె ఇంకా మాట్లాడుతుండగానే రాయలవారి దక్షిణ హస్తం రాణిగారి చుబుకాన్ని సుతారంగా స్పృశించింది. ఆ తాకిడికి చిన్నాదేవి శరీరం ఒక్కసారిగా జలతరంగిణిలా జివ్వుమంది. కోటి వీణలు ఒకేసారి కదన కుతూహల రాగాన్ని వినిపిస్తున్నట్లుగా ఆ స్పర్శ ఉంది. ఆమెకు ఇదేమీ కొత్త కాకపోయినా ఆ స్పర్శ మాత్రం ఎప్పుడూ నూతనంగానే ఉంటుంది. "చలి చలిగా ఉంది కదూ"! అంటూ మాటలతోనే మదన తాపం రెచ్చగొడుతూ రాయలవారు అన్నారు. "రవిచంద్ర నేత్రులు మీరుండగా ..." చిన్నాదేవి పతి దేవుని కళ్ళలోకి సిగ్గుతో చూస్తూ, పలికిన అసంపూర్ణ వాక్యమిది. "ఎంత కవితాత్మకంగా మాట్లాడావు దేవీ! మా కౌగిలి చలికాలంలో వేడిగాను - వేసవిలో శీతలంగానూ ఉంటుందని కదూ నీ కవి భావం. ఆ రెండూ విష్ణుచక్షువులు. ఈ ప్రభువులు అలా విష్ణువుతో పోల్చడంలో కూడ ఎంతో ఔచిత్యాన్ని పోషించావు...." అలా పలుకుతూ రాయలవారు ఆమెకు మరింత చేరువయ్యారు. ఈ దంపతుల తియ్యని సంభాషణలు పాఠకుల మదిని పులకరింపచేస్తున్నాయి.

శైలీ విన్యాసం :

చారిత్రక నేపధ్యాన్ని సూచించే కథే, అయినప్పటికీ రాయలవారు చిన్నాదేవితో మాట్లాడే సరస సల్లాప మాటల నిర్మాణ శైలి పాఠకులను అవిశ్రాంతంగా చదివింపచేస్తుంది. సొగసైన పదాల పొందిన ప్రణయ రస కావ్య నిర్మాణ చాతుర్యంతో అర్ధరాత్రి పలికిన రాజ దంపతుల మాటలు పాఠకుల మనసులను చెదర నీయవు. రాయలవారిలో రతిరాజు ఆపాదమస్తకం, అణువణువునా రాణి చిన్నాదేవిని ఆవరించి ఉన్నాడు. ఆ

సమయంలో శయనమందిరానికి సమీపంలోని గంట ఆ అర్ధరాత్రి మ్రోగడంతో రాజదంపతులిద్దరూ ఉలిక్కిపడ్డారు. ప్రభువులవారికి నమ్మిన బంటైన సూరప రాజు మాటల్లో రామరాజభూషణకవి రాజ దర్శనాన్ని కోరుతున్నట్లు తెలియజేసారు. సూరపరాజు వినయ పూర్వక మాటలపొందిక ఈ కథలో కొసమెరుపు.

''ఏలినవారు మీరు! క్షమియింపగ వేడెద ...'' అని చేతులు జోడించి రాయలువారికి అత్యంత విలువైన దేశ రక్షణ విషయాన్ని ప్రస్తావించాడు కవి. ఇటువంటి కీలక సమయాల్లో కూడా రాజావారు కవులపట్ల అంత ఆదరణ, ఆదర్శాన్ని ప్రదర్శించడం కవిగారిని ఆశ్చర్యచకితుల్ని చేసే శైలీ విన్యాసానికి ఉదాహరణ. దేశ రక్షణ కోసం తన ఆరోగ్యాన్నీ లెక్కచేయక జోరు వానలోనూ, రాయలువారిని సమీపించి, విలువైన సమాచారాన్ని భట్టుమూర్తి కవి, ప్రభువుకు అందించారు. ఇది అత్యంత రహస్య సమా చారం. దీనికి గుర్తింపుగా ఆ సభా వేదికలో భట్టుమూర్తికి రాయలువారు చేసిన సన్మానం. కథ నడపడంలో రసరాజు పోషించిన శైలీ విన్యాసం చదువరులకు ఆసక్తి కలిగి స్తుంది. వికటకవి సంభాషణ చమత్కార శోభ, అష్టదిగ్గజ మాంగల్య కళానిధి ఏర్పాటు, అల్లసాని పెద్దన విలువైన సూచనతో రాయలువారిని కూడా కలుపుకుని మాంగళ్య కవితా నవ నిధిగా మార్పుచేయడం వంటి ఆలోచనలు, కథా కథన శైలీ శిల్పానికి వన్నెతెచ్చేవే కదా

భాష సౌందర్యం :

కథలంటే ఇష్టపడని తెలుగువారుండరనేమాట అత్యుక్తి కాదు. తెలుగు భాషలో కథాకథన శైలిని అల వరచుకున్న తక్కువమంది కథకుల్లో రసరాజు ఒకరు. ఈ కథలో రాయలువారిని ''రవిచంద్ర నేత్రులు మీరుండగా...'' చిన్నాదేవి పతిదేవుని కళ్ళల్లోకి సిగ్గుతో చూస్తూ పలికిన అసంపూర్ణ వాక్యమిది. ''ఎంత కవితాత్మకంగా మాట్లాడావు దేవీ! మా కౌగిలి చలి కాలంలో వెచ్చగానూ, వేసనిలో ఉంటుందని కదూ నీ కవిత హృదయం''. పైగా ఈ రెండు విష్ణు చక్షువులు. ఈ ప్రభువును అలా విష్ణువుతో పోల్చడం రసరాజు పాటించిన ఔచిత్యం ఎంతో బాగుంది. ''రాజా వారితో ఉన్న ఔచిత్యం, సంస్కారం, ఆదరం, ప్రసంగాభిలాష, ఎంతో గొప్పవి'' అని అప్పాజీ నోటి వెంట వెలువడిన మాటలు ప్రత్యక్షర సత్యాలు, కథ కొనసాగించడంలోను, పదప్రయోగ దక్షతలోను, సందర్భోచిత భాషా సౌందర్యా నికి నికషోపలం. రసరాజు కథలోని పాత్రలకు భాషను అనుసంధించడంలో దిట్ట.

పదేళ్ల క్రితమే విజయదశమి ఉత్సవాల్లో మహామంత్రి తిమ్మరుసు మరోకవి రామరాజ భూషణుడు ఇరువురు మాత్రమే ఏ సమయంలోనైనా రాయలువారిని కలుసుకోగలిగే, అత్యంత విలువైన గౌరవ ప్రవేశపత్రాన్ని ప్రభువులు అనుగ్రహించారు. అసలీ ప్రవేశ పత్రాలు ముళ్ళకిరీటాలు వంటివి. వినియోగంలో ఏ మాత్రం అనౌచిత్యం దొరలినా, ఎంతటివారలైనా శిక్షార్హులే. అందుకే ఈ కథానిక నిర్వహణలో రసరాజు ప్రతీచిన్న విషయాన్నీ ఔచితీ సమంచితంగా తీర్చిదిద్దారు. ఇది తెలుగు కథా ప్రవంతికి మకుటాయమానమైంది. రామరాజభూషణ కవికి కానుకగా ప్రభువులవారు ఐదువేల తులాల బంగారాన్ని కానుకగా ఇవ్వగా ,పెద్దన పెద్దిరికపు సూచనలతో మాంగళ్య కవితా నవనిధిగా నామీకరణ మార్పు జరిగింది. అస్తవ్యస్తంగా రూపొంద వలసినదాన్ని క్రమపద్ధతిలో రూపొందించడంపట్ల రాయలువారు అనుమోదించారు. నవనిధి అనే పేరు శ్లేషాలంకార శోభితం. రాయలవారితో తొమ్మిదిమంది కవులుకాగా, క్రొత్తనిధి అనే మరో పేరు. పెద్దనకు పెద్దరికాన్నిచ్చిన రాయలవారి సాహితీ ప్రసన్నతకు ఈ సంఘటన మచ్చుతునక. ఇలా శ్లేషశోభిత సౌందర్య భరితమైన భాష సొబగులకు ఈ కథ ఆలవాలం.

కొంగ్రొత్త సామెతలు రూపొందించడంలో రసరాజు కలం పదునుదేరింది. ''శృంగారానికి చలి దోహదం చేస్తుంది తప్ప ఎటువంటి అవరోధాల్ని కలిగించదు. రాయలువారు సాహితీ సమరాంగణ సార్వభౌములేకాదు-

రసిక చక్రవర్తులు కూడా. చిన్నాదేవి రాయలవారిని స్పృశించడం, కోటి వీణలు ఒకేసారి కదన కుతూహల రాగాన్ని వినిపిస్తున్నట్లుగా ఉంది. రవి కాననిచో కవిగాంచునే కదా! '' ఇలాంటి సామెతలు పూలు నవ్విన కాలం అనే కథలో సంప్రదాయ బీజాల్లా విస్తరించి ఉన్నాయి. వీటిలో కొన్ని సామెతలు అలంకార శోభితాలు. రోషాగ్నులువంటి సమాసాలు ఈ కథలో అక్కడక్కడ చూడగలం. అష్టదిగ్గజాలకు సంబంధించిన కథ కావున, కవుల మాటలు కొన్ని పద్యాల ధోరణితో మలచడం కథకుని భాష సౌందర్య నిర్వహణకు పతాక వంటిది.

శీర్షికా వైభవం :

పూలు నవ్విన కాలమనే ఈ కథ బహుమతి పొందడానికి తగినదే. వసంత శోభకు ప్రకృతి పులకించి మల్లెలవంటి తెల్లని పూలు సమాజాన్ని పరిమళింప జేస్తాయి, పరవసింపజేస్తాయి. రామరాజభూషణ కవిని వసంత ఋతువులోనే సన్మానించడం, తెనాలి రామ కృష్ణుడు, అల్లసాని పెద్దన వంటి మహాకవుల మాటలకు విలువనివ్వడం లాంటి మంచి సంప్రదాయ విషయాలకు ఈ కథ నెలవు. తమ ప్రభువును, రాజ్యాన్ని రక్షించు కోవడానికి, తన అనారోగ్యాన్నీ పట్టించుకోకుండా రామ రాజభూషణుడు నెరపిన తెగువ ప్రశంసనీయం. ఇలా ఎన్నో రకాల శుభసూచకాలకు ఈ కథ నిలయం. రకరకాల పూలకు ఆలవాలమైన ప్రకృతి పులకరింతలకు , కోయిల కుహూరవాలకు ఆలవాలం కావున పూలు నవ్విన కాలం అనే శీర్షిక ఈ కథకు పెట్టడం ఎంతో సముచితం. కథకుడు రసరాజు కలంనుండి సుమారుగా 65 కథలకు పైగా వెలువడ్డాయి. తెలుగు కథా జగత్తులో రసరాజు ముందువరుసలో పేర్కొనదగినవారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'అత్తలందు మా అమ్మ వేరయా' కథానుశీలనం – ప్రకృతి జీవన విధానం

– కుడకళ్ల రాజేశ్వరి, ఫ్లాట్ నం. 102, రాజహంస గెలాక్సీ అపార్ట్‌మెంట్, రుద్రంపేట బైపాస్, అనంతపురం.

డి. నాగజ్యోతి మురమళ్ళ 'అత్తలందు మా అమ్మ వేరయా అనే కథలో ఆధునిక కాలంలో యాంత్రిక జీవనం గడిపే దంపతులను (కొడుకు, కోడల్ని) ప్రకృతికి విరుద్ధంగా నడచుకోకుండా వాళ్ళను తనదైన శైలిలో అత్త భంగ్యంతరంగా మార్చుకున్న విధానాన్ని చక్కగా తెలియజేసింది. ఈ కాలంలో ఉద్యోగరీత్యా కావచ్చు, పట్నం సంస్కృతి కావచ్చు, పట్నం జీవన విధానం కావచ్చు, చాలా మంది ఆప్యాయతలకు, అనుబంధాలకు దూరమవుతూ, మానసిక విశ్రాంతి లేకుండా మానసికోల్లాసాన్ని కలిగించే సాంస్కృతిక కార్యక్రమాలకు దూరమై, కృత్రిమ జీవనవిధానంలో పడిపోయి, భౌతిక, మానసిక, శారీరక రుగ్మతలకు లోనవుతున్నారు. వాటిని అత్త తన చాకచక్యంతో కోడలి మనస్సును ఎలా గెలుచుకొన్నదన్నదే ఇందులోని ప్రత్యేకత. ఇప్పుడు ఈ కథను అనుశీలించి విశ్లేషిద్దాం.

శ్రీ, చైత్ర నూత్నదంపతులు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఇందులో పాత్రలు శ్రీ అమ్మ (చైత్రకు అత్త), పనిమనిషి లక్ష్మమ్మ, పరోక్ష పాత్ర సైదులు (లక్ష్మమ్మ భర్త). పల్లెలో యాంత్రిక జీవనానికి దూరంగా బ్రతికిన తన కొడుకు పట్నం వచ్చాక యాంత్రిక జీవనానికి అలవాటు పడిపోకూడదని తల్లిగా ఆరాటపడింది. శ్రీ వాళ్ళ అమ్మ, ఒక చిన్న ఇల్లు కొనిచ్చి, ఆ ఇంటి పెరట్లోనే పూలమొక్కలు కూడా ఉండేటట్టు జాగ్రత్తలు తీసుకొంది. కొడుకూ కోడళ్ళు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో యాంత్రిక జీవన విధానంలో కొట్టుకుపోయి భార్యాభర్తల అనుబంధం ఎక్కడ దెబ్బతింటుందో అని ఆమె ప్రయత్నించిన తీరు పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. పట్నాల్లో అంత సులభంగా పనిమనుషులు దొరకరు. దొరికినా నమ్మకమైన వాళ్ళు దొరకడం మరీ కష్టం. ఊళ్ళో తమ ఇంట్లో పని చేసిన లక్ష్మమ్మనే కొడుకు శ్రీ ఇంట్లో పని చెయ్యడానికి ఏర్పాటు చేసింది. లక్ష్మమ్మ భర్త సైదులు ఏదో ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఆమె శ్రీ, చైత్రల ఇంటికి మూడు వీధుల చివర ఉంటుంది. రావడానికి దగ్గరే కాబట్టి లక్ష్మమ్మకు ఇబ్బంది కాలేదు.

లక్ష్మమ్మ ఇంటి పనికి రాగానే కొన్ని నిబంధనలు శ్రీ, చైత్రలకు పెట్టింది. అంతకు ముందే పనిమనిషి కోసం వెతికి విఫలమైన వీరికి నిబంధనలు పెద్దగా అడ్డంకిగా అనిపించలేదు. పైగా అమ్మ కూడా లక్ష్మమ్మ ప్రకారం నడచుకుంటేనే పనిచేస్తుంది, లేకపోతే చెయ్యదు అని చెప్పి ఉండటంతో వెంటనే శ్రీ - చైత్రలు ఇద్దరు ఆ నిబంధనలకు ఒప్పుకున్నారు. ప్రొద్దున్నే చైత్ర స్నానం చెయ్యాలి. పూజ చెయ్యాలి. శ్రీ అలా బయటికి పార్కు దాకా వెళ్ళి రావాలి. మార్నింగ్ వాకింగ్ లాంటిదన్న మాట. తర్వాత శ్రీ స్నానం చేసి చైత్ర ఇచ్చిన హారతికి నమస్కరించాలి. ఆఫీసుకి ఇద్దరూ వెళ్ళేముందు భార్య చైత్ర భర్త శ్రీకి ఎదురు రావాలి. ఆఫీసునుంచి వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి గుడికి వెళ్ళి రావాలి. ఆ తర్వాత భోజనం చేసి ఆరుబయట భార్యా భర్తలిద్దరూ వెన్నెల్లో కాసేపు గడపాలి. తర్వాత పరుపులు సిద్ధం చేశాక వచ్చి పడుకోవచ్చు. ఈ పనులు చెయ్యడంలో మొదట వీళ్ళిద్దరూ అయిష్టంగానే చేసినా, అనుబంధం, ఆప్యాయత, ఆత్మీయత మరింత దగ్గర కావడంతో ఇద్దరూ ఆనందానుభూతి చెందారు. గుత్తి వంకాయ కూరను ల్యాప్‌టాప్ ముందర పెట్టుకొని ఏదో పరధ్యానంగా తింటూ ఉంటే లక్ష్మమ్మ 'ఏం బాబూ గుత్తివంకాయ కూర ఎలా ఉంది?' అని అడిగేటప్పటికి అరే! నా కిష్టమైన గుత్తివంకాయ కూరను కూడా రుచి లేకుండా రుచిని ఆస్వాదించకుండా అలానే తింటున్నానేమిటి అని గుర్తు చేసుకొని ఎంత మంచిది లక్ష్మమ్మ అనుకున్నాడు.

ఈ లోపల శ్రీ చెల్లికి పెళ్ళి కుదిరింది. అందరూ వెళ్ళి వచ్చారు. చైత్ర అత్తగారి వెంటే తిరుగుతుంటే అత్త అంటే ఆమెకెంత అభిమానం, ప్రీతి, గౌరవం అని అందరిచేత మెప్పు పొందింది. దీన్ని చూసి శ్రీ చాలా ఆనందపడ్డాడు. చెల్లి పెళ్ళి అయిపోయాక పట్నానికి అమ్మ వచ్చి, కొన్ని రోజులు ఉంది. ఎలా ఉందిరా మీ జీవితం? అని అడిగింది. "అంతా లక్ష్మమ్మ రూల్స్ పుణ్యమేనమ్మా! తనే ఇంత ఆనందానికి కారణం. ఆనందించడాన్ని మాకు అలవాటుగా మార్చింది" అన్నాడు శ్రీ. అమ్మ కొంటెగా నవ్వింది. "ఎందుకమ్మా అలా నవ్వుతున్నావు!" అన్నాడు. "మీకు ఈ మధురమైన జీవితాన్ని పరియం చెయ్యాలనే ఆమెను ఇక్కడ పెట్టాను నేను. ఇప్పటి తరంలా మీరు ఫాస్ట్ లైఫ్‌లో మెటీరియలిస్టిక్‌గా (భౌతికంగా) బతకడం నాకు ఇష్టం లేదురా. మా అంత ఆనందంగా మీరూ ఉండాలి. అదీ ఏ ఆంక్షలూ లేకుండా. లక్ష్మమ్మ చెప్పిన షరతులూ, మాటలూ, పనులూ నేను చైత్రకు చెప్పి ఉంటే అత్తగారి హోదా, ఆంక్షలు తప్ప ఆనందం కనబడక పోయేది. అందుకే మీ భాషలో చెప్పాలంటే మీ సంసార మనే ప్రోగ్రాంకు 'యాంత్రికత' అనే వైరస్ సోకకుండా 'యాంటీవైరస్'గా లక్ష్మమ్మను వాడానురా కన్నా!" అని అమ్మ నవ్వింది. అప్పుడు శ్రీ హర్షాతిరేకంతో అమ్మ ఒడిలో తలదాచుకున్నాడు. "అవురా! అత్తలందు మా అమ్మ వేరయా..' అనుకున్నాడు. పాఠకులకు కూడా అత్తలు అందరూ కొడుకూ కోడలూ అన్యోన్యానురాగాన్ని కోరి, అనుబంధాన్ని చూసి సంతోషించేవాళ్ళే అయితే ఎంత బాగుండునో అనిపించక మానదు - ఈ కథను చదివితే. యాంత్రిక జీవన విధానంలో కొట్టుకుపోకుండా ఉండాలని కూడా ఈ కథ హెచ్చరిస్తోంది. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి పులకించాలని కూడా ఈ కథ చెబుతోంది. అందువల్ల రచయిత్రి డి. నాగజ్యోతి మురమళ్ళను ప్రత్యేకంగా అభినందించాల్సిందే.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వి.ఆర్.విద్యార్థి కవిత్వం - శాంతి ప్రియత్వం

- పాశం శ్రీనివాస్, పరిశోధక విద్యార్థి, తెలుగు డిపార్ట్‌మెంట్, వివేకానంద స్కాలర్ హాస్టల్, కాకతీయ యూనివర్శిటీ, వరంగల్.

విఆర్ విద్యార్థిగా సుప్రసిద్ధుడైన వేలూరి రాములు, వేలూరి నర్సయ్య, కమలమ్మ దంపతుల ఏడుగురి సంతానంలో ఒకరిగా గవిచర్ల గ్రామంలో జన్మించినాడు కాళోజీల స్ఫూర్తితో రచనా వ్యాసంగాన్ని చేపట్టి ''వాని కవిత్వమే అలగ్'' అని వారితోనే అన్పించుకున్నాడు ''కాళోజీ తమ్ములం ప్రజాకీయ వాదులం/ఖచ్చితంగా ప్రజా కవుల జాతి మాది నీతి మాది / అన్యాయాన్ని ఎదిరించిన వాడు మాకు ఆరాద్యుడు'' అని నిక్కచ్చిగా తేల్చి చెప్పినాడు.

వి.ఆర్.విద్యార్థి తన పన్నెండవ ఏటనే సైనికుడిపై తొలి కవితను రాసి సైనికుడిగా జీవితంను మొదలు పెట్టి వందలాది కవితలు రచించినాడు. రచిస్తున్నాడు. 1965, 1971 పాకిస్తాన్, బంగ్లా విమోచన యుద్ధాల్లో మిస్సైల్స్, రాడార్ల విభాగాల్లో ప్రత్యక్షంగా పని చేసి దేశానికి సేవలందించినాడు. విశ్వ కవితల సరసన చేరదగ్గ కవితగా డా॥ ఎన్.గోపి గారు పేర్కొన్న 'అపరిచితులు'' కవితను విద్యార్థి పఠాన్‌కోట రన్వే మీద విమాన రెక్కల క్రింద కూర్చుని రాశారట. ఈ కవిత మీద నియోగి 84 పేజీలతో ఒక పెద్ద విశ్లేషణ రాశారు. 1971 లో యుద్ధ రంగం నుండి తన శ్రీమతికి రాసిన సైనికుడి ఉత్తరం కూడా ఎంతో ప్రాచుర్యం పొందింది.

ప్రపంచం మొత్తం మీద హింస మాత్రమే నిషేధించాల్సిన అంశం అని ప్రగాఢంగా నొక్కి చెప్పే ఈ కవి హింసకు మూలం స్వార్థం అని అది లేకుండా ఉన్ననాడు మానవాళి సుభిక్షంగా ఉంటుందంటాడు. యుద్ధం రకాల్ని వివరిస్తూ ''ఒక యుద్ధం బానిసల దండయాత్ర/పీడితుల తిరుగుబాటు/ఇంకో యుద్ధం నియంతల నిలకడ కోసం దళారుల రక్షణ కోసం'' అంటాడు. ఇంకా,

ఒక యుద్ధంలో / తర తరాలకు తీరని సమస్యలకు
తిరుగులేని పరిష్కారం/నూతన వ్యవస్థ అవిష్కారం
ఇంకో యుద్ధంలో/తర తరాలకూ తీరని సమస్యలు
మానని గాయాల సంధ్యలు/పాత రాతి యుగం జాడలు
ఒక యుద్ధంలో/కవులు జన కంఠమై మోగుతారు
నేల తల్లి చెరవీడే దాకా/త్యాగాల కత్తుల మీద నడుస్తారు
ఇంకో యుద్ధంలో కవులు ఏలిన వారి బాకాలు/
భూమాత ఉక్కు సంకెళ్ళను
తీరు తీరున వర్ణించే గూబలు
(''ఏ యుద్ధం ఎవరి కోసం''-పలకరింత -పుట:84)

ఎయిర్ ఫోర్స్ లో పని చేస్తున్న రోజుల్లో ఆయన భారత దేశంలోని అనేక ప్రాంతాల్లో పని చేశారు. పఠాన్ కోట్, జైసల్మేర్, షిల్లాంగ్, గౌహతి లాంటి సుదూర ప్రాంతాల్లో వాయుసేనలో ఒక సైనికుడిగా పనిచేస్తూ తాను పొందిన అనేక అనుభవాలను, అనుభూతులను కవితల రూపంలో వెలువరించినాడు. ఒక సైనికుడు కవి గావడం చాలా అరుదుగా జరిగే విషయం.

వి.ఆర్ విద్యార్థిలో పసి పిల్లల్లో కనిపించే ఒక స్వచ్ఛమైన అమాయకత్వం కనిపిస్తుంది. ఈ అమాయకత్వమే ఆయన కవితల్లో కుడా కనిపిస్తుంది. సైన్యంలో చాలా కాలం పని చేసి పదవీ విరమణ చేసి ఏవేవో కలలు కంటూ తన స్వగ్రామానికొచ్చిన ఓ మాజీ సైనికుడి కలలు భగ్నమై పోవడాన్ని ''మీ కోసం'' అన్న కవితలో విద్యార్థి ఇలా విశదీకరించినాడు.

'మాకు మాత్రం ఏం తెలుసు చెప్పండి
అసలు శత్రువులు దేశంలోనే ఉన్నారని
అనేక రూపాల్లో అనేక రంగాల్లో

టెర్రరిస్టు మూకలే, మాఫియా గ్యాంగులే
ప్రజా జీవనాన్ని శాసిస్తున్నాయని
స్వాతంత్ర్యానికి సరిహద్దులు గీస్తున్నాయని'

బయటి శత్రువుతో పోరాడి విశ్రాంతి తీసుకుందామని వచ్చిన ఓ మాజీ సైనికుడి ఆవేదన ఇది.

తాను షిల్లాంగ్‌లో చూసిన ఒక దృశ్యాన్ని తన కలం కుంచెతో ఇలా చిత్రించినాడు.

"ఆ వేకువలో
చిగురు లేత ఉష:కిరణం తంతులో
నాజూకుగా నేసిన శాలువా కప్పుకొని
భూతలం మీద పరచుకున్న
తుషార మౌక్తికాల మీద నడిచి వెళ్తూ
చేతనా ప్రపంచంలోకి
నువ్వు"

విద్యార్థి మేఘాలయలో పని చేస్తున్న రోజుల్లో అక్కడి ఓ గిరి కుమారిని ప్రేమించినాడు. పదవీ విరమణ చేశాక ఆమెకు ఈ కవి రాసిన ప్రేమ లేఖ-

ఆ పవిత్ర ధరిత్రి నుంచి
విడదీయ లేని లతానికుంజానివి
ఆ సుందర సరస్సు నుండి త్రెంచలేని సరోజానివి
నిన్ను ప్రేమించాను/అందుకే దురాశ పడలేదు
మాయ మాటలు చెప్పలేదు/నిన్ను నీకే వదలి వచ్చాను
నాగరికపు దోపిడి దొంగలు
మీ కొండల్నీ కోనల్నీ ఆక్రమించారట
ప్రతి పువ్వునీ, రెమ్మనీ దోచుకున్నారట
తేనేటీగనీ, జింక పిల్లనీ, సింహ కిశోరాన్నీ
బంధించారట, నిజమేనా?
నీవెలా ఉన్నావో, ఏమైపోయావోనని అందోళనగా ఉంది"

వి.ఆర్ విద్యార్థి కవిత్వం ఆయన మనస్సులాగే చాలా సూటిగా, సాఫీగా అమాయకంగా, అలంకారాలు, శబ్దాంభికం లాంటి ఆచ్ఛాదనలు లేకుండా సాగుతుంది పాఠకుల్ని ఆప్యాయంగా పలకరిస్తుంది.

తనను గూర్చి తాను తెలుసుకోవాలంటాడు విద్యార్థి. నీతో నువ్వు కవితలో

"ఎప్పుడైనా నిన్ను నువ్వు చదువుకున్నావా!
నీతో నువ్వు సంభాషించావా!
నీకు నువ్వు పరిచయమయ్యావా!
ఇక లోకాన్నేం తెలుసుకుంటావు!

కాలాన్నేం వడబోస్తావు" అంటాడు. నిన్ను నువ్వు తెలుసుకున్నప్పుడే ప్రపంచాన్ని తెలుసుకుంటావని ధ్వని. నిన్ను నువ్వ తెలుసుకుని నీలో ఉన్న చెడును సంహరించుకొని మంచిని పెంచుకోవాలంటే నీతో నువ్వు యుద్ధం చెయ్యాలి. ఈ విషయాన్నే "నాతో నేను" అన్న కవితలో చెప్పాడు.

జీవితంలో
నన్ను నేను గెలవడానికే
కవిత్వమై పలకడం, కథలు చెప్పడం
చిత్రం గీయడం, శిల్పం తొలవడం
నాట్యం చెయ్యడం, స్వర తరంగమై లేవడం
నిరంతరం నాతో నేను యుద్ధం చేస్తూ
గెలుస్తాను, ఓడిపోతాను కానీ గెలవడానికే

సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం మొదలైన కళలన్నీ ఆయా కళాకారులు తమలోకి తాము చూసుకోవడం వల్లనే తమతో తాము యుద్ధం చేయడం వల్లనే ఉద్భవించాయని ఈ కవితలో ధ్వని.

"చింతనుడు" అనే కవితలో కుడా ఈ అంతుర్ముఖీనతే దర్శనమిస్తుంది. ఈ కవి ఆరాటమంతా కవితా జలపాతంగా మారాలనే జనం గుండె కనుమల్లో పరిప్లవించాలనే. "ప్రశస్తం" అనే కవితలో సైతం ఈ తనలోకి తాను చూసుకునే గుణమే కనిపిస్తుంది.

"ఇప్పుడు నువ్వొక
నిరంతర కల్లోలినివి!
అలల దెబ్బతో
నీ రూపం బీటలు వారుతోందా!
సుడుల గునపాలతో

నీ పదముద్రలు పెకిలించబడ్తున్నాయా
ఆందోళనా జ్వాలలు
బడ బాగ్నిలా
నిన్ను చుట్టు ముట్టాయా? భీతిల్లకు" అంటూ తనకు తాను ధైర్యం చెప్పుకొంటూ సవాలక్ష ఏజెన్సీలు నమ్మకాన్ని పంచి నిన్ను నిద్రపుచ్చడానికి దుకాణాలు తెరుచుకు కుర్చున్నాయి. వాటి వైపు కన్నెత్తకు అంటూ యే ఐడియో లజీకి లొంగక నీకై నువ్వు సత్యమేమిటో తెలుసుకొని విశ్వ మానవుడిగా ఎదగమని ఈ కవితలో విద్యార్థి తనకు తాను చెప్పుకొన్నట్టు కన్పిస్తుంది. కవి అయినవాడు సహలోకాల్ని, అంతర్లోకాల్ని, అంతరాంతర లోకాల్ని వది లించుకోవాలని, సకలానికి - అంటే అన్ని లోకాలకూ సంబంధితుడు కావాలని కూడా కవి చెబుతున్నాడు.

ప్రకృతిలో మమేకం కావడం ఏ కవికైనా ప్రియమైన విషయమే. అమెరికాలోని ఎన్నో అద్భుతమైన సౌందర్యా లతో విలసిల్లే ప్రదేశాల్ని చూసిన విద్యార్థి ఆ సౌందర్యాన్ని తన కవితల్లో బంధించడానికి ప్రయత్నం చేశాడు.

మానవ జీవిత రహస్యాన్ని నిర్వహించి సూత్రబద్ధం చేసిన తాత్వికుడుగా విద్యార్థి తన కవితల్లో దర్శన మిస్తారు. సమాజాన్ని నిండుగా ప్రేమించే ఈ కవి కష్టా లలో మగ్గుతూ కన్నీటి జడులలో నిలువెల్లా తడవడం లోని రహస్యాన్ని ఛేదించడానికి సముద్రపు నీలి ఎడారుల్లో, ఎడారి వెన్నెల సముద్రాల్లో, అడవుల్లో ఏకాంత జల పాతాల్లో మోగుల మూగనోములో..... ఇంకా ఎక్కడెక్కడో స్పష్ట్యంతరాలను సైతం వదలకుండా వెతికారు.

చివరకు తన సమీపంలోనే కనుగొని-
"ఓ కవిత రహస్యామా!
నువ్విక్కడుంటావని
ఈ రాళ్ళు కొట్టే తండ్రి
ఘర్మ జలాల్లో దాగున్నావని
కలుపు తీసే తల్లి
క్షుధాగ్ని చింతనలో దాగున్నావని
విమల సహజీవన సూత్రంలో దాగున్నావని
ఇంకా వీళ్ళకు తెలిసేదెప్పుడో" (జీవిత రహస్యం - పలకరింత) అంటూ చచ్చామని నమ్మించడానికి వెల్లకిలా తిరిగి పడుకొన్న చేపల్లాంటి అతి తెలివి గాళ్ళ ప్రవర్తనకు విస్తుపోతూ దళారులు, వ్యాపారులు, పాలకులు చేస్తున్న ఉమ్మడి కుట్రలను అమాయక ప్రజలు ఎట్లా ఎదుర్కొం టారో, చీమల్లోని సహజీవనాన్ని ఐకమత్యాన్ని ఎలా అలవరుచుకొంటారో లక్ష్యం నెరవేరేవరకు గమనం ఆపని వజ్ర సంకల్పం గురించి వీళ్ళకు తెలిసేదెప్పుడోనని వెంటనే తెలిస్తే బాగుండునని తపన పడతాడు. వారు మోస పోతున్న తీరుకు తల్లడిల్లుతాడు. చివరగా కరుణ రసార్ద్ర జలపాతమై ప్రవహిస్తూ మనలనందరినీ ముంచెత్తుతారు. ఒక భావశకలపు ఒరిపిడి నుండి తేరుకోకముందే మరో భావ శకలంతో బలంగా ఢీకొడతారు.

విద్యార్థి నీటి బుడగ జీవితమే అంటూ జిడ్డు కృష్ణ మూర్తి ఆత్మ జ్ఞానాన్ని ఔపోసన పట్టిన జ్ఞానంతో ఎన్నో కవితలు రాశాడు. జీవితాంతం పోరాడాల్సి వస్తే రానీ, రాలిపోవాల్సి వస్తే రానీ, జీవితానికర్థం స్వేచ్ఛే కదా అని స్వేచ్ఛా బావుటాని ఎగురవేశాడు. "జీవితం" అనే కవితలో జీవితమంటే ఏమిటో తేటతెల్లం చేశాడు.

"నువ్వనుకొనే,
నవ్వుల వెన్నెలా కాదు;
నేననుకొనే,
బాధల చీకటీ కాదు;
జీవితం!
అంచనాలకు మించిన
అతీతమైన అనుభవం" అనటం ద్వారా జీవితంలో కష్టసుఖాలు ఏవీ శాశ్వతం కాదని పరిభ్రమణం చెందు తుంటాయన్న సత్యాన్ని తెలియజేశాడు.

ఒక ఉద్యమ కవిగానో, విప్లవ కవిగానో ముద్ర వేయించుకోవటం ఇష్టపడని వి.ఆర్. విద్యార్థి మానవీయ సమాజంలో తప్పిపోయిన శాంతి గురించి, చేజారిపోతున్న విలువల గురించి ఆరు దశాబ్దాలుగా కలంతో యుద్ధం చేస్తూనే ఉన్నాడు.

ఏడు సంపుటాలలో 400 పై చిలుకు ఉన్న వి.ఆర్. విద్యార్థి కవితలలో విశ్వ జనీనత, సర్వమానవాళి సమానత్వ ఆవశ్యకతా గుర్తింపు, తెలంగాణ స్థానికత ప్రాధాన్యత చాటింపు కన్పిస్తాయి. వి.ఆర్.విద్యార్థి కవిత్వాన్ని చదవటం కాదు, అధ్యయనం చేయండి. విద్యార్థిని "విశ్వకవి" గా అంగీకరిస్తారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. విద్యార్థి కవిత్వం (వి.ఆర్.విద్యార్థి కవితా సర్వస్వం)
2. అద్దంలో విద్యార్థి (వి.ఆర్.విద్యార్థి కవితా సమాలోచన)

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విద్యాలయాల్లో ప్రస్తుత తెలుగు భాష పరిస్థితి

- ఆచార్య గెంజి అరుణ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్, ఎస్.వి.యూనివర్సిటీ, తిరుపతి.

ఒకప్పుడు విద్య వేరు ఇప్పటి విద్య వేరు. ఆనాటి కాలం విద్య గురుకులాల్లో ప్రారంభమైంది. ఆధునిక కాలంలో పాఠశాలలు ఏర్పడిన తర్వాత కూడా బడికి పంపడానికి పిల్లలను ఎవరూ ఇష్టపడేవారు కాదు. అదీ ఆడపిల్లలనైతే అస్సలు చదివించేవారు కాదు. తెలుగులో పేరు రాయడానికి వస్తే చాలు అని అనేవారు. మగపిల్లల నైతే ఊరిలో ఎంతవరకు పాఠశాల ఉంటే అంతవరకు చదివించేవారు. చదువుకోడానికి స్తోమత లేక, చదవాలన్న ఆశ ఉన్నా ఆ ఆశను చంపుకొని పాలం పనులకు వెళ్లేవారు. ఇంటిలో సంతానాన్నంతా చదివించే స్థోమత ఆ రోజుల్లో అందరికీ ఉండేది కాదు. ఏ కొద్దిమంది మాత్రమే మహా కష్టంమీద చదువును కొనసాగించేవారు.

ఆ కాలంలో గవర్నమెంటు పాఠశాలలు అధికశాతం తెలుగు మాధ్యమంలో ఉండేవి. అందరూ తెలుగు మాధ్యమంలోనే చదువుకొనేవారు. తర్వాత ఆంగ్ల విద్యా బోధనను ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించాయి.

భాష అనేది ఒకరి అభిప్రాయాలు మరొకరికి వ్యక్తం చేయడానికి ఉపయోగపడుతుంది. ఇరువురి మధ్యలో ఒక వారధిగా నిలుస్తుంది.

తెలుగుభాషలో అక్షరాలు 56. ఏ భాషలో లేనన్ని అక్షరాలు మన తెలుగు భాషలో ఉన్నాయి. ద్రావిడ భాషల్లో లిపి ఉన్న భాషల్లో ప్రముఖమైంది తెలుగు భాష. తెలుగు భాషకు సౌందర్యం ఎక్కువ. అలాగే మాధుర్యం కూడా ఎక్కువే. పరాయి భాషవారు కూడా సులభంగా నేర్చుకొనే భాష మన తెలుగు. తెలుగు భాషలో పదాలు అన్నీ అచ్చుతో ముగుస్తాయి. అందుకే తెలుగును ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని అన్నారు. అలాగే 'దేశభాషలందు తెలుగు లెస్స' అని అన్నారు. మరొకరు భారతదేశ భాషలన్నింటిలోకి తెలుగు భాష సౌందర్యభాష అని అన్నారు.

విద్యాలయాల్లో అయితే భాష యొక్క ప్రాధాన్యం ఒకప్పుడు కాస్త తగ్గిందనే చెప్పవచ్చు. తెలుగు భాషకు బదులు సంస్కృత భాషను, హిందీ భాషను ద్వితీయ భాషగా తీసుకొనేవారు. కాని ఇప్పుడు మాతృభాషపైన మమకారం పెరుగుతూ వస్తుంది. ఆంగ్లభాషలో చదివినా తెలుగువారు వారి తెలుగుభాషను ద్వితీయభాషగా నేర్చుకోవడం గమనార్హం. ఇది శుభపరిణామమనే చెప్పవచ్చు.

ఇక విద్యాలయాల్లో తెలుగు చదువుకొన్న వారికి ఉద్యోగాల విషయంలో చూస్తే ఎం.ఏ.లు, పిహెచ్.డి. లు చేసినవారు ఏ కొద్దిమందికో ఆ భాషలో ఉద్యోగాలు వస్తున్నాయి. పండిట్ టీచర్లుగా, లెక్చరర్లుగా కొంతమందికి గవర్నమెంట్‌లో ఉద్యోగాలు రాగా మరికొంతమంది ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్నారు. కాని కొద్దిమందికి మాత్రమే ఈ అవకాశం దొరుకుతుంది. మరికొంతమంది చదువుకు సంబంధం లేని ఉద్యోగాలు చేసుకొంటున్నారు.

ఒక్క తెలుగులోనే చదువుకొంటే వారి భవిష్యత్ ప్రస్తుత పరిస్థితుల్లో అగమ్యగోచరమే. అందుకే తెలుగు భాషతోపాటుగా ఆంగ్లభాషలోనూ ప్రావీణ్యం సాధించాలి.

అలాగే సాంకేతిక రంగం వైపు కూడా కాస్త మొగ్గు చూపాలి. ఎందుకంటే టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థినీ విద్యార్థులకు భాషతో పాటుగా సాంకేతిక పరిజ్ఞానం పై కూడా తర్ఫీదు ఇవ్వాల్సిన అవసరం విద్యాలయాలపై ఉంది. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో కంప్యూటర్ ల్యాబ్స్‌లో కూడా శిక్షణ ఇస్తున్నారు. అలా శిక్షణ ఇవ్వడం వల్ల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొంటారు.

మాతృభాషను ప్రేమించాలి. పరాయిభాషను గౌరవించాలి. మాతృభాషతోనే అన్ని పనులు చేసుకోలేము.

పెద్ద పెద్ద చదువులు చదువుకోవాలన్నా లేదా విదేశాలకు వెళ్లి చదువుకోవాలన్నా మనకు ముఖ్యంగా ఆంగ్లభాష రావాల్సి ఉంటుంది.

అలాగే అనేక ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు మాతృభాషతోపాటుగా జాతీయ, అంతర్జాతీయ భాషను కూడా మనం నేర్చుకోని ఉండాలి. అప్పుడే విజయవంతంగా దాన్ని పూర్తి చేస్తాం.

ఇక్కడ ఒక ఆశ్చర్యం ఏమిటంటే తెలుగువారు, తెలుగు మాట్లాడేవారు, వారి మాతృభాష తెలుగు అయినాసరే ఎవరయినా తెలుగులో ఎం.ఏ. చదువుతున్నాం, తెలుగులో పిహెచ్.డి. చేస్తున్నాం అంటే చాలా చులకనగా చూస్తారు. అలాంటి భావన ఉండకూడదు. ఎవరి సబ్జెక్టు వారికి గొప్ప అంతే కదా! ఈజీగా చదివేయవచ్చు అని అంటారు. దిగితే గాని దాని లోతు తెలియదు కదా! ఏ సబ్జెక్టు అయినా దానికి తగిన విలువ దానికి ఉంటుంది. ఆ విలువను గుర్తించాలి అంతే.

గవర్నమెంటు పాఠశాలల్లో తప్ప మిగిలిన ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలల్లో విద్యార్థులు తెలుగులో మాట్లాడకూడు. తెలుగులో మాట్లాడితే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షలు విధించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎందుకంటే అందరూ ఇంగ్లీషు భాష నేర్చుకోవాలని. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మా పిల్లవాడు ఇంగ్లీషులో బాగా మాట్లాడాలి. దానికి తగిన తర్ఫీదు ఇవ్వండి అని టీచర్లకు చెప్తారు.

కొన్ని విద్యాలయాల్లో అయితే తెలుగు సబ్జెక్టును తీసుకోవడం లేదు. ఉన్నా చాలా తక్కువమంది ఉంటున్నారు. దానికి కారణం భవిష్యత్‌ను ఆలోచించి వేరే సబ్జెక్ట్ తీసుకోవడమే.

తెలుగు భాషపైన మక్కువ ఏర్పడడానికి పిల్లలకు కథలను చెప్పించాలి. పాటలను పాడించాలి. వారితో కథలను కూడా చెప్పించాలి, రాయించాలి. పిల్లలకు నచ్చిన కథను రాయమని చెప్పడం వల్ల పిల్లల్లో ఆలోచనా శక్తి పెరుగుతుంది. అలాగే సృజనాత్మక శక్తి పెరుగుతుంది. అలాగే కొన్ని పదాలు మాట్లాడుకొనేటప్పుడు వచ్చే అనుమానాలను నివృత్తి చేసే విధానం

- ♦ వడదెబ్బ - సన్‌స్ట్రోక్
  వడ - తిప్పడం, తిరగడం, తినే వస్తువు
  దెబ్బ - వేటు, గాయం
- ♦ అమ్మకాలు - అమ్మడం
  అమ్మ - తల్లి
  కాలు - శరీరంలో ఒక భాగం లేదా 1/4 భాగం
- ♦ పెట్టు - ఒక పెట్టు వేయరా (దెబ్బ, వేటు) అని అంటాం.
  పెట్టు - ఒక చోట ఉంచడం
- ♦ పెట్టు / కొను = వేసుకోవడం
  పెట్టు / కొని = చెవిదిద్దులు పెట్టు / కొని వెళ్లింది.
  పెట్టు - దెబ్బ
  కొను - డబ్బుపెట్టి కొనడం
- ♦ పెట్టు / బడి - మొదటగా పెట్టే ధనం పెట్టడం, వేటు, దెబ్బ
  బడి - పాఠశాల, విద్యాలయం
  పెట్టుబడు - పెట్టుబడి ఎంత పెడుతున్నావు పెట్టుబడికి ఏమి కొంటున్నావు
  మేలు / కొను
  మేలు అంటే మంచి
  కొను అంటే కొనడం
  మేలుకొను - నిద్ర లేవటం, కష్టం నుంచి కోలుకోవటం

రెండు వేరు వేరు అర్థాలు కలిగిన పదాలు కలిపి ఒక కొత్త పదంగా ఏర్పడి కొత్త అర్థాన్నిచ్చే పదాలను శబ్ద పల్లవాలు అని అంటారు.

ఇలాంటి పదాలపైన విద్యార్థులకు చాలా శ్రద్ధ, ఆసక్తి ఉంటుంది. వాటిని విడగొట్టి అర్థాలను చెప్పి కలిపి అర్థాన్ని చెప్పడం వల్ల కొత్త అర్థం రావడం వారికి ఆశ్చర్యానికి

గురి చేస్తుంది. అలాగే విద్యార్థులకు తెలుగు భాషలో పట్టు రావాలంటే ప్రయివేటుగా చదువు చెప్పించవచ్చు.

అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో స్థిరపడిన తెలుగు వారు వారి పిల్లలకు మాతృభాష పోకూడదని ఆన్‌లైన్ ద్వారా తెలుగుభాషను నేర్పుతున్నారు. తెలుగు రావాలని ఇంటిలో తెలుగులోనే మాట్లాడుతారు. అలాగే ఒక అమెరికాలో స్థిరపడ్డ ఒక తెలుగు కుటుంబం వారి పిల్లలకు తెలుగు బాగా రావాలని 'యూ' ట్యూబ్‌లో ఒక తెలుగు చానల్‌ను ప్రారంభించి వారి పిల్లలతో తెలుగులో అనేక విషయాల గురించి మాట్లాడిస్తున్నారు. అలా మాట్లాడడం వల్ల వారికి తెలుగుభాష బాగా వస్తూ ఉంది అని తెలియజేశారు.

ఇంకా తెలుగుభాష రావాలి అంటే ఒక విద్యాలయాల పాత్రే కాదు, తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ఉంది. భాష అనేది మాట్లాడేవారు ఉన్నంతవరకు అది సమసిపోదు. మన పిల్లలను తెలుగులోనే మాట్లాడించాలి మొహమాటానికి పోయి పరాయి భాషలో మాట్లాడ కూడదు. అవసరమైన చోట మాత్రమే పరాయిభాషలో మాట్లాడాలి.

తెలుగుభాషకు ప్రాచీన హోదా కావాలని తెలుగువారు అనుకొన్నట్లు తెలుగుభాషలో చదువుకొన్న వారందరికీ మంచి భవిష్యత్తు ఉండేవిధంగా ప్రభుత్వాలు పని చేయాలి.

విద్యాలయాల్లో తెలుగును ఐచ్ఛిక పత్రంగా ఎంచుకొనేటట్లు చూడాలి. దానివల్ల తెలుగు చదువుకొన్న కొందరికైనా జీవనభృతి కలిగే అవకాశం ఉంటుంది.

సామాజిక మాధ్యమాలు ఒక విశాలమైన వేదిక లాంటివి. కాబట్టి ఎవరి ప్రతిభ వారిది. దానికి తగ్గట్టుగా తెలుగు భాషాప్రావీణ్యతను సామాజిక మాధ్యమాల ద్వారా చూపించుకొంటున్నారు.

అలాగే తెలుగు భాషకు సంబంధించిన అనేక వీడియోలను కూడా తెలుగు నేర్చుకోవాలి అనేవారికి ఉపయోగపడే విధంగా ఉన్నాయి. బతుకుతెరువు కోసం చాలామంది ఈ సామాజిక మాధ్యమాలను ఎంచుకొని ఉన్నారు.

తెలుగు భాషను బతికించాలంటే తెలుగువారు తెలుగులోనే మాట్లాడాలి.

ఆధారగ్రంథాలు :

1. తెలుగు దినపత్రికల ప్రకటనల్లో భాష వాడుక - డా॥ సి. రాజారాం.
2. ఆడుతూ పాడుతూ తెలుగు నేర్చుకుందాం - శ్రీ ఖాదర్ బాషా.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వీరేశలింగం రాసిన జీవిత చరిత్రలు

– ఆర్. బాలసుబ్రమణ్యం, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం.

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో వచ్చిన వచన సాహితీ ప్రక్రియల్లో జీవిత చరిత్ర ఒకటి. బయోగ్రఫి అనే ఆంగ్ల పదానికీ సమానంగా తెలుగులో జీవిత చరిత్ర అనే పదం స్థిరపడింది. స్వీయ చరిత్ర ఆత్మాశ్రయం అయితే జీవిత చరిత్ర పరాశ్రయం. లోకంలో మహాపురుషుల విశిష్టతను అందరికీ తెలియజేయడం కోసి రాసేది జీవిత చరిత్ర. చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, వైజ్ఞానిక, సామాజిక, కళా రంగాల్లో ప్రముఖ పాత్ర నిర్వహించిన వ్యక్తుల జీవితాలను గురించి తెలిపే రచనల్ని జీవిత చరిత్రలు అంటారు. కవులు, రాజకీయ నాయకులు, శాస్త్రజ్ఞులు..ఇలా ఎవరికి సంబంధించిన జీవిత వ్యక్తిత్వాలైనా ఇతరులకు తెలిసేలా మరొకరు రాయడమే జీవిత చరిత్ర. జీవిత చరిత్రలో కల్పనకు తావులేదు. వాస్తవాలను యథాతథంగా రాసేటప్పుడు జీవిత చరిత్రకు ప్రామాణికత ఉంటుంది. తెలుగు నాట జీవిత చరిత్ర ప్రక్రియకు ఆద్యుడు - కందుకూరి వీరేశలింగం.

వీరేశలింగం తలపెట్టిన వితంతు పునర్వివాహ ఉద్యమానికి బసవరాజు గవర్రాజు, మాకర్ల సుబ్బారావు నాయుడు వీరిరువు అన్నింటిలో చేదోడువాదోడుగా ఉంటూ వితంతు పునర్వివాహాల కార్యక్రమాలకు ఆర్థికంగానూ సహాయపడ్డారు. ఈ ఉద్యమంలో కందుకూరికి కుడిభుజంలా ఉండి వెన్నుతట్టి ప్రోత్సహించారు. కందుకూరి గారు నేను ఇలాంటి కార్యాలను చేపట్టడానికి వీరు ప్రధానకారకులన్నారు. కాబట్టి వీరి జీవిత చరిత్రలు అందరికీ తెలియాలని తలంపుతో కందుకూరి గారు రాసుంటారని నా అభిప్రాయం.

బసవరాజు గవర్రాజు గారి జీవిత చరిత్ర :

బసవరాజు గవర్రాజు గారు రాక్షసనామ సంవత్సరం మార్గశిర, బహుళ, తృతీయం బుధవారం నాడు 1855 వ సంవత్సరం డిసెంబరు నెల 26వ తేదీన తన మేనమామగారి ఊరైనా 'కలవళ్ళు' గ్రామంలో జన్మించారు. ఈయన తల్లి మరొక మగశిశువును ప్రసవించి గవర్రాజు గారికి నాలుగోవ సంవత్సరం రాగానే మరణించారు. అప్పుడు తల్లియొక్క అమూల్యమైన సంరక్షణ, ప్రేమానురాగాలు లేని లోటు ఆయనకు పసితనంలోనే కలిగింది. ఈయన తండ్రిగారి సోదరులకి కూడా సంతానం లేకపోవడంతో ముగ్గురు అన్నదమ్ములకు ఈయనే ముద్దుల కుమారుడు. ఈయన మీద ప్రేమతో త్వరగా విద్య అభ్యసించాలని ఒకరు సంస్కృతం, మరొకరు ఇంగ్లీషు, ఇంకొకరు లెక్కలను నేర్పించారు. ఆటలకు నిర్భందంచేసి చదివించారు. పాఠశాలలో ఇతని పరిజ్ఞానాన్ని చూసి నాల్గవ తరగతి నుండి ఆరవ తరగతికి మార్చారు. కొన్ని రోజుల తరువాత పెద్దతండ్రి రామచంద్రరావు గారు మరణించడంతో ఆయన భార్యలతో ఆస్తి పంపకాలలో వివాదములు జరుగుతుండగానే 1871 వ సంవత్సరము తండ్రి వీరన్నగారు కూడా స్వర్గస్థులైనారు. బసవరాజుగారికి అప్పుడు 14 సంవత్సరాలు. దాంతో వారందరిలో పెద్దతండ్రి అయిన ఒకరున్నారు. కాని ఆయన వృద్ధుడు. పై చదువులకు ఖర్చు ఎక్కువుగా కావలసి వచ్చింది. అయినా నిరుత్సాహ పడకుండా కష్టపడి సర్వకళాశాల పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. దానితో రెండు సంవత్సరాలు ప్రథమ శాస్త్రం పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. దాంతో అదే స్కూల్లో పట్టా పరీక్ష చదవడానికి అవకాశం లేదు. కాని తరువాత చెన్నపట్టనానికి పోయి చదవాలి అన్న ఆశ చావలేదు. దాంతో చదువు చాలించి లీన్నీసు పేటలో పరీక్షరాసి తరువాత ఉత్తీర్ణుడై ఉపాధ్యాయ పదవిని పొందారు. అంతే కాకుండా పట్టా చదువు ఎలా అని ఆలోచించగా ఇతని బుద్ధి వికాసాన్ని, ఇతని

సేవలను చూసి చాలా మంది కట్న కానుకులను ఇచ్చి పిల్లను ఇస్తానని వచ్చారు. కాని వారిలో ఒకరు చిత్రపు కామరాజు గారు తన మరదల్ని వివాహం చేసుకుంటే బి.ఎ చదివిస్తానని వాగ్దానం చేస్తే పెద్ద తండ్రికి ఇష్టంలేకపోయినా వివాహం చేసారు. పెండ్లిలో చెప్పిన మాట నిలబెట్టుకోలేదు కామరాజుగారు. దాంతో కొన్ని రోజులకు ఆయన కూడా మరణించారు. దాంతో బసవరాజుగారు పట్టణములో పాఠశాలలో ముప్పై రూపాయలకి ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేశారు. అక్కడే 1875 - 76 సంవత్సరం తరువాత అక్కడే పట్టా పరీక్ష కోర్సును ప్రారంభించారు. దాంతో ఉద్యోగాన్ని మాని పట్టా చదువు చదివి పట్టాను సాధించుకున్నారు. పట్టా చదువుతున్న రోజుల్లో పదిహేనురూపాయలు జీతం వచ్చేది. ఆ వచ్చేదాంట్లోనే కుటుంబ భారాన్ని కూడా భరించేవారు. 1879లో చెన్న ప్టణంలో మే నెలలో ఆయనకు నెలకు 40 రూపాయల జీతంతో కాలేజీలో సహాయ ఉపాధ్యాయునిగా పనిచేశారు. 1880లో మార్చి నెలలో 50 రూపాయలకి, 1882 జూన్‌లో 60 రూపాయలకి పనిచేశారు. ఆ పనిలో 1884 జూలైలో దొరతనం పాఠశాలలో క్రింది తరగతులను తీసేసారు. దాంతో గవర్రాజుగారు అక్కడ మండల న్యాయ సభలో న్యాయవాదిగా ఉండుటకు పట్టాను పొందారు. అక్కడ మండల న్యాయాధికారి అయిన కెల్సాలు ఈయనకు నెలకు వంద రూపాయలు ఇస్తానని న్యాయసభలో ప్రధాన లేక ఉద్యోగానికి రమ్మని పిలవడంతో బసవరాజు మిత్రుల ప్రోత్సాహంతో వెళ్ళి చేరారు. అక్కడ న్యాయాధిపతి లిన్టరు గారితో సరిపడక 1885లో ఉద్యోగం మానేశారు. తరువాత న్యాయవాది ఉద్యోగంలో ప్రవేశించారు.

ఈయన పట్టా పరీక్ష చదువుటకు ముందే 1876లో భాషాంతీకరణ పరీక్షలో, 1879లో ఉపాధ్యాయుడిగా ఉన్న కాలంలోనే బి.ఎ. పరీక్షలో 1882లో సివిల్ గ్రేడ్ పరీక్షలో మొదటి తరగతి న్యాయవాది పరీక్షలో నిల్చి మెప్పొందారు. ఈయనకు ఆంగ్లలో కూడా మంచి పరిజ్ఞానం కూడా ఉంది. ఈయన నీతితప్పని వారు, ధృడనిశ్చయం కలవాడు. ఈయన ఈశ్వరుడికి తప్ప మరెవరికి భయపడడు. ఆయనకి ధర్మమే పరమ దైవమతంగా ఉండేది. అంతరాత్మ యొక్క వాక్యమే వేద వాక్యంగా నుండెను. ఈయన నత్యం, ధర్మం, లోకోపకారమని, నమ్మినదానిని అనుసరించడంలో లోకం అంతా ద్వేషించినా, బంధువులు, మిత్రులు వదిలి వెళ్ళినా దేనికీ వెనుకడుగు వేసే స్వభావం కలవాడు కాదు దీనికి ఒక నిదర్శనంగా ఒక విషయం కందుకూరి గారు చెప్పారు.

బసవరాజుకి ప్రథమంగా పుట్టిన మగ శిశువు మరణించడంతో అందరూ వాడుక ప్రకారం గోదావరి ఒడ్డున ఇసుకలో పాతి పెట్టడానికి తలచారు. కాని పాతిపెట్టిన శిశువును కుక్కలు, నక్కలు పిల్లగించి ఈడ్చి తినడం మనం చూస్తూనే ఉన్నాం. ఈ శవవాహనాదుల విషయం యొక్క ఆచారాన్ని మార్చాలని ముందుగానే ఆలోచించి ఉండడం చేత ఆ శిశువు విషయంలోనే కొత్త మార్పు తీసుకురావాలని ఆ శిశువు పట్టేటట్లు ఒక పెట్టెలో పెట్టి మేకులు బిగించి దానిని తీసుకుపోవడానికి ఒక అద్దె బండిని కుదుర్చుకొని గవర్రాజు, కందుకూరి తరువాత మరొక ఇద్దరు స్నేహితులు వెళ్ళి వారితోటలోనే ఒక చోట బూడ్చి వచ్చినామని కందుకూరి చెప్పారు. మనుష్యులు ఏర్పరచుకొన్న శ్మశానవాటికలో కాక వేరొక చోటలో పూడ్చటం, శిశువును పెట్టెలో పెట్టి తీసుకుపోవడం, బంధువులు, కొంతమంది మిత్రులు ఇంకా అనేకులు ఎన్నివిధాలుగా దూషించినా, ఎవరు ఏమనుకున్నా తమ కన్న బిడ్డ మరణించిన తరువాత కాకులు, గ్రద్దలు తినకుండా ఉండడానికి నేను చేసిన కార్యం మంచిదన్న ధృడ నిశ్చయంతో, తృప్తితోను నిలిచారు.

వితంతు వివాహాల కార్యములలో ఈయనకు సంబంధం కొంచెంగానో, గొప్పగానో అందరికీ తెలుసు. ఈ స్త్రీ పునర్వివాహాలకు ప్రయత్నం ఆరంభంలో తన ప్రాణాలను విడిచిదెమని చెప్పినవారు, స్త్రీ పునర్వివాహాలు

మంచివి కావని చెప్పినవారు ఉన్నారు. సమయం మారినప్పుడు మొహం చాటేసినవారు, స్త్రీ పునర్వివాహాల నందు మేము తప్పక భోజనాలకు వస్తామని ప్రమాణం చేసి రాసి ఇచ్చిన బ్రాహ్మణ ప్రభువులు ఉన్నారు. గవర్రాజుగారు ఈ పనుల్లో ఏదీ చేయలేదు. ఈ విషయం ఇప్పుడు కొత్తగా చెప్పడం కంటె మూడు సంవత్సరాల క్రితం నేను ఉపన్యాసించిన దానిని నేను ఇప్పుడు చదువుతాను అని కందుకూరి చెప్పారు.

నాకు మొదటి నుండి పరమ ఆప్తుడు ఒక ఈ కార్యము నందేకాక దేశక్షేమ నిమిత్తమై తలపెట్టిన మంచి కార్యములలో నాకు కుడి భుజంగా నుండి పైకి పేరు నాదైనా వెనుక నుండి నాకంటే అన్ని కార్యాలు చేస్తున్న బసవరాజు గవర్రాజు సాహసమైన చరిత్ర చెప్పాలని ఉంది. ఈ వితంతు వివాహాలు చేసేటప్పుడు తన బంధువులు కాని, భార్య తరపు బంధువులు కాని ఒక్కసారిగా గొల్లుమని గోలపెట్టారు, శపించారు. తల్లిదండ్రులు పోయిన తరువాత తనను పెంచి పెద్ద చేసిన పెద్దతల్లి తనని విడిచి పోయినా కూడా వెనుదిరగక లోక కార్యంకోసం ఎన్ని కష్టాలు ఎదురైనా సహించుకొని, భార్యకు దీర్ఘవ్యాధి చేత బాధ పడుతున్నాకూడా బంధువుల రాక బాధ కలిగించినా కూడా ఈ కార్యం కొరకు సంతోష పూర్వంగా స్త్రీ పునర్వివాహాలలో తోడుగా ఉండి జరిపించారు. ఈ నా మిత్రుడుని గురించి నేను ఎలా పొగడాలో తెలియడం లేదు అన్నారు కందుకూరి.

1885వ సంవత్సరంలో సత్యనాథంగారు కందుకూరి, బసవరాజు అయిన మేము ఈ స్త్రీ పునర్వివాహ విషయాలలో పనిచేసినట్టు "మద్రాసు మెయిల్" పత్రికలో వ్రాసారు. 1886 లో జనవరి 1 వ తేదీన బసవరాజుగారు దానిని చదివి క్రింది అర్థం వచ్చేలా రాశారు. "వితంతు వివాహాల సంబంధించిన విషయాలలో నాపేరు, కందుకూరివారి పేరును చెప్పడం చేత మా మీద మీకు ఎంత ప్రేమగలదో తెలుస్తుంది. కాని ఈ గొప్ప కులాచార సంస్కార కార్యములో నేను చేసింది చాలా తక్కువని సిగ్గుపడుతున్నాను. నాకు సరియైన పరిస్థితి సత్యనాథము గారికి ఒకవేళ తెలియకుండా ఉండవచ్చును. నేను చేసినదంతా ఈ పక్షమువారిలో భోజనము చేసేంత, నేను వారిని ప్రోత్సాహపరిచేది చేయకపోయినా, నేను ఉన్నా లేకున్నా తామొక్కరే ఈ కార్యాన్ని చేసుండేవారని, ఆయన లేకపోతే నా అంతట నేను ఏమీ చేయలేకపోయేవాడిని అని ఆయనతో పాటు నేను పయనించినదానికంటే అధికముగా, నిశ్చయముగా నేను ఏమీ చేయలేదు అని, నా మనో నిశ్చయముకొరకు కొంతపని చేయాలి అని నేను ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను కాని అయ్యయో నా సోమరితనం నా మార్గములో అడ్డంగా వస్తూవున్నది అని అర్థం వచ్చేలా చెప్పారు." (వీరేశలింగం రచనలు ఐదవ సంపుటం. పుట: 212.)

ఈయనకు ఇంత గర్వరాహిత్యం ఉన్నా ఎప్పుడూ ఆత్మగౌరవం మాత్రం పోగొట్టుకోలేదు. అలాగని ఎవరి దగ్గరైనా నరే దురుసుతనం చూపించలేదు. స్త్రీ పునర్వివాహం చేసుకొన్న వారిలో కొందరు అప్పుడప్పుడు దూషించినా, తిట్టుకున్నా మారుమాట మాట్లాడక సహించి ఊరక ఉండేవారు. కాని మిత్రులతో మాత్రం చెప్పుకునే వారు. కాని వారి మీద కొంతైనా కోపం పెంచుకోకుండా వాళ్ళకి కష్టం వస్తే పిలుపు రాకపోయినా అన్నివిధాల సహాయం చేసేవారు.

ఒక కార్యనిశ్చయమునకై ఆలోచించేటప్పుడు ఆయన పరుల మాట వినక సర్వస్వతంత్రుడె ఉన్నాడు. అధికారం కోసం గాని, స్వలాభం కోసం కాని, బహుజన విరోధమునకు గాని ఏమాత్రం తన మనో నిభ్రతను ఆయన ఎన్నడు విడిచిన వాడుకాదు. తన మిత్రులలో జాతి, మత భేదం లేకుండా బ్రాహ్మణులు, శూద్రులు, వైశ్యులు, మహమ్మదీయులు, క్రైస్తవులు కూడా మిత్రులుగా ఉండేవారు.

ఆయనకు దైవభక్తి కూడా కలదు. మనవారు చిల్లర దేవుళ్లు అని, ద్వేష ప్రధానంగా పరస్పర విరుద్ధమైన గ్రంథాలందు ఆయనకు పెద్దగా విశ్వాసంలేదు గాని,

సర్వకారుణ్యుడు, సర్వశక్తుడు అయిన పరమేశ్వరుని మీద అపారమైన భక్తి కలదు. లోకపిత అయిన ఈశ్వరుడు ఈ సకల మానవకోటి జీవరాశుల అన్నింటిలో సమానమైన ప్రేమకలవాడని, ఈశ్వరున్ని ప్రార్థించిన వారందరూ సోదరత్వం గలవారు కనుక, జాతి, మత, వైషమ్యాలను వదిలి మంచి మనస్సుతో పరస్పర సహాయ సహకారాలు ఉండాలని, అలా ప్రవర్తించడమే పరమధర్మమని ఆయన పరమ సిద్ధాంతం. దీనిద్వారా బసవరాజు గారికి ఆ పరమశివునిపై ఉన్న భక్తి ఎలాంటిదో మనకు తెలుస్తుంది.

బసవరాజు గవర్రాజుగారు ఎప్పుడూ దేశానికి నిజమైన మేలు చేయాలి అని పరిశుద్ధమైన చింతేగాని, నలుగురి చేత గొప్పవాడు అని పిలిపించుకోవాలన్న అభిలాష ఎంతమాత్రం లేదు. ఈ మనుషులు తాము గొప్పవాళ్ళ మని పేరు పొందడానికి చేసిన తంత్ర మంత్రాలు ఒక్కటి కూడా ఈయన దగ్గర లేదు. ఆయన పేద పిల్లలకోసం రాత్రి పాఠశాలకు వెళ్ళి చదువు నేర్పించేవారు. చీకటి రాత్రుల్లో కూడా అప్పుడప్పుడు వెళ్లి పసివాళ్లను చదుకోవ డానికి ప్రోత్సహించేవారు. ఇది తరుచుగా ఆయన్ని చూసేవారికి తెలుస్తుంది.

ఆయన పరోపకారచింతనకోసం, నిష్పక్షపాతంగా మన పట్టణంలో ప్రకటిస్తున్న 'వివేకవర్ధిని' పత్రిక ద్వారా వెలువడుతుంది. ఆ పత్రికకు ఈయన ప్రాణంగా ఉన్నారని చెప్పవచ్చు. అందులో ఇంగ్లీషు భాగంలో తరుచుగా వీరే వ్రాస్తూ ఉండేవారు. వారు రాసిన వ్యాసాలలోని నీతి ప్రథానుపదేశం, నిష్పాక్షికతను, పరోపకార చింతన, మీరు దానిని సావధానంగా చదివితే ఆయన స్వభావం మీకు తెలుస్తుంది. ఈ పత్రికలో కూడా అనేక చిక్కులు వచ్చినాయి. అయినా కూడా ఎదుర్కొని ఉన్నారు. ఒకప్పుడు ఆయన బంధువు యొక్క ధౌర్జన్యాలను గురించి రాయవలసి వచ్చింది. రక్త సంబంధం గల బంధువు మరియు మిత్రుడు, ఒక పక్క ధర్మం అలాంటి పరిస్థితుల్లో ఆయన వార్తలు రాసి చురుకుగా పనిచేయకపోయినా, మిత్రపక్షం వదిలి ధర్మపక్ష అధికారులుగానే ఉండినారు. ఇలాంటి సంఘటనలు మరెన్నో ఉన్నాయి.

బసవరాజు గారు స్త్రీ విద్య విషయంలో, బాలికల పాఠశాల విషయములో, సస్యోధ్యాన సమాజకార్య విషయంలోను, రాణిగారి 'జ్యూబిలి' ఉత్సవ విషయం లోను, రిప్పన్ ప్రభు రాజ్యోత్సవ విషయంలోను, పఠిన మందిర విషయంలోను, నేషనల్ కాంగ్రెస్ సభావిషయాన, పాఠశాల కార్యనిర్వాహక సమాజ విషయమున ఆయన ఎలా పాటుపడ్డారో మనందరికీ తెలిసన విషయమే.

దేశక్షేమమే నిమిత్తమై ఉండటం చేత కుటుంబాన్ని మరిచిపోయాడని మీలో కొంతమంది అనుకోవచ్చు. కాని అది తప్పు. ఆయనకు కుటుంబంపై గల అనురాగం, ప్రేమానురాగాలు ఇంత అని చెప్పటం అలవిలేదు. వీరి అన్యోన్యతను చూసినవారు ఆశ్చర్యపోవాల్సిందే. బసవ రాజు దంపతులకు 1883వ సంవత్సరం నవంబరు నెలలో ఒక కుమార్తె జన్మించింది. బసవరాజు గారు ప్రతిరోజు భార్యవద్ద కొంతసేపు కూర్చుని కష్టసుఖాలను చెప్పుకుంటూ ప్రతిరోజు నియముగా జరుగుతూవున్నది.

ఆయన రాజ్యాంగ విషయములలో అప్పటి ప్రబుద్ధులు అనేకులు దొరతనం వారు చేసినది అంతా తప్పని భావించేవారు కనుక ఈ ఇంగ్లీషు ప్రభుత్వంలో కొన్ని లోపాలు ఉన్నా, వీరి ప్రభుత్వం వచ్చిన తరువాతనే ఎన్నడు లేని క్షేమాలు, లాభాలు వర్థిల్లాయని ధృడంగా విశ్వసించినవారిలో ఒకరుగా ఉన్నారు.

న్యాయవాది ఉద్యోగంలో న్యాయబద్ధమైన చట్టం ఆవశ్యకమని ఋజువుగా ప్రవర్తించేవారిలో వీరొకరని ప్రజాభిప్రాయం. అలాంటప్పుడు కూడా ఈ వృత్తిలో కూడా దినదినాభివృద్ధిని పొందుతూ వచ్చేవారు. వీరి దినచర్యను బట్టి చూస్తే న్యాయవాది ఉద్యోగంలో చేరినప్పుడు రెండువందల ముప్పై రూపాయలు తీసుకున్నట్లు తెలుస్తుంది. బసవరాజు గవర్రాజు మరణించడానికి ముందునెల రెండు వందల డెబ్భైరూపాయలు దొరికాయని చెప్పినట్లు నాకు గుర్తని కందుకూరిగారు

చెప్పారు. న్యాయవాదిగా ఉన్నకాలంలో ఋజువర్తనం, సత్యమార్గం ఎప్పుడూ ప్రశంసకులతో ఉండేవారని మీకు తెలుసుగదా! ఆయన గుణ సామర్థ్యములు అందరికీ తెలుసు. ఆయన చిరకాలము జీవించే ఉంటే న్యాయవాదులలో కెల్లా ఉన్నతమైన స్థానాన్ని పొందుతారనే దృఢనిశ్చయం కలిగి ఉండేది. బసవరాజు గవర్రాజు గారి గురించి ఉత్తమమైన గుణములు ఈయన వద్ద అధికంగా ఉండినవి. కాని సమయం లేనందున ఇంతటితో సరి పెట్టెదను. ఈయన అమాయకత్వంలోనూ, గుణ మాధుర్యంలోనూ, సాధుత్వంలోనూ, దయాళుత్వంలోనూ శిశువు వంటివాడు. అంతేకాకుండా ప్రయత్నం చేసేటప్పుడు బాల్యంలో కూడా ప్రజలు ఎంతటి శక్తి సామర్థ్యాలు కలిగి ఉండవచ్చునో, ఎంతటి గొప్పగౌరవాన్ని పొందవచ్చునో, ఎంతటి నీతిమంతులుగా ఉండవచ్చునో, ఎంతటి ప్రేమకాస్పదులు కావచ్చునో ఈయన ఒక మార్గదర్శకులుగా ఉంటారని సందేహంలేదు. ఒకరి మంచి చెడ్డలు మరణాంతరమునగాని బయటపడవు. ఈయన్ని తెలిసినవారందరూ ఇంతటి పరిశుద్ధమైనవాడు, నీతి మంతుడు, ఘనుడు, ఔన్నత్యం, నిర్మలమైన మనస్సును కలిగిన వ్యక్తిగా బసవరాజు గవర్రాజు గారి జీవిత చరిత్రను కందుకూరి కళ్లకు కట్టినట్టు చూపించారు.

శ్రీ మాకర్ల సుబ్బారావునాయుడు గారి జీవిత చరిత్ర:

(1889వ సంవత్సరం మే నెల 28వ తేదిన జరిగిన సభలో) ఈ సభామందిరంలో ఇదివరకే సంతాపకరమైన మిత్రుని మరణవార్తను చెప్పి సంవత్సరమైనా కాలేదు. తొమ్మిది మాసాలలోనే వెనుకటి దు:ఖవార్తనే మరవ లేకున్నా ఉన్నారు. తిరిగి ఇప్పుడు మరొక మిత్ర మరణవార్తతో 'గోరుచుట్టు మీద రోకటిపోటు పొడిచి నట్లుగా' ఆ వార్తను మీకు తెలియజేస్తున్నాను. మనకందరికీ మిత్రుడు, ఇక్కడ మండల న్యాయసభలో పనిచేస్తున్న న్యాయవాదులలో అగ్రగణ్యులు. సత్యం, సౌలభ్యమైన అనేక సద్గుణ సంపన్నుల కలిగిన 'శ్రీమాకర్ల సుబ్బారావు నాయుడుగారు మే నెల 19వ తేది ఆదివారం నాడు గుంటూరులో స్వర్గస్థులయ్యారు. ఈయన నెల్లూరు మండలంలోని డివిజన్‌కు హెడ్‌కానిస్టేబుల్‌గా ఉండిన ఆది నారాయణప్ప నాయుడు గారికి నాల్గవ సంతానంగా 1855లో జన్మించారు. ఈయన పెదతండ్రి వీరేశలింగం నాయుడు గారు ఆ మండలంలోనే తహశీల్దారునిగా ఉన్నారు. ఈయనకు మూడు సంవత్సరాల ప్రాయంలో వీరి తల్లిగారికి మేనమామైన బందరు నివాసులు ఎక్కువ కాలం వీరితో పాటు ఉండి ఆ తరువాత బందరుకి పోయి లక్షాధికారులయ్యారు. మాకర్ల- రామయ్య నాయుడు గారు వారి తల్లిదండ్రులను బహువిధాలుగా ప్రార్థించి ఈయనను దత్త పుత్రుడుగా స్వీకరించారు. వీరు దత్తత పోయిన పది సంవత్సరాలకే తండ్రి మరణించాడు. అటు తరువాత పినతండ్రి రామయ్యనాయుడు తమ్ముడైన మాకర్ల వెంకటస్వామి వీరిని సరిగ్గా చూడకుండా చాలా కష్టపెట్టారు. ఇలాంటి సమయంలోనే వారు సంసారభారాన్ని కూడా భరించవలసి వచ్చింది. అయినా మన సుబ్బారావు నాయుడుగారు తన పినతండ్రి పెట్టిన బాధలను అన్నింటిని భరించి తను బుద్ధిమంతుడై చదువుకొంటూ విద్యలో శక్తికలవాడై సకల కళాశాల ప్రవేశ పరీక్షలోను, ప్రథమశాస్త్ర పరీక్షలోనూ బందరులో ఉత్తీర్ణుడయ్యాడు. తరువాత కుటుంబం సహితంగా చెన్న పట్టణానికిపోయి అక్కడ తల్లికి, భార్యకు సరిగ్గా ఆరోగ్యం సరిలేకుండా చాలా కష్టపడి వ్యయప్రయాసాలకులోనై తన పినతండ్రి ఇచ్చిన పదివేల రూపాయలను ఖర్చు పెట్టడమే కాకుండా ఆరువేల రూపాయలను అప్పుచేసి, అక్కడున్న అయిదారు సంవత్సరాలలో విద్యార్థులకు విద్యావిషయాలలో సహాయపడుతూ అక్కడే బి.ఎ. పట్టపరీక్షలో ఉత్తీర్ణుడైన సంవత్సరంలోనే భాషమయ్యం గారి వద్ద అంతేవాసిగా ఉండి చెన్నపురిలో న్యాయసభలో న్యాయవాది పట్టాను పొంది 1882వ సంవత్సరంలో పని చేయడానికి మన పట్టణానికి వచ్చారు. అప్పటి నుండి ఇక్కడే ఉండి న్యాయసభలో న్యాయవాదిగా పనిచేసిన

విషయం మీకందరికి తెలుసు. ఈయన ఇక్కడికి రాకమునుపే ఈయన గురించి నాకు కొంతవరకు తెలుసు. ఈయన బందరులో పాఠశాలలో చదువు కున్నపుపడు రెండుసార్లు ఇక్కడికి వచ్చినప్పుడు నాకు ఈయనతో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత మన పట్టణంలో మొదట స్త్రీ పునర్వివాహం జరిగిన తరువాత 1881వ సంవత్సరంలో నేను చెన్నపట్టనానికి పోయినప్పుడు తరచుగా నా దగ్గరకు వచ్చి నేను ఇచ్చిన ఉపన్యాసాలలో మొదలైన వాటిలో నాకు సహాయంగా ఉన్నారు.

ఈ పట్టణములో వారు వచ్చినప్పటినుండి సుబ్బారావు నాయుడుగారి యోగ్యప్రవర్తనము మీకు తెలుసు. ఇటువంటి వారు ఈ లోకాన్ని విడిచిన తరువాత పుణ్య లోకంలో నిరంతర సుఖాలను అనుభవిస్తారు. అటువంటి పుణ్య పురుషుడు ఈ లోకాన్ని విడిచి పెట్టి వెళ్లాడని వ్యసనపడడం అవివేకం. లోకంలో మరణం అనేది సహజం. ఎలాంటి వారైనా ఎప్పుడో ఒకప్పుడు మరణిం చాల్సిందే. వారిలో కొంతమంది మాత్రమే కీర్తిని సంపా దిస్తారు. అటువంటి వారిలో మన నాయుడుగారు ఒకరు. ఇప్పుడు లోకంలో ఆయన శరీరం తప్ప వేరేమి విడిచిపోలేదు కదా. ముసలి తనం సమస్త వ్యాధులతోనూ వచ్చి యవయవ పటుత్వాన్ని తప్పించి పూర్ణంగా బాధించు వరకు మనం ఈ లోకంలో జీవించుట అపేక్షణీయ మగునా? ఎంతమాత్రం కాదు. ఈ లోకంలో ఎంతకాలం బ్రతికితే తృప్తి కలుగును. ఈ జీవిత కాలంలో చక్కగా ప్రవర్తించి సుఖంగా ఉండగానే ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాలని మనం నిరంతరం ప్రార్థన చేయాలి. జీవిత కాలం యొక్క దీర్ఘత్వాన్ని నిర్ధారణ చేసేది మనుషుల యొక్క ఉపకార చింతనను బట్టి, సత్ప్రవర్తన బట్టి ఉండాలే గాని, యేండ్ల యొక్క సంఖ్యనుబట్టి ఉండ కూడదు. నిరర్థక జీవుడై వెయ్యేండ్లు జీవించిన వాడికంటే పుణ్యాత్ముడై ఒక్కరోజు జీవించినవాడే చిరకాలజీవని చెప్పవచ్చు. మన మిత్రుడు వయస్సు చేత చిన్నవాడైనా తన యోగ్యప్రవర్తన చేత చిరకాలజీవి అని అనలేదా! అనే అంశాన్ని ఒక్కసారి ఆలోచిద్దాం.

విద్యనుబట్టి నేను ఈయనను గురించి చెప్పడం లేదు. మన దేశంలో విద్యావంతులు అనేకులున్నారు. కాని ఆ విద్యకు అనుగుణమైన సత్ప్రవర్తన కలవారు అంతాగా లేరు. మన మిత్రుడు విద్యకు అనుగుణంగా సత్ప్రవర్తన కలవాడనడానికి సందేహం లేదు. మన మిత్రుని ఉద్యోగం న్యాయవాదిత్వం. న్యాయవాదులందరూ అసత్యం పలుక కుండా అభివృద్ధి చెందలేరని ఈ దేశంలో అందరూ నమ్ముతున్నారు. మన నాయుడుగారు న్యాయవాదినే కాదు సత్యవాదినే అని నిరూపించుకున్నాడు. తాను వాదించేటప్పుడు అది సత్యమైన వ్యవహారం అయితేనే వాదించేవారు. లేకపోతే వాదించరు. ఇంతేకాక అక్రమ మైన వాదనలను చేసే న్యాయవాదులు కూడా మనం ఇలాంటి పని చేసినప్పుడు నాయుడుగారు ఏమను కుంటారోనని మదనపడేవారని నేను విని ఉన్నాను. నేను ఈయన మన పురపారిశుద్ధ్య విచారణ సంఘంలో సభికులుగా అనేక సంవత్సరాలు పనిచేసి ఉన్నాము. ఈయన ఆ కాలములో ఒక అసత్యం కూడా పలికినవారు కాదు. పక్షపాతంతో ఒకపనైనా చేసినట్టుగాని, ఒప్పించిన పనిని తన శక్తిని ఉపయోగించి చేయకుండా విడిచి పెట్టినట్టు కాని నేను కనీ వినీ ఉండలేదు. నాకు తెలిసి నంత వరకు శ్రీ మాకర్ల సుబ్బారావునాయుడు గారు సత్యాభిలాశం, పరోపకార బుద్ధి, శాంతి సౌలభ్యం, ధైర్యోత్సాహములు, దేశాభివృద్ధిని కనబరిచినట్లు నేను ధృడంగా చెప్పగలను. ఈయన నడి యౌవన దశలో చేతిలో కావలసినంత ధనం ఉండినా కూడా పర స్త్రీ విముఖుడై ఉండుట కొనియాడదగిన విషయమని అన్నారు. ఈయన స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సమాజంలో ఒక సభికుడుగా ఉండి ఈయన సమాజ క్షేమానికై హృదయపూర్వకంగా కూడా పనిచేసేవారు. ఈ పట్టణంలో ప్రతివారం వచ్చే వివేకవర్ధిని పత్రికకు అప్పుడప్పుడు ఇంగ్లీషు వ్యాసాలు రాసేవారు. ప్రతి విషయంలోను కూడా ఈ పురుష రత్నం యొక్క సుగుణాలు ప్రకాశిస్తూ వచ్చినవి. ఈయన ఆధాయం వ్యయాలను గురించి తెలిసినవారు

ఈయన త్యాగశీలత తెలియకపోదు. మన పట్టణంలో ఈ అలంకార మహాపురుషుని జ్ఞాపకార్థంగా ఏదైనా చేయడం మనందరి కర్తవ్యం. కాబట్టి వీరి ఇరువురి జ్ఞాపకార్థంగా మనం చేయవలసింది అంతా ఇతరులతో సద్వర్తనమును ప్రోత్సహించడం, యోగ్యపురుషుల సద్వర్తనతను గౌరవించడం ఇలాంటివి అన్నీ సాధ్యమై నంత వరకు చేయడం మూలాన సమాజంలో నాయుడు గారు, బసవరాజు గారి పేర్లను స్థిరపరచవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. వీరేశలింగం రచనలు - ఐదవ సంపుటం, ఉపన్యాసాలు, వ్యాసాలు, జీవిత చరిత్రలు- సం. అక్కిరాజు రమాపతి రావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1986.
2. కందుకూరి వీరేశలింగము, స్వీయ చరిత్రము, ఆంధ్రకేసరి యువజన సమితి, రాజమహేంద్రి, 2015.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద విమర్శా దిక్సూచి – ఆచార్య కొలకలూరి ఇనాక్ దృక్పథం

– ఆచార్య ఖాస్తాల శంకరరెడ్డి, తెలుగుశాఖాధ్యక్షులు, మద్రాసువిశ్వవిద్యాలయం, చెన్నై.

"హృదయం లాంటిది కవిత్వం, మెదడులాంటిది విజ్ఞానం, సంస్కారం లాంటిది విమర్శ" అని ఆచార్య జి.వి.సుబ్రమణ్యంగారు పేర్కొన్నారు. ఈ అభిప్రాయం ఆధారంగా కవిత్వానికి, విజ్ఞానానికి, విమర్శకుగల విడదీయరాని అనుబంధం ఎలాంటిదో తెలుస్తుంది. ఏ సాహిత్యంపైనైనా ఎంత ఎక్కువగా విమర్శా విశ్లేషణ జరిగితే ఆ సాహిత్యం అంతటి ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అది ఉత్తమోత్తమ సాహిత్యమో కాదో స్పష్టం చేసేది విమర్శ. అందుకనే సద్విమర్శకుడు వైద్యుడు లాంటివాడు అని ఐ.ఏ.రిచర్డ్ అంటారు. అంటే వైద్యుడు దేహ ఆరోగ్యాన్ని బాగుచేస్తే విమర్శకుడు కవుల, రచయితల మానసిక ఆరోగ్యాన్ని బాగు చేస్తాడు. దీని వలన పాఠకులు ఉత్తమ సాహిత్యంవైపు పయనించే విధంగా చేయడమేకాక, ఉత్తమ సాహిత్యం పట్ల చక్కని అవగాహనను కలిగిస్తాడు.

నిజానికి జానపద సాహిత్య విమర్శ ఇతర ప్రక్రియల లాగా సృజనాత్మకమైందికాక పోయినా ఈ విమర్శ ఉంటేనే సృజనాత్మక ప్రక్రియను సహృదయులు ఆదరిస్తారు. అంతేకాక విమర్శకుడు ఒక స్పష్టమైన మార్గాన్ని కూడా సూచిస్తాడు. సమకాలీన అంశాలను దృష్టిలో వుంచుకుని వెలువడుతున్న సాహిత్యంలోని లోతుపాతులను చక్కగా విడమరిచి ఉన్నది వున్నట్లుగా నిక్కచ్చిగా వ్యవహరిస్తాడు. కనుక సాహిత్యం సక్రమమైన మార్గంలో, సిద్ధాంత పరమైన ప్రాతిపదికలతో సమకాలీన సమాజానికి ప్రతిబింబంగా నిలిచే విధంగా చేయగలిగే గొప్పతనం విమర్శకు, విమర్శకులకు ఉంది. అటువంటి విశిష్ట విమర్శకులు మన తెలుగు సాహిత్యంలో ఎందరో ఉన్నారు. ఎవరికి వారు తమదైన శైలిలో సాహిత్య విమర్శను చేస్తూ కొత్త కొత్త విమర్శ సిద్ధాంతాలను, సూత్రాలను ప్రతిపాదిస్తు సాహిత్యాన్ని ముందుకు నడిపిస్తున్నారు. అటువంటి ప్రముఖ విమర్శకులలో ఒకరు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు. వీరి వ్యక్తిత్వం అనేక కోణాలలో దర్శనమిస్తుంది. అటువంటి కోణాలలో ఒకటి ఉత్తమమైన సాహిత్య విమర్శకుడు. వారి వ్యక్తిత్వం ఆధారంగా ప్రముఖ విమర్శకుడుగా ఎదిగిన నేపథ్యాన్ని పరిశీలిద్దాం.

విమర్శకుడిగా ఎదిగిన విధానం :

ప్రతివ్యక్తి తన జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎన్నెన్ని మార్గాలలో పయనించినా వాటి నేపథ్యంగా ఉండేది వారి వ్యక్తిత్వమే. అంటే వారి జీవిత నేపథ్యం ఆధారంగా ఒక విధమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. ఆ వ్యక్తిత్వపు ఆలోచనల నుండే ఏ సమస్యనైనా దర్శించే వీలుంటుంది. ఈ క్రమంలో ఆచార్య ఇనాక్ గారి వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే ఎంతో విశిష్టంగా కనిపిస్తుంది. వారి జీవితం కష్టాల కడలిని దాటుకుని సాహితీ లోకంలో అత్యున్నతమైన వ్యక్తిగా ఎదిగారు. ఇది ఒక సుదీర్ఘమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోటులు, సుఖ దు:ఖాలను అధిగమించి నేడు ఒక ఆదర్శనీయమైన వ్యక్తిగా నిలిచారు.

ఆచార్య ఇనాక్ గారి జీవన ప్రస్తానానికి వేదిక అయిన రంగం సాహిత్య రంగం.కృషి, పట్టుదల గల వ్యక్తి ఏ రంగాలలో అడుగిడినా ఆయా రంగాలలో శిఖరాలను తాకడంలో ఆశ్చర్య పడవలసిన పనిలేదు. అటువంటి వ్యక్తిత్వంగల ఇనాక్‌గారు సాహితీ రంగంలోకి ప్రవేశించారు. అప్పటికే తెలుగు సాహిత్యంలో ఉద్ధండులు అయిన కవులు ఎందరో సాహిత్యంలోని వివిధ రంగాలలో ప్రవేశం చేసి చక్కని ప్రతిభాపాఠవాలు ప్రదర్శిస్తున్నారు. అయితే సాహితీ లోకంలో ఎందరో ఉద్ధండ పండితులున్నా విశిష్ట

వ్యక్తిత్వం కలిగిన వారు నూతనమైన మార్గంలో పయనించి వారికంటూ ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంటారు. అలాంటి వ్యక్తిత్వం కలిగిన వారు ఆచార్య ఇనాక్‌గారు. వారి వ్యక్తిత్వ లక్షణాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే నిగర్వి, వారితో ఎవరైనా మొదటి సారి సంభాషించినప్పుడు ఆశ్చర్యానికి లోనౌతారు అనడంలో అతిశయోక్తి లేదు. ఒక రకంగా చెప్పాలంటే వారు విశిష్టమైన స్థానానికి చేరుకోవడంలో కూడా ఈ లక్షణం ఎంతగానో తోడ్పడి ఉంటుంది.

సాధారణంగా సాహిత్యంలో కొంత దూరం పోయాక ఒక రకమైన గుర్తింపు వచ్చే సరికి అప్పటి వరకు లేని ఎన్నో లక్షణాలు ప్రవేశిస్తాయి. వారి ఆలోచనా తీరు తెన్నులు మారిపోయిన సందర్భాలు అనేకం. కాని ఇప్పటికీ ఇనాక్ గారు నిత్య విద్యార్థిగా అప్పుడే సాహితీ రంగంలోకి ప్రవేసించిన వ్యక్తిగా, ఒక గ్రంథాన్ని చదివినా, ఒక రచన చేసినా, ఒక అంశాన్ని విశ్లేషించినా నూతనమైన ఆలోచనలతో వాటి ఆత్మను దర్శించడానికి ప్రయత్నం చేస్తారు. అప్పటి వరకు అందులో వెలుగు చూడని నూతన కోణాన్ని ఆవిష్కరిస్తారు. వారు ఒక కథ రాసినా, ఒక నాటకాన్ని రూపొందించినా, ఒక నవలను సృష్టించినా ఏ ప్రక్రియ చేపట్టినా వారి విశిష్ట వ్యక్తిత్వం అందులో ప్రతిఫలిస్తుంది. ఆ రంగంలో ఒక నూతనమైన ఒరవడిని సృష్టిస్తారు. అందుకే వారి రచనలు పాఠకులను ఇట్టే ఆకట్టుకుని ఆలోచింపజేస్తాయి. ఇలా సాహితీ రంగంలో కవిగా, కథకుడిగా, నవలా రచయితగా, సాహిత్య విశ్లేషకుడిగా, నూతన సిద్ధాంత ప్రతిపాదకుడిగా ప్రశంసలు అందుకున్న ఆచార్య ఇనాక్ గారు ఒక విశిష్టమైన విమర్శకుడిగా ఎదిగారు.

తెలుగు సాహిత్య విమర్శ రంగంలో ఇనాక్ :

తెలుగు సాహిత్యంలో ఎందరో ఉద్దండ పండితులు, విమర్శాగ్రేసరులు ఇలా ఎందరో వివిధ దృక్పథాలతో విశ్లేషణలు, విమర్శలు చేశారు. ఆచార్య ఇనాక్‌గారు స్వతహాగా కవి, రచయిత, సృజనాత్మక శక్తి కలిగిన సాహిత్యకారుడు కనుకనే అప్పటి వరకు ఎన్నో విమర్శనాత్మక విశ్లేషణలు వచ్చినా ఎవరూ రాయని ఒక విశిష్ట దృక్పథంతో ప్రామాణికమైన విమర్శన గ్రంథాలను వెలువరించి, విమర్శాలోకంలో తనదైన గుర్తింపును పొందారు. వీరు రాసిన తెలుగు వ్యాస పరిణామ (పరిశోధన గ్రంథం), సాహిత్య వ్యాసాలు, సాహిత్యదర్శిని, సమీక్షణం, ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం మొదలైన గ్రంథాలు తెలుగు విమర్శా లోకంలో విశిష్టమైన స్థానాన్ని పొందాయి. కనుకనే వారి విమర్శనా శైలి ప్రాచీన ఆధునిక సాహిత్యంలో ప్రముఖులను, పండితులను, విమర్శకులను సైతం ఆకట్టు కోవడమేకాక వారి సాహిత్యం ద్వారా సాహితీ విలువలకు సముచిత స్థానాన్ని కలిగించాయి. ఇలా వారి సాహిత్య కృషి సాహిత్యంలోని అన్ని రంగాలకు విస్తరించింది.

ఆచార్య ఇనాక్ గారు ఏ రంగంలో అడుగిడినా వారి ఆలోచనా సరళికి అపూర్వమైన ఆదరణ ఏర్పడింది అంటే ఏ రంగంలోకి ప్రవేశించినా దాని పట్ల ఎంతో నిబద్ధతను ప్రకటించే వారు, లోతైన అధ్యయనం చేసేవారు. దానిని సమకాలీన సమాజానికి ప్రతిబింబిస్తున్న తీరు పరిశీలించే వారు, అందుకనే వారు ఏ సాహిత్యాన్ని అందుకున్నా అందులో నిరంతరకృషిచేసి అపారమైన పట్టును సాధించేవారు. అలాగే విమర్శరంగానికి వీరు అందించిన ''ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం'' అనే గ్రంథం మారుతున్న సామాజిక విలువలను బట్టి ఆధునిక సాహిత్యాన్ని ఎలా చదివి అర్థం చేసుకోవాలో, విమర్శించాలో పాఠకలోకానికి సులభశైలిలో వివరించారు. అప్పుడే విమర్శ రంగంలోకి ప్రవేశించిన నూతన పరిశోధకులకు శాస్త్రీయ దృక్పథంతో, హేతుబద్ధమైన అవగాహనతో, తర్కబద్ధంగా దర్శించడానికి కావలసిన విమర్శనా సామగ్రిని అందించే విశిష్ట ఉత్తమ గ్రంథంగా పేరు గాంచింది. అదే కోణంలో వెలువడిన మరొక విశిష్ట విమర్శ గ్రంథం''జానపదుల సాహిత్యం విమర్శ''. ఇది జానపద

సాహిత్యానికి ఒక సిద్ధాంత భూమికను ఏర్పరిచి ఒక సూత్రబద్ధంగా జానపద సాహిత్యాన్ని వ్యాఖ్యానించిన విశిష్ట గ్రంథం. ఈ క్రమంలో జానపద సాహిత్య విమర్శ రంగంలో ఆచార్య ఇనాక్ గారి దృక్పథం, సిద్ధాంతం ఎలాంటిదో పరిశీలిద్దాం.

జానపద సాహిత్య విమర్శకుడుగా ఆచార్య ఇనాక్:

ఆధునిక సాహిత్యంపై విస్తృతమైన విమర్శ సాహిత్యం వెలువడింది. ఇంకా వెలువడుతూనే ఉంది. కారణాలు ఏమైనప్పటికిని జానపద సాహిత్యం మీద చెప్పుకోదగినంత విమర్శ రాలేదనేది స్పష్టం. నిజానికి జానపద సాహిత్యం మనకు ఎక్కువగా ఆశు సాహిత్యంగా మౌఖిక రూపంలో నిక్షిప్తమై ఉంది. ఆ ఆశు సాహిత్యంలోనే మన తరతరాల జానపద సంస్కృతికి చెందిన పునాదులు కనిపిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే భారతీయ సంస్కృతి విశేషాలు మనకు వేల సంవత్సరాల నుండి చిరస్థాయిగా నిలిచిన జానపద సాహిత్యంలో నిక్షిప్తమై ఉంది. అటువంటి సాహిత్యం అజ్ఞాత సాహిత్యంగా, చీకటి సాహిత్యంగా నిరాధారణకు గురై ఇప్పుడిప్పుడే పలువురి మన్ననలను పొందగలుగుతుంది. విశ్వవిద్యాలయాల్లో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నా ఇంకా ఎందరికో ఈ విశిష్ట సాహిత్యం పట్ల చులకన భావన కలిగి ఉండడం అందరికి తెలిసిన విషయం. ఎందుకంటే అది మౌఖిక, అజ్ఞాత సాహిత్యమని, దానికి ఒక సిద్ధాంత ప్రాతిపదికలేదు అనేది వీరి వాదన. అటువంటి వాదనకు సంస్కృతి, నాగరికతల పేరుతో మూఢత్వాన్ని ప్రదర్శిస్తున్న అజ్ఞాన సాహితీలోకానికి ఆచార్య ఇనాక్‌గారు సంధించిన విమర్శనా బాణం 'జానపదుల సాహిత్య విమర్శ' గ్రంథం. సాధారణంగా జానపద సాహిత్య విమర్శ అన్నవెంటనే అందులో విమర్శ ఏముంటుంది, దాని ప్రాతిపదికలు ఏవి, దానిలో దర్శించేది ఏముంటుంది అనే వాళ్ళకు ఇనాక్‌గారు అందించిన ఒక చురక ఈ 'జానపద సాహిత్య విమర్శ'. జానపద సాహిత్యానికి ఒక సగౌరవమైన చరిత్ర ఉంది, విశిష్టమైన లక్షణం ఉంది. అనలు నేడు గొప్పగా చెప్పుకుంటున్న పురాణ, ఇతిహాసాల కంటే ముందు నుండి ఈ సాహిత్యం ప్రజాబాహుళ్యంగా వర్ధిల్లిందని సిద్ధాంతీకరించిన గ్రంథం ఆచార్య ఇనాక్ గారి 'జానపదుల సాహిత్య విమర్శ'. జానపద సాహిత్యంలో జానపద పరిశోధనా రంగాన్ని దర్శించవలసిన తీరును అందించే దిక్సూచి ఈ గ్రంథం. అటువంటి విశిష్టమైన విమర్శనా గ్రంథాన్ని రూపొందించి విశిష్ట జానపద విమర్శకులుగా కీర్తికెక్కారు ఆచార్య ఇనాక్‌గారు.

జానపద సాహిత్య విమర్శ - ఇనాక్ దృక్పథం :

జానపద సాహిత్య విమర్శ గురించి ఆచార్య ఇనాక్ గారు ఈ విధంగా అభిప్రాయ పడుతారు. "సాధారణంగా విమర్శనం ఆలోచన అంతస్సారంగా ఉంటే జానపద సాహిత్య విమర్శనం అనుభూతి అంతరాత్మగా ఉంటుంది. తెలుగు సాహిత్య విమర్శకు నూట ఏభై ఏళ్లు దాటలేదు. తెలుగులో జానపద సాహిత్య విమర్శకు తెలుగు సాహిత్యం అంత ప్రాచీనత వుంది. ఆ కాలంలో పండితులు, కవులు, రాజుల సాహిత్య విమర్శ దృక్పథం పరిమితంగా వున్నప్పటికీ, జానపద సాహిత్య విమర్శన దృక్పథం ఆనాటి పరిస్థితుల దృష్టిలో పరిమితంగా ఉంది" అని జానపద సాహిత్య విమర్శ విస్తృతిని తెలియజేశారు. ఈ అభిప్రాయాన్నే ఒక క్రమబద్ధమైన సిద్ధాంతపరంగా అన్వయించి పరిశోధకులను, విమర్శకులను ఆశ్చర్యానికి గురి చేశారు. ఈ జానపదుల సాహిత్య విమర్శను ప్రధానంగా మూడు భాగాలుగా విభజించి విశ్లేషించారు. అవి.

1. లక్ష్యం
2. లక్షణం
3. సిద్ధాంతం

ఈ విభాగాలు చేయడంలోనే వీరి విమర్శనాత్మక దృక్పథం ఎలాంటిదో తెలుస్తుంది. లక్ష్యం అనే మొదటి భాగంలో ఉపోద్ఘాత శీర్షిక క్రింద దైవీయత - కవి పండితులు, సాహిత్య సృష్టి, స్వప్న దర్శనం, భీమకవి, పోతనలు. మానవీయత అనే శీర్షిక క్రింద తిక్కన

ఆంధ్రీకరణం - జానపదుల అభీష్టం, శ్రీనాథుడు - జానపదుల అభిమానం, శ్రీకృష్ణదేవరాయలు - జానపదుల ఆత్మీయత, సాహిత్యం - జానపదుల ఇష్టానిష్టాలు, కావ్యాంకితం - జానపదుల ఆనందం, భాస్కర శతకం - జానపదుల దృక్పథం, కాకతీయులు - జానపదుల నిర్ణయం, కవి మంత్రిత్వం - జానపదుల సంతోషం, భాషాభ్యాసం - జానపదుల ఆసక్తి, కవుల ఇంటి పేర్లు - జానపదుల అభిమతం. జానపదుల సాహిత్య విమర్శ అనే శీర్షిక క్రింద వినోద సాహిత్యం - జానపదుల వ్యాఖ్యానం, రెండర్థాలు - జానపదుల అంతరార్థాలు, జీవితంలో బూతు - జానపదుల విమర్శ. లక్షణం అనే రెండవ విభాగంలో జానపద సాహిత్య విమర్శ - లక్షణాలు, సాహిత్య విమర్శ - జానపదుల సాహిత్య విమర్శ, జానపదుల విమర్శ సాహిత్యం - జానపద లక్షణాలు, జానపద సాహిత్య వర్గీకరణం - విమర్శ స్థానంలో విద్వాంసుల వర్గీకరణ, పరిశోధకుల వర్గీకరణ, గద్య కథనాలు - జానపదుల సాహిత్య విమర్శ స్థానంలో జానపద సాహిత్య విమర్శ - కథ, జానపద విజ్ఞానం వర్గీకరణ అనే అంశాలు. సిద్ధాంతం అనే మూడవ భాగంలో సింహావలోకనంలో సమన్వయం, సారాంశం, నిర్ణయం అనే వాటికి సంబంధించిన విమర్శనాత్మకమైన సిద్ధాంత భూమికను ప్రకటించారు. ఆ అంశాల లోతులలోకి వెళితే జానపద సాహిత్య విమర్శకుడిగా ఆచార్య ఇనాక్ గారి దృక్పథం స్పష్టంగా తెలుస్తుంది.

ఆధునిక సాహిత్యం మీద వచ్చినంత విమర్శ ప్రాచీన సాహిత్యం మీద, ప్రాచీన సాహిత్యంపై వచ్చినంత విమర్శ జానపద సాహిత్యంలో రాలేదనేది విజ్ఞులు అంగీకరిస్తున్న విషయం. జానపద సాహిత్య విమర్శ గురించి డా॥ రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారు తన విమర్శ - 2009లో ఇలా అంటారు.

"ఒకప్పుడు విశ్వవిద్యాలయాలలో ఉద్యమ స్థాయిలో పరిశోధనలు జరిగాయి, సదస్సులు వర్కుషాప్‌లు జరిగేవి. మాధ్యమాలలో విమర్శలు వచ్చేవి. అవి మందగించి పోయాయి. సామాజిక శాస్త్రాల వెలుగులో ఏ శాస్త్రాన్నైనా, ఎప్పటి సాహిత్యాన్నైనా, ఎవరి సాహిత్యాన్నైనా అధ్యయనం చేయడానికి అవకాశం ఉంది. ఒక వ్యవస్థగా మారబోయిన జానపద విజ్ఞాన విమర్శ వెనక్కి వెళ్ళిపోయింది. ఎక్కడైనా పరిశోధనలు జరుగుతున్నా అవి సి.డి.లలో మిగిలిపోయి ఉన్నాయి. జానపద విజ్ఞాన పరిశోధనకు, విమర్శకు ఒక ప్రత్యేక వ్యవస్థకావాలి. దాని కోసం ఆలోచించాలి" అని పేర్కొన్నారు. ఈ లోటును పూరించడానికే అన్నట్లుగా ఆచార్య ఇనాక్‌గారి జానపదుల సాహిత్య విమర్శ రూపు దిద్దుకుంది.

సాధారణంగా సృజనాత్మక సాహిత్యంపై విమర్శ చేయడం సర్వసాధారణం. కాని జానపద సాహిత్యంపై విమర్శ చేయడం అంత సులువైన విషయం కాదు. అయితే జానపద సాహిత్య విమర్శను అర్థం చేసుకోవాలంటే జానపదుల ఆత్మను అర్థంచేసుకోగల నైపుణ్యం, నేపథ్యం అవసరం. ఈ లక్షణాలు ఆచార్య ఇనాక్ గారిలో పుష్కలంగా ఉన్నాయి. అందుకే తన జానపదుల సాహిత్య విమర్శ గ్రంథానికి రాసిన ఉపోద్ఘాతంలోనే ఆ విమర్శపై వారికి గల దృక్పథం తెలుస్తుంది. జానపదుల విమర్శ ఎలా ఉంటుందో తెలియజేస్తూ "జానపదులు సాహిత్యం అనుభవించి ఆనందించే రసికులు, సహృదయులు, సమర్థులు. వాళ్ళు తమకు తోచిన తీరులో దాన్ని విమర్శించగలరు. చాలామంది చదవలేరు. సాహిత్యం విని, వినడంవల్ల అనుభవించి ఆ అనుభవం అభివ్యక్తం చేయగలరు. ఆ అభివ్యక్తీకరణం సాహిత్య విమర్శకుల అభివ్యక్తీకరణం కంటే భిన్నంగా ఉంటుంది" అని జానపద సాహిత్య విమర్శ ఆయువు పట్టును పట్టుకోగలిగారు. జానపద సాహిత్యాన్ని జానపదుల మనస్తత్వం ఆధారంగా అంచనా వేయగలగాలి. అందుకు తగిన నేపథ్యం విమర్శకునికి ఉండాలి. ఆ నేపథ్యంలో నుండి వచ్చినవారు కనుకనే ఆచార్య ఇనాక్ గారు జానపదుల అంతరాత్మను ఆవిష్కరించగలిగారు.

దైవీయ కోణంలో జానపదులు కవి, పండితులకు అతీంద్రీయ శక్తులు ఉన్నట్లుగా జానపదులు భావిస్తారని పేర్కొంటారు. అందుకే వాళ్ళ అద్భుతమైన, ఆశ్చర్యకరమైన కవిత్వం సృష్టించగలిగారిని జానపదుల విశ్వాసంగా వ్యాఖ్యానిస్తారు. అంటే ఆ కవుల చుట్టూ జరిగే సన్నివేశాల ఆధారంగా కవులకి భగవదాంశ ఉన్నట్లు భావిస్తారు. అలా వేములవాడ భీమకవి, శ్రీపతి పండితుడు మొదలైన వారిని ఉదాహరణగా తీసుకొని జానపద విమర్శా కోణంలో విశ్లేషించారు. అలాగే కవులు సాహిత్య సమస్యలతో సతమతమవుతుంటే వారిని కాపాడడానికి సరస్వతి, సర్వేశ్వరుడు, శ్రీమహావిష్ణువు స్వయంగా భూలోకం వచ్చి కవులకు సహాయం చేసినట్లు జానపదులు కల్పనలు చేసిన విధానాన్ని విమర్శనాత్మకంగా విశదీకరించారు.

అలా ఇష్టదైవాలు కలలో కనిపించి కవులకు సాహిత్య సంబంధమైన సమస్యలకు పరిష్కారం చూపించారని జానపదుల అభిమతంగా వ్యాఖ్యానిస్తాడు. ఉదా॥కు పోతన భాగవతాన్ని కాపాడడం కోసం శ్రీరాముడు సర్వజ్ఞ సింగభూపాలుని భార్యకు కలలో కనపడి చేయవలసిన కర్తవ్యాన్ని బోధించినట్లుగా జానపదుల విశ్వసిస్తున్నారని సాహిత్య ఆధారాలతో వ్యాఖ్యానించాడు. అలాగే పోతన కుమార్తె - భగవద్దర్శనం, అన్నమయ్య అద్భుత చర్యలు, భాస్కరశతకం - కవితపశ్చక్తి మొదలైన వాటిని జానపదుల కోణంలో విమర్శనాత్మకంగా సిద్ధాంతీకరించారు.

మానవీయకోణంలో సాహిత్యం, చరిత్రలలోని అనేక సంఘటనల ఆధారంగా పరిశీలించారు. నన్నయ కాలం నుండి తెలుగు సాహిత్యం ప్రారంభమయిందని భావిస్తే జానపదుల మానవీయ సాహిత్య విమర్శనం, సాహిత్య సృజనంతో మొదలైనవి అనడంలో ఇబ్బంది లేదని అంటారు. అయితే జానపద విమర్శ కథలుగా, గాధలుగా ప్రచారంలో వున్నాయి. అవి కవుల జీవితాలు, జీవిత చరిత్రలు, కావ్యచరిత్రలు, రాజులు రాజాస్థానాల కవిత సృజనాల సమాచారం గ్రంథస్థం కావించే కాలంలో సాహిత్య చరిత్రకారులు జానపద సాహిత్య విమర్శను తమ గ్రంథాలలో పేర్కొన్నట్లుగా సిద్ధాంతీకరించారు. అదే కోణంలో తిక్కన భారతాంధ్రీకరణ, జానపదుల అభిష్టం, గురునాథుడు అన్వయం చెప్పినట్లుగా ఉన్న కథను పరిశీలిస్తే,

ఉదా॥ "తిక్కన అనువాద రీతిలో చెప్పే కవిత్వం, ఒకసారి చెబితే మళ్ళీ మార్చుకోదనే ప్రతిజ్ఞ ఉందని ప్రఖ్యాతి. ఉందో లేదో నిర్ణయానికి వీలులేదు. కాని ప్రతిజ్ఞా భంగం కాకుండా భారతాంధ్రీకరణం చేశాడని జానపదులు విశ్వసించారు. అందుకే ప్రచారం చేశారు. తిక్కన తాను చెబుతున్న పద్యం ముగించక గురునాథా ఇంకేం చెప్పేది అని అడిగాడని, గురునాథుడు తనను ప్రశ్నించాడని గ్రహించక, కురునాథుణ్ణి ప్రశ్నించాడని భావించి 'ఏమి చెప్పదున్ గురునాథా'గా వ్రాశాడని, ఆపైన వ్రతభంగమని తిక్కన చింతిస్తుంటే కాదని గురునాథుడు అన్వయం చెప్పినట్లుగా జానపద సాహిత్య సమన్వయ కథ ప్రచారంలో ఉంది". అని తెలిపారు.

అలాగే శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయులు, కాకతీయులు, కవుల ఇంటి పేర్లు మొదలైన వాటి ఆధారంగా జానపదుల అభిమానం, ఆనందం, దృక్పథం, నిర్ణయం ఆసక్తి, అభిమతం మొదలైన కోణాలలో విమర్శనాత్మకమైన పరిశీలన చేశారు.

అలాగే జానపదుల వినోద సాహిత్యం, వ్యాఖ్యానం, రెండర్థాలలో జానపదుల అంతరార్థ భావాలు, జానపదుల జీవితంలో బూతు ప్రయోగాలు - విమర్శలు, కవుల చుట్టూ అల్లుకున్న కథలు. ఉదాహరణకు తెలుగు సాహిత్యంలో తెనాలి రామలింగకవికి సంబంధించినవి. అలాగే జానపదుల భాషకు సంబంధించిన విశ్లేషణలో మాండలిక వైవిధ్యంతో కూడిన విమర్శా దృక్పథాన్ని సమీక్షించారు.

ఉదా : 1. గుంటూరు మాండలికం భాష మాట్లేడే వ్యక్తి, అనంతపురం మాండలికంలో మాట్లాడే వ్యక్తితో జరిగిన సంభాషణను పరిశీలించవచ్చు.

'హుబ్లి పోయే అమరావతి'లో గుంటూరు నుంచి గుంతకల్ వచ్చిన గుంటూరు ప్రాంతం మనిషి, అనంత పురం ప్రాంతం మనిషిని అడిగాడు.

'ఈ రైలు బళ్ళారిలో ఆగుద్దా?'

అనంతపురం మనిషి నవ్వాడు. అన్నాడు.

'ఏగుద్దా?'

గుంటూరు మనిషి మళ్ళీ అడిగాడు. 'ఎందుకేగదు. ఏగుద్దనే కదా ఎక్కింది. ఆగుద్దా అని అడిగేది?'

'ఇప్పుడు సాగుద్దా?'

'తెలియదు. ఆగదా!'

'ఆగుద్దాంటే ఆగుద్దే సాగుద్దా అంటే సాగుద్దే. ఏగుద్దంటే ఏగుద్దే!' అని అనంతపురం ప్రాంతం మనిషి నవ్వేడని చెబుతూ ఉంటారు.

గుంటూరు మనిషికి ఏమీ అర్థం కాలేదు. రైలు బళ్ళారిలో ఆగుతుందో ఆగదో తెలియలేదు. అనంతపురం మనిషి ఆనందంగా ఉన్నాడు. ఆ ఆనందార్థం ఏమిటో కూడా గుంటూరు మనిషికి తెలియలేదు.

ఆగుద్దా అన్నప్పుడు వినిపించిన బూతు గుంటూరు మనిషికి తెలియదు. అనంతపురం మనిషికి తెలిసింది. ఆ మనిషి దీన్ని మిత్రులతో చెప్పాడు. క్లబ్బుతో, యూనివర్సిటీలో, రైల్వేస్టేషన్‌లో ఈ కథా వ్యాఖ్యానం చేసిన సరసులు చాలా మందిని చూశాను. జరిగిన సంఘటన కథగా మారింది. కథకు వ్యాఖ్యానం మొద లయింది. ఈ విమర్శన సాహిత్యం విశేష ప్రచారాన్ని సంతరించుకొంది" అని చమత్కరించారు.

అలాగే

ఉదా : 2 "కూరగాయలు అమ్మే ఆమెతో సంభాషణ"

కాయలు పట్టి చూస్తూ "గట్టిగా ఉన్నాయా?" అడిగాడు జానపదుడు.

"పట్టి చూశావుగా తెలియలేదా?" ఆమె తిరిగి అడుగుతుంది.

'ఒక మాదిరిగా ఉన్నాయి' అంటాడు.

'ఉన్న వవ్వి!' అంటుంది.

'ఇవి దబ్బకాయలా, నిమ్మకాయలా?'

'అవి ఏం కాయలో కూడా తెలియలేదా? తెలియదా?'

'రేటు ఎట్లా?'

'కొనే ముఖమేనా?'

'కొందామనే'

'దబ్బకాయలో, నిమ్మకాయలో తెలియకుండానే కొంటావా?'

'తెలిసుకొందామనీ!'

'తెలుసుకొన్నాంక రా పో'

ఆమె గడుసరి. అతను కొత్త బిచ్చగాడు. ప్రయత్నిం చాడు. ఫలితం కలగలేదు. ఆమె కిష్టంలేదు. వాడు సాధించలేకపోయాడు. కథ విఫలం. విషాదాంతం. ఇది జరిగినకథ. కావ్యం వంటిది. దీని విన్న మరో కూరగాయల బేరగాడు మననం చేసుకొంటాడు. సాహిత్య సన్నివేశం మననం చేసుకొన్నట్లు పక్కవాడితో చెబుతాడు. చేప్పేటప్పుడు పాత్రల్ని పరిచయం చేస్తాడు. సందర్భం విశదీకరిస్తాడు.

ఇక జానపద విమర్శ లక్షణాలను తెలియజేస్తూ దీనిలో వాళ్ళ ఊహ ఆలోచనలు మాత్రమే ప్రతి బింబిస్తాయి. దీనిలో కవితాదృష్టి జానపదుల దృష్టి, దైవదోహద సాహిత్యం, జానపదుల విమర్శ, రాజుల కవుల సంబంధం - జానపదుల నిర్ణయం ఇలా అనేకాంశా లను చారిత్రక, సాహిత్యాంశాలను జానపదుల దృష్టిలో విమర్శా విశ్లేషణ చేయడం జానపద విమర్శ నూతన దృక్పథంగా భావించవచ్చును. జానపద సాహిత్య విమర్శలో భాగంగా జానపద గేయాలకు ఆచార్య జి.ఎస్.మోహన్ గారు తెలిపిన లక్షణాలు మరియు ఆచార్య కొలకలూరి మధురజ్యోతి క్రోడీకరించిన మరికొన్ని లక్షణా లను సమన్వయం చేస్తూ నూతన లక్షణ ప్రతిపాదన

చేశారు. అలాగే జానపద సాహిత్య వర్గీకరణ జానపద సాహిత్య విమర్శ స్థానం తెలియజేస్తూ ప్రసిద్ధ జానపద పరిశోధకుల వర్గీకరణ, విశేషాలను తెలియజేశారు. అదే విధంగా జానపద కథలు, గద్య కథనాలు మొదలైన అంశాలను సూత్రబద్ధంగా విమర్శనాత్మక వ్యాఖ్యానం చేశారు.

సింహావలోకనంలో వ్యక్తీకరించిన అంశాలు వారి జానపద సాహిత్య విమర్శ పట్ల గల వారి పరిపూర్ణ అవగాహన చక్కని నిదర్శనం. ఒకానొక సందర్భంలో నిర్ణయం చేస్తూ "ప్రాచీన సమాజాలు జానపద జనజీవన నిలయాలు. అక్కడే ప్రభవించింది జానపద సాహిత్యం. ఆధునిక సమాజంలో జానపదం మారి జ్ఞానపదం మొదలవుతుంది" అని అంటారు.

ఈ విధంగా జానపద సాహిత్యాన్ని ఒక క్రమబద్ధమైన అధ్యయనంలో చారిత్రక, సామాజిక, సాహిత్యాంశాలను నేపథ్యంగా జానపదుల దృష్టిలో నుండి పరిశీలించిన విధానం ఇప్పటి వరకు వచ్చిన జానపద సాహిత్య విమర్శలో ఒక నూతన అధ్యాయంగానే చెప్పవచ్చు. జానపద సాహిత్యాన్ని తన అనుభవ రూపంలో ఆస్వాదించి, తర్కించి ఒక సూత్రబద్ధమైన విమర్శను పాఠకలోకానికి అందించారు ఆచార్య ఇనాక్ గారు. తెలుగు వ్యాకరణానికి చిన్నయ సూరిగారి బాలవ్యాకరణం ఎలా దిక్సూచిగా ఉందో అలాగే జానపద సాహిత్యానికి ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి జానపద సాహిత్య విమర్శ అంతటి ప్రాధాన్యతను సంతరించుకుంది. జానపద సాహిత్యంపై విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే ఎన్నో పరిశోధనలు జరిగాయి. ఎందరో మేధావులు జానపద సాహిత్యంపై విశేషమైన గ్రంథాలు వెలువరించారు. అవి అన్నీ జానపద సాహిత్య మనుగడకు, విస్తృతికి ఎంతగానో దోహద పడుతున్నాయి అనడంలో సందేహం లేదు.

ఆధునిక జ్ఞానపదంగా ఉన్న జానపదాన్ని మరో మలుపు తిప్పిన గ్రంథం ఆచార్య ఇనాక్ గారి "జానపదుల సాహిత్య విమర్శ". ఇక మీదట జానపద సాహిత్యంపై కృషి చేసే పండితులు, పరిశోధకులు ఆచార్య ఇనాక్‌గారు సూచించిన నూతన దృక్పథం వైపు పయనిస్తే విశేషమైన ఫలితాలు అందుతాయి అనడంలో సందేహం లేదు. సృజనాత్మక సాహిత్య విమర్శ చేయడం సర్వసాధారణం. కాని మౌఖిక సాహిత్యం, ప్రచారంలో ఉన్న సాహిత్యాన్ని ఒక క్రమబద్ధమైన సూత్రానుగుణంగా తీర్చిదిద్దడం ఆచార్య ఇనాక్ గారికే సాధ్యమైనదని భావిస్తున్నారు. ఇప్పటి వరకు జానపద పండితులు ఆలోచించని నూతన మార్గంలో పయనించి విశేషమైన నిర్మాణాత్మక విమర్శా దృక్పథాన్ని ప్రకటించిన ఆచార్య ఇనాక్ గారు జానపద సాహిత్యం విమర్శకు దిక్సూచిగా నిలిచారు. వీరు జానపద సాహిత్య విమర్శా రత్నంగా సాహితీలోకంలో చిరస్థాయిగా నిలుస్తారు. వారి జానపద విమర్శా దృక్పథం భవిష్యత్తు సాహితీ లోకానికి మార్గదర్శకత్వం వహిస్తుందని భావిస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. విమర్శ శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య 2. తెలుగు సాహిత్యంలో విమర్శ - పాటిబండ మాధవ శర్మ
3. విమర్శ - 2009 - డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
4. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమలోకనం -సం.పా.ఆచార్య గజ్జర్లమూడి కృపాచారి బృందం
5. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై పరిశోధన -సం.పా.డా॥రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఆచార్య కొళ్ళాగుంట ఆనందన్
6. జానపదుల సాహిత్య విమర్శ - ఆచార్య కొలకలూరి ఇనాక్
7. జానపద విజ్ఞానధ్యయనం - ఆచార్య జి.యస్.మోహన్.

★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగుభాష వ్యాప్తి - అమలు విధానం

-వై. శశికుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

భారతదేశంలో అత్యధికంగా మాతృభాషగా మాట్లాడే భాషలలో తెలుగు నాలుగో స్థానంలో ఉంది. భారత దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 82 మిలియన్ల మంది మాట్లాడేవారున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషగా మాట్లాడే భాషల జాబితాలో 15వ స్థానంలో ఉంది. వేల సంవత్సరాల చరిత్ర కల్గిన తెలుగు భాష నేడు, తెలుగు రాష్ట్రలలోనే రోజు రోజుకు పతనా వ్యవస్థకు చేరుకుంటుంది. భారత స్వాతంత్ర సంగ్రమంలో కావచ్చు, ఆంధ్ర ప్రజలు తమిళుల నుండి ఏర్పడటంలో కానీ, మరి ముఖ్యంగా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో తెలుగు భాషా, సాహిత్యాలు కీలక పాత్ర పోషించాయి. రాష్ట్రంలో ఉన్న ఆదివాసిలు, ముస్లింలు, ఇతర భాషలకు చెందిన భాషలు కూడా, ఈ రోజు తెలుగు భాషలో భాగస్వామయ్యి తెలుగు భాషతో కలిసిపోయాయి. తెలంగాణలోని తెలుగు భాషకు పూర్వకాలం నుండి ఎంతో చరిత్ర ఉన్నట్లు హిందూ మత గ్రంథాల ఆధారంగా తెలుస్తుంది. ఈ ప్రాంతాలను ఎందరో పాలించిన తెలుగు భాష తన అస్థిత్వాన్ని కోల్పోలేదు. కాని నేడు ప్రపంచీకరణ పేరుతో అన్య భాషలు చేసే దాడితో తెలుగు భాష మెల్లమెల్లగా తన ఉనికినే కోల్పోతుంది.

భారతదేశంలో 1961లెక్కల ప్రకారం మొత్తం 1652 భాషలుంటే, 2011 నాటికి వీటి సంఖ్య 1369 కి వచ్చింది. దాదాపు 283 భాషలు గడిచిన 50ఏళ్ళలోనే అంతరించి పోయ్యాయి. 50ఏళ్ళ కింద సంఖ్య పరంగా దేశంలో తెలుగు మాట్లాడేవాళ్ళ సంఖ్య మూడవ స్థానంలో ఉంటే (హిందీ, బెంగాలి, తెలుగు) 2011లెక్కల ప్రకారం నాల్గవ స్థానంలోకి చేరింది. మూడవ స్థానంలోకి మరాఠీ భాష చేరడం విశేషం. ఒకప్పుడు ఆంగ్లేయ అధికారి సర్ జార్జ్ గియర్సన్ దేశంలోని భాషలన్నింటిపై సర్వే చేసి లింగ్విస్టిక్ సర్వే ఇన్ ఇండియా అనే పుస్తకంలో పొంద పరిచాడు. ఆ తర్వాత కాలంలో ఈ భాషలన్నింటిపై సర్వేను కేంద్రం చేపట్టాలి. కాని నేటికి కూడా ఆ ప్రయత్నాలు జరుగలేదు. దేశంలో 1652 భాషలుంటే, అందులో కేవలం 22భాషలను మాత్రమే భారత రాజ్యంగం ద్వారా గుర్తింపును ఇవ్వడం, మిగిలిన భాషలను విస్మరించడం వంటి అంశాల వల్ల కుడా దేశంలో భాషలు కనుమరుగవ్వడానికి ప్రధాన కారణం. ఏ సమాజంలో అయితే ప్రజలు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు అవుతారో, ఆయా దేశాలే అభివృద్ధిలో ముందు ఉంటాయి. భారత రాజ్యంగంలో ఆర్టికల్ 19 ప్రకారం తమ భావాలను వ్యక్తం చేసే హక్కు ప్రతి భారతీయుడికి ఉండి కాని, నేడు భాషాంతరాల వల్ల, స్థానిక భాషలను పరిపాలనలో భాగస్వామ్యం చెయక పోవడం వల్ల కూడా భారతదేశం వంటి దేశాలు ఇంకా అభివృద్ధి చెందక పోవడం, ప్రజాస్వామ్యంలో భాగం కాలేకపోతున్నారు. 1961 జనాభా గణన ప్రకారం దేశంలో హిందీ తర్వాత అత్యధిక మంది మాట్లాడే భాషలో తెలుగు రెండవ స్థానంలో ఉండేది. 1971 లెక్కల ప్రకారం మూడవ స్థానంలోకి, 2011 లెక్కల ప్రకారం నాల్గవ స్థానంలో పడిపోయింది. అందుకే చాలా ప్రాంతాలలో ప్రజలు పరిపాలనలో ఇంకా భాగస్వామ్యులు కావడం లేదు. కాని అమెరికాలో మాత్రం సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ సర్వే ప్రకారం 2010 నుండి2017 మధ్యకాలంలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య దాదాపు 5లక్షలకు చేరింది.

ఆంగ్ల సామ్రాజ్య వలస విధానం వల్ల ప్రపంచంలోని చాలా ప్రాంతీయ భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉందని, అందులో తెలుగు కూడా ఉందని 1999సం యునెస్కో హెచ్చరించింది. భారతీయ సమాజంలో ఉన్న అనేక ఆర్థిక, సామాజిక అసమానతలతో, కుల

వ్యవస్థలతో అనేక అంతరాలతో అనేక అవస్థలు పడు తుంది. ఫలితంగా నేటికి కూడా చాలా సమాజాలు విద్యకు దూరంగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రపంచీకరణ పేరుతో ఒకవైపు ఆంగ్ల భాష, దేశ భాష అని చెప్పుకుంటూ హిందీ ఒకవైపు దాడి చేస్తున్నాయి. ఇవి మాత్రమే సరిపోదు అన్నట్లుగా నేడు సంస్కృత భాషను ప్రాంతీయ భాషలకు పోటిగా ఆయా సమాజాలపై రుద్దుతున్నారు. కేవలం ఆంగ్లంలో మాత్రమే చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే అపవాదాన్ని అందరు నమ్ముతున్నారు. కాని నేడు ఇజ్రాయిల్ దేశ జనాభా కేవలం 93 లక్షలే. అయినప్పటికి నేడు ప్రపంచ దేశాల ముందు శక్తివంత మైన దేశంగా ఎదిగింది. కారణం వారి మాతృభాష అయిన హిబ్రూ భాషలో విద్యా బోదన అందించడమే. అంతే కాకుండా ప్రపంచంలో అతిపెద్ద జనాభా కలిగిన చైనా దేశం కూడా ఆర్థిక అభివృద్ధిలో భారత్ కంటే ముందుంది. విస్తిర్ణంలో అతి పెద్ద దేశం రష్యా, జపాన్, జర్మనీ వంటి చాలా దేశాలు అభివృద్ధి చెందడమే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచ దేశాలకు మార్గదర్శకం అయ్యాయంటే ప్రధాన కారణం ఆయా దేశాలు మాతృభాషలో విద్య బోదనను చేయడమే.

దేశంలోనే మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం మన తెలుగు దేశమే. కాని నేడు అభివృద్ధికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. భారతదేశంలో కవులకు, కళాకారు లకు, భాషావేత్తలకు విలువ ఉండదు కాని, యూరప్ దేశాలలో కవులను, వారు ఉపయోగించిన వస్తువులను, వాళ్ళు నివసించిన ఇళ్ళను జాతి సంపదగా గుర్తిస్తారు.

2004 సం. కేంద్ర ప్రభుత్వం తమిళ భాషకు, 2005 సంస్కృత భాషకు, 2008సం. తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన హోదా ఇవ్వడం జరిగింది. ఇలా ప్రాచీన హోదా వచ్చిన భాషాలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వందకోట్ల నిధులను ఇస్తుంది. ఈ నిధులతో రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు క్లాసికల్ లాంగ్వేజ్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్సిస్టిట్యూట్, తెలుగు డెవలప్‌మెంట్ కౌన్సిలుంగ్ వంటివి ఏర్పాటు చేసి భాషల అభివృద్ధికి తోడ్పడవచ్చు. ఈ నిధుల ద్వారా మాతృభాషలో విద్యాభ్యాసం చేసిన ప్రతి ఒక్కరిని జీవనోపాధి లభించడమే కాకుండా తెలుగు భాషను సజీవంగా ముందు తరాలకు అందించడం జరుగుతుంది.

మాతృభాష ఉపయోగం, పరిరక్షణను గురించి పత్రికా, సమాచార సాధనాలు కీలక పాత్ర పోషించాలి. ఉన్నత న్యాయ స్థానాలలో కూడా తీర్పులు తెలుగు భాషలలోనే వచ్చేటట్లు, కోర్టులలో తెలుగు భాష వినియోగం పెరిగేటట్లు న్యాయ స్థానాలు కూడా చొరవ చూపాలి. THE TELANGANA SHOPS & ESTABLISHMENTS RULES, 1990 చట్టం ప్రకారం రాష్ట్ర పరిధిలో ఉన్న దుకాణాలకు పేర్లను తెలుగు భాషలో పెట్టేటట్లు చట్టాలను అమలు చేయాలి. అంతే కాకుండా 2018 సం. శాసన సభలో ''తెలుగు కంపల్సరీ ఆక్ట్'' తీసుకువచ్చారు. ఈ ఆక్ట్ ప్రకారం ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు తెలుగును ద్వితీయ భాషగా అమలు చేయని స్కూళ్ళపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. తమిళనాడు తరహాలో మాతృభాష పరిరక్షణ అనే అంశాన్ని అన్ని పార్టీలు తమ ఎన్నికల మానిఫేస్ట్ లో పెట్టేటట్లు ప్రజలందరు పెద్ద ఎత్తున భాషా ఉద్యమాన్ని చేపట్టాలి. అంతేకాకుండా 1966సం. వచ్చిన అధికార భాష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. రాష్ట్రంలో ఉన్న భాష పరమైన సంస్థలకు ప్రభుత్వాలు ఖచ్చితంగా నిధులను కేటాయించి తెలుగు భాష పరిరక్షణకు పెద్ద పీట వేయాలి. తమిళనాడు తరహాలో మాతృ భాషలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వ విద్యా, ఉద్యోగాలలో 10% ప్రత్యేక రిజర్వేషన్లను అమలు చేయాలి. పరిశోధన చేస్తున్న పరిశోధక విద్యార్థు లకు సెంట్రల్ యూనివర్శిటీలు ఇస్తున్న విధంగా, నాన్ నెట్ ఫెలోషిప్ ను అందించాలి. తెలుగు రాష్ట్రాలు తెలుగు భాషకు సంబంధించి ఒక ప్రత్యేకమైన తెలుగు శాఖను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి, తెలుగు భాషా అభివృద్ధికి,

భాషా పరిరక్షణకు సంబంధించిన చర్యలను తీసుకునేలా చూడాలి. దేశానికి కాని, తెలుగు రాష్ట్రాలకు గాని ఏదైనా విపత్తులు కాని, సంక్షోభాలు కలిగినప్పుడు విదేశాలలో స్థిరపడిన తెలుగువాళ్ళూ తమ తమ శక్తి మేరకు సహాయం చేస్తున్నారు. కాని ఇతర ప్రాంతాలలో స్థిరపడిన తెలుగు వాళ్ళు (ప్రవాసాంధ్రులు) తెలుగు భాషలకు చేస్తున్న సేవలకు గాని, వీళ్ళ రచనలకు కాని, పరిశోధనలకు గాని రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదు. కాబట్టి వీళ్ళకు కూడా సరైన గౌరవం అందించి, భాషాభివృద్ధిలో భాగం చేయాలి. వీళ్ళకు కూడా ఉన్నతమైన గౌరవం కల్పించాలని కోరుతున్నాం. తెలుగు దేశంలోని ప్రతి జిల్లాకు ఒక సాహిత్య సాంస్కృతి సంస్థను ఏర్పాటు చేసి, వెలుగులోకి రాని కవులను, వారి రచనలను, అంతరించిపోతున్న కళలను కాపాడాలి. తెలుగు భాషకు సంబంధించి కాలానికి అనుగుణంగా కంప్యూటర్ ల్యాబ్ లను, సాంకేతికతతో కూడిన కోర్సులను ప్రవేశపెట్టాలి. తెలుగు భాష రెండు ఉమ్మడి రాష్ట్రాలకు సంబంధించిన అంశం. కానీ నేడు ప్రాచీన అధ్యాయన కేంద్రాన్ని కేవలం ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే పరిమితం చేశారు. ప్రస్తుతం నెల్లూరులో ఉంది. ఈ ప్రాచీన అధ్యాయన కేంద్రానికి సంబంధించిన శాఖలను తెలంగాణలో కూడా ఏర్పాటు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఇంజనీరింగ్, వైద్యం చదువులను తెలుగులో నేర్పబోతున్నది. తను ఇచ్చే ఉద్యోగాల కోసం తెలుగులో పరీక్షలు పెట్టుతున్నది. ప్రభుత్వ బాంకుల ఉద్యోగులు ఇతర రాష్ట్రాలకు కూడ వెళ్ళే అవకాశం కూడా ఉంది. అందుకని మన రాష్ట్రమే విడిచిపోని మన ఉద్యోగుల కోసం జరిగే పరీక్షలు తెలుగులో ఉండేటట్లు పోరాటం చేయాలి.

తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి తెలుగు వాడి బాధ్యత. భాష అంటే కేవలం భావ వ్యక్తికరణకు మాత్రమే ఉపయోగపడే సాధనం కాదు. మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మన కట్టుబాట్లు, మన పూర్వీకుల జ్ఞాపకాలు, మన పూర్తి అస్థిత్వమే ఇందులో నిమిడి ఉంటుంది. భాషలను ఏ సమాజనైనా సరే ఇతర సమాజాలకు, ఇతర సంస్కృతులకు బానిసలను చేయాలంటే ముందుగా ఆయా సమాజాలకు సంబంధించిన భాషలను నాశనం చేస్తే సరిపోతుంది. కాబట్టి తెలుగు భాష పరిరక్షణ మనందరి బాధ్యత.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చరిత్ర తలవని నంగేలి

- డా॥. పెండ్యాల లావణ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

- డా॥. బూసి వెంకటస్వామి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

చరిత్ర పుటల్ని తిరగేస్తే ఎంతోమంది సంఘ సంస్కర్తలు, ఉద్యమకారులు, పోరాట యోధులు కనిపిస్తారు. దేశ స్వతంత్రం కోసం పోరాడిన వాళ్ళు కొంతమందైతే, తమ ఉనికిని కాపాడుకోవడానికి చేసిన ఉద్యమకారులు ఇంకొంతమంది ఎన్ని ఉద్యమాలు, పోరాటాలు జరిగినా అన్నింటిలోను స్త్రీలు పాల్గొన్నారు. నాటి నుండి నేటి వరకు సమాజంలో వర్గపోరు జరుగుతూనే ఉంది. వర్గపోరును ఎదిరించిన వారిలో స్త్రీలు కూడా ఉన్నారు. అయితే ఉద్యమాలు, పోరాటాలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కోరకంగా ఉంటాయి. ప్రపంచం లోని అన్ని సమాజాలలో ఏదో ఒక రకమైన వివక్షలు, అంక్షలకు ప్రజలు గురి అవుతూనే ఉన్నారు. మనకు కొన్ని అంక్షలు, వివక్షలు గురించి మాత్రమే తెలుసు. కాని మనం చరిత్ర పుస్తకాల్ని తిరగేస్తే నమ్మశక్యంకాని అంశాలు వెలుగు చూస్తాము. సమాజంలో ఎన్నో రకాల పన్నులు విని ఉన్నాము. పన్నులను ప్రభుత్వ అధికారులకు చెల్లిస్తూనే ఉన్నాము. అయితే మనం పన్నులను కేవలం వస్తువులకు మాత్రమే చెల్లిస్తాము. మానవ శరీర భాగాలపై పన్నులు విధియు పంస్కృతి, ఆచారాలను మనం విని ఉండలేదు. అందులోను ముఖ్యంగా స్త్రీల రొమ్ములపై ప్రత్యేకమైన పన్ను కలిగిన ప్రాంతం. ట్రావెన్కోర్. ఇది కేరళ, తిరువనంతపురంలో భూగం. కేరళ ట్రావెన్కోర్ (తిరువనంతపురం) రాజ్యాన్ని పరిపాలించిన రాజులు స్త్రీల రొమ్ములపై పన్నులు విధించేవారు. ఈ పన్నులు చెల్లించ డానికి మహిళలు చాలా ఇబ్బందులు పడేవాళ్ళు. ఈ రొమ్ముల పన్నును కట్టకుండా ధైర్యంగా ఎదిరించిన స్త్రీ మూర్తి నంగేలి. తన ప్రాణ త్యాగంతో మిగిలిన స్త్రీలను చైతన్యవంతం చేసి రొమ్ము లపై పన్నును పూర్తిగా ఎత్తివేసేలా చేసిన త్యాగధనురాలు.

18వ శతాబ్దంలో కేరళను ట్రావెన్కోర్ మహారాజు మార్తాండవర్మ పరిపాలించేవాడు. మార్తాండ వర్మ రెండు రకాల పన్నులను విధించేవాడు. ఒకటి స్త్రీల కోసం 'ముళక్కారం' అనే పన్ను వసూలు చేసేవాడు. ముళక్కారం అంటే 'రొమ్ము పరిమాణ పన్ను'. స్త్రీల యొక్క రొమ్ములు పరిమాణాలు ఎంత పెద్దగా ఉంటే అంత పన్ను వసూలు చేసేవాళ్ళు. రెండవది 'తలక్కారం' పన్ను. ఇది కేవలం పురుషులకు విధించే పన్ను. పరుషుల గడ్డాలు, మీసాలు పెంచుకోవాలంటే తలక్కారం పన్ను కట్టి తీరాల్సిందే. ట్రావెన్కోర్ రాజ్యంలో ఉన్నత వర్గాలకు చెందిన బ్రాహ్మణ, ధనికులైన స్త్రీలకు ముళక్కారం పన్ను వర్తించదు. ఉన్నత వర్గాలకు చెందిన స్త్రీలు మాత్రమే వక్షోజాలపై దుస్తులు ధరించాలి. గిరిజన, బడుగు, బలహీన వర్గాల స్త్రీలు వక్షోజాలపై వస్త్రాన్ని ధరించకూడదు. అలా ధరించాలంటే రాజుకు పన్ను కట్టాల్సిందే. పన్ను చెల్లించకుండా రవికెను ధరిస్తే కఠినమైన శిక్షలు అమలు పరిచేవారు. అగ్ర కులాలకు చెందిన స్త్రీలు లోన రవికె వేసుకుని పైనచీరకొంగు కప్పుకునే అర్హత ఉండేది.

బడుగు, బలహీన గిరిజన వర్గానికి చెందిన స్త్రీ, పురుషులు ముక్కారం, తలక్కారం చెల్లించలేక, రాజును ఎదిరించలేక బానిసలుగా బతికేవాళ్ళు. రాజుకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై శిక్షలు కఠినంగా ఉండేవి. దీనికి ప్రధాన కారణం పేద ధనికుల మధ్య ఉండే వ్యత్యాసమే. పేదవాళ్ళు ధనికులవ్వడం ధనిక వర్గాలకు ఇష్టం ఉండేది కాదు. పేదవాళ్ళు పేదవాళ్ళ లాగానే

ఉండాలి. వాళ్ళకు సంపద కలిగితే తమ మాట వినరనే భావనతో ఉండేవారు. కేరళలో కూడా ఒకప్పుడు ఇవే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అప్పట్లో కుల వ్యవస్థ రాజ్యమేలింది. నిమ్న కులాలను అణగదొక్కడానికే రాజులు పనిచేసేవాళ్ళు. పేదలకు వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని కూడా లాక్కొనేందుకు పన్నులు విధించే వారు.

ట్రావెన్కోర్ రాజ్యంలోని అలపుళా జిల్లా చేర్తాల (చేరితాలా) గ్రామంలో కండప్పన్, నంగేలీ దంపతులుండే వాళ్ళు. సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబం. ట్రావెన్కోర్ సంస్థానంలోని అంక్షలను వ్యతిరేకించిన ఏకైక మహిళ నంగేలీ. భర్తతోపాటు భార్య కూడా పొలం పనులు చేస్తుండేది. నంగేలీ దంపతులు నిమ్నవర్గాలకు చెందిన వాళ్ళు. నంగేలీని భర్త చాలా ఆప్యాయంగా చూసుకునే వాడు. నంగేలీ కూడా భర్త పట్ల అంతే ప్రేమను కనపరిచేది. ట్రావెన్కోర్ సంస్థానంలో ప్రతినెల రొమ్ము పరిణామ పన్నులు వసూలు జరుగుతుండేది. డబ్బులు లేక పన్ను చెల్లించమని చెప్పే స్త్రీలను వాళ్ళ భర్తల ఎదుటనే అధికారులు మానభంగం చేసేవారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక కొంతమంది తనువు చాలించేవారు. భర్తలకు దూరమయ్యేవారు. కొందరు అధికారులు పన్ను మినహాయింపు పేరుతో స్త్రీలను లోబర్చుకునేవాళ్ళు. అప్పట్లో అగ్రవర్ణాలదే పైచేయి. వాళ్ళని ఎదిరించే శక్తి లేక బడుగు, గిరిజన బలహీనవర్గాల ప్రజలు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ గడిపేవాళ్ళు. నంగేలీ కూడా మొదలట్లో అధికారులకు భయపడింది. తరువాత రవికె లేకుండా పనులకు వెళ్తుంటే అధికారుల చూపులు ఆమెకు గునపాలు గుచ్చుకున్నట్లుగా తోచాయి. అందుకే నంగేలీ ఒక నిర్ణయానికి వచ్చింది. డబ్బు ఉన్న ఇళ్ళల్లోని ఆడవాళ్ళు రవికె వేసుకుంటే పన్ను చెల్లించక్కర్లేదు. మేము ఎందుకు పన్ను చెల్లించాలని నిలదీసింది. ఎవరైనా అధికారులు ఇంటికి వస్తే అగ్రకులాల స్త్రీల లాగా మేము ఎందుకు రొమ్ములు కనిపించకుండా వస్త్రాలు ధరించ కూడదని ప్రశ్నించింది. తాను ఎప్పుడు అర్ధనగ్నంగా తిరగనని చెప్పి తన రొమ్ములను కప్పి ఉంచేది. పన్ను కోసం అధికారులు ఇంటికి వస్తే తన రొమ్ములను చూపించనని మొండికేసేది. ఇందుకు ఆమె భర్త కూడా మద్దతివ్వడంతో నంగేలీ ధైర్యంగా పన్ను విధానాన్ని ఎదుర్కోగలిగింది. ఒంటరి పోరాటం వలన ఫలితం ఉండదని భావించిన నంగేలీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగ ప్రదేశాల్లో కూడా వస్త్రాలు ధరించి తిరిగేది. పన్ను కట్టమని అధికారులు అడిగినా పట్టించుకునేది కాదు. ఆమె తీరు తోటి స్త్రీలలో ధైర్యాన్ని నింపింది. నంగేలీ లానే మిగతా స్త్రీలు కూడా వస్త్రాలు ధరించి వీధుల్లోకి రావడాన్ని చూసిన అధికారులు వ్యతిరేకతను జీర్ణించుకోలేకపోయారు. విషయం తెలిసి మార్గాండ వర్మ అధికారులను మందలించి శిక్ష విధించమని ఆజ్ఞాపించాడు. నంగేలీకి తగిన శిక్ష విధించడం వలన ప్రజల్లో మళ్ళీ భయాన్ని పెంచాలని భావించారు. రాజు ఆజ్ఞ ప్రకారం భారీ సైన్యంతో పన్ను అధికారి ప్రవతియార్ నంగేలీ ఇంటిని చుట్టుముట్టాడు. నంగేలీని అదుపులోకి తీసుకుని పన్ను వసూలు చేసే ప్రయత్నం చేశాడు. ఆమెపై వస్త్రాలు తొలగించి అత్యాచారానికి సిద్ధమయ్యారు. దీనితో ఆమె వారిని ప్రతిక్కకు నెట్టి పన్ను కడతానని చెప్పి ఇంట్లోకి వెళ్ళింది. ఇంట్లోకి వెళ్ళి పదునైన కొడవలితో తన రొమ్ములను కోసి అరిటాకుల్లో వాటిని పెట్టి రక్తం కారుతున్న ఛాతితో అధికారుల వద్దకు వచ్చింది. ఈ రక్తపు ముద్దలను పన్నుగా తీసుకోండి అంటూ తొలగించిన రొమ్ము భాగాలను అధికారుల ముఖం మీదకు విసిరేసింది. ఆమె చర్యకు భయపడిన అధికారులు అక్కడినుండి వెళ్ళిపోయారు. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే నంగేలీ ప్రాణం విడిచింది. నంగేలీని ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించిన భర్త ఆమె మరణాన్ని తట్టుకోలేకపోయాడు. ఆమె భౌతిక కాయాన్ని దహనం చేస్తుండగా చితిలోకి దూకి ఆమెతోపాటు ఆ జ్వాలల్లో ఆహుతైయ్యాడు. ఇదే దేశంలో జరిగిన మొట్టమొదటి

సతీసహగమనం. ఈ దారుణాలను కళ్ళారా చూసిన ప్రజల్లో ఆగ్రహం కట్టులు తెంచుకుంది. నంగేలీ, ఆమె భర్త కండప్పన్ మరణాలు వృధా పోకూడదని పాలకుల ఆగడాలపై పోరాడితేనే తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని భావించి ప్రాణాలకు తెగించి పోరాటానికి సిద్ధమయ్యారు. మలక్కారం చట్టం వలన నిమ్న కులాల ప్రజలంతా ఒక్కటయ్యారు. అగ్రవర్ణాలపై తిరగబడ్డారు. దీక్షలు, పోరాటాలతో పాలకుల గుండెల్లో వణుకు పుట్టించారు. నిమ్నవర్గాల తిరుగుబాటు వలన అమానుష చట్టాల నుండి విముక్తి లభించింది. దీనితో ట్రావెన్కోర్ రాజ్యంలో నిరసనలు మిన్నంటాయి. ట్రావెన్కోర్ రాజు ములక్కారం, తలక్కారం పన్నులను వెంటనే రద్దు చేశాడు. నంగేలీ పేరు మీదనే ఆ గ్రామానికి 'ములచ్చి పురంబు' (రొమ్ము కోసిన మహిళ) అనే పేరొచ్చింది. నంగేలీ త్యాగం కేరళలో నవ సమాజ స్థాపనకు మార్గం చూపింది. నంగేలీ ధైర్యంగా ఎదిరించకపోయి వుంటే ఇప్పటికీ ఆ సమాజం అలాగే ఉండిపోయేది. నంగేలీ తెగువ నూతన దిశను నిర్దేశించింది. మిగిలిన స్త్రీలల్లో చైతన్యాన్ని తెచ్చింది. నంగేలీకి మద్దుతుగా మిగిలిన స్త్రీలందరు పోరాటంలో పాల్గొని తమ భవిష్యత్ తరాన్ని కాపాడుకోగలిగారు. స్త్రీ శరీరంలో అర్ధభాగంగా నగ్నంగా కనపడమంటే సామాన్యమైన విషయం కాదు. అదులోను రవికె లేకుండా తిరగడమంటే ఇప్పుడు గనక అవి తలచుకుంటే మన రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ప్రపంచ చరిత్రలో ఎక్కడా కూడా ఇటువంటి పన్నుల చట్టాల గురించి విని ఉండము. చరిత్ర పుటల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే మనకు ఇటువంటి దారుణాలు తెలియకపోవు. చరిత్రలో నిలిచిపోయే స్థానం నంగేలీది. తన ప్రాణాలను సహితం లెక్కచేయకుండా భవిష్యత్ తరం కోసం పోరాడింది. ఈ పోరాటంలో తన భర్త తోడ్పాటు కూడా లభించింది. నంగేలీ యొక్క త్యాగం ఒక రకమైన కుల అణచివేతను అంతం చేసింది.

రొమ్ములపై పన్ను విధించడం విచిత్రంగానే అనిపించవచ్చు. అయితే అప్పట్లో దాని గురించి పాలకుల బుర్రల్లో ఒక ఆలోచన ఉండేది. అదేంటంటే ఎవరైతే ఆహారం ఎక్కువగా తింటారో వారి రొమ్ములు పెద్దవి గాను, ఆహారం తక్కువగా తినే వారి రొమ్ములు చిన్నవి గాను ఉంటాయని గుడ్డిగా నమ్మేవాళ్ళు. అసలు ఆహారానికి రొమ్ములకు సంబంధమే లేదు. కాని ఇక్కడ ట్రావెన్కోర్ అధికారులు రొమ్ములు పెద్దవిగా ఉండే మహిళలు వారికి మూడు పూటలా ఆహారం లభిస్తుందని, అంతగా తిండి తింటున్నారంటే వారి ఆర్థిక స్థితి మెరుగ్గా ఉందనే అంచనాకు వచ్చేవారు. పెద్ద రొమ్ములు ఉండే మహిళల నుండి భారీగా పన్నులు వసూలు చేసేవారు. చెల్లించకపోతే అత్యాచారాలు చేసేవాళ్ళు. ఈ అమానుష చర్యలకు నంగేలీ తన ప్రాణత్యాగంతో చరమగీతం పాడింది. ట్రావెన్కోర్ రాజ్యం ధృడమైన కుల వ్యవస్థను పాటించేది. అందుకే స్వామి వివేకానంద ట్రావెన్కోర్‌ని "పిచ్చిశరణాలయం" అని పిలిచేవారు.

ముగింపు :

అణచివేతకు వ్యతిరేకంగా నంగేలీ తన శరీరాన్ని ఛేదించిన గాథ తరతరాలుగా పాఠాలుగా అందించ బడాలి. అయితే నేడు ఆమె కథ కొంతమంది పాత తరం సమయకర్తలు, పరిశోధకుల జ్ఞాపకాలలో మాత్రమే భద్రపరచబడింది. ఆమె త్యాగానికి ఫలితంగా ఆమె పేరుతో ఎక్కడా స్మారక చిహ్నాలు లేవు, ఆమె ధైర్యాన్ని ప్రశంసించే పుస్తకాలు లేవు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పెబ్బిలి హైమావతి కథలు – మానవీయ సంబంధాలు

– పులి చిన్న బాబు, తెలుగు విభాగం, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

సమకాలీన కథ రచయితలలో హైమావతి ఒకరు. కథ, నవల, కవిత్వం నాటకం మొదలగు సాహితీ ప్రక్రియలలో విశేషకృషి చేస్తున్న వీరు సదా చిరస్మరణీయులు. ప్రస్తుత మన సమాజాన్ని సంస్కరింటానికి హైమావతిగారు ఎంచుకున్న మార్గం సాహిత్యం. ఒక వైపు కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే, మరోకవైపు తను నమ్ముకున్న సాహిత్యంలో ఏనలేని కృషి చేస్తున్నా ఈతరం నేటి మేటి కథా రచయిత పెబ్బిలి హైమావతి. ప్రస్తుత సమకాలీన సమాజంలో తలేత్తుతున్న సమస్యలనే ఇతి వృత్తాలుగా స్వీకరించి ఎన్నో అద్భుతమైన కథలు రచిచారు. ఆమె ఎంచుకున్న కథా ఇతి వృత్తాలే ఆమె ఓ మంచి కథా రచయితగా నిలబెట్టాయని చెప్పటానికి ఏలాంటి సందేహం లేదు కందుకూరి వారి "దిద్దుబాటు" ఇది తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటి కథ. ఈ కథా ఇతి వృత్తం కూడా సమాజంలో జరిగే సంఘటనల ఆధారంగా స్వీకరించబడిందే. తన కథా సాహిత్యం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపించారు మన పంతులు గారు ఆయన బాటలోనే నడిచారు ఎందరో కథా రచయితలు వారిలో శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి, ముక్కపాటి, చలం, కో.కు.గోపించంద్, పాలగుమ్మి, మల్లాది మొ॥ ప్రముఖ రచయితలు. వారిలో ఓ ప్రముఖ స్త్రీ వాద రచయిత మన పెబ్బిలి హైమావతి.

పెబ్బిలి హైమావతిగారు విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సమీపంలోని పాటిపల్లి అనే గ్రామంలో 1953, ఫ్రిబవరి 16వ తేదిన యేన్యేటి అప్పన్న, పైడితల్లి దంపతులకు ఆరవ సంతానంగా జన్మించింది. ఆమెకు ముగ్గురు అన్నయ్యలు, ఇద్దరు అక్కలు ఉన్నారు. ఆఖరి సంతానం కావడం వల్ల హైమావతి అన్నయ్యలు అక్కలు ఎంతో ప్రేమగా, అల్లారు ముద్దుగా పెరిగింది. హైమావతి గారిది సంప్రదాయ బద్ధమైన రైతు కుటుంబం మన సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విలువనిచ్చే అసలు సీసలైన తెలుగు కుటుంబం. పెద్దన్నయ్య యేన్నేటి రామారావు ఇంజనీరు. రెండో అన్నయ్య అప్పారావుగారు ఉపాధ్యాయుడు. మూడో అన్నయ్య సత్యరాయణ మూర్తి ప్రొఫెసర్ మరియు కవి, రచయిత. పెద్దక్క ఇంజరపు అమ్మాజి. చిన్నక్క భాను మల్లేశ్వరి ఇరువురు గృహిణులు.

హైమావతి 1957సం॥ అనకాపల్లిలో లక్ష్మీదేవి పేటలోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతిలో చేరి 5వ తరగతిని పూర్తి చేసింది. తరువాత ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (హైస్కూల్) నందు 9వ తరగతి వరకు చదువుకుంది. హైమావతిగారికి 9వ తరగతిలో ఉన్నప్పుడే రచనా వ్యాసంగం పై ఆసక్తి కలిగింది. 1967సం॥ "చెదిరిన మనస్సు" అనే కథను మొట్ట మొదటి సారిగా వ్రాసి రచయితగా తన రచనా ప్రస్తానంను ప్రారంభించింది. ఆమే ఇప్పటి వరకు 100పైగా కథలు, 21నవలు, 10 కవితలు, ఒక నాటకంను రచించారు. హైమావతి గారికి 9వ తరగతి చదువుతున్నప్పుడే వివాహం అయ్యింది. కావున తన చదువును మధ్యలోనే ఆపివేయవలసిన వచ్చింది. తనకు చదువు మీద ఎంతో ఆసక్తి ఉన్నప్పటికి చుదువును కోనసాగించలేక పోయింది. కాని ఆమెకు చదువుపైఉన్న ఆసక్తిని గమనించిన ఆమో భర్త వెంకట సుబ్బరావు గారు ఆమెను ఎంతగానో ప్రోత్సహించారు. భర్త ప్రోత్సహంతో 1969సం॥లో యస్.ఎల్.సిని పూర్తి చేసింది. తరువాత 1986 సం॥ ఆంధ్ర విశ్వవిధ్యలయం నుండి బి.ఏ (పబ్లిక్ ఆడ్మినిస్ట్రషన్)లో డిగ్రీ పూర్తి చేశారు.

హైమావతి రచనలో ఇతి వృత్తాలు కేవలం ఊహా జనితాలుకావు. ప్రతి సామాన్య వ్యక్తుల నిజజీవితాల్లో జరిగే, జరుగుతున్న చిన్న చిన్ని సంఘటనలే అని

చెప్పడంలో అతిశయోక్తిలేదు. ఈ సన్నివేశాలను ఆధారంగా చేసుకొని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చేరువయ్యి, వారి హృదయాలకు హద్దుకోనే అద్భుతమైన పాత్రలను సృష్టించింది. ఈ పాత్రల ఆధారంగానే హైమావతి మానవ సంబంధాలను గురించి చాలా స్పష్టంగా తన ఉద్దేశ్యాన్ని వ్యక్తపరిచారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలై పోయి మానవ జీవితాన్ని మృగ్యం చేశాయని రచయిత్రి తన ఆవేదనని ''అపర్ణ'' కథలో నీలవేణి పాత్ర ద్వారా తెలియపర్చారు. ప్రస్తుత సమాజంలో తల్లీ బిడ్డల సంబంధాలు కూడా ఆర్థిక సంబంధాలతో ముడివేసుకు పోవడం రచయిత్రిని ఎంతగానో కలవర పెట్టింది. కథా సాహిత్యం ఎప్పుడూ కూడా సమాజ శ్రేయస్సుకు, సర్వతో ముఖాభి వృద్ధికి తోడ్పడుతుందని రచయిత్రి ప్రగాఢంగా నమ్మింది. కాని నేటి సమాజంలో మారుతున్న పరిస్థితులకు దృక్పథాలకు అనుగుణంగా మనిషి అలోచనలు మారిపోడం దుర దృష్టకరం. మసిబారి పోతున్న మానవ సంబంధాల గురించి రచయిత్రి తన కథలలో పాత్రల ద్వారా ఆమె చిత్రించిన తీరు ప్రశంసనీయమైంది.

''అపర్ణ'' కథలో సవతి తల్లీ నీలవేణి వికలాంగురాలైన అపర్ణను ఎన్నో చిత్ర హింసలకు గురిచేస్తుంది. మంచి మేరిట్ స్టూడెంట్ అయిన ఆమెను చదివించకపోగా 'కన్యా శుల్కానికి' ఆశపడి అభంశుభం తేలియని అపర్ణ జీవితాన్ని నా శనం చేయటానికి ప్రయత్నించింది. సమాజంలో మానవ సంబంధాలు పూర్తిగా మట్టికొట్టుకుపోలేదని, ఎంతో కొంత మంది మంచి వ్యక్తుల మనస్సులలో ఇంకా పదిలంగానే ఉన్నాయని రచయిత్రి కృష్ణప్రసాద్ పాత్ర ద్వారా రచయిత్రి నిరూపించింది.

ప్రజాసామ్యంలో జాగరూకులైన ప్రజావాళి ఉంటుంది. వీరిటి సామాజిక బాధ్యత ఎక్కువగా వుంటుంది. కాని ఈతరం వారు ఆ సామాజిక బాధ్యతను విస్మరించిం చారని అనిసిస్తుంది. సమాజంలోగాని, కనీసం మన చుట్టు ప్రక్కల ఏమి జరిగినా తనకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అసలు ఈ సమాజంతో నాకు ఎలాంటి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి సామాజిక బాధ్యత లేని వ్యక్తులకు ''ఆత్మ విశ్వాసం జతగా'' కథలో ''గాయిత్రి'' పాత్ర ఎందరినో ఆలోచింప చేస్తుదని చెప్పవచ్చును. తన స్నేహితురాలు 'సుమ' బాగా చదువుకుని, ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగంలో స్థిర పడింది. తన తల్లీ దండ్రులను కాదనుకొని తనకు ఇష్టమైన 'చైతన్య'ను ప్రెమించి పెళ్ళి చేసుకుంది. కాని అత్త మామలు పెట్టి అనేక చిత్రహింసలు భరించలేక పోయింది. కాని భర్త కూడా తల్లీదండ్రులకు ఎదురు చేప్పలేని పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో 'సుమా' జీవితం నాశనమైపోయి ఆత్మహత్య చేసుకోవాలను కునే సమసంలో ''గాయిత్రి'' మంచి మనస్సుతో 'సుమను' ఆదరించి ధైర్యం చేప్పి, తన సంసారాన్ని తానే చక్క పెట్టుకునేతట్లు చేసింది గాయిత్రి. గాయిత్రి ఇది మంచి తనం, మానవత్వంను చాటుకున్న పాత్ర.

''ఎక్కడ స్త్రీలను గౌరవిస్తారో'' ఆ ప్రాంతం పూజింప బడుతుందనేది నానుడి. భారతీయ సమాజంలో స్త్రీకి ఇచ్చిన గౌరవం మరీ ఎక్కడ ఉండలేదంటే అతిశయోక్తి కాదు. మన సమాజంలో స్త్రీకి అంత గౌరవం ఉంది. అలాంటి స్త్రీని ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరై పెళ్ళి చేసుకుంటానని చేప్పి మోసం చేసిన మోహన్ పాత్ర (అమ్మా నన్ను క్షమించవూ) ఈ సమాజంలో తల దించుకునేతట్లు చేసింది. ''అమ్మా నన్ను క్షమింపూ'' కథలో మిశాలిని మోహన్ ప్రేమించారు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఒక బిడ్డకు జన్మనిచ్చి విశాలిని మోసం చేసివెళ్ళి పోయాడు. అప్పటి నుండి ఆమో బ్రతుకు బజారున పడింది. ఆమె కూతురు నవ్య తండ్రిలేని బిడ్డగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన తన తల్లీని వ్యభిచారినిగా చిత్రించింది. అలాంటి వారి కుటుంబంలో సమస్యలు తలేత్తి కుటుంబ నాశనమయ్యే స్థితిలో విశాలి స్నేహితు రాలు మాణిక్యం వారికి సహాయం చేసి ఆ కుటుంబాన్ని నిలబెట్టింది. మాణిక్యం మానవతా ధృక్పదనంతో అమె తన వంతు సాయం చేసింది. నవ్య తన తల్లీ పట్ల

పెంచుకున్న ద్వేషంను పోయేతట్లు చేసి, అమె తప్ప ఏమి లేదని తేలిపర్చిన మంచి మనసున్న మాణిక్యం పాత్ర. ఇది ఎంతో ఆదర్శమైనది.

ఒకే సమాజంలో అందరితో కలసి జీవనం సాగిస్తున్న ప్రజలు తమ మనుగడ సాగించాలంటే ఒకరి పట్ల ఒకరికి నమ్మకం, పరస్పర సహాయ సహకారాలు అందించు కోవడం ఎంతైన అవసరం. కాని ఈ యాంత్రిక ప్రపంచలో మనిషి తన మనుగడను కోల్పోతున్నారు. ఈ సమాజనికి నాకు ఎలాంటి సంబంధం లేదన్న విధంగా తన స్వార్థం తాను చూసుకుంటున్నాడు. అలాంటి స్వార్థపరుల కళ్ళు తెరిపించింది. ''అమ్మంటే'' కథలో లక్ష్మమ్మ పాత్రగౌతమి కోడుకు 'వేదవ్యాస్' తను పుట్టినప్పుడు బిడ్డకు పాలులేక తల్లీ ఎంతో మనోవేదనకు గురైంది. కనీసం ఆవుపాలు అలవాటు చెద్దామనుకుంటే ఆవుపాలు బిడ్డకు సరిపడ లేదు. బిడ్డ పాలకు అల్లాడి పోతుంటే తల్లీ చూడలేక పోతుంది. కాని ఆమె బంధువులుగాని, తన రక్త సంబం ధికులు ఎవ్వరూ పట్టించుకోలేదు. అలాంటి పరిస్థితులలో ఆ ఇంటి పనిమనిషి 'లక్ష్మమ్మ' బిడ్డకు పాలిచ్చి ప్రాణాలను కాపాడింది. తన యజమానురాలు ఓ తల్లిగా పడుతున్న ఆవేదనను అర్థం చేసుకొని తాన చేయగలిగిన సాయం చేసింది లక్ష్మమ్మ, తను ఆ ఇంటి పనిమనిషి అని కూడా చూడకుండా పాలిచ్చి బిడ్డకు పునర్జన్మను ప్రసాదించి తన మానవతా వాదాన్ని చాటుకున్న గోప్ప మానవతా మూర్తి.

ప్రపంచం అంతా డబ్బు చుట్టె తిరుగుతుంది. డబ్బే అంతా మూలం డబ్బు లేకపోతే మానవ జీవితం లేదని భావించి వైవ్యంను వ్యాపారంగా మార్చిన డాక్టరు నీల కంఠంలాంటి డబ్బు పిచాచుల కళ్ళు తేరింపిచిన కథ ''తీలాపాపంతలో పడికిడు'లో డాక్టరు నీల కంఠం పాత్ర వైద్య వృత్తిని వ్యాపారంలా మార్చాడు. కేవలం డబ్బుల కోసం ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న దుర్మార్గుడు. ఈ కరోనా సమయంలో లక్షలకు లక్షలు ఫీజు వసూలు చేస్తున్న డాక్టర్లుకూడా ఆలోచించాల్సిన అవసరం ఎంతైన ఉందని డా॥ నీలకంఠం ద్వారా రచయిత ఈ వైద్య సమాజాన్ని హెచ్చరిస్తుంది. ఎందుకంటే ''వైద్యో నారాయణ క్షహర్ణి'' అంటే డాక్టరు దేవునితో సమానం అని అర్థం బాధా, వేదనా, రోధనతో డాక్టరు దగ్గరకు వచ్చిన రోగిని ఎంతో అప్యాయంగా నవ్వుతూ పలకరించి, మంచి వైద్యం చేసి ప్రాణాలను రక్షిస్తాడు. కాబట్టి ప్రజలకి డాక్టరు నిజంగా దేవునితో సమానంగా ఆదరిస్తారు. అలాంటి డాక్టరు వృత్తికే మచ్చ తెచ్చాడు డా॥నీలకంఠం ''ప్రాణం పోయాల్సిన వ్యక్తే ఒక వ్యక్తి ప్రాణాలు తీసి పాపం మూట గట్టుకున్నాడు''

జీవితంలో డబ్బు సంపాందిచడమే ముఖ్య లక్ష్యం కాదు. కుటుంబం, ర్తసంబంధాలు, మంచి మానవత్తపు విలువ ఎంతో ముఖ్యమని ''జమాతా దశమగ్రహ'' కథలో 'అవధాని' పాత్ర ద్వార రచయిత ఎంతో చక్కగా వ్యక్త పరిచారు. అవధానిగారు తన యావదాస్థిని తన కోడుకుతో పాటు అల్లుడికి కూడా సమానగా పంచిపెట్టి తన మానవత్వాన్ని చాటుకున్నాడు అవదాని గారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పొత్తూరి విజయలక్ష్మి కథలు – మానవ సంబంధాలు

– పి. విజయలక్ష్మి, తెలుగు లెక్చరర్, గుంటూరు.

ఆధునిక కథా రచయిత్రులలో అందునా హాస్య కథా రచయిత్రులలో పొత్తూరి విజయలక్ష్మి గారిది ఒక ప్రత్యేక స్థానం. గుంటూరు జిల్లా యాజలి గ్రామంలో జన్మించిన విజయలక్ష్మి గారు పి.యు.సి. వరకు మాత్రమే విద్యా భ్యాసం చేశారు. కానీ ప్రపంచమనే విశ్వవిద్యాలయంలో జీవితమనే మాస్టారు బోధించిన బోధనలనుండి ఎంతో నేర్చుకున్నాను. అని ఆవిడే స్వయంగా చెప్పుకున్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని , వ్యక్తుల జీవితాలను చాలా దగ్గర నుండి పరిశీలించి వాటినే ఇతి వృత్తాలుగా తీసుకొని సుమారు 145 కథలు, 19 నవలలు, రెండు సంపుటాలుగా నోస్టాలజీయా, వ్యాస సంపుటాలు, జ్ఞాపకాల జావళి పేరుతో తన అనుభవంలోకి వచ్చిన విషయాలను వ్యాసాలుగా రచించారు. వీరు వ్రాసిన మొదటి నవల "ప్రేమలేఖ" "శ్రీవారికి ప్రేమలేఖ" అనే సినిమాగా వచ్చి విజయవంతమై హాస్య కథా రచయిత్రిగా విజయలక్ష్మి గారిని స్థిర పరిచింది. అది మాత్రమే కాకుండా "శంకరరావుపెళ్లి" నవల "ప్రేమ చిత్రం-పెళ్లి విచిత్రం" అనే సినిమాగా, "సంపూర్ణ గోలాయనం" నవల "ప్రేమఎంతమధురం" సినిమాగాను వచ్చాయి చాలా సినిమాలకు స్క్రిప్ట్ రైటర్ గా వ్యవహరించారు.

ఏ రచయిత రచనలు చేసినా ఆరచనలు ఆనందాన్ని కలుగ జేయడమే కాకుండా ఆ రచనలలో సామాజిక సాంస్కృతికాంశాలు తప్పని సరిగా మిళితమై ఉంటాయి. విజయలక్ష్మి గారి కథలలో ఉన్న సామాజిక అంశాలను మనము పరిశీలిస్తే మానవ సంబంధాల గురించి,సమాజ స్థితి గతుల గురించి, ఆచార్య వ్యవహారాల గురించి, కుటుంబ విలువల గురించి,గ్రామీణ జీవితం గురించి, స్త్రీల సమస్యల గురించి హాస్యంతో మిళితమై మనసును తట్టి లేపుతాయి. ఈ అంశాలన్నింటి లోను విజయలక్ష్మి గారి కథల లోని మానవ సంబంధాలను పరిశీలిస్తే మనీ సంబంధాలకన్న మానవ బంధాల విలువ ఎంత గొప్పదో మనకు తెలుస్తుంది.

"చంద్రహారం" కథలో రామచంద్ర మామ్మగారు చనిపోయారని తెలియడంతో ఊరు బయలుదేరతాడు. అన్నీ కార్యక్రమాలు పూర్తయిన తరువాత మిగిలిన వారందరూ ఎవరి ఇళ్లకు వాళ్ళు బయలు దేరతారు. మామ్మ దగ్గర మిగిలిన చంద్రహారాన్ని ఇద్దరు కూతుళ్లు అమ్మేసి పంచుకోవాలని అనుకుంటున్నప్పుడు మామ్మకు గుర్తుగా మిగిలిన ఆ చంద్రహారం కోసం తన స్కూటరును, వంటిమీదున్న గోలుసును ఉంగరాలను అమ్మేశాడు. నెలవారి కడుతున్న చీటిని పాడేశాడు. ఆ డబ్బును మేనత్తలకు ఇచ్చి ఆ చంద్రహారం తీసుకున్నాడు. బంధువులందరు నవ్వుకున్నప్పటికి నాకు అది మా మామ్మకు ప్రతిరూపం. మమ్ములనందరని ఆదుకున్న కల్పతరువు చెక్కు చెదరకుండా అలా ఉండి పోవలసిన తీపి గుర్తు అనుకుంటూ ఆ చంద్రహారాన్ని అపురూపంగా చూసుకుంటున్నాడు. మానవ సంబంధాలను చూపే ఈ చిన్న సంఘటనను రచయిత్రి ఈ కథలో తెలిపారు.

"తిధి-నక్షత్రం" కథలో భూషణం-వరలక్ష్మమ్మ ఇంటికి ఎదురుగా ఉన్న ఇంటిలో సీత అనే అమ్మాయి ఉండేది. ఆమె ప్రతిరోజూ వరలక్ష్మమ్మ గారి ఇంటికి వచ్చి "మా అత్తయ్య ఇవాళ తిధి, నక్షత్రం ఏమిటో కనుక్కు రమ్మంది." అని అడుగుతుంది. వినేవాళ్లకు అది నిజమేమో అనిపిస్తుంది. కానీ వాస్తవంగా అక్కడ జరుగు తున్న విషయం వేరు. ఆ వంకతో సీత ప్రతిరోజూ వాళ్లింటికి వచ్చి భోజనం చేసి వెళుతుంది. అత్తగారింట్లో ఆమెను సరిగా చూడారు. అందుకనే భూషణం-వరలక్ష్మమ్మ దంపతులు ఆమెకు కావలసిన వన్ని పెట్టి

తినిపిస్తుంటారు. సీతతో వారికి ఎటువంటి సంబంధం లేకపోయినప్పటికీ, ఆమె పడే కస్టాలు చూడలేక ఆమెకు సహాయ సహకారాలు అందిస్తుంటారు. సీత తలి దండ్రులు వరలక్ష్మమ్మ గారి తో "మా పిల్లను ఓకంట కనిపెట్టి ఉండండి. అమాయకురాలు, నోరులేనిది. కన్నవాళ్ళం కాళ్ళు కడిగి కన్యాదానం చేశాక ,పరాయి వాళ్ళమే. మీరు నాలుగిళ్ళ అవతల ఉంటారు. మీ బిడ్డ అనుకోని దాని మాంకిచెడ్డ చూసుకోండి. ఇవి చేతులు కావు కాళ్ళు" అన్నారు.

ఈ సంఘటనను బట్టి సమాజంలో ఎటువంటి సంఘటనలు జరుగు తున్నాయి అనేది తెలుస్తుంది. సీత కూడా వరలక్ష్మమ్మ దగ్గర మొహమాట పడకుండా కావలసింది అడిగి పెట్టించుకొని తింటుంది. ఈ విధమైన సంబంధాలు సమాజంలో అనేకం ఉంటాయి. ఇవే లేకపోతే సమాజం ఎలా అభివృద్ధి చెందుతుంది. ఎవరికి వారు నా చిన్ని బొజ్జకు శ్రీమ రక్ష అనుకొంటే సమాజం బాగుపడదుకదా!

"సన్మానం" కథలో సూర్యం, మంజుల భార్యా భర్తలు. అనుకోకుండా ఒక రోజు వాళ్ళ వాకిట్లో ఇద్దరు మాట్లాడు కోవడం వినిపించింది. రాధాకృష్ణ-దుర్గా దంపతులు వర్షంలో తడిసి వాళ్ళ వాకిట్లో ఉన్నారు ఆ రోజు రాధాకృష్ణకు సన్మానం ఉంది. వర్షం కారణంగా అది వాయిదా పడింది. డబ్బు లేక ఇబ్బందీపడుతున్న రాధాకృష్ణ మళ్ళీ ఇంకోరోజు సన్మానానికి రావాలంటే కష్టమవుతుందని భార్యతో చెబుతున్నాడు. ఆ మాటలు విన్న సూర్యం వాళ్ళని లోపలికి పిలిచి, తాను వాళ్ళ శిష్యుడనని చెప్పి రాధ కృష్ణ దంపతులకు సకల మర్యాదలు చేసి ఆ దంపతులకు బట్టలు పెట్టి, కొంత డబ్బు చేతిలో పెట్టాడు. వాళ్ళను సాదరంగా బస్సు ఎక్కిస్తాడు. శిష్యుడి ఆదరం చూసి రాధాకృష్ణ పొంగి పోతాడు. వాళ్ళు వెళ్ళిన తరువాత సూర్యం భార్య మీకు ఎక్కడ ఆయన గురువు అని అడిగితే కష్టంలో ఉన్న వాళ్లిద్దరను చూస్తే మా అమ్మ నానా గుర్తు వచ్చారు. వాళ్ళకు సహాయ0 తీసుకోవడానికి మొహమాటం అడ్డు వస్తుంది. అందుకే శిష్యుడను అని చెప్పి సహాయం చేశాను. అని సూర్యం చెబుతాడు. ఏ సంబంధం లేక పోయినా, శిష్యుడు కాకపోయినా మానవత్వంతో రాధ కృష్ణ దంపతులకు సహాయం చేసిన సూర్యం ఎందరికో ఆదర్శ ప్రాయుడు.

"పూర్వీ" కథలో గోపాలం, సావిత్రి లకు హరి ఒక్కగా నొక్క కొడుకు. చిన్నప్పుడే ఇంటినుంచి పారిపోయి చిన్న చితకా పనులు చేసుకుంటూ బతుకుతుంటాడు. పూర్విని ప్రేమించి వివాహం చేసుకుంటాడు. కొన్నాళ్ళకు యాక్సి డెంటలో హరి మరణిస్తాడు. అపుడు హరి ఉద్యోగము పూర్వికి రావడంతో పాటు కొంత డబ్బు కూడా వస్తుంది. పూర్వీ ఆ డబ్బు తీసుకొని వచ్చి అత్తమామలకు ఆ డబ్బు అందజేస్తుంది అసలు హరికి పెళ్ళయిన విషయము కూడా వారికి తెలియదు. అలాంటిది పూర్వీ హరి తలీదండ్రులను ఆదుకోవడం తన బాధ్యత అని ఆ డబ్బు తెచ్చి వాళ్లకిస్తుంది. అంతేకాకుండా వెళ్ళేటపుడు తాను వంటరికాదు తనకు ఒక కుటుంబం ఉంది అనే తృప్తితో వెళుతుంది.

ఇక్కడ మనం పూర్వీ బంధాలను నిలుపుకున్నతీరు అందరం నేర్చుకోవాల్సిన విషయం. పెళ్ళయిన వెంటనే అత్తమామలతో కలిసి ఉండటా నికే ఎవ్వరూ అంతగా ఇష్టపడటం లేదు. అలాంటిది భర్త చనిపోయిన తరువాత కూడా అతని తలీదండ్రుల బాధ్యత తీసుకున్న పూర్విని చూస్తే బంధాలకు ఇవ్వవలసిన ప్రాధాన్యత అర్థమవు తుంది.

"మేరా భారత్ మహాన్" కథలో శ్రీహరి కుటుంబంతో పాటు మనాలి వెళతారు . స్నోపాయింట్ దగ్గరకు వెళ్ళడానికి జీపు మాట్లాడుకొని వెళ్ళి అందరూ సంతోషంగా తిరిగి వచ్చారు. జీపు డ్రైవర్ అశోక్ అదనగా 200 వందలు కావాలని అడిగితే శ్రీహరి అతడితో గోడవపడి 50 రూపాయలు మాత్రమే ఇస్తానంటాడు. అశోక్ గోడవపడి ఏమి తీసుకోకుండానే వెళతాడు. మరుసటి రోజు శ్రీహరి తిరుగు ప్రయాణానికి బయలుదేరతాడు. వర్షం వల్ల ప్రయాణం కాన్సిల్ అవుతుంది. వాళ్ళ దగ్గరఉన్న డబ్బు

టికెట్స్ కి సరిపడినంత మాత్రమే ఉంది. మరి ఎక్కడ ఉండాలి అని బాధపడుతుంటే చూసి అశోక్ వాళ్ళను తన ఇంటికి తీసుకొని వెళ్ళి ఆదరంగా చూస్తాడు. అంతేకాకుండా శ్రీహరికి టికెట్స్ కొరకు డబ్బిచ్చి అక్కడకు వెళ్ళాక పంపించండి అంటాడు. అది విని అశోక్ సమయానికి దేవుడిలా ఆదుకున్నావు. నన్ను నమ్మి డబ్బుయిచ్చావు నేను ఇస్తానో ఇవ్వనో అనే అనుమానం కూడా రాలేదా? అని అడుగుతాడు.

"అదేం మాట సాబ్ పొట్టకూటికోసం కొట్లాడతాం కానీ నమ్మినవాడిని మోసం చేయడం మన రక్తం లోనే లేదుకదా సార్ ఇక నేను సాయం చేయడం అంటారా మనిషికి మనిషి సాయం చేసుకోకపోతే ఇంకెవరూ వస్తారు? ఆదుకోవడానికి. అంటాడు. ఇక్కడ 200 రూపాయలు బక్షీష్ ఇవ్వలేదని గొడవపడ్డ అశోక్ అదే వ్యక్తికి కష్టం వస్తే క్షణం కూడా ఆలోచించకుండా సాయం చేశాడు . ఒకరికి ఒకరు సాయం చేసుకోవడం మానవుల కర్తవ్యంగా చెప్పిన అశోక్ మానవతకు ప్రతిరూపంగా కనిపిస్తాడు. మానవ సంబంధాలు కేవలం ఆర్థిక సమంధాలే కాదు అప్యాయతానురాగాల సంబంధాలు అని ఈ కథ ద్వారా నిరూపితమైంది.

"రంగడు వస్తాడు" హాస్య కథలో హాస్యంతో పాటు మానవ సంబంధాలు ఎంత గొప్పవో వివరించడం జరిగినది. రంగడు పోస్ట్ మాన్ . 2,3, రోజులకు ఒకసారి ఆవూరికి తీసుకొచ్చి టపా తీసికెళుతుంటాడు. వచ్చిన ఉత్తరాలను రచయిత్రి తాతగారు ఒకటి రెండు చదివిగాని ఇవ్వరు. అలా ఒక రోజు మూడు ఉత్తరాలలో సీతాపతికి వాళ్ళ బాబాయి రాసింది. అందులో సీతాపతి చెల్లెలకు మంచి సంబంధం చూసాం, మీరొచ్చు మాట్లాడుకుంటే పెళ్లి జరిపించేద్దాం అని రాసుంది. అది చదివి సీతాపతి పెళ్ళికి డబ్బెలా అని బాధ పడుతుంటే "అవన్నీ చూసు కోవచ్చులేరా ముందు నువ్వు వెళ్ళి మాట్లాడిరా అంతా సానుకూలంగా ఉంటే పెళ్ళే చేయలేక పోతావా? నువ్వు వూళ్ళో ఉన్నావు గాని అడవిలో లేవుకదా! మేమంతా లేవుటరా?" అంటారు. ఇక్కడ వారి మాటలను బట్టి ఒకరికొకరు కష్టసమయములో ఎంతగా సహాయం చేసుకునేవారో తెలుస్తుంది. మానవ సంబంధాలన్నీ ఆ రోజుల్లో ప్రేమ ఆప్యాయతల సంబంధాలుగా ఉండేవని తెలుస్తుంది.

కాశీపతికి కిషోర్ సహాయం చేసాడన్నా,ముకుందాన్ని చేరదీసి చదువుచెప్పించిన గురు పుత్రుడు కష్టంలో ఉన్నాడంటే పొందినమేలు మరిచి పోకుండా అతడికి జీవనూపాధి ఏర్పాటు చేసినా, పేదవాడైన సీతయ్య కూతురు పెళ్ళికి తలోచేయి వేశారన్నఒకరికొక రిమీదఉన్న ఆప్యాయతానురాగాలే.

ఈ విధమైన మాన సంబంధాలు పొత్తూరి విజయలక్ష్మి గారి కథలలో అనేకం కనిపిస్తాయి. ఎటువంటి సంబంధం లేకపోయినా మానవ్యత్వంతో సహాయం అందించాలనేదే వీరి ఆలోచన. అందుకే హృదయాలకు హత్తుకునేలా కథలలోని పాత్రల మధ్య అనేక సమస్యలను చూపించి వాటిని ఎలా పరిష్కరించాలో, తోటి మానవులతో ఎలా ప్రవర్తించాలో వీరి కథల ద్వారా తెలుస్తుంది. నిత్య జీవితంలో చుట్టూ జాగుతున్న సంఘటనల ద్వారా తాను ప్రేరణ పొందటమే కాకుండా కథల రూపంలో సమాజంలోని ప్రతి వ్యక్తికి అర్థమయ్యేలా వివరించారు. ఆర్థిక సంబంధాలే కాదు మానవత్వం కాదా మనిషికి చాలా ముఖ్యం. తోటి వారికి సహాయపడాలనే కోరిక ప్రతి వ్యక్తికి ఉండాలనేదే వీరిభావన. అందుకే అటువంటి పాత్రలను కథలో చొప్పించి సమాజానికి ఎంతో ప్రయోజనాన్ని కలిగేలా చేయడానికి ప్రయత్నించారు.

ఆధార గ్రంథాలు :

1. పూర్వీ కథల సంపుటి
2. సన్మానం కథల సంపుటి.
3. పొత్తూరి విజయలక్ష్మి హాస్య కథలు.
4. చంద్రహారం కథల సంపుటి.

★

BHAVAVEENA
Vol. 19, Issue. 5(1), May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు ప్రజల గ్రామీణ సంస్కృతి - అవలోకనం

- డా॥. ఎస్. చిన్నరెడ్డయ్య, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రవేశిక :

ఒక జాతి జీవన విధానం, ఆలోచనాసరళి ఆ జాతి సంస్కృతిని సూచిస్తాయి. ప్రాచీన కాలం నుంచి తెలుగు గ్రామీణ ప్రజలకు ఒక సంస్కృతి ఉంది. గ్రామీణ సంస్కృతి అంటే రైతు సంస్కృతేననవచ్చు. రైతును కేంద్రీకృతం చేసుకునే గ్రామీణుల జనజీవనం నడుస్తుంటుంది. సంస్కృతి ప్రధానంగా మానవుని ఆలోచనా విధానానికి సంబంధించిన అంశం. ఆలోచననుసరించి అతని జీవనవిధానం నిర్ణయమవుతుంది. జీవన విధానంలో ప్రజల విశ్వాసాలు, ఆచార వ్యవహారాలే కాకుండా సాంఘిక స్థితి కూడా ప్రాధాన్యం వహిస్తుంది.

ప్రజలు జరుపుకునే పండుగలు, నోములు, వ్రతాలు, జాతరలు, విద్య, వివాహాది కార్యక్రమాలు జరుపుకునే తీరు, కట్టుకునే ఇళ్ళు, ధరించే వస్త్రాలు, కట్టు బొట్టు, వివిధ వృత్తులు, జానపద శిష్టకళలు, భిక్షకగాయకుల తీరు తెన్నులు, వ్యవసాయం ఇలా ఒకటేమిటి నిద్ర లేచింది మొదలు నిద్రపోయేవరకు ప్రజలు నిర్వహించుకునే దైనందిన కార్యక్రమాలన్నీ సంస్కృతి కిందకే వస్తాయి. ఒక ప్రాంతంలో నివసించే సామాజిక వర్గ ప్రజల సంస్కృతిలో కూడా మళ్ళీ భిన్నత్వం కనిపిస్తుంది. ఇది ప్రధానంగా పండుగలు, జాతరలు, నిర్వహణలో స్పష్టంగా బయటపడుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో జరిగే జాతరలు వేర్వేరుగా ఉన్నాయి. కృష్ణా జిల్లాలోని కొల్లేరులో కొల్లేటి పెద్దమ్మ తిరుణాల, చిలకలపూడిలో పాండురంగస్వామి సంబరాలు, పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ తల్లి జాతర, ఉయ్యూరులో వీరమ్మ తల్లి జాతర, చింతలపూడిలో నూకాలమ్మ జాతర జరుగుతాయి. గుంటూరు జిల్లా నరసరావుపేట దగ్గరున్న కోటప్పకొండలో కోటప్పకొండ తిరుణాల, గురజాలలో పాత పాటేశ్వరీ అమ్మవారి తిరుణాల, కారంపూడిలో పలనాటి వీరుల ఆరాధన జరుగుతాయి. ప్రకాశం జిల్లాలో ధేనువు కొండలో గంగమ్మతల్లి తిరుణాల, సింగరాయ కొండలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి తిరుణాల జరుగుతాయి. నెల్లూరు జిల్లాలోని వెంకటగిరిలో పోలేరమ్మ జాతర, కనుమూరులో ముత్యాలమ్మ జాతర జరుగుతాయి. చిత్తూరు జిల్లా తిరుపతిలో గంగమ్మజాతర, పుత్తూరులో ద్రౌపదమ్మ తిరుణాల జరుగుతాయి. కర్నూలులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర, మాలె పాడులో బన్నీ ఉత్సవం జరుగుతాయి. కడప జిల్లాలోని లక్కిరెడ్డిపల్లెలో గంగమ్మజాతర, నుండుపల్లెలో నాగారపమ్మ జాతర జరుగుతాయి. తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం మరిడమ్మ జాతర, నూకాలమ్మ జాతర జరుగుతాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో మావుళ్ళమ్మ జాతర జరుగుతుంది. విశాఖ పట్నం జిల్లాలోని పాడేరులో మోదుకొండమ్మ జాతర, అనకాపల్లిలో నూకాలమ్మ జాతర జరుగుతుంది. విజయనగరం జిల్లా కేంద్రంలో పైడితల్లి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ జాతర్ల నిర్వహణలో వైవిధ్యం కనిపిస్తుంది. అయితే వాటి మూల తత్వం ఒక్కటిగానే ఉంటుంది. అదే సంస్కృతి మౌళిక లక్షణం. ఈ జాతరలన్నీ పట్టణాల్లో జరుగుతున్నా హాజరయ్యే వారందరూ గ్రామీణులే. ఇక ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలందరూ వివిధ పండుగలను సర్వసాధారణంగా జరుపుకుంటున్నారు.

గ్రామీణ నేపథ్యం :

భారత దేశ జనాభాలో ఎనభై శాతం వ్యవసాయదారులే. వీరిలో వ్యవసాయదారులు, వ్యవసాయ సంబంధిత పనులలో పనిచేసే వారూ ఉన్నారు. సాంకేతిక

రంగంలో వచ్చిన మార్పులవల్ల సాంప్రదాయ వ్యవసాయం రాను రాను యాంత్రీకరణం వైపు పరుగిడుతున్నది. కరువు ప్రాంతాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాని వ్యవహారంగా తయారైంది. అటువంటి ప్రాంతాల్లో రైతులు వ్యవసాయం చేయలేక ఇతర వ్యాపకాలకు మళ్లుతున్నారు. పెద్ద రైతులు దైనందిన వ్యవసాయం పక్కన పెట్టి సావకాశంగా ఉండే పనులు చేసుకుంటారు. వీరు తక్కువ పెట్టుబడి అయ్యే పండ్ల తోటలపై మొగ్గ చూపుతున్నారు. ఈ కారణంగా పల్లెల్లో సామాజిక పరంగా, సాంస్కృతికపరంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ''ఆప్యాయతకు, అనురాగానికి, ఆనందానికి, పల్లెలే పట్టు గొమ్ములు'' అనే మాటకు అర్థం లేకుండా పోతున్నది. పల్లెల్లో ఒకనాడు అనగా 1950 నుండి 1980 వరకు రైతులు, రైతు కూలీలు మొదలగు పల్లె వాసులు నివసించిన గృహాలు, పంటలు పండించే విధానము, వారు వాడిన పరికరాలు, పనిముట్లు రాను రాను కనుమరుగౌతున్నవి. వాటిని ఈ తరంవారు ప్రత్యక్షంగా చూడాలంటే అంత సులభంకాదు. ఏ పుస్తకాలలోనో, సినిమాలలోనో చూడవలసిందే తప్ప వేరుమార్గము లేదు. ఆ పనిముట్లను, వాటిని వాడే విధానాన్ని, వాటి ఉపయోగాన్ని ఈ తరానికి తెలియజేయడం చాలా ముఖ్యం.

ఒకప్పుడు పల్లె ప్రజలు ప్రతి విషయంలోను ఒకరి కొకరు సహకరించుకునేవారు, వారి అన్యోన్యత కల్మష రహితంగా ఉండేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. అదే విధంగా పల్లె ప్రజల సాంస్కృతిక జీవనం ఉన్నతంగా ఉండేది. ఈ సంస్కృతిలోనూ కాలాను గుణంగా ప్రాంతీయతను బట్టి కాస్తంత తేడా వచ్చింది. అంతే గాని అన్ని విషయాలలోను ఆంధ్రప్రదేశ్‌లో సామ్యం కనిపిస్తుంది. కొన్ని చోట్ల వ్యత్యాసం కనిపిస్తుంది. ఈవిధమైన ఈ మార్పును పురోగమనమే అనవచ్చు. నేడు రాజకీయంగా సాధారణ ప్రజలు కూడా చాలా చైతన్యం పొందారు. విద్య విషయంలోనూ ప్రజలు చాలా పురోగతిని సాధించారు. అదేవిధంగా సామాజికంగా కూడా ఎంతో అభివృద్ధి సాధించారు. ఇది నిరంతర ప్రక్రియ. ప్రపంచంలో, భారతదేశంలో రాజకీయ సాంఘిక, ఆధ్యాత్మికాదిరంగాల్లో వచ్చే మార్పులను బట్టి సంస్కృతిలో మార్పులొస్తుంటాయి.

నివాస సంస్కృతి :

గుడిసె, పూరిల్లు, గుడిసిల్లు / చుట్టిల్లు, పెంకుటిల్లు, రేకుల ఇల్లు, మట్టి మిద్దె, బండ్ల మిద్దె, మేడ, భవంతి, సపారు ఇలా అనేక రకాలు వుంటాయి. గోడలు కట్టి రాళ్ళతో కట్టుకని కప్పువేయటానికి 'కూసాలు', దూలాలకు 'వేప కలప వాడేవారు. అందువల్ల అవి ఎంతో బలంగా ఉండేవి. దూలాలపైన దంతెలు వేసి చాపలు గాని, బండలుగాని పరిచి పైన చౌడుతో కాంక్రీట్ లాగా కప్పేవారు. ఇవి మట్టి మిద్దెలు. ఇళ్ళ నిర్మాణం విశాలంగా ఉండేది. స్నానం చేసిన నీరు 'మురుగు' కాకుండా 'జాలాది' (పెద్ద గుంట) తీసి ఆ నీరు అందులో ఇంకేలా చేసుకొనేవారు. పశువులకు ప్రత్యేకంగా 'ఆవాసాలను ఏర్పాటు చేసుకునేవారు. ఆర్థిక స్తోమత కల వారు మట్టిమిద్దెలు కట్టి పశువులకు తగిన వసతి (గాడి) ఏర్పాటు చేసుకునేవారు. ఎరువు వేయడానికి 'దిబ్బ'లకు వసతి చేసేవారు. అందుకే 'గ్రామం గేయం లాంటిది - నగరం నాటకం లాంటిది' అంటాడు 'లాంగ్‌ఫెలో'. అయితే ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో పక్కా ఇండ్లు కట్టించడంతో పైన పేర్కొన్న ఇళ్ళన్నీ దాదాపుగా తెర మరుగయ్యాయని చెప్పవచ్చు.

జలవనరుల సంస్కృతి :

కాలువలు, చెరువులు, బావులు, కసిం కాలువలు, బోరు బావులు, కుంటలు, వాగులు, వంకలు, వీటిని పల్లె ప్రజల జల వనరులనవచ్చు. రైతులు నీటి వసతి కొరకు చెరువులు, బావులు పైనే ఎక్కువగా ఆధారపడే వారు. వర్షాకాలంలో చెరువులు నిండితే ఆరు నెలల వరకు నీళ్లు వుండేవి. చిన్న చిన్న వంకలు వాగులు ప్రవహిస్తుంటాయి. ఆ రోజుల్లో వాటిల్లో ఎండాకాలంలో కూడా సన్నగానైనా నీరు పారుతుండేది. దాంతో బావుల్లో

ఎండాకాలంలో కూడా నీళ్లు పైకే వుండేవి. ఆ వంకల్లో సాగే నీటిని నిలగట్టి చిన్న కాలువ ద్వారా పంటలకు మళ్లించేవారు. లేదా ఏతం, గూడ వంటి సాధనాల ద్వారా నీటిని పొలాలకు మళ్లించి పంటలు పండించే వారు. బావుల నుండి కపిలి అనే సాధనం ద్వారా ఎద్దులతో నీటిని పైకి తోడి పంట పొలాలకు పెట్టే వారు. దీనినే మోట అని కూడా అంటారు. ఆ తర్వాత బావులకు కరెంటు మోటార్లు వచ్చాయి. దాంతో రైతుల పని కొంత సులువైంది. ఇలా వ్యవసాయ సంస్కృతిలోనూ మార్పు లొచ్చాయి.

వ్యవసాయ పనిముట్లు :

బాన, బండి (కలిపి బండి) కదురుగోలు, ఇరుసు, ఎద్దుల బండి, కాడి మాను, మడక, లేదా నాగలి, గొర్రు, పార, తొలిక, కర్రు, గునపము, గొడ్డలి, కొడవలి, కత్తి, పిక్కాసు, మాను, పల్లంకి, మోకు, పగ్గం, తొండం తాడు, పసుపు, జాటి, ముల్లు గర్ర, పలుపులు, చిలుకు దోటి, కొంకి, గోరు గిల్లు, గీస కత్తి, చిక్కం, మచ్చు కత్తి, గొర, దోకుడు పార, మొదలగు నవి వ్యవసాయంలో ఉపయోగించు పరికరాలు. గతంలో రైతులు తమ పొలాలకు బావులలో నుండి కపిలి లేదా మోట అనే సాధనంతో నీటిని తోడి పండించే వారు. ఈ సాధనం ఎద్దులతో నడిసేది.

వీటిలో మొదటిగా చెప్పుకోదగినది అరక / మడక / నాగలి ఇది కొయ్యతో చేసింది. ఇందులో భాగాలు - మేడి, నొగ, కాడిమాను, కర్రు. ఈ కర్రు లేదా కారు మాత్రం ఇనుముతో చేసింది. ఎద్దులతో భూమిని దున్నడానికి ఉపయోగిస్తారు. రెండు ఎద్దులు, ఒక మనిషి అవసరం. అయితే పనిమాత్రం నిదానంగా జరుగుతుంది. ప్రస్తుతం భూమిని దున్నడానికి టిల్లర్లు, లేదా ట్రాక్టర్లు వంటి యంత్రాలు వచ్చాయి. వీటితో అతి తొందరగా దున్నడం పూర్తవుతున్నది. రైతుకు శ్రమ చాల వరకు తగ్గుతున్నది. భూమిని దున్నిన తర్వాత దాన్ని చదును చేయడానికి, గట్లు వేయడానికి, పాదులు కట్టడానికి, మెట్ట భూముల్లో విత్తనాలు చల్లడానికి ఉండే పరికరాల స్థానంలో ప్రస్తుతం ట్రాక్టర్లే అన్ని పనులు చేస్తున్నాయి. ఈ మధ్య వరి కోత యంత్రాలు, నూర్పిడి యంత్రాలు కూడా వచ్చాయి. రైతుకు చాల కష్టం తగ్గింది కాని పంటలు పండించడానికి సరిపడ నీళ్లే లేవు.

వినోద సంస్కృతి :

వినోదం సంస్కృతిలో ప్రధానమైన భూమికను నిర్వహిస్తుంది. ఇందులో కోడి పందెములు, భిక్షుక వృత్తి ప్రముఖ పాత్ర వహిస్తాయి.

కోడిపందెములు :

కోడి పందెములు తెనుగువారి వినోదములలో చాలా ప్రాచీనమగు వినోదము. మన సారస్వతములో కేతనకవి కాలము నుండియు నారాయణకవి కాలము వరకు పలువురు కవులు ఈ పందెములను వర్ణించారు. పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధంలో వీటిదే ప్రధాన భూమిక. కోడి పందెపు శాస్త్రము కూడా చాలా ప్రాచీనమైనట్టిదే. నారాయణకవి కోడి పందెమును ఇట్లు వర్ణించాడు.

"కాచిప్రాతలు దారాలు కట్టుముళ్ళు
ముష్టులును నీళ్ళముంతలు మూలికలును
కత్తులపాదుళ్ళు మంత్రముల్ కట్టుపసరు
లెనయవచ్చిరి పందెగాళ్ళే పురేగి
వేగ నెమిలి పింగలి కోడి డేగ కాకి
వన్నెలైదింటి కిరులందు వెన్నెలందు
రాజ్యభోజనగమన నిద్రామరణ
ములను విచారించి యుపజాతులను వచించి"

- అని కోడిపందేలు జరిగే తీరు, కోళ్ళలోని రకాలను కవి అద్భుతంగా వర్ణించాడు. నేడు కూడా ఆంధ్రదేశంలో సంక్రాంతి పర్వదినాల్లో కోడి పందేలు జరుగుతున్నాయి.

భిక్షకుల సంస్కృతి :

పల్లె వాసులైన రైతులపై ఆధారపడిన యాచక వృత్తి వారు అనేకం. అందులో ముఖ్యులు బుడబుక్కల వారు. వీరి వేష ధారణ చాల గంభీరంగా వుంటుంది. నొసటన

